ఫ్యాషన్ ప్రపంచంలో సాటిలేని చీరలు, కరిష్మా శారీస్.

34564



ప్రముఖ క్లాత్ షాపులలో లభించును.

SHANKAR ADS/K.S/87-8

ఉత్తరాలు

ముఖ చిత్రం

రాయలసీమ రతనం న ట్యమయూరి వసుమతి ముఖచిత్రం 18–24 డిసెంబర్ సంచికకే వన్నె తెచ్చింది. మీరు మధ్య మధ్యన ఇటువంటి ముఖ చిత్రాలను కూడా వేస్తుంటే పత్రికకు ఎంతో నిండుదనం వస్తుంది. వసుమతి గురించి విశేషాలు బాగా తెల్పారు. ఈ చిన్నారి నాట్య మయూరిని సానపెట్టిన శ్రీ మాస్టర్ రమణగారికి మా అభిమాన వారపత్రిక 'ఆంధ్ర పత్రిక' ముఖంగా అభినందనలు తెలియపర్చుకుంటున్నాము. ఈ చిన్నారి నాట్య మయూరి భవిష్యత్‌లో గొప్ప నర్తకిగా ఎదిగి గొప్ప పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని మనసారగా మేము కోరుకుంటున్నాము.

–న్యాయపతి రమేష్‌బాబు, హైదరాబాదు

సీరియల్స్

18–24 సంచిక ముఖచిత్రం నాట్య మయూరి వసుమతి చాల బాగుంది. కొత్త సీరియల్ "ఆడపిల్లలు- అనుభవాలు" మొదట్లోనే ఆకట్టుకొంది. హరికిషన్ గారికి నా థాంక్స్.

–ఎల్. వి. సుబ్బయ్య, గూడూరు

★ ★ ★

హరికిషన్ గారి సీరియల్ "ఆడపిల్లలు- అనుభవాలు" ప్రారంభంలోనే ఆకర్షణీయంగా ఉండి పత్రికని ముందుగానే రిజర్వ్ చేసుకోవాలనే ఆలోచనని కలిగించింది. అసంఖ్యాక హృదయ సామ్రాజ్యాల్ని కబళించడానికి హరికిషన్‌గారు జైత్ర యాత్ర ప్రారంభించినట్టున్నారు.

–కె. వి. వి. యస్. మూర్తి, భద్రాచలం

★ ★ ★

చిరంజీవి, వసుమతి ముఖ చిత్రంతో వెలువడిన వారపత్రిక ఏంతో ఆకర్షణీయంగా వుంది. సీరియల్స్ ఒకదాన్ని మించి మరొకటి పోటీ పడుతున్నయ్యి. కార్టూన్లు, విడి కథలు ఫరవా లేదు. ఇంకో ముఖ్య విషయం: "వినాయకరావు పెళ్ళి"కి మేము రడీ అవుతున్నాము అని తెలియ జెయుటకు ఆనందించు చున్నాము.

– గంగరాజు సుబ్బలక్ష్మి, ఒంగోలు

కథలు

"ఇరుకు" కథ చాలా బావుంది. ఒక మనిషికి ఏడవడానికి కూడా స్వతంత్రం లేని నేటి సామాజిక పరిస్థితులు నిజంగా బాధాకరం.

– ఎం. వి. ఎస్. ఎస్. ప్రసాద్, కాకినాడ

★ ★ ★

రాయలసిమ నాట్య రత్న మయూరి "వసుమతి" ముఖ చిత్రంతో వెలువడ్డ పత్రిక మా యదపై తరంగం చేసింది. "ఇదీ ప్రగతి" కథ బాగుంది.

– మారగాని కొండలరావ్‌గౌడ్, ఖమ్మం

వ్యాసాలు

నాట్యమయూరి వసుమతి ముఖ చిత్రంతో వెలువడిన ఆంధ్ర సచిత్ర వార పత్రిక నన్ను ముగ్ధుడ్ని చేసింది. "రాయల సీమ రతనం నాట్యమయూరి వసుమతి" అన్న వ్యాసం నా కళా హృదయాన్ని ఆనందింప చేసింది.

అన్ని రంగాలలో వెనుకబడి వున్న రాయలసీమలో, 24 గంటల సేపు నృత్యం చేసి, పలువురి ప్రేక్షకుల ప్రముఖుల ప్రశంసలు పొందిన వసుమతి నిజంగా రాయలసీమ రతనమే.

– గోపిని కరుణాకర్ నాయుడు, పలేరు

న్యూఢిల్లీ లేఖ

జయదుబాషి గారి విశ్లేషణాత్మక వ్యాసాలలో తలపండిన, పరిణితి చెందిన ఆర్థిక రాజకీయ నైపుణ్యం వుంటుందని ఆశించి బహుశః వారం వారం ప్రచురిస్తున్నా రనుకుంటాను. ఆయన విశ్లేషణలో ఎక్కువగా నెగెటివ్ అప్రోచ్ తప్ప పాజిటివ్ అప్రోచ్ కనిపించటం లేదు. అమెరికాను తప్ప అన్ని వ్యవస్థలను దుయ్యబట్టు తున్న దుబాషీ గారు, ఆశించే శ్రేయో వ్యవస్థ యేమిటో ఒకసారి పాజిటివ్ అప్రోచ్‌తో వ్యాసం రాస్తే చూడాలని వుంది.

– పులిచేరి రామమోహనరావు, విజయవాడ □

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :

దేశోద్ధారక కాశీనాథుని

నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు : (1938-1972)

29.1.88; 5.2.88

శ్రీ ప్రభవ నామ సం. మాఘ శు. ఏకాదశి; బ. తదియ,

సంపుటము 80 : సంచికలు 23; 24

ముఖ్య సంపాదకుడు :

శివలెంక రాధాకృష్ణ

కార్యవాహక (యాక్టింగ్) సంపాదకుడు :

మతుకుమల్లి మాధవరావు

విడి ప్రతి వెల	రు. 3.00
పోస్టులో 6నెలల చందా	రు. 87.10
పోస్టులో 12నెలల చందా	రు. 174.20

ఆంధ్రపత్రిక కార్యాలయము,

గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

న్యూఢిల్లీ లేఖ

డా. జయ్ దుబాషి



మతతత్వం ఎవరిది?

బొంబాయిలోని ఆహ్లాద కరమైన, పచ్చ పచ్చని శివారు ప్రాంతాలలో విలెపార్లె ఒకటి. సినిమావాళ్ళు దాన్ని తాము తీసే వ్యంగ్యాత్మక ఆధునిక హాస్య చిత్రాలకు నేపథ్యంగా వాడుకుంటారు. ఈ అసాధారణమైన పేరు పార్లెవారి బిస్కట్ల ఫ్యాక్టరీపల్ల వచ్చింది. అక్కడి ఇరుకు సందుల్లో తిరుగాడేటప్పుడు ఒకప్పుడు గాలిలో బిస్కట్ల వాసన వ్యాపించి ఉండేది. కాస్త తక్కువగా సగం ఇళ్ళు గుజరాతీలవి. బహుశా మూడో వంతు ఇళ్ళు మరాఠీ వారివి. కొందరు, బహుశా మూడో వంతు మంది మురికివాడల్లో నివసిస్తారు. ఉన్నత వర్గంగా ఉండే స్టాక్ బ్రోకర్లు, బంగారం వర్తకులు, ఇతరుల శుభ్రమైన చిన్న బంగళాలను ఆనుకునే ఈ మురికివాడలు ఉంటాయి.

గత నెలలో ఈ చిన్న నియోజకవర్గం శివసేనకు చెందిన వ్యక్తిని శాసనసభకు ఎన్నుకుంది. శాసనసభలో దాని రెండో ప్రతినిధి ఆయన. ఆయన రమేష్ ప్రభు. ఆయన బొంబాయి నగర మేయర్ కూడా. ప్రభు కాంగ్రెస్ (ఐ) కి చెందిన ప్రభాకర్ కుంటేకు, జనతా పార్టీకి చెందిన ప్రాణ్‌లాల్ వోహ్రాకు వ్యతిరేకంగా నిలబడ్డారు. కుంటే గతంలో మహారాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారు. బొంబాయిలో సుప్రసిద్ధ వ్యక్తి. వోహ్రా కూడా ఈ నియోజక వర్గంలో మూడు సార్లు గెలుపొందిన ప్రముఖ వ్యక్తి. ప్రభు ఈ ఇద్దరినీ చిత్తుగా ఓడించారు. కుంటేకు 18,783, వోహ్రాకు 13,928 వోట్లు రాగా ప్రభు 29.574 వోట్లు గెల్చుకున్నారు. ఇతర అభ్యర్థులందరి ధరావతులు గల్లంతయ్యాయి.

ప్రభు గెలిచారంటే నాకేమీ ఆశ్చర్యం కలగలేదు. కుంటే గతంలో ప్రజా సోషలిస్టుగా ఉండేవారు. చంద్రశేఖర్‌వలెనే ఆయన తమ పార్టీని వదిలి శ్రీమతి ఇందిరాగాంధీతో కలిశారు. చంద్రశేఖర్‌వలెనే ఆయన ఒక కుహనా సోషలిస్టు పరిభాషను వాడుతారు. ఇంకొక అభ్యర్థి అయిన ప్రాణ్‌లాల్ వోహ్రా మొదట కాంగ్రెస్‌వాదిగా ఉండి, అత్యవసర పరిస్థితి తర్వాత జనతా మనిషి అయ్యారు. కాని ఆయన మౌలికంగా మొరార్జీ దేశాయి వంటి కాంగ్రెస్ వాది. కేవలం శివసేనకు చెందిన ప్రభుకు మాత్రమే ఇటువంటి సందేహాస్పదమైన గతం లేదు. ఎన్నికల రోజున శివసేన ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ఒక పూర్తి పేజీ ప్రకటనను విడుదల చేసింది:


"ఈ ఎన్నికలలో శివసేన కేవలం హిందూ తత్వం కోసం, హిందూ మతాన్ని పరిరక్షించడం కోసం మాత్రమే పోటీ చేస్తున్నది. ఎందుకంటే ప్రభుత్వ ప్రచురణ అయిన "రిడిల్స్ ఆఫ్ హిందూయిజమ్" పుస్తకంలో శ్రీరాముణ్ణి, శ్రీకృష్ణుణ్ణి నీచంగా చిత్రించిన ప్రభుత్వాన్ని ఎదుర్కోవడానికి ఒక్క రాజకీయపార్టీ కూడా ముందుకు రాలేదు. తమ పార్టీ ప్రగతిశీల పార్టీ అని ప్రతిష్ఠ పొందడానికి వాళ్ళందరూ ఆ పుస్తకాన్ని సమర్థించారు. కనుక భవిష్యత్తులో కూడ హిందూ దేవతలు అవమానానికి గురవుతారు. దానికి వ్యతిరేకంగా పోరాడే వాళ్ళెవరు?"

దాన్ని మత తత్వమనైనా అనండి. మరేమైనా అనండి. కాని శివసేనకు తాను ఎక్కడ నిలిచి ఉన్నదో, ఎక్కడ నిలబడాలనుకుంటున్నదో పూర్తి స్పష్టత ఉంది. పన్ను చెల్లింపుదార్ల ధనాన్ని ఉద్దేశ్యపూర్వకంగా హిందూ వ్యతిరేకత కలిగి ఉన్న పుస్తకాన్ని ప్రచురించడంపైన వెచ్చిస్తే, శివసేనతో తలపడక తప్పదని అది ప్రభుత్వాన్ని హెచ్చరించింది. శివసేన హిందూ వేదిక మీది నుంచే ఎన్నికలలో పోటీ చేసి అఖండ విజయం సాధించింది.

వాస్తవానికి ఇతర పార్టీలు కూడా ఈ 'మత తత్వాన్ని' ఎన్నికలలో సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నించాయి. ఇక్కడే వినోదం మొదలవుతుంది. నాకు తెలిసినంతవరకు తన అభ్యర్థికి ప్రచారం చేయడానికి చంద్రశేఖర్ వెళ్ళలేదు. ఆయన సహచరులు చాలామంది వెళ్లారు.

ఉదాహరణకు మధుదండావతే వెళ్ళారు. ఆయనను షాబుద్దీన్ గురించి ప్రశ్నించినప్పుడు ఆయన చాలా క్షమాపణలు కోరుతున్నట్టు మాట్లాడారని, ఆ షాబుద్దీన్‌మీద త్వరలోనే చర్య తీసుకుంటామని శ్రోతకు హామీ ఇచ్చారని నేను విన్నాను. అదే సమయంలో ఆయన నాయకుడైన చంద్రశేఖర్ ఉత్తరప్రదేశ్‌లోను, ఇతరచోట్ల తన శ్రోతలకు షాబుద్దీన్‌లోగాని, ఆయన ప్రకటనలలో గాని ఏమీ పొరపాటు లేదని, తన పార్టీ ముస్లింల పట్ల ఆదరణను కొనసాగిస్తుందని చెప్పారు. బొంబాయిలోని వోటర్లు తెలివితక్కువ వాళ్ళు కారు. వాళ్ళు ఉత్తర భారతదేశం నుంచి వచ్చే పత్రికలు కూడా చదువుతారు. జనతాపార్టీ నాయకులు ఢిల్లీలో ఒక మాట, బొంబాయిలో ఒక మాట ఎందుకు చెపుతారని వాళ్ళు ఆశ్చర్యపోయి ఉంటారు. ఎవరి వోట్లను ఆకాంక్షిస్తున్నారనే దానిపై ఆధారపడి ఏదో ఒక మతాన్ని దగ్గరికి తీసే పార్టీలయిన కాంగ్రెస్‌కు, జనతాకు తేడా ఏమిటని వాళ్ళు ప్రశ్నించుకుని ఉంటారు. విలెపార్లెలో ఉన్న ముస్లిం వోట్లు చాల స్వల్పం. అవి జనతాకు పడలేదు. కాంగ్రెస్(ఐ) కి పడ్డాయి. ఎందువల్లనంటే ఈ రకమైన ఆటలో కాంగ్రెస్ (ఐ) ఎక్కువ స్థిరంగా ఉంది.

శివసేన గూండాలు. సంఘ వ్యతిరేక శక్తులు ఉన్న పార్టీ అని, అది వ్యాపారస్తులను బ్లాక్‌మెయిల్ చేసి



జాగ్రత్త... జాగ్రత్త... జాగ్రత్త!

వాడు

త్వరలో మీ ముందుకు రాబోతున్నాడు!!!

అతని కళ్ళు—
నిర్దాక్షిణ్యంగా నిప్పులు కక్కే మిషన్ గన్లు...

అతని నవ్వు—
మృత్యురక్తం ...

అతని జీవితం—
అడుగడుగునా ప్రమాదాల ప్రహేళిక...

అదే ... ప్రత్యేకత

నిముషానికో నేరం!!!
క్షణానికో ఘోరం!!!
ఘడియకో గండం!!!




వక్కా సుబ్రహ్మణ్యం

సంధించిన సరికొత్త ధనాస్త్రం

పవిత్ర పాపి


డబ్బు సంపాదిస్తుందని అంటారు. అది నిజమే అయితే, శివసేనకు, కాంగ్రెస్‌కు మధ్యన తేడా చాలా స్వల్పమైనదన్నమాట. కాంగ్రెస్ కూడా వ్యాపారస్తులను బ్లాక్‌మెయిల్ చేయడం ద్వారానే డబ్బు సంపాదిస్తుంది. ఐతే అది దేశంలో మాత్రమే కాక, విదేశాలలో కూడా పెద్ద చేపలనే పట్టుకుంటుంది. శివసేన బొంబాయిలో కొన్ని లక్షలు స్వాహా చేసుకుంటుంటే, కాంగ్రెస్ జెనీవాలోను, స్టాక్‌హోమ్‌లోను కోట్ల రూపాయలు, తరచుగా వందలాది కోట్ల రూపాయలు సేకరించు కుంటోంది. శివసేన తన ధనాన్ని పరేల్‌లోనో, దాదర్‌లోనో, విలెపార్లెలోనో దాచుకుంటే, కాంగ్రెస్ స్విస్ ఖాతాల్లో దాచుకుంటుంది. విలెపార్లె వోటర్ల ముందర రెండు - లేక మూడు రకాల రాజకీయ వేత్తలలో నుంచి ఒకరిని ఎంపిక చేసుకోవాలనే అవకాశం వచ్చినప్పుడు వాళ్ళు నేర్పుతోనే ఆ పని చేశారని నేను అనుకుంటున్నాను. స్థానిక పార్టీని, స్థానిక నాయకుణ్ణి ఎన్నుకోవడంలో వాళ్ళు తమ ప్రాంతంలో నివసించే వ్యక్తిని, తామందరికి చిరునామా తెలిపిన వ్యక్తిని ఎన్నుకున్నారు. కాంగ్రెస్ వాదులు లూటీ చేసిన సంపదను ఎక్కడ దాచుకుంటారో ఎవరికీ తెలియదు. అందువల్లనే ఎన్నో ప్రయత్నాలు జరిగినప్పటికీ బోఫోర్స్ లూటీ ఎక్కడ ఉన్నదో ఏ ఒక్కరూ కనిపెట్టలేకపోయారు.

జనతా అభ్యర్థికి శివసేన అభ్యర్థికి వచ్చిన



న్యూఢిల్లీ లేఖ

వోట్లలో సగం కన్న తక్కువే వచ్చాయి. ఆయన గుజరాతీ కాకపోయినట్టయితే బహుశా ధరావత్తు కోల్పోయి ఉండేవారు. ఐతే ఆయనకు చెందిన వర్గం కూడా మూకుమ్మడిగా ఆయనకు వోట్లు వేసినట్లు కనబడదం లేదు. గుజరాతీల వోట్లు ఆయనకు, కాంగ్రెస్ అభర్థి కుంటికు మధ్య చీలిపోయాయి. ప్రచారంలో పైకి చూడడానికి వోహ్రా తీవ్రమైన హిందూ వ్యతిరేక వైఖరిని ప్రకటించాడు. కొందరు జనతా నాయకులు ఆయనను నెమ్మదింప జేయడానికి ప్రయత్నించారు. కాని ఆయనకు ముస్లిముల వోట్లేమీ రాలేదు. నేను ఇదివరకే చెప్పినట్టు ముస్లింల వోట్లు ఎప్పుడూ కాంగ్రెస్ (ఐ)కే పడతాయి. ఎందుకంటే నెహ్రూ కాలం నుంచి కాంగ్రెస్ స్థిరంగా ముస్లిం అనుకూలంగా ఉంది. అల్ప సంఖ్యాక వర్గాలపట్ల హఠాత్తుగా శ్రద్ధను ప్రకటించి జనతా ఏమి సాధించింది? ఏది ఏమైనా ఎవరు ఎక్కువ మత తత్వాన్ని ప్రదర్శిస్తున్నారు? ఒక ప్రత్యేక ఆశయం కోసం పోరాడుతూ, దాన్ని బహిరంగంగా చెపుతున్న శివసేనలాంటి పార్టీనా? దాన్ని మత తత్వ పార్టీ అనండి, మరేమైనా అనండి. ఒక ప్రత్యేక మతం వోట్లు గెల్చుకోవడానికి అన్ని నియమాలు వదులుకుని, అప్పటికీ బహిరంగంగా రాలేని జనతావంటి పార్టీనా? నేను ముస్లింనయి ఉంటే శివసేనను సమర్థించేవాణ్ణి. ఎందుకంటే అప్పుడు నేను ఎక్కడ నిలబడి ఉన్నానో నాకు కచ్చితంగా తెలిసి ఉండేది. జనతాకు వోటు వేసి ఉంటే, ఆ పార్టీ నన్ను కేవలం నా వోట్ల కోసం దోపిడీ చేయదలచుకున్నది గనుక, నా ఉపయోగం తీరిపోగానే నన్ను మోసం చేస్తుంది గనుక, నేను తెలివిమారినవాణ్ణి అయి ఉండేవాణ్ణి. విలెపార్లె వోటర్లు కూడా ఇదే విధంగా ఆలోచించినట్లు ఉన్నారు. □




శ్రీరస్తు - శ్రీ త్రిపురసుందరీ వరశివాభ్యాం నమః

ఆంధ్రపత్రిక


పూర్తి ఆఫ్‌సెట్ ముద్రణతో త్వరలో వెలువడుతుంది

పూర్తి ఆఫ్‌సెట్ ముద్రణతో త్వరలో వెలువడుతుంది

శ్రీ వృషనామ సంవత్సర పూర్ణశాస్త్రీయ పంచాంగము



మేషం
వృషభం
మిథునం
కర్కాటకం
సింహం
కన్య



తుల
వృశ్చికం
ధనుస్సు
మకరం
కుంభం
మీనం



'దైవజ్ఞచిన్తామణి' శ్రీ పిడపర్తి చినకృష్ణమూర్తిశాస్త్రి,

'భాషాప్రవీణ' శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రి సిద్ధాన్తి సోదరులచే గుణింపబడినది.


ఆంధ్ర పత్రికా కార్యాలయము

ప్రతి 1-కి రూ. 5-00

గాంధీనగరం - విజయవాడ - 3. — దోమల్‌గూడ - హైదరాబాద్ - 29.

సీరియల్

వినాయకరావు పెళ్లి



మల్లాది వెంకటకృష్ణమూర్తి

(గత సంచిక తరువాయి)

శతభిషం ఇంట్లో ఆ కాంపౌండ్‌లోని వారంతా, ఒక్క ఇంటి యజమాని రమణమూర్తి, ఆయన కుటుంబం తప్ప ఆ రోజు సాయంత్రం చూసి వచ్చారు. శతభిషం భార్య భాగ్యలక్ష్మి ఎలక్కాయ టీని, బిస్కెట్లని అందరికీ ఇచ్చింది.

"ఆ రోజు రాత్రి కూడా రమణమూర్తి కరెంట్ తీసేయకపోతే వినాయకరావు పూర్తిగా గెలిచినట్లే. మన డిమాండ్ ఇంకోటుంది. ఈ ఇంటికి సున్నం వేయించి ఒకటి పక్కన సున్నా పెట్టినన్ని సంవత్సరాలయింది. గోడలు మాసిపోయి బోసిగా వున్నాయి. వినాయకరావు ఆ పుణ్యంకూడా కట్టుకోవాలని కోరుతున్నాను".

బట్టల దుకాణాన్ని నడిపే ఆయన చెప్పాడు.

"అలాగే" వప్పుకున్నాడు శాస్త్రి వినాయకరావు తరఫున.

"ఒకవేళ ఆయన వప్పుకోకపోతే మన కార్యక్రమం, ప్రణాళిక గురించి కూడా ఓసారి అనుకుంటే మంచిది" చెప్పాడు. చిట్‌ఫండ్ కంపెనీలో పనిచేసే మరోకాయన.

"మునిసిపాలిటీకి వుత్తరాలు రాసిద్దామా?" అడిగింది బట్టల కొట్టాయన భార్య భాగ్యలక్ష్మి.

"అలాక్కాదు. దీనికో చిట్కా వుంది" చెప్పాడు శాస్త్రి చిన్నగా నవ్వుతూ.

"ఏమిటి?" అడిగారంతా.

"మనం రేపు ఉదయానికల్లా తలో కుక్కని సంపాదించి వాటిని పెంచాలి".

"అందువల్ల లాభం?" అడిగాడు వినాయకరావు.

శాస్త్రి చెప్పాడు.

మర్నాడు ఉదయం వినాయకరావు, రమణమూర్తి ఇంటికి వెళ్ళాడు కాని ఆయన పని మీద బయటకి వెళ్ళాడని చెప్పింది ఆదిలక్ష్మి.

"ఎప్పుడొస్తారు?" అడిగాడు.

ఆదిలక్ష్మి, కాసేపు అతనితో చూపులతో నే పోట్లాడి చెప్పింది.

"సాయంత్రం దాకా రారు".

"కొద్దిగా జరూరు పని వుందే? ఎలా?"

"ఏం పని?"

"ఇంటికి వెల్ల వేయించే విషయం గురించి మాట్లాడాలి"

"అలాంటి విషయాలు మా నాన్నగారితో నే మాట్లాడాలి మీరు"

కోపంగా లో పలికి వెళ్ళిపోయింది ఆదిలక్ష్మి.

ఆ రోజు సాయంత్రం ఆఫీసు నించి తిన్నగా ఇంటికొచ్చేసారు మిత్ర బృందం. రమణమూర్తి పోర్షన్‌లోనికెళ్ళాడు వినాయకరావు. ఆయన ఇంటికి సున్నం వేసే వాళ్ళతో యూనిట్‌కి ఎంత కూలి ఇవ్వాలో బేరం ఆడుతున్నాడు.

వెంటనే వెనక్కి తిరిగిన వినాయకరావుని చూసి పిలిచాడు రమణమూర్తి.

"వెళ్ళిపోతున్నావేం అబ్బాయ్?"

"పనవుతోందిగా. ఇంక మాట్లాడాల్సిన అవసరం లేదని".

"ఏం మాట్లాడుదామని వచ్చావ్?"

"గోడలకి సున్నాలు వేయడం గురించి. మేం అడక్కుండానే కూలీలని పిలిపించారుగా.

రమణమూర్తి వినాయకరావు వంక చూసి చిన్నగా మందహాసం చేసాడు.

జరిగిన కథ –2 : వినాయకరావు, శాస్త్రి రూంమేట్లు. శృతి తమ ఇంటి ఓనర్ రమణమూర్తి కూతురేనని తెలియని వినాయకరావు అభిమానిస్తూ, ఉత్తరాలు రాస్తూ ఉంటాడు. ఆదిలక్ష్మి రేడియోలో పాడుతుందని తండ్రికి తెలియదు. శృతి పాటని సాధన చేస్తుండగా వినాయకరావు వింటాడు. వినాయకరావు ఉత్తరానికి శృతి జవాబు రాస్తుంది.

"మీ ఇంటి గోడలకనుకున్నావా?"

"కావా?" అన్నట్లుగా చూసాడు వినాయకరావు.

"మా పోర్షన్ గోడలకు మటుకే".

"మేం అద్దె ఇవ్వట్లేదా, లేక మేం మాత్రం మనుషులం కామా?" అడిగాడు వినాయకరావు.

"నెలకో పాతిక పెంచితే కాదంటారు. అన్ని సౌకర్యాలు కావాలి మీకు".

"అయితే వల్ల కాదంటారా?".

"కాదు."

"సరే అయితే" వెనక్కి తిరిగాడు వినాయకరావు.

"అన్నట్టు బాబూ... ఒక్క నిముషం".

ఆయన లోపలికి వెళ్ళి నాలుగు పక్కలా పసుపు రాసిన ఓ కవరు తెచ్చి వినాయకరావు చేతిలో వుంచాడు.

"ఆదిలక్ష్మి పెళ్ళా?" అడిగాడు వినాయకరావు".

"కాదు".

"మరి? ఇంక మీ ఇంట్లో వేరే శుభకార్యాలేమున్నాయి?".

"మా పెద్దమ్మాయి పెళ్ళి".

"పెద్దమ్మాయి పెళ్ళా!!!" విస్మయంగా అడిగాడు వినాయకరావు. కవర్ విప్పి శుభలేఖని బయటకి తీసి చదివాడు.

"మీ అల్లుడుకేమయినా అయిందా? రెండో పెళ్ళా? ఈ రోజుల్లో విధవా వివాహం..."

"షటప్... మా అల్లుడికిచ్చే పెళ్ళి" అరిచాడాయన అసహనంగా.

"వాళ్ళకి పెళ్ళయి ఇద్దరు పిల్లలు కూడా వున్నారుగా. ఇప్పుడు పెళ్ళేమిటంది?" అడిగాడు వినాయకరావు.

"వచ్చే ఆదివారం. ఇంట్లోనే ఇక్కడే. అందుకే ఈ సున్నాల సన్నాహాలు".

"అయితే మా అద్దె వాళ్ళందరికీ సున్నాలు సున్నాయేనా?".

"సున్నానే".

"ఆఖరి మాటగా అందరి తరపున మళ్ళీ అడుగుతున్నాను. సున్నాయేనా?".


"సున్నాయే".

"అయితే రేపు ఉదయం మీరే మనసు మార్చుకుంటారు. ఎందుకయినా మంచిది ఇంట్లోని గోడలన్నిటికీ కలిపి మాట్లాడేయండి".


వెనక గదిలోంచి ఆ మాటలు విన్న ఆదిలక్ష్మికి అనిపించింది. వినాయకరావు ఏదో బలమయిన పథకం వేసాడని. వినాయకరావు బయటికి వెళ్ళిపోగానే మళ్ళీ సున్నాలతనితో మాట్లాడసాగాడు రమణమూర్తి.

* * * * * *

గోదావరి జిల్లాలోని నర్సాపురంలోని ఓ రెండు నిట్టాళ్ళ పాకలో రిలయన్స్ కప్ గురించి జరిగే క్రికెట్ మేచ్ మీద రౌండప్‌ని చూస్తున్నాడు వినాయకరావు తండ్రి డాంబికేశ్వరరావు.







"అబ్బబ్బ! మీకిదేం పిచ్చండి. పొద్దున్నంతా చూసారుగా. అవతల అన్నం చల్లారిపోతోంది". ఆయన భార్య చాముండేశ్వరి విసుక్కుంది.

ఆయన టి. వి. ని కంచానికి. అనుగుణంగా తిప్పుకొని అన్నం ముందు కూర్చుని గుమ్మంలోంచి అవతల గదిలో కనబడే టి. వి. లోని క్రికెట్ మేచ్‌ని చూడసాగాడు.

"మా అన్నయ్య ఉత్తరం రాసాడు" చెప్పింది చాముండేశ్వరి.

"పొలం ఎలా పండిందట?" అడిగాడాయన.

"అబ్బ! పొలం గురించి కాదండి. సుబ్బలక్ష్మి గురించి?".

"ఇంటర్ పాసయిందిట?"

"ఈసారి పరీక్షకు వెళ్ళలేదండి. పరీక్ష రేపనగా సరిగ్గా ఇవాళ జ్వరం వచ్చిందట."

"ఇవాళ జ్వరం వస్తే ఆ సంగతి (మొన్న) ఉత్తరంలో ఎలా రాయగలిగాడు?" అడిగాడు డాంబికేశ్వరరావు.

చాముండేశ్వరి లేచి వెళ్ళి టి. వి. ఆర్పి వచ్చి కూర్చుంది.

"ఇప్పుడు శ్రద్ధగా వినండి నే చెప్పేది. కపిల్‌దేవ్ ఎక్కడికీ వెళ్ళడు సునీల్ గవాస్కర్ ఎక్కడికీ వెళ్ళడు. రేపు ఉదయం మళ్ళీ వెస్టిండీస్‌తో ఆడతారు గాని హాయిగా చూద్దురుగాని".

సరే చెప్పు".

"అసలు వినాయకం ఈ క్రికెట్ ఆట ఎలా ఆడతారో నువ్వు చెప్పకపోతే నాకు మనశ్శాంతిగా ఉండేది".

"ఎలా ఆడతారో నే చెప్తా విను".

"మొత్తం పదకొండుమంది..."

"నా కక్కర్లేదు. ఆ జబ్బు నాకు అంటుకుంటే ఇక ఇద్దరం అన్నం మానేసి టి వి. ముందే వుండాల్సి వస్తుంది".

"ఇంతకూ మీ అన్నయ్య వుత్తరం ఏమని రాసాడు? నాట్లేసాట్ట?"

"ఇవి నాట్ల రోజుల్టండి? మీ మతి మరుపు పాడుగాను. టి. వి లో ఈ క్రికెట్ మీ మతిని చెడగొడుతోంది."

"ఇదేం గుర్రప్పందాలో, పేకాటో కాదు సరే ఎవరి ముచ్చట వారిది. కాస్త చారు పోసి విషయానికి రా".

"ఇది చారు కాదు పులుసు".

"ఆ పేరెట్టావా? పల్చగా వుంటే చారనుకున్నాను."

"సుబ్బలక్ష్మికి వెంటనే పెళ్ళి చేసేయాలనుకుంటున్నాడట. మనల్ని వినాయకరావుకి వెంటనే పెళ్ళి చేసేయాలనుకోమంటున్నాడు."

"కట్నం ఏమాత్రం ఇస్తానంటున్నాడేంటి"

"మనం అనుకున్నట్టుగానే పొలం మన వాడి పేర మీద పెడతారులెండి. అయినా చిన్నప్పటి నించి అనుకుంటున్న సంబంధం. ఇప్పుడా కట్నం కోసం కాదనగలమా చెప్పండి".

"నా భార్య అన్నయ్య– నాకు బావమరిది– కాని కట్నం దగ్గర– కాదేవ్ పిచ్చి ఊహమా. ఈ బ్లాక్ అండ్ వైట్ టి. వి. స్థానంలో కలర్ టి. వి. వుండాలి వినాయకరావు పెళ్ళికి. మన డబ్బుతో కాదు. అర్థం అయిందా?"

"మరి వినాయకాన్ని పిలిపించి లాంఛనంగా తాంబూలాలు పుచ్చుకోవడం మంచిదని రాసారు".

"అయితే వాడికి ఈ సంగతి వుత్తరం రాయి."

"నే రాయడం దేనికి. మా అన్నయ్యే నాతో పాటు వాడికీ ఓ కార్డు ముక్క రాసి పడేసానని రాసాడు."

"అయితే వాడి దగ్గర నించి వుత్తరం వచ్చేదాకా ఆగుదాం".

"చిన్నప్పట్నించి అనుకుంటున్న సంబంధం. ఇప్పుడు వాడు కాదన్నా, మీరు కాదన్నా ఇక మా అన్నయ్య మన గడప తొక్కడు." చిరాగ్గా చెప్పింది చాముండేశ్వరి.

"వాడూ కాదనడు. క్రితంసారి శెలవలకి వచ్చినపుడు నేను ఈ విషయం వాడితో కదిపి చూసాను. పట్నవాసంకదా. ఏ ప్రేమయినా వాణ్ణి క్లైమా చేసిందేమోనని అనుమానపడ్డాను. అలాంటిదేం లేదు".

"సరిగ్గా మా అన్నయ్య భయం కూడా ఇదేనండి. ఆ ముక్కే రాశాడు. ముడెట్టేస్తే ఎప్పుడు కావాలంటే అప్పుడే కాపరానికి తీసుకెళ్ళచ్చు".

"ఎందుకయినా మంచిది. నీవూ వుత్తరం రాయి.".

"నేను రాస్తే తలాయిస్తాడు కాని మీరే రాయండి".

"అలాగే. డిసెంబర్ మొదటి వారానికి క్రికెట్ మేచ్‌లన్నీ అయిపోతాయి ఆ తర్వాత రాస్తాను".

"ఈలోగా సుబ్బలక్ష్మికి ఎవరితోనో పెళ్ళయి ఆ పిల్లకి కడుపోస్తుంది కూడా. అన్నం తిని రాయండి".

"అలాగే రాస్తాలేవే. నువ్వేమంటావో అని ఆ మాటన్నాను. నాకు మనబ్బాయి పెళ్ళి ముఖ్యమా లేక క్రికెట్టా?" డాంబికేశ్వరరావు నవ్వాడు.

"గట్టిగా నవ్వకండి. లేగదూడ బెదురుతుంది" చెప్పింది చాముండేశ్వరి.

* * * * * *



వినాయకరావు పెళ్ళి

ఆ రోజు ఉదయం నిద్ర లేచి ఆదిలక్ష్మి రేడియోని ఆన్ చేసింది వెంకటేశ్వర సుప్రభాతం వస్తోంది. ఎక్కడో కుక్క మొరిగిన శబ్దం వినపడింది.

ఆదిలక్ష్మి, బాయిలర్‌ని రాజేస్తుంటే మరోసారి కుక్క మొరిగిన శబ్దం వినపడింది 'ఈ కాంపౌండ్‌లో నేలాగుంది. ఎట్నుంచి వచ్చిందో అనుకుంది మనసులో

"ఏరా రమణమూర్తి. కాసేపు నోరు మూసుకోలేవు అలా కుక్కలా అరవకపోతే" అన్న వినాయకరావు మాటలు వినపడి బయటకి వచ్చింది ఆదిలక్ష్మి, పొద్దుటకు తెల్లారిందనుకుంటూ.

బయట కనపడ్డ దృశ్యాన్ని చూసి అమిత ఆశ్చర్యపోయింది ఆదిలక్ష్మి. వినాయకరావు ఇంటి ముందో చిన్న కుక్కపిల్ల కట్టి వుంది. దాని ముందు కూర్చుని మాట్లాడుతున్నాడు.

"ఏరా రమణమూర్తి, నీకు ఈ పూట ఎందు చేపలు కావాలా లేక మటన్ కావాలా?" ఓర కంటితో ఆదిలక్ష్మిని చూసి అడిగాడు వినాయకరావు కుక్కని.

బదులుగా అది మొరిగింది.

ఒహొా. పీత కావాలా? అదెక్కణ్ణుంచి తేన్రా? మటన్ పెట్టిస్తాలేరా రమణమూర్తి".

ఆదిలక్ష్మి అతని దగ్గరకెళ్ళి కోపంగా చూస్తూ అడిగింది.

"ఏవిటిది మిస్టర్"

"కుక్కపిల్లండి"

"తెలుస్తూనే వుంది. ఏమిటా వాగుడు?"

"వాగలేదే. మాట్లాడానండీ".

"దాంతో మాట్లాడుతావా' నాన్నగారి పేరెందుకు తెస్తారు మధ్యలో"

'మీ నాన్నగారి పేరు తేవడమేమిటండి? ఆ పేరంటేనే నాకసహ్యం. నా కుక్కని వాని పేరు పెట్టి పిలిచి మాట్లాడుతున్నాను".

"ఏవిటీ! ఈ కుక్కకి మా నాన్నగారి పేరు పెట్టావా?"

"అది కాదు ఆదిగారు. ఐ మీన్ ఆదిలక్ష్మిగారు. ఈ కుక్క పేరే మీ నాన్నగారికి పెట్టారు జస్ట్ దట్. అంతే"

"మర్యాదగా దీన్ని బయటకి పంపండి. లేదా పేరయినా మార్చండి" గర్జించింది ఆదిలక్ష్మి.

"ఏవిటమ్మా తెల్లారే ఈ గొడవ?" రమణమూర్తి ఆవలిస్తూ ఇంట్లోంచి బయటకి వచ్చి అడిగాడు కూతురిని

ఆదిలక్ష్మి బదులు చెప్పేలోగా శతభిషం 'గుడ్‌మార్నింగ్ రమణమూర్తి' చెప్పాడు

"గుడ్‌మార్నింగ్" బదులు చెప్పాడు రమణమూర్తి.

"మిమ్మల్ని కాదండి గుడ్‌మార్నింగ్ అంది మా కుక్కని" చెప్పాడు శతభిషం.

"ఆదిలక్ష్మి మరో కుక్కపిల్ల శతభిషం ఇంటి ముందు కట్టేసి వుండటం చూసింది. అద్దెకున్న నాలుగు పోర్షన్‌ల ముందు నాలుగు కుక్కల్ని కట్టేసి వుండటం చూసారు తండ్రీ కూతుళ్ళిద్దరూ

"అరే మీరూ కుక్కని కొన్నారే? మీ కుక్క పేరేంటి?" అడిగాడు వినాయకరావు బట్టల కొట్టు అతన్ని.


"రమణమూర్తని కుక్కలకి పెట్టే పేరు పెట్టుకున్నాను". చెప్పాడతను.

"చమత్కారంగా వుందే? మా కుక్క పేరు మీరు కాపీకొట్టారన్న మాట" చెప్పింది చిట్‌ఫండ్‌లో పని చేసే ఆయన భార్య ధనలక్ష్మి.

"అంటే ఈ కాంపౌండ్‌లోకి నాలుగు పెంపుడు కుక్కలొచ్చాయన్నమాట?" ఆ నాలుగిటికి నా పేరే పెట్టారన్నమాట" అడిగాడు రమణమూర్తి తీక్షణంగా చూస్తూ.

"మీ పేరు కాదండి. కుక్కలకి సహజంగా పెట్టే పేరు పెట్టుకున్నాం".

"వీల్లేదు. వాటికి నా పేరు పెట్టడానికి, అలా పిలవడానికి వీల్లేదు"



కొత్త శీర్షిక

నాటి పెళ్ళి ముచ్చట్లు

మీ పెళ్ళి అయి చాలా కాలం అయినా ఇంకా ఆనాటి తమాషా సంఘటనో, సరదావిషయమో, నవ్వొచ్చే జోకో గుర్తుందా? అయితే మీరు దానిని 250 అక్షరాలకి మించకుండా క్లుప్తంగా రాసి పంపండి. రచనతో పాటు మీ పాస్ పోర్ట్ ఫొటో కూడా పంపవచ్చు. ప్రచురణకి ఆమోదయోగ్యమైన వాటిని ఈ 'వినాయకరావు పెళ్ళి' సీరియల్ పేజీలలో ప్రచురిస్తాము.

రచనలని, ఫొటోలని 'నాటి పెళ్ళి ముచ్చట్లు' శీర్షిక పేర సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ–520003 అనే చిరునామాకి పంపాలి.



అరిచారాయన.

"నాలుగు కుక్కలకి నాలుగు పేర్లు వెదికే బదులు మీరే వేరే పేరొకటి తీసుకోండి" సలహా ఇచ్చింది శతభిషం భార్య.

"అసలీ ఇంట్లోనే ఎవరూ కుక్కలు పెంచడానికి వీల్లేదు" చెప్పింది ఆదిలక్ష్మి అందరి వంకా కసిగా చూస్తూ–

"సరిగ్గా అద్దె ఇస్తున్నప్పుడు అది మా ఇష్టం అండి" చెప్పింది బట్టలషాపు అతని భార్య.

"అలాంటప్పుడు ఇల్లు ఖాళీ చేయండి" చెప్పింది కనకమహాలక్ష్మి బయటకి వచ్చి.

"ఉన్న ఫళాన పొమ్మంటే ఎక్కడికి పోతాం. వేరే ఇంటికోసం చూస్తున్నాం. దొరగ్గానే వెళ్ళిపోతాం. కదురా రమణమూర్తి" కుక్కని దువ్వుతూ చెప్పాడు వినాయకరావు.

"దాన్ని ఆ పేరుతో పిలుస్తే వూరుకోను. టామీ, టైగర్, సీజర్ లాంటి పేర్లేమయినా పెట్టుకోండి" అరిచాడు రమణమూర్తి.

"అవి బొత్తిగా ఏం బాగాలేవు. ఇంకేమయినా చెప్పండి" అడిగాడు శతభిషం.

"నేను కుక్కల పేర్ల డిక్షనరీ ఏమయినా రాసాననుకుంటున్నావా?" అరిచాడు రమణమూర్తి.

"రమణమూర్తి పేరు బహు ముచ్చటగా వుందని అది పెట్టుకున్నాం" చెప్పింది చిట్‌ఫండ్ కంపెనీలో పనిచేసే అతని భార్య.

"మనుషుల పేర్లు కుక్కలకేమిటి? నేనెక్కడా వినలేదు" అడిగింది కనకమహాలక్ష్మి.

"మా వూళ్ళో కుక్కలకన్నీ మనుషుల పేర్లే. రాధాకృష్ణమూర్తి, సూర్యప్రకాశరావు, వెంకటేశ్వర్లు..... ఇలా" చెప్పాడు వినాయకరావు.

"అవును. మా వూళ్ళో కూడా అంతే" చెప్పారు మిగతావాళ్ళు ముక్తకంఠంతో.

"ఇది మీరంతా కావాలని చేస్తున్న అగడం. పోలీసులకి రిపోర్టిస్తాను. చెప్పాడు రమణమూర్తి.

"పోలీస్ స్టేషన్‌లో కనుక్కునే ఈ పేర్లు పెట్టుకున్నాం. కుక్క స్వంతం అయితే చాలట ఏ పేరు పెట్టుకోడానికయినా" చెప్పాడు శతభిషం.

"ఇంతకీ మీరంతా కూడగట్టుకుని ఇదంతా ఎందుకు చేస్తున్నట్లు?" అడిగింది కనకమహాలక్ష్మి.

"కుక్కలు పెంచుకుంటే దొంగలు రారని"

"అసలు విషయం ఏమిటో చెప్పండి" అడిగింది ఆదిలక్ష్మి ఆ సమాధానం చెప్పిన వినాయకరావుని.

"శతభిషాన్ని అడగండి" చెప్పాడు వినాయకరావు.

"అయ్యో! నా మీదేం పెట్టకండి. నీవు చెప్పవయ్యా" బట్టల కొట్టతనితో చెప్పాడు శతభిషం.

"నాకు తెలీదు. నీకేమయినా తెలుసా?" అడిగాడాయన చిట్‌ఫండ్ కంపెనీ అతన్ని చూస్తూ.

"వినాయకం చెప్తేనే మంచిది" చెప్పింది భాగ్యలక్ష్మి.

"చెప్పండి. ఎందుకు చేస్తున్నారీ న్యూసెన్స్?" అడిగింది ఆదిలక్ష్మి తీక్షణంగా చూస్తూ.

"అందరిళ్ళకీ వెల్లవేయిస్తే రమణమూర్తిని నాలుగు తన్నితో లేస్తాను.... మీ నాన్నగారిని కాదండి. నా వుద్దేశం ఈ రమణమూర్తిని" కుక్క వంక చూపించి చెప్పాడు.

తన పేరుతో పిలవబడే కుక్కలు బయటకు వెళ్ళే మార్గం ఉందని తెలిసిన రమణమూర్తికి మనసు కాస్తంత కుదుటపడింది. వెంటనే చెప్పాడు.

"మా పెద్దమ్మాయి పెళ్ళి ఎలాగూ ఇంకో పది రోజుల్లో జరుపుతున్నాం. మీరు వద్దన్నా అందరిళ్ళకి వెల్ల వేయించాలనుకున్నాను. ఉండేది మీరయినా, ఇల్లు మాదేగా. మా కోసం కాదు. శుభకార్యానికి సున్నం అందం అంటారు. అందుకని" చెప్పాడు రమణమూర్తి అదేదో చాలా తేలిక విషయం, మీరు కనుక్కోలేక పోతారా అన్నట్లుగా.

"అలా అయితే సరే" చెప్పాడు వినాయకరావు.

"మా మీద కోపంతో కాదుగా. ఏం అనుకోకండి" చెప్పాడు శతభిషం.

అంతదాకా వీధి గుమ్మం పక్కన రోడ్డు మీద నిలబడి జరిగిందంతా విన్న శాస్త్రి లోపలకి వచ్చి వాటిని చూసి చెప్పాడు.

"ఇదేమిటి? ఈ కుక్కలేమిటి? ఛ. ఛ"

"చూసావా నాయనా మీ వినాయకం అగడం?" చెప్పింది కనమహాలక్ష్మి కళ్ళలో నీళ్ళు తిరుగుతుంటే.

జరిగింది ఆవిడ మళ్ళీ చెప్పగా విని శాస్త్రి వినాయకరావుని కోప్పడ్డాడు.

"నీకిదేం సరదారా? కుక్కని పెంచుతావా? పైగా మన అందరికీ, ఇంత నీడ ఇస్తున్న మహానుభావుడు రమణమూర్తి పేరు పెడతావా? ఒరేయ్. దాన్ని వెంటనే ఎక్కడ నించి దొంగిలించుకు వొచ్చావో అక్కడ వదలకపోతే కుక్కని కొట్టినట్లు కొడతాను జాగ్రత్త. ఆయన కష్టపడి నాలుగు రాళ్ళు వెనకేసి, దాంతో ఇటుకరాళ్ళు కొని ఈ ఇల్లు కట్టబట్టేగా మనం ఇక్కడ తలదాచుకోగలిగింది. ఆమాత్రం ఇంగిత జ్ఞానం లేకపోతే ఎలా?" వినాయకరావు మీద అరిచాడు శాస్త్రి.

ధర్మపథం



ఇంద్రుని దేవి పూజ

ఒకప్పుడు ఇంద్రుడు దుర్గాదేవిని మిక్కిలి ఆర్భాటంతో పూజించాడు. అతనిలో భక్తిభావం కంటే- తానందరి కంటే ఎంతో ఘనంగా- ఇతరులకు ఎవ్వరికీ లభ్యంకాని పూవులతో పూజ చేస్తున్నాననే అహంకారమే అధికంగా ఉండినది. ఎంతో భక్తితో పూజ జరుగుతున్నదనే అందరూ అనుకొన్నారు. వారిలో దుర్వాస మహర్షి; దేవీ భక్తుడు కూడా ఉన్నాడు. ఇంద్రుని యీ మహత్తరమయిన పూజను దేవి సమక్షంలో వివరించి, ఆమెకు తృప్తి కలిగించాలనే సంకల్పంతో ఆ మహర్షి ఆమె సన్నిధికి బయలుదేరాడు. ఆమె నివాస భవనం వద్ద ద్వార పాలకులు ఆయనను అడ్డగించారు. ఆయన కోపించి "దేవీ భక్తుడనైన నన్నే అడ్డగిస్తారా!" అని ప్రశ్నించాడు. వారు "స్వామీ! ఆమెకు ఇప్పుడు చాలా అస్వస్థతగా ఉన్నది. పండుకొనే ఉన్నది. ఇది దర్శించడానికి సమయం కాద న్నారు. ఆ ముని ఎలాగో లోపల ప్రవేశించి చూడగా, దేవి సేవకులు చెప్పినట్లే ఏదో బాధపడుతూ పండుకొని ఉన్నది. దుర్వాసుడు "దేవీ! మీ యీ అస్వస్థతకు కారణం ఏమిటి?" అని అడిగాడు. ఆమె "ఇంద్రుడు భక్తితో కాక, అహంకారంతో ఆర్భాటంగా పూజ చేశాడు. ఒక్కొక్క పువ్వు ఒక బాణం లాగ నా శరీరానికి గుచ్చుకొని బాధ కలిగించినది. దీనిని భరించలేకున్నాను" అన్నది. ఇంద్రుని పూజ కళ్లారా చూచి మెచ్చుకొని ఆ విషయం దేవికి విన్నవించడానికొచ్చిన ఆ మునికి ఈ మాట ఆశ్చర్యాన్నీ, పరితాపాన్నీ కలిగించింది. తాను ఇంద్రుని మనో భావాన్ని గ్రహించ లేనందుకు సిగ్గు పడ్డాడు. "దీనికి చికిత్స సెలవియ్యి. నేను చేస్తాను" అన్నాడా ముని. "నీవేమీ చెయ్యలేవు. ఈ దగ్గరున్న నా గుడిలో ఒక వైద్యుడుంటాడు. అతన్ని పిలుచుకొని రా" అని దేవి చెప్పింది. ముని అక్కడికి పోయి ఎంత వెతికినా వైద్యుడు కాన రాలేదు. దేవి విగ్రహం సన్నిధిని ఒక బక్క చిక్కినవాడు మాత్రం కన్నీరు కారుస్తూ కానవచ్చాడు. దుర్వాసుడు నిరాశతో దేవి వద్దకు వచ్చేసరికి, బాధ నివారణమై, స్వస్థత చెంది దేవి సంతోషంతో కూర్చుని ఉన్నది. వైద్యుడు కానరానందున నిరాశతో వచ్చిన దుర్వాసునికి- వైద్యుడు రాకుండానే నెమ్మది పొందిన దేవిని చూడగా ఆశ్చర్యం కలిగింది. "వైద్యుడు కానరాలేదు. అతడు రాకుండానే నీకు స్వస్థత కలిగినందుకు సంతోషం. నా కక్కడ కన్నీరు కారుస్తూ నీ విగ్రహం సన్నిధి నున్న ఒక బక్క చిక్కినవాడు మాత్రం కానవచ్చాడు" అని అన్నాడు. దేవి నవ్వుతూ "ఆ బక్క చిక్కినవాడే వైద్యుడు. అతడు నిర్మల హృదయంతో ప్రగాఢ భక్తితో, మానసిక పూజ చేస్తూ ఆనంద బాష్పాలు విడుస్తున్నాడు. ఆ బాష్ప జలమే నా శరీరంపై వ్యాపించి, నా బాధను పోగొట్టింది" అన్నది. "నిజమైన భక్తికి ఆర్భాటం అక్కర్లేదు. భక్తి లేని పూజ పత్రి చేటు" అనే నానుడి ప్రసిద్ధమే కదా!

-బులుసు వేంకటరమణయ్య

వినాయకరావు పెళ్ళి

"నిజమేరా. ఇంతదూరం ఆలోచించలేదు. సారీ, రమణమూర్తిగారు" చెప్పాడు వినాయకరావు బాధగా.

అది నటనో, నిజమో అర్థం చేసుకోలేకపోయాడు రమణమూర్తి అండ్ హిజ్ కుటుంబ సభ్యులు.

కుక్కలన్నీ బయటకి వెళ్ళాక చెప్పాడు రమణమూర్తి.

"మీరంతా మా అమ్మాయి పెళ్ళికి రావాలి. మీ అందరి భోజనాలు ఆ రోజు మా ఇంట్లోనే. బయట షామియానా వేసి పెళ్ళి".

"తప్పకుండా. మీ ఇంటికి చుట్టాలు అనేకులు వస్తారు కదా. అంతా తలో గది వాళ్ళుండటానికి ఇస్తాం" చెప్పాడు శాస్త్రి.

"నీవు మహా బుద్ధిమంతుడివోయ్. మీ గోత్రం ఏమిటి?" అడిగాడు రమణమూర్తి అతన్ని వాత్సల్యంగా.

"కౌండిన్యస గోత్రం సార్ మాది" చెప్పాడు శాస్త్రి.

"చంపేసావోయ్. మాదీ ఆ గోత్రమే".

కనకమహాలక్ష్మి ఆయన చెవులో గుసగుసలాడింది.

"మర్చిపోయాను కదూ. మా ఆదికి మేనరికం వుంది".

"అయ్యో. చిన్న అనుమానం. మీ పెద్దమ్మాయి అల్లుడుగారితో వేసవి శెలవలకి వచ్చినప్పుడు చూసాను. ఇద్దరు పిల్లలు కూడా. ఇప్పుడు పెళ్ళేమిటి?" అడిగాడు శతభిషం.

"వాళ్ళది ప్రేమ వివాహం. ఆ వేడిలో రిజిస్టర్ మేరేజ్ చేసేసుకున్నారు. అది ఇటీవల ప్రభుత్వంవారు కనిపెట్టిన పెళ్ళి. దాని మీద నాకేం నమ్మకం లేదు. అగ్నిసాక్షిగా పెద్దల ముందు నాతిచరామి అని సప్తపది జరిగితేనే మన శాస్త్ర ప్రకారం వివాహం అయినట్లు.

"మా అల్లుడు నా మాట పెడచెవిన పెడుతూ వచ్చాడిన్నాళ్ళు".

ఇప్పటికి వప్పుకున్నాడు".

"అయితే ఆస్తి పంపకాలు చేస్తున్నారన్నమాట" అడిగాడు వినాయక రావు.

ఆదిలక్ష్మి, అతని వంక కోపంగా చూసి లోపలకి వెళ్ళిపోయింది.

అక్కడ అలా ఓ చిన్న సంగ్రామం జరిగి, సంధితో మళ్ళీ వాతావరణంలో శాంతి నెలకొంది.

(ఇంకా ఉంది)



కొత్త
రలక్
మీ కుటుంబానికి ప్రత్యేక సబ్బు
తులసి సద్గుణాలు గలది.
FAMILY SOAP
Ralak
WITH THE GOODNESS OF TULSI
Ralak
మీ కుటుంబాన్ని ఆనందారోగ్యాల
కుటుంబంగా రూపొందించండి. వారికి
తెచ్చివ్వండి, కొత్త రలక్—మీ కుటుంబానికి
ప్రత్యేక సబ్బు. రలక్‌లో సుప్రసిద్ధమైన
తులసి సద్గుణాలున్నాయి. ఇందుచేత
చర్మం శుభ్రంగా కళకళలాడుతూ
రూపొందుతుంది. దీని తాజాతాజా
సువాసనలతో వారికి సదా తాజాదనపు
అనుభూతి కలుగుతుంది. హాయిగా
ఆహ్లాదంగా ఉంటుంది.
ఆనందారోగ్యాల కుటుంబం, రలక్ కుటుంబం.

ప్రశ్నావళి — కె. రామలక్ష్మి

బి. ఎస్., భీమవరం.

★ ప్రస్తుతం అతి భయంకర రూపం దాల్చిన వరకట్న సమస్య మరింత తీవ్రం గావడానికి కారణం స్త్రీలు ముఖ్య కారణం అంటాను.


● నిజమే. కొడుకులపై కర్చు రాబట్టాలని భర్త పూనికతో వుం ి- తల్లి ఏం చేస్తుంది?! ఈ సమస్యకి పెద్దలు కాాణం అనేకంటే-పెళ్లి చేసుకునే- యువతీ యువకుల చేవ చచ్చిన తనం ముఖ్య కారణంగా నేను అనుకుంటాను.

★ మీ ఎడ్రసు చెప్తారా?

● ప్రశ్నావళికి ఇంటి ఎడ్రసు దేనికి?!

ఎన్. కె. ఆర్., పర్లాకిమిడి.

★ పెళ్లి చూపులలో ఒకరినొకరు యిష్టపడి పెద్దల



సమక్షంలో పెళ్లి చేసుకుంటారు. పెళ్లయిన తరువాత చాలా మంది దంపతులు విడిపోతూంటారు. అప్పుడీ పెళ్లి చూపులెందుకు? విడిపోవడాలెందుకు?

● పెళ్లి చూపులే- పెళ్లి కాదు. కలిసి బ్రతకడం పెళ్లి. పెళ్లి చూపులలో 'తేలని' సమస్యలు పెళ్లి తరవాతేగా బయటపడేది?! కాల్చి చంపడం కాల్చుకోవడం కంటే- యీ విడిపోవడం ఎంతో మెరుగు.

★ ప్రతి ఒక్క మనిషిలో ఒక ప్రత్యేకత వుంటుంది. కాదంటారా?

● ఎలా? అదే దైవ సృష్టిలోని విచిత్రం- మనిషిని పోలిన మనిషే వున్నా- ఇద్దరిలో ఎంతో తేడా వుంటుంది. అల్ఫ్రెందో అనే చిత్రకారుడు గంగ గట్టున పడుకుని వచ్చేపోయే వారి పాదాలను స్కెచ్ చేశాడు. ఆ పాదాలలో ఎన్ని రకాలో చూస్తే ఆశ్చర్యం వేస్తుంది

ఆర్. ఆర్. ఆర్., గుంతకల్.

★ మంచి సరుకుకు మంచి పబ్లిసిటీ ఇవ్వడంలో తప్పేముంది అన్నాదొక రచయిత. కామెంట్ ప్లీజ్.

● 'సరుకు' అని ఒప్పుకొన్న ఆ రచయిత అలా అనడంలో తప్పులేదు.

★ బాధ్యతాయుతమైన రచయితలు సామాన్యుల స్థాయికి దిగజారి ఒకరినొకరు దుమ్మెత్తి పోసుకోవడంపై మీ అభిప్రాయం?

● బాధ్యతాయుతమైన రచనలు చేసే వారి గురించి ఆలోచించండి మీరు... అలాంటి వారినెప్పుడూ వేళ్ళ మీద లెక్క పెట్టవచ్చు... ఇక దుమ్మెత్తిపోసుకుందుకు దిగజారిన వారి గురించి ఆలోచించడం వృధా కాలయాపన.

★ కొందరు ఎడిటర్లు సబ్జెక్టు చెప్పి దానికో పేరును కూడా సూచించి కొత్త రచయితలను ప్రోత్సహిస్తున్నారు. ఈ పద్ధతి బాగుందా?

● ఇలాంటివి 'కమిషన్డ్' రచనలు. సంపాదకులు 'దబ్బివ్వక' రచనలు వేస్తుండడం, సంపాదకుల 'కిదురిచ్చి' రచనలు ప్రచురింప చేసుకోవడం కూడా జరుగుతోందని వింటున్నప్పుడు... నేనెంత ప్రిమిటివ్ మనిషినో నాకర్థం అవుతోంది. దేశానికి దూరంగా వున్నాను కనుక యింకా బుర్ర పాడైపోలేదని సంతోష పడుతూ వుంటాను!!

★ కూతుళ్లకు కానీ కట్నం యివ్వకుండా ఎలా పెళ్లి చేశారండీ నేనైతే ఒక్క చెల్లిలుకే సంబంధం తేలేక ఛస్తున్నా.

● సారీ, నేను సంబంధాలు తేలేక 'చావడం' 'ఎలాగో అలాగ' పెళ్లి చేసి చావాలనుకోడం వంటి ధోరణులకు వ్యతిరేకిని. పిల్లలకి- చదువు- సంస్కారం- ఉద్యోగం చేయగల నేర్పు సమకూర్చడం మనకి నచ్చిన సంబంధం అయితేనే చూడడం- లక్ష్యంగా పెట్టుకు చేశాను... మీ చెల్లెలైతేనేమి? తోటి మనిషిగా చూసి ఆమె వ్యక్తిత్వాన్ని పెంపొందించండి, ఆమెని గౌరవంగా చూడగల వ్యక్తి కోసం చూడండి అదీ ముఖ్యం.

పి. వి. ఆర్. -ఖమ్మం

★ అక్కయ్యా స్త్రీకి స్త్రీయే శత్రువు అంటారు. మరి మీకు శత్రువు ఎవరు?

● స్త్రీయే అనుకోరాదూ??

జి. ఆర్. కె. -రాయగడ

★ భారతదేశంలో స్త్రీకి గౌరవం ఎప్పుడు దొరుకుతుంది?

● ఎంతసేపూ గత కాలంలో యిచ్చిన గౌరవాన్ని అంచనా వేసుకుంటూ కూర్చోడం మానినప్పటి నుంచి!

కె. కె. -రామవరం

★ మీ జవాబులు కత్తితో కోయడంలేదు. రంపంలా నలచి నలచి వేస్తున్నాయి. వ్యంగ్యం కత్తిలా వుంటే సుఖం అనుకుంటా.

● ఎవరికి? తప్పు తెలుసుకునేలోగా తల తీసెయ్యడం ఏమిటి?!

★ నేడు రూపాయి విలువ పడి పోతూంటే మనిషి ఎదిగిపోతున్నానని, అభివృద్ధి సాధిస్తున్నానని గొప్పలు చెప్పుకుంటున్నాడు.

● ఇన్ఫ్లేషన్ లేనిదే ఆర్థికాభివృద్ధి కనిపించదు... అందుకే మనిషి రూపాయిని రూపాయిగా కాక పైసల్లో 'ఎక్కువ'గా చూస్తుంటాడేమో (అమెరికా ఆంధ్రులు డాలర్ పదమూడు రూపాయలంటూ లెక్కలు చూసుకున్నట్టు?)

జి. వి. ఆర్. -హైదరాబాదు

★ మాట నేర్పు వుండాలంటారు? అదేమిటి కె. రా.?

★ మాట నేర్పంటే ఏం లేదు గురూ?- ఉరుము తెలియకుండా- మెరుపు చూపెట్ట కల్గాలి. అంతే.


డి. హెచ్. ఎమ్. -వరంగల్

★ విజయ సాధనకి మార్గం ఏమిటి?

● పుష్... కాని ఒక్కడే కష్టం- విజయ మార్గాన ఉన్న తలుపులు చాలా బలంగా వుంటాయి- తోయడానికి శ్రమించాలి!

★ గొప్ప విషయాలు, గొప్ప వ్యక్తులు అర్థం కావడం కష్టం. కాదంటారా?

● గొప్ప సత్యాలు, గొప్ప వ్యక్తులూ కూడా చాలా సింపుల్‌గా వుంటాయి... కష్టపడక్కర లేదు. నిజం చెప్పడం ఎంత సులభం- ఒక్క మాట చాలు. అదే అబద్ధం అడితే- ఒక్క మాట చాలదు- అలాగే గొప్ప వ్యక్తులు పసివాళ్ళలాగా- అర్థం అయిపోతారని నా నమ్మకం. □



తాతయ్య గమత్తులు మళ్ళీ మొదలయ్యాయి!


తాతయ్య ఎక్కడవుంటె అక్కడ అంతా అల్లరే. ప్రతి క్షణం కూడా హడావిడే. ఆయన తన మనవలని ఆడించడానికి కొత్త ట్రిక్కులు గురించి ఆలోచిస్తు వుంటారు. అరవై అయిదేళ్ళ. ఆ వయసులో ఆయన చలాకీతనం చూస్తే ప్రపంచంలో అంత చురుకైన తాతయ్య చాలా తక్కువమంది వుంటారని అనిపిస్తుంది. అంతా హార్లిక్స్ వలనే. అదే ఆయనని యిన్నేళ్ళూ ఆరోగ్యంగా, చురుగ్గా, వుండేటట్లు చేసింది. డాక్టర్లు సిఫార్సు చేసినట్లు అది పోషక శక్తి కలదేకాక ఎంతో తేలిగ్గా జీర్ణమవుతుంది. ఆయన ప్రతి రోజు రెండుసార్లు హార్లిక్స్ త్రాగుతారు. అది ఆయన అలవాటు. మరి అందులో ఆశ్చర్యపడవలసినది లేదు కదా!



60 ఏండ్లకు పైగా తాతయ్యకు యిష్టమైన ఆరోగ్య పానీయం

హార్లిక్స్‌లో కీలకమైన సహజ పోషకాలు— మాంసకృత్తులు, విటమినులు, ఖనిజాలు, పిండిపదార్థాలు సమృద్ధంగా ఉన్నాయి. అవి తేలిగ్గా జీర్ణమయ్యే రూపంలోవుండి బలము, జీవశక్తి మరియు మంచి ఆరోగ్యము సమకూరుస్తాయి.

కుటుంబానికంతటికీ పోషక శక్తిని సమకూర్చేదిగా రుజువు కావడంవల్ల ప్రపంచ మంతట డాక్టర్లు హార్లిక్స్‌ని సిఫార్సు చేయడంలో ఏమాత్రము ఆశ్చర్యం లేదు.



మంచి పుష్టికరమైనది

HTA 5818 TEL

దీపం

రేవతి

సాయంత్రం ఆరు గంటలయింది. పగలల్లా తన ప్రతాపం చూపించిన సూర్యుడు అలసిపోయిన శ్రమజీవిలా పడమటి దిశగా జారుకుంటున్నాడు. మధ్యాహ్నమల్లా ఎడతెగక వీచిన వడగాలులు అప్పుడప్పుడే కాస్త చల్లబడి పిల్లతెమ్మెర్లుగా మారుతున్నాయి.

సింహాచలం బస్టాండ్ కోలాహలంగావుంది. ఆరోజు అక్కడ కూరగాయల సంత కావటాన రోజూ కంటే మరింత హడావిడిగావుంది. పగలల్లా కూరగాయ లమ్ముకుని ఖాళీ బుట్టలతో వ్యాపారులు ఆ స్టాండంతా ఆక్రమించేశారు. ఆఫీసులు, కాలేజీలు అప్పుడే వదిలారేమో, దానికితోడు పొరుగూరికి బయలు దేరే సినిమా జనం, ప్రపంచంలో ఎక్కడలేని జనాభా యిక్కడే వున్నారేమో అనిపిస్తోంది.

విజయ చిరాగ్గా మరోసారి వాచీ చూసుకుంది. బస్ వచ్చే దిశగా చూసింది. కనుచూపుమేరలో ఎక్కడా బస్ వస్తోన్న జాడే లేదు చేతిలో వున్న వీక్లీ తిరగెయ్యటం ప్రారంభించింది

పది నిమిషాలు పుస్తకం తిరగేసేసరికి చిరాకేసింది. బస్ యిప్పట్లో రాదని ఆమె కర్థమైపోయింది. నుదుటికపట్టిన చెమటంతా కర్చీఫ్‌తో తుడుచుకుంది. మళ్ళీ వీక్లీలో తల దూర్చింది.

"విజయమ్మా బావున్నావా?" ఆశ్చర్యంతో తలెత్తి చూసింది విజయ. ఎదురుగా ఓ ముసలమ్మ.

"నువ్వు......?" గుర్తురాలేదు విజయకి.

"నేను నర్సమ్మనమ్మా మర్చిపోయావా?" బోసిగా నవ్వింది ముసలమ్మ.

విజయకి గుర్తొచ్చింది. ఆవిడ తను గోపాల పట్నంలో వుండేటప్పుడు రోజువారి కూరగాయ లమ్మిన ముసలమ్మ.

"ఏమనుకోకు నర్సమ్మా. ఏదో పరధ్యానంగా వున్నా..... నువ్వు బావున్నావా?" నవ్వుతూ అడిగింది విజయ.

"నువ్వు యిక్కడున్నావేమమ్మా......" అడిగింది నర్సమ్మ.

"నీకు తెలీదుకదా..... నేనిక్కడే ఆంధ్రాబ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్నా...."

"ఎప్పుడో ఆరేళ్ళక్రిందట అందర్నీ చూసేనమ్మ..... మీరు యిల్లు మారాక యిదే కనిపించటం.... అంతా కులాసేనా అమ్మా?" అప్యాయంగా అంది నర్సమ్మ.

"ఆఁ....." నిర్లిప్తంగా అంది విజయ.

"నీకు పెళ్ళయిందా విజయమ్మా?" ఆమె కళ్ళు విజయ మెడవైపు చూసాయి.

ఒకక్షణం మౌనం. తర్వాత అంది విజయ. "లేదు."

"నాన్నగారేం ప్రయత్నించలేదా అమ్మా?"

"కాదు...... కొంతకాలంవరకు నేనే చేసుకో నన్నాను."

దూరంగా బస్సు శబ్దం వినిపించింది.

"నర్సమ్మా..... అదిగో బస్సు......"

"వస్తానమ్మా.... " నర్సమ్మ తట్టపట్టుకుని పరిగెత్తింది.

విజయ ఊపిరిపీల్చుకుంది నిట్టూర్చి.

పావుగంట తర్వాత చినవాల్తేర్ బస్సొచ్చింది. రష్‌గావుంది. విజయ కష్టపడి ఎక్కింది.

* * * *

"ఏమ్మా యింత ఆలస్యం?" గుమ్మంలో కూర్చున్న వెంకట్రామయ్య లోపలికి అడుగుపెడుతున్న విజయనడిగాడు.

"బస్ దొరకటం ఆలస్యమైంది నాన్నా" తండ్రి సమాధానంగురించి ఎదురుచూడకుండానే లోపలికి నడిచింది.

"ఏమిటే యింత ఆలస్యం.....?" కూరగాయలు తరుగుతున్న తల్లి లోపల్నుంచి కేకేసింది

విజయకి చిరాకేసింది.

"నేనేం ఊరంతా తిరిగిరావటంలేదమ్మా..... రోజూ



పదిమైళ్ళదూరం చచ్చీచెడీ బస్సులో ప్రయాణించాలి..... ఉద్యోగం మానెయ్యాలా చెప్పు?" కూతురలా నిలదీసేసరికి జానకమ్మ విస్తుపోయింది.

"ఇప్పుడు నేనేం అన్నానమ్మా?" ఆవిడ ముఖం చిన్నబుచ్చుకుంది.

తల్లిముఖం చూడగానే విజయ మనస్సు చివుక్కుమంది.

"అదికాదమ్మా..... నాకేం సరదానా ఆలస్యంగా రావటం..... గంటముందే యింటికి రావాలని నాకూ వుంటుంది. ఆ బస్‌స్టాప్‌లో పడిగాపులుకాసేసరికి నాపనయిపోతోంది" అనునయంగా అందామె.

"నిజమేనమ్మా...... స్నానంచేసి బట్టలు మార్చుకోమ్మా" కూతురివైపు ప్రేమగా చూస్తూ అంది జానకమ్మ.

ఆ రాత్రి విజయ భోంచేసి చదువుకుంటున్నప్పుడు చెప్పాడు వెంకట్రామయ్య

"రేపు నీ గురించి పెళ్ళివారొస్తున్నారమ్మా."

"ఊఁ....." వెనక్కి చూడకుండానే అంది విజయ.

"రేపు శెలవుపెడతావా?"

"కుదరదు నాన్నా.... సెలవు లివ్వరు యిప్పట్లో."

"మంచి సంబంధమమ్మా..... ఏలూరు వాళ్ళది.... అబ్బాయి సెంట్రల్ గవర్నమెంటు వుద్యోగి......" ఆగాడు వెంకట్రామయ్య.

"అయితే ఏం చెయ్యమంటావు?" చిరాగ్గా అంది విజయ.

"నువ్వు ఊఁ అంటే..... " నసిగాడు వెంకట్రామయ్య.

ఇప్పటి కెన్ని సంబంధాలు నాన్నా.... అసలు నాకే విసుగేస్తోంది. పెళ్ళిచూపులకని ఎవడో ఓ అడ్డ గాడిద రావటం..... వాడడిగే వెధవ ప్రశ్న లన్నింటికీ ఏదో తప్పుచేసినట్లుగా తలొంచుకుని జవాబు చెప్పటం...... తీరా చూశాక, ఊరెళ్ళి ఉత్తరం రాస్తాననటం, తర్వాత మీ అమ్మాయి నచ్చలేదనో, మీ అమ్మాయి ఎవడితోనో తిరుగుతోందనో, లేదా మీ అమ్మాయి శీలం మంచిదికాదనో ఉత్తరం రాయటం...... నీకు ఏమీ అనిపించకపోయినా....... నాకుమాత్రం పెళ్ళిచూపులన్నా, పెళ్ళన్నా ఎలర్జీ పుట్టింది..... దయచేసి నన్నుమాత్రం విసిగించకు...." ఆమె గుండెల్లో ఉక్రోషం అంతా బయటపడింది.

అయిదునిమిషాలు మౌనం తర్వాత అన్నాడు వెంకట్రామయ్య.

"ఈ ఒక్కసారికీ నామాట కాదనకమ్మా..... నీకంటే చిన్నవాళ్ళిద్దరికీ నువ్వు పెళ్ళిచేసావు. కానీ నీకింత వరకు పెళ్ళికాలేదు. లోకం ఏమనుకుంటుందో. ఆలోచించు. నీగురించికాదు.... నాగురించి..... కనీసం కూతురు పెళ్ళి చెయ్యలేని వెధవనని లోకం నన్ను దుమ్మెత్తిపోస్తుంది. కనీసం ఈ ఒక్కసారి నాగురించి ఒప్పుకో" తండ్రి కళ్ళల్లో నీళ్ళు చూసి చలించిపోయింది విజయ.

క్షణం తర్వాత......

"సరే నాన్నా..... నీగురించి ఈ ఒక్కసారికీ. ఒప్పుకుంటున్నా" ఏదో స్థిర నిశ్చయానికి వచ్చినదానిలా అంది.

ఆ రాత్రంతా విజయకి నిద్రపట్టలేదు. ఆలోచిస్తోంది. ఆమెకి కిషోర్ గుర్తొచ్చాడు. గుండెల్లో ఆవేదన. ఉక్రోషం మొదలయింది. తను డిగ్రీ చదువుతున్నరోజుల్లో తన వెంటపడేవాడతను. తనను ప్రేమిస్తున్నానని, తను ప్రేమించకపోతే ఛస్తానని ఓ సారి ఒంటరిగా కంటపడినప్పుడు కంట తడిపెట్టుకున్నాడు. తనకి నవ్వొచ్చింది. జాలేసింది. అలా పరిచయమైన ప్రేమ ఆర్నెల్లు సాగింది. అతనితో సినిమాలు, షికార్లు ఎంతో హాయిగా



గడిచాయా రోజులు. ఈ సంగతి తనింట్లో తెల్సింది ఆ కుర్రాణ్ణి పిలిస్తే మాట్లాడతానన్నాడు తన తండ్రి. ఆ విషయం కిషోర్‌కి చెబితే తన యింటికి రావటానికి ఒప్పుకోలేదు. తనతో పరిచయం పెంచుకున్నది పెళ్ళిచేసుకోటానికి కాదని, ఏదో సరదాగా గడపటానికని అన్నాడు తను ఏడ్చింది. కాళ్ళుపట్టుకుని బ్రతిమాలింది అతను కరగలేదు తరవాత చాన్నాళ్ళు కనిపించలేదు. ఆ తర్వాత కొంతకాలం తనెంతో నిరాశగా రోజులు గడిపింది.

డిగ్రీ పూర్తయిన ఆర్నెల్లకే బ్యాంకు పరీక్ష పాసవటంవల్ల తనకి బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం వచ్చిన ఆర్నెల్లకి ఓ రోజు కిశోర్ బ్యాంకుకొచ్చాడు తను ఉద్యోగం చేస్తున్నానని ఈమధ్యనే తెలిసిందని, తనని పెళ్ళిచేసుకోటానికి సిద్ధమేనని అన్నాడు అంత జరిగాక మళ్ళీ కిశోర్‌తో కలిసి బ్రతకటానికి తనకు మనసొప్పలేదు తనకు ఉద్యోగం వచ్చిందన్న సంగతి తెలిసే కిశోర్ మనసు మార్చుకున్నాడని తనకు తెలుసు అటువంటి నయవంచకుడితో కాపురం చెయ్యటం, విషసర్పానికి పాలు పొయ్యటమేనని తనకు తెలుసు. పెళ్ళి విషయం ఎత్తవద్దని మర్యాదగా చెప్పేసింది. కిశోర్ బెదిరించాడు పెళ్ళిచేసుకోకపోతే యిక తనకు జన్మలో పెళ్ళికాకుండా చేస్తానని వెళ్ళిపోయాడు కోపంగా.

ఆ తర్వాత తనకు వచ్చిన సంబంధాలన్నీ అతనే పెళ్ళివారికి లేనిపోనివి కల్పించి రాసి తన పెళ్ళి చెడగొడుతున్నాడు. తను బ్యాంకు లోనుపెట్టి తన తరవాత చెల్లెళ్ళిద్దరికీ పెళ్ళిచేసిందిగానీ తన పెళ్ళి యింతవరకు కాలేదు

తొలిఝాము కోడి కూయటంతో విజయ ఆలోచనలకు తెరపడింది. అప్పుడే మగత నిద్రలోకి జారిపోయింది.

ఆ మర్నాడు సాయంత్రం పెళ్ళివారొచ్చారు తల్లీ, తండ్రి. పెళ్ళికొడుకు. పెళ్ళికొడుకు దర్జాగా వున్నాడు విజయ తలొంచుకుని కూర్చుంది అయిష్టంగానే

దీపం

ఆమె యిచ్చిందని గమనించినట్టున్నాడతను విజయను ఎక్కువ ప్రశ్నలేవి వేసి వేధించలేదు

తతంగమంతా అరగంటలో పూర్తయింది. కట్నం గురించి అసలడగలేదు. అందరిలాగ వూరెళ్ళి వుత్తరాలు రాస్తామని చెప్పకుండా అప్పటికప్పుడే ఉంగరాలు మార్చి ప్రధానంకూడా చేసుకున్నారు

వెంకట్రామయ్య, జానకమ్మల సంతోషానికి అవధుల్లేవు. నిజంచెప్పాలంటే ఏ సంబంధం కూడా యిలా ప్రధానం వరకూ రాలేదు. తరవాత నెలలోనే పెళ్ళి. అంతా విజయ అదృష్టవంతురాలన్నారు.

విజయకు అర్ధంకాలేదు యిది కలో? నిజమో? అంతా నిమిషాల మీద జరిగిపోయింది. ఏ ఆటంకంలేకుండావుంటే ఈ పెళ్ళి జరిగిపోయినట్లే. అంటే తనూ ఓ యింటిది కాబోతోందన్నమాట. ఈ వూహ ఆమెను పులకరింపజేసింది. ఆమె మనసంతా వసంతకోకిలలా వూహల్లో విహరించింది. పదేపదే ప్రధానపుటుంగరంవైపు చూసుకుని మురిసి పోయింది. పెళ్ళికి నెలంటే నెలే గడువుంది. నెల రోజుల్లో ఒక్కరు కాస్తా యిద్దరవుతారన్నమాట. ఆమె మనసు తీయని ఆలోచనలతో నిండిపోయింది.

పదిహేనురోజులు గడిచాయి.

– ఆరోజు ఆఫీసునుండి రాగానే యింట్లో అడుగు పెడుతున్న విజయకు ఏదో మార్పు కనిపించింది. పడక్కుర్చీలో తలపట్టుకు వెనక్కివాలిన తండ్రి, వంటింట్లో ఓ మూల గోడకి చేరబడి కూర్చున్న తల్లి, ఎప్పుడూ పుస్తకమే పట్టుకుని ఎరగని యిద్దరు తమ్ముళ్ళూ బుద్ధిగా చదువుకుంటున్న తీరు. ఆమె మనసు ఏదో కీడు శంకించింది. అసలు ఆమె రాకనే యింట్లో ఎవరూ గమనించనట్టు ప్రవర్తిస్తున్నారు.

ఆమె మౌనంగా గదిలో కెళ్ళి బట్టలు మార్చుకుంది.

"ఏం జరిగింది నాన్నా.... అలా వున్నారేం అంతా?" తండ్రి వెనకచేరి నెమ్మదిగా అడిగింది విజయ.

"నా ఖర్మమ్మా అంతా నా ఖర్మ......" నుదుటిమీద చేత్తో కొట్టుకున్నాడాయన.

జరిగింది అర్ధమయింది. ఆమె మనసును స్థిరంగా వుంచుకోటానికి ప్రయత్నిస్తోంది.


"ఎవడో దౌర్భాగ్యుడు నీమీద పగబట్టాడమ్మా......

ు బ్రతుకుతో ఆటలాడుకుంటున్నాడు. పెళ్ళి కుదిరినట్టే కుదిరింది. ఇంతలోనే అంతా మాయలాగ తలక్రిందులైపోయింది పరిస్థితి. ఆ ...వడో రాసిన వుత్తరం నీ కొంపముంచింది మీ

ఆటలు – అద్భుతాలు


అతి కష్టమైనపందెం

ప్రపంచంలో అన్నిటి కంటే కష్టతరమైన మోటార్ల పందెం ఐదు రోజులపాటు జరిగే మూడు వేల మైళ్ళ కెన్యా సఫారీ పందెం. 1981లో చంద్రశేఖర్ ఖిమ్జి వరుసగా మూడుసార్లు గెలు పొందిన హ్యాట్రిక్ చేసిన మొదటి వ్యక్తి అయ్యాడు.



DIST. BY ASIA FEATURES







ప్రపంచ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్లలో అత్యధిక విజయాలు సాధించిన వారు పశ్చిమ జర్మన్‌లు. 1954లో వారు ఆరు ఆటలలో 25 గోల్‌లు సాధించారు. అంటే ఒక్కొక్క ఆటకు 4.16 గోల్‌లు సాధించారన్న మాట.

అత్యధిక కప్ విజేతలు



మొట్టమొదటి గుర్రాల ప్రదర్శన

మొట్ట మొదటి అంతర్జాతీయ గుర్రాల ప్రదర్శన 1901లో ట్యూరిన్‌లో జరిగింది. అప్పుడు ఇటలీ వారికి వ్యతిరేకంగా జర్మన్, స్విస్ సైనికాధికారులు పోటీ పడ్డారు.

సంబంధం మా కక్కర్లేదంటూ పెళ్ళివారు ఉత్తరం రాసారు. నీకు..... యింక నీ కీ జన్మలో పెళ్ళిచెయ్య లేనమ్మా...... " ఆయన నుదురుబాదుకుని గొల్లు మన్నాడు.

విజయ తండ్రిని వూరడించలేదు. ఆమె మౌనంగా తన గదిలోకి నడిచింది. ఆమె మంచంమీదపడి వెక్కి ఎక్కి ఏడవలేదు. మౌనంగా వీక్లీ తీసుకుని తిరగెయ్యసాగింది ఏం జరగనట్టుగానే. ఇలాంటి పరిస్థితులు తను ఎన్నోసార్లు ఎదుర్కొంది. తన గుండెప్పుడో బండబారిపోయింది. అయితే తను చేసిన పొరపాటల్లా ఈసారి పెళ్ళిగురించి ఎక్కువ ఆశలుపెట్టుకోవటం. ఆమె ఆలోచిస్తోంది. ఆమె ఆలోచనలు తన పెళ్ళి చెడిపోయినందుకుకాదు. తన పెళ్ళని ఆఫీసులో అందరికీ ఎంతో ఆనందంగ చెప్పింది. వాళ్ళకేం సమాధానం చెప్పాలీ అని?

అరగంట గడిచాక తండ్రి గదిలోకి వచ్చాడు.

"ఇదిగోనమ్మా నీ బ్రతుకు పాడుచేసిన ఉత్తరం – కాలేజీ రోజుల్లో నీతో తిరిగిన వెధవేనా యిది రాసింది...... ఓసారిచూడు. వాడినిక వదిలిపెట్టను." ఆవేశంగా అరిచాడు వెంకట్రామయ్య.

విజయ ఉత్తరం అందుకుని చదివింది. తిరిగి తండ్రి కిచ్చేసింది.

"ఎవడూ ఆ వెధవేనా?"

"ఏమో అతని రాత నాకు గుర్తులేదు. అయినా నా తలరాత యిలా వుంది. నువ్వు ఎవర్నీ ఏం అనకు. వాళ్ళపాపాన వాళ్ళుపోతారు."

ఆమె తిరిగి పుస్తకంలో తలదూర్చింది ఆమె గుండెల్లో రేగుతున్న అగ్నిసెగలసంగతి తండ్రి గమనించకుండా.

• ఆ రాత్రి వెంకట్రామయ్యకి నిద్రపట్టలేదు. ఆయన ఆ రాత్రి భోంచెయ్యలేదు. అశాంతిగాపడక్కుర్చీలో పడుకుని ఆలోచిస్తున్నాడు. మాటిమాటికీ విజయ రూపమే అతనికి గుర్తు కొస్తోంది. అతను ఆలోచిస్తున్నాడు. తన కూతురు పెళ్ళిచెయ్యలేని దౌర్భాగ్యానికి తనను తనే నిందించుకున్నాడు. తనమీద తనకే అసహ్యం వేస్తోంది. ప్రపంచంలో ఏ తండ్రీ కూడా తనంత కిరాతకంగా ప్రవర్తించడేమో! కన్న కూతురు బతుకు పాడుచేసిన కసాయివాడు తను. ఏ తండ్రీ చెయ్యనిపని తను చేస్తున్నాడు. పెళ్ళి కుదిరినప్పుడల్లా తన కూతురి గురించి తనే చెడుగా ఉత్తరాలురాసి ఆ పెళ్ళిళ్ళు జరక్కుండా చేస్తున్నాడు. అవును. తన కూతురు పెళ్ళయి వెళ్ళిపోతే మరి తనగతి? తను సాధారణ గుమాస్తాగా పదేళ్ళక్రితమే రిటైరయ్యాడు. తనకు తండ్రి, తాతలు సంపాదించిన ఆస్తులేమీ లేవు. అసలు తనూ అందరి తండ్రుల్లాగే తన కూతుర్నీ పెళ్ళికూతురిలా చూడాలనుకున్నాడు. కానీ తన కూతురు ఉద్యోగంచేస్తున్నప్పటి నుండే తనలో స్వార్థం ప్రవేశించింది. ఆమే గనక వెళ్ళిపోతే...... తను, గుండెజబ్బుతో వున్న తన భార్య, యిద్దరాడపిల్లలు, ఊహతెలియని యిద్దరు మగపిల్లలు కుక్కబతుకు బ్రతికేవారు. ఆమె వెళ్ళిపోతే తన చిన్న కూతుళ్ళిద్దరికీ పెళ్ళి కాదనే భయంతో పెద్దకూతురి పెళ్ళి చెడగొట్టి, సంబంధాలు కుదిరాయనే నెపంతో తరవాత ఆడపిల్లద్దరికీ పెళ్ళిళ్ళు జరిపించేశాడు. తనే ఉత్తరాలు రాసి పెళ్ళిళ్ళు చెడగొట్టాననన్న సంగతి విజయకు తెలిస్తే యింకేవన్నావుందా? ఆమె తనని కుష్టురోగికన్నా హీనంగా చూడదూ...... కానీ విజయంటే తన కెప్పుడూ ఆరో ప్రాణమే. ఆమె తన రెండు కళ్ళు, తనింటి దీపం. ఆమె లేకపోతే తన బ్రతుకే అమావాస్య చీకటి. వెంకట్రామయ్య ఆలోచనలు పూర్తయ్యాయి. అతని కళ్ళు ధారా పాతంగా వర్షిస్తున్నాయి.

గదిలో నిద్రపోతున్న విజయ ఉలిక్కిపడిలేచింది. ఏదో పీడకల. లేచి నీళ్ళు త్రాగింది. మళ్ళీ మంచంమీద చేరబడింది. ఆమెకింక నిద్రపట్టలేదు. ఆలోచనలు ఆమెను ముసురుతున్నాయి. ఇక తనకు పెళ్ళికాదనే భయంకరమైన నిజం ఆమెను కృంగదీస్తోంది. తనకిక జన్మలో పెళ్ళికాదు. పెళ్ళిచేసి అత్తారింటికి పంపవల్సిన తండ్రే తనపాలిట శత్రువై, దొంగ ఉత్తరాలు రాసి తన పెళ్ళి చెడగొడ్తూంటే, యిక తనెవరితో చెప్పుకోగలదు. ఇన్నాళ్ళూ కిశోర్ తన పెళ్ళి చెడగొడుతున్నాడని అనవసరమైన భ్రమలో అతన్ని ద్వేషించింది. కానీ సాయంత్రం తండ్రి ఉత్తరం యిచ్చినప్పుడు తనకు తెల్సింది. ఆ ఉత్తరాలు రాసేది తన తండ్రేనని, ఎంతమార్చి రాసినా తన తండ్రి రాత తను గుర్తుపట్టగలదు. అయినా తన తండ్రిని స్వార్థపరుడనటానికి తనకు మనసురావటంలేదు. మరి తను పెళ్ళయి వెళ్ళిపోతే వాళ్ళందరిగతీ ఏంకావాలి? తన తండ్రిమీద తనకేం కోపంలేదు. జాలేస్తోంది. తనకు చాలా బాధగా వుంది. తన పెళ్ళిచెడిపోయినందుక్కాదు తన పెళ్ళి చెడగొట్టినందుకు తన తండ్రెంత కుమిలిపోతు న్నాడో అని.

"భగవంతుడా నా తండ్రిని ప్రశాంతంగా నిద్రపోనీ" ఆమె మనసులో దేవుడికి మొక్కుకుంది. □

నందినీ శత్పథి కాంగ్రెసులో పునఃప్రవేశం?

ఒరిస్సా మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుతం రాజకీయంగా ప్రవాసం గడుపుతున్న శ్రీమతి నందిని శత్పథి మళ్ళీ కాంగ్రెస్ (ఐ)లో చేరడానికి ప్రయత్నిస్తున్నారని చాలా మంది అనుమానిస్తున్నారు. రాష్ట్ర రాజకీయాలలో ఒక వైపు జె. బి. పట్నాయక్ అపకతవకలు, ప్రతిపక్షాల అనైక్యతల వల్ల నందిని శత్పథి మళ్ళీ త్వరలోనే ఉచ్ఛదశకు రాగల అవకాశాలు కూడా కనబడుతున్నాయి. తన ప్రయత్నాలను ఇప్పటికే ఆమె ప్రారంభించారు. శ్రేయోభిలాషులకు, అనుకూలురైన పాత్రికేయులకు విందులు ఇస్తున్నారు. కాంగ్రెస్ (ఐ) ప్రభుత్వం పైన సాగుతున్న విమర్శలలో



జోక్యం చేసుకోవడం లేదు. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా పెదవి విప్పలేదు. జనతా సభ్యులు, ఇతర స్వతంత్ర సభ్యులు ఒకసారి శాసనసభ ప్రత్యేక సమావేశాన్ని బహిష్కరించగా ఆమె మాత్రం హాజరయ్యారు. అంతేగాక చాలా తరచుగా ఆమె ఢిల్లీ వెళుతున్నారని తెలుస్తోంది. ఆమె కాంగ్రెస్‌లో చేరడానికి పెట్టుకున్న అభ్యర్థన పత్రం కూడా తన దగ్గర ఉందని ఒరిస్సా వ్యవహారాలు చూసే ఎ. ఐ. సి. సి. కార్యదర్శి అంటున్నారు!....

వీర బహదూర్ సింగ్ విఫల ప్రయత్నాలు!

ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి వీరబహదూర్ సింగ్ ప్రధాని కటాక్ష



వీక్షణాలను కోల్పోయారా? వరుసగా జరిగిన సంఘటనలు ఈ అనుమానాన్ని బలపరుస్తున్నాయి. ఉత్తర ప్రదేశ్‌లో కరువు సహాయ చర్యలను రాష్ట్ర ప్రభుత్వం సవ్యంగా చేపట్టడం లేదని ప్రధాని లోక్‌సభలో బహిరంగంగా ప్రకటించారు. తమ పార్టీకి చెందిన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రధాని బహిరంగంగా మందలించడం ఇదే మొదటి సారి. వెంటనే ప్రధానిని కలిసేందుకు ఢిల్లీ వెళ్ళిన వీరబహదూర్ సింగ్‌కు ప్రధాని దర్శనమే దొరకలేదుట. ఉత్తర ప్రదేశ్ అతిథి గృహంలో విఫల నిరీక్షణ తర్వాత, కనీసం విమానాశ్రయంలోనైనా తన గోడు ఒక్క క్షణమైనా వింటారేమోనని ప్రధాని రంగూన్ వెళ్ళే సందర్భంలో వీరబహదూర్ సింగ్ విమానాశ్రయానికి వెళ్ళారు. కాని అక్కడా ఆయన శ్రమ నిష్ఫలమే అయింది. రానున్న ఎన్నికలకు ముందే పార్టీకి కొత్త రూపు నిచ్చేందుకు ముఖ్య మంత్రులను మార్చాలని కాంగ్రెస్ (ఐ) చేస్తున్న ఆలోచనలకు ఇది ఒక సూచన అని పరిశీలకుల వ్యాఖ్య....

ఇంట్లో పులి, బైటికెళ్తే పిల్లి!

ఆయన బీహార్‌లోని ధన్‌బాద్‌లో నేర ప్రపంచానికి నాయకుడు. జనతా పార్టీ శాసన సభ్యుడుగా ఒక వైపు రాజకీయాలలో, ధన్‌బాద్ ప్రజల్ని భయకంపితుల్ని చేయగల మాఫియా చరిత్రతో నేర ప్రపంచంలో రాజ్యమేలుతున్న ఆ వ్యక్తి పేరు సూరజ్‌దేవ్‌సింగ్. కాని అంత పెద్ద మనిషి దారి దోపిడిగాళ్ళ ముందర చేతులు ముడుచుకోవడమే గాదు తన చేతుల్లో ఉన్న ఏడువేల రూపాయలు, బంగారు ఉంగరం, చేతి గడియారం వాళ్ళ చేతుల్లో పెట్టాడు. కలకత్తాలో డమ్‌డమ్ విమానాశ్రయం నుంచి తెల్లవారు జామున నగరంలోకి వస్తుండగా మధ్యలో ఆయన కారు చెడిపోయింది. ఆయన, ఆయనకు అంగరక్షకులుగా



ఉన్న ఏడుగురు కారు దిగి చూసేసరికి సాయుధులైన దారి దోపిడిగాళ్ళు పలకరించారట. కావలసినవి వసూలు చేసుకుని వెంటనే వెళ్ళిపోయారట!....

ప్రత్యామ్నాయ ఇంధనానికి బాలమేధావి ఊహ!

పెట్రోల్ ధరలు పెరుగుతున్నప్పుడు నుంచి ప్రత్యామ్నాయ ఇంధన వనరుల అన్వేషణ విపరీతంగా జరుగుతున్నది. ఈ అన్వేషణను అతి చిన్నారి వయసులోనే ప్రారంభించి



బహుమతి గెలుచుకున్నాడు సచిన్ పటేల్. ఆ చిన్నారి వయసు ఏడు సంవత్సరాలు. టెక్సాస్ రాష్ట్రంలోని ముతెన్‌బర్గ్‌లో సెంట్ రోజ్ ఆఫ్ లిమా పాఠశాలలో చదువుతున్న ఈ విద్యార్థి "అంతరిక్షం నుంచి సౌరశక్తి" అనే తన పరిశోధనాంశంతో అమెరికా అన్వేషణ పోటీలో పాల్గొన్నాడు. ఆ పోటీలో అత్యుత్తమ పరిశోధనా బహుమతి పొందాడు. ఈ బాలుడు ఆటబొమ్మలతో తయారుచేసిన పరిశోధన నమూనాను ప్రతిష్ఠాత్మకమైన వాషింగ్టన్ స్మిత్సోనియన్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రదర్శిస్తున్నారు. అంతరిక్షంలో పరిభ్రమించే పరిశోధన కేంద్రంలో అమర్చిన ఒక పెద్ద అద్దం ద్వారా భూమి మీదికి నిరంతరాయంగా సూర్యకాంతిని ప్రతిఫలింపజేస్తూ, దాన్ని ఒక సౌరశక్తి కొలిమిలోకి పంపి నీటి ఆవిరితో టర్బయిన్‌ని పనిచేయించటం వల్ల విద్యుత్తును తయారు చేయవచ్చునని సచిన్‌పటేల్ తన నమూనాలో సూచించాడు!... □



సన్నీ హోమియోపతీ షాంపూ. అందమైన
శిరోజాలకు ప్రకృతి కానుకనీ అది మీకు
అందిస్తుంది. ఆర్నికా
ఈ మూలిక మీ శిరోజాలను
శుభ్రపరచడమేకాక, టానిక్‌గా కూడా
పనిచేస్తుంది. జుట్టు రాలిపోవడాన్ని, చుండ్రుని
మృదువుగా, సహజంగా అదుపు చేస్తుంది.
వీటన్నింటికీ మించినది ఏమిటంటే, సన్నీ
యొక్క కండిషనర్, వెంట్రుకలు చిక్కు
తొలగిస్తుంది. మీ జుట్టుని సిల్కులా చేసి మంచి
అదుపులో ఉంచుతుంది. సన్నీకి గల ప్రత్యేకమైన
ఫ్రెంచ్ సువాసనని కూడా మీరు
మెచ్చుకుంటారు !
ఉత్తమ ఫలితాలు ఉండేందుకు సన్నీ
ఆర్నికా హెయిర్ ఆయిల్‌ని బాగా తలకు
అంటేలా రాయండి 1-2 గంటలు ఆగి,
ఆ తరువాత సన్నీ ఆర్నికా షాంపూని
తడి జుట్టుకి పట్టించండి నురగ వచ్చేలా
రుద్దుకోండి నీళ్ళతో జుట్టు బాగా కడుక్కోండి

ఉత్పత్తి చేసినవారు
బాక్సన్ హోమియో ఫార్మసీ ప్రయివేట్ లి.
121 ఒఖ్లా ఇండస్ట్రియల్, ఫేజ్ I
న్యూ ఢిల్లీ -110 020

తెలుసుకోండి

సన్నీ

ఆర్నికా షాంపూని
తద్వారా మీ శిరోజాల
అందాన్ని తిరిగి మెచ్చుకోండి.

సన్నీ ఆర్నికా షాంపూ
కండిషనర్‌తోబాటు

మృదువుగా సహజంగా–
హోమియోపతికి మాత్రమే సాధ్యమైన రీతిలో



R K SWAMY/BHP/4925 TL

సీరియల్

ఈతరం యువతి

వడ్లమన్నాటి కుటుంబరావు



(గత సంచిక తరువాయి)

"ఏయ్ తాయారూ?"

"అబ్బ! ఊరుకోండి ఏమిటా హుషారు?"

"ఏమనుకున్నావ్ మరి నా పేరంటే".

"తెలుసు గదా... మళ్ళీ చెప్పమంటారా?"

"చెప్పు".

"ఊరికే చెప్పను"

"ఊరించకే తాయారూ?"

రవ్వల నెక్లెసు కూడా చేయిస్తానంటే గువ్వ పిట్టలా ఒదిగిపోయి మరీ చెపుతాను."

"రవ్వల నెక్లెసు కష్టంగానీ... నెక్లెసు చేయిస్తాలే... అది పెట్టుకున్నావంటే నువ్వు... హైక్లాస్... అనుకో".

"అందుకనేగా మీ పేరు– వీర శృంగారావతారం" అంది తాయారు– మెచ్చుకోలుగా.

బెలూన్‌లా ఉబ్బిపోయాడు అవతారం.

"ఇందులోనే కాదోయ్ ఎందులోనూ ఎదురు లేదోయ్ ఈ అవతారానికి. ప్రత్యర్థులు బెదిరి పారిపోవలసిందే!"

"అంతేలెండి"

ఆ శృంగారం ... పంచదార లేని పాయసం... అని తాయారుకి తెలుసు!

అయినా మళ్ళీ అంది "అబ్బ! ఊరుకోండి. రోజు రోజుకీ మరీ చిన్న పిల్లాడయి పోతున్నారు." అంది.

ఆమె మనసులో బంగారు నెక్లెసు మాత్రమే మెదులుతోంది.

"ఎలా అయినా మీరు నాకు కాదు పతి" అంది కొద్ది నిముషాలాగి – మెల్లగా.

అదేమిటి తాయారూ! ఇందాకటి నుంచీ నన్నెంతో పొగిడావు కదా ఇప్పుడు కాదంటున్నావేమిటి పతి?" కంగారు పడ్డాడు అవతారం.

"అది కాదండీ... మీరు నిందా నివారణా కార్యాలయానికి అధిపతి! కదా?" అంది.

"అవును గదా?" అన్నాడు అవతారం మీసం మెలేస్తూ.

"ఎలా వుంది కార్యాలయం?"

"మూడు అపనిందలూ... ఆరుముడుపులుగా"

"అదేమిటండీ? నిందా నివారణా కార్యాలయం అధినేత కదా మీరు?" సందేహంగా అడిగింది తాయారు.

వెంటనే సర్దుకున్నాడు అవతారం. "తాయారూ! నిగనిగలాడే నీ అందం చూసి... నిందని అపనిందగా మాట్లాడేస్తున్నట్టున్నాను. అది నా తప్పు కాదు".

"ఏమిటో మీ భాష?"

"నీకెందుకుగానీ ఆ ఘోష? ఇలా రా!"

"ఇక చాల్లెండి..." అంది గోముగా

"అయ్యో! అవతారం గారూ రక్షించండి... రక్షించండి" అన్న కేక వినిపించింది బయటి నుంచి.

తాయారుని విదిలించి లేచి వెళ్ళి తలుపు తీశాడు. అంతే!!

ఆ దృశ్యం చూసి నిలువెల్లా ఆశ్చర్యపోయాడు. తన స్టాఫ్ మెంబరు ఊకదంపుడురావ్ పీక పట్టుకున్నాడో వ్యక్తి!

కోడి మెడకాయ పిసికినట్టు ఆ వ్యక్తి "ఊక" మెడ పిసుకుతుంటే ఈ భూమి మీద తనకు నూకలు చెల్లిపోయాయా అన్నంత బాధగా అరుస్తున్నాడు ఊకదంపుడు రావ్.

అవతారాన్ని చూడగానే... ఆ వ్యక్తి ఊక పీకని వదిలి చేతులు జోడించి "అయ్యా! అవతారంగారూ మీకు నా మనఃపూర్వక నమస్కారాలు." అన్నాడు భయభక్తులతో.

"నమస్కారం. . నమస్కారం.... నమస్కారం...." అన్నాడు అవతారం ప్రసన్నంగా– కాళ్ళలోని వణుకుని వేళ్ళలోకి తెచ్చుకుంటూ.

"వీరు..." అంటూ పరిచయం చెయ్యబోయాడు ఊక.

"నువ్వుండెహె! తొండలు పట్టే నాయాలా" అంటూ కసిరాడా వ్యక్తి ఊకని.

అవతారంకేసి తిరిగి "అయ్యా! మీ ఉకగారి పీక పట్టుకున్నాను గదాని నన్ను కుత్తుకలు కోసే క్రూర ముత్తయ్యనుకోకండి! మీరు నాకు అనుమతి ఇస్తే... ఉత్తరాన హిమాలయాల దగ్గర నుంచి దక్షిణాన దేవాలయాల దాకా నాకున్న పరపతి గురించి తిరపతి తీర్థయాత్ర వెళ్ళి వచ్చిన వాళ్ళు చెప్పినట్టుగా... చెప్పిన మాట చెప్పకుండా చెప్పగలను! పోతే నాకు ఒక్కటే దురలవాటుందండి"

"ఏమిటది?" అన్నాడు అవతారం ఆగంతకుని గొంతుక వినసొంపుగా ఉందనుకుంటూ.

"నాకు ఎవరి మీదన్నా ఎక్కువ ఇష్టం కలిగిందనుకోండి... బీడీ పీక గుర్తొస్తుందండీ! అది వెంటనే దొరక్కపోతే... ఆ వ్యక్తి పీక పట్టుకుని... బీడీ పీక చివర నుసి నలిపినట్టుగా నలప బుద్దేస్తుందండి. 'ఉదాహరణకి ఊకగారి పీక అందుకే పట్టుకున్నానండి. కానీ వారికి నా అలవాటు తెలియదు కదండి... అందుకని... పీక నరికి వేస్తానేమోనని పిరికివాడిలా భయపడి పోయి కేకలేసేశాడండీ".

"ఇంతకీ మీకు మా ఊకదంపుడు ఎలా తెలుసు?

"అదేంటండీ అలా అడిగారు అవతారంగారూ? బాగుంటుందా వంకాయ

జరిగిన కథ– 14: మృదులకు వచ్చిన సంబంధాలన్నీ దుష్ప్రచారం వల్ల చెడిపోతుంటాయి. ఆ దుష్ప్రచారం చేసేది రవికాంతేనని ఎవరో మధుసూదనంగారికి ఫోన్లో చెపుతారు. మధుసూదనం, ఇద్దరు కొడుకులు కలిసి, రవికాంత్‌ను చితకగొట్టి ఇంట్లో వదిలేస్తారు. రవికాంత్ మీద మృదులకు కూడా అనుమానాలు కలుగుతాయి. నిర్మల రవికాంత్ దగ్గరికి వచ్చి సలహా ఇస్తుంది.



పులుసు? అన్నట్టుగా. ఇక్కడికి దగ్గిరలో ఒక దంపుడు బియ్యం కొట్టుంది చూశారండీ... అక్కడ కూర్చున్నానండీ. కాలక్షేపానికి. అక్కడికి ఒక్కడే వచ్చాడండీ మీ ఊకదంపుడరావు. బియ్యపు కొట్టు వాళ్ళతో ఆయన మాట్లాడే ధోరణి చూసి "హలో! ఊకదంపుడూ భాయ్ తాగొద్దాం బాయ్ చలో! అన్నానండీ. నా పేరు నీకెలా తెలుసు? అన్నాడండి. నీ పేరేమిటి? నీ గురువుగారి పేరు కూడా తెలుసు అన్నానండి. మా అవతారంగారు... మా ఆర్. పి. ఓ నేత.. నిందా నివారణా కార్యాలయాధినేత కూడా తెలుసా? చాలా సంతోషం. ఇంత గొప్పవారు మీరు సింపుల్‌గా ఛాయ్ ఇప్పిస్తే చాలదు అంటూ "ఓయ్" అంటూ! కేకేశాడండి. దాంతో ఎదరు హొటల్లో ఈగలు తోలుకుంటున్న నల్లతోలు జోగులుగాడనే 'బోయ్' పరుగెత్తుకుంటూ వచ్చేశాడండీ. ఈ ఊక పీకలు మెయ్యా మెక్కేశాడండీ. వాడు తెచ్చిన పొట్లాలన్నీ. ఇంకా తింటే కక్కొస్తుందనో ఏమో నా మీద జాలి తలచి... టీతో ముగించేశాడండీ.

పద! గురువుగారి పరువు పెంచే చిట్కాలు చాలా ఉన్నయ్ నా దగ్గర. అన్నానండి. బాబోయ్! నేను రాను అన్నాడండి. ఎందుకు రావు? ఆ మహనీయుని దర్శనానికి... వారికున్న పేరు ప్రఖ్యాతులు వారి ప్రజా సేవకి నిదర్శనాలు కావా? అన్నానండి. అప్పుడు వాడేమన్నాడంటే... ఆయనో పని చెప్పారు నాకు. నేనింకా అది పూర్తి చెయ్యలేదు. వెళ్ళగానే ఏం చేస్తున్నావురా కుంకా... ఇంకా? అంటారు. అందుకని నాకు భయం. ఒంటరిగా నువ్వెడితేనే నయం! అన్నాడండి. నా డబ్బుతో తిని... నా డబ్బుతో తాగి– ఓయేననుకోండి– మీ దగ్గరకు రమ్మంటే



జబ్బు మనిషిలా వణికిపోతుంటే.... నేను ఊరుకుంటానాండీ?!-ఊకా.... కోస్తాను నీ పీక... అంటూ పీక పట్టుకుని లాక్కొచ్చానండి. అదండీ సంగతి. ఇక అసలు పాయింట్‌లోకి రమ్మంటారా? లేక జాయింటుగా మాట్లాడుకుందామంటారా?"

"మీరే చెప్పండి అసలు పాయింటేమిటో" అన్నాడు అవతారం... ప్రశంసగా చూస్తూ...

ఊక వేపు అనుమానంగా చూశాడు ఆగంతకుడు.

పరిస్థితి గ్రహించాడు అవతారం. ఇలాంటి విషయాల్లో అతని బుర్ర పాదరసం!

"ఇదిగో ఊకా?"

"ఏం సార్! కావాలా కిలో పెసర నూక?"అన్నాడు.

"కాదయ్యా! కాక చేసిందే ఏమో... రాకూడదనుకున్నా వచ్చేసింది విపరీతమయిన కాళ్ళనొప్పి. ఈ రాత్రికెలాగో అవస్థపడతాగానీ... రేపు మాత్రం కానీయకు దురవస్థ... మిడిల్ క్లాస్ మెడికల్స్‌లో... మాత్రలు తీసుకొని రేపు ఉదయం... ఎక్కువ సమయం గడవకుండా నడిచిరా!" అంటూ ఇంట్లోంచి అయిదు రూపాయల కాగితం తీసుకొచ్చి చేతిలో పెట్టాడు– అవతారం.

"బతుకుజీవుడా!" అనుకున్నట్టుగా బయటికి అడుగుపెట్టాడు ఊక.

"మీ రాక మాకు చాలా సంతోషం కలిగించింది. రండి! లోనికి దయచేయండి" అంటూ ఆహ్వానించాడు అవతారం– ఆగంతక వ్యక్తిని.

అవతారం వెనకాలే లోనికి నడిచాడా వ్యక్తి.

తొంగి చూస్తున్న తాయారు బుంగమూతి పెట్టుకుని లోపలకు తప్పుకుంది.

కుర్చీలో కూర్చోమని ఆ వ్యక్తికి చెప్పి, లోనికి వెళ్ళి నిమ్మరసం తెచ్చి యిచ్చాడు అవతారం.

గటగటా తాగేశాడా వ్యక్తి.

"అవతారంగారూ!" అన్నాడు గ్లాసు కింద పెట్టి.

"ఆఁ!"

"మీరు చేస్తున్న పని ఏం బాలేదండీ" తాపీగా అన్నాడా వ్యక్తి.

గతుక్కుమన్న అవతారం... పాలు పితుక్కుంటున్నప్పుడు గేదె తన్నినట్టుగా ఫీలయ్యాడు.

"ఏమన్నారూ?"

"ఇంకా ఏం అనలేదండీ. ఇప్పుడంటున్నాను... మీరు అవతారంగారే కాదు. బుద్ధావతారంగారు కూడానని"

"ఏమిటండీ...? ఆర్. పి. ఓ. అధినేతను నిందా నివారణా కార్యాలయం యజమానిని నన్నే పట్టుకుని అంత మాటంటున్నారు".

"లేకపోతే ఏమిటండీ? నిందా నివారణా కార్యాలయం ఏమిటండీ... నా బొంద".

"ఇదిగో మాష్టారూ! మీరు శృతి మించుతున్నారు. మితిమీర్తున్నారు."

"అందుకు నన్ను క్షమించమని కొత్తిమీర కారం తిని మిమ్మల్ని బతిమాలుకుంటానికి నాకెలాంటి అభ్యంతరం లేదు. ముందు నా మాట వినండి. నన్ను చెప్పనియ్యండి".

"ఏమిటది?"

"మీబోటి మంచివాళ్ళని ఈ లోకం నీళ్ళల్లో ముంచి వేస్తుందండీ".

"ఎలా?"

"ఎవరి మీదో నింద పడుతోంది. దానికి మీరు ఏం చేస్తున్నారు?"

"ఆ నింద పోవటానికి మా శాయశక్తులా కృషి చేస్తున్నాం".

"అదే తప్పంటాను".

"నేను ఒప్పుకోను".

"అక్కడే మీరు పప్పులో కాలేస్తున్నారు"

"ఏం చెయ్యాలంటారు?"

"ఆ నిందని కాష్ చేసుకోవాలి. వందలు వేలు సంపాయించాలి?"

"పాపం కదూ?"

"పాపం గీపం అంటూ దీపం వేపు చూస్తే లాభం లేదు. డబ్బున్న వాడికే విలువ".

"ఇంతకీ నన్నేం చెయ్యమంటారు?"

"మీ పాపభీతి పక్కన పెట్టండి. నీతిని అలమరలోకి నెట్టండి. డబ్బు సంపాయించండి సార్. కట్టలకు కట్టలు! పెట్టెలకి పెట్టెలు!"

"ఆఁ! అంత డబ్బొస్తుందంటారా?"

"నిజంగా"నండీ... లేకపోతే ఎందుకు చెబుతాను?"

ఇంతలో తాయారు గొంతు వినిపించింది లోపల నుంచి "ఏమండీ ఇలా ఓసారి వస్తారా" అంటూ.

"మీ ఇల్లాలుగారూ చెల్లెమ్మ పిలుస్తోంది వెళ్ళిరండి".

లోనికి వచ్చాడు అవతారం.

"తాయారూ! తప్పు కదూ" అన్నాడు మృదువుగా మందలిస్తూ.

"ఏమిటండీ" అంది కంగారుగా.

"పరాయి వ్యక్తితో మాట్లాడుతున్నప్పుడు సరాగానికి పిలిస్తే ఎలా చెప్పు? ఇది కాదా తప్పు?"

"చాల్లెండి సంబడం! ఎప్పుడూ మీకు ఆ ధ్యాసే" నవ్వుతూ తోసేసింది.

"అందుకు కాదా....? అయితే చెప్పు మరెందుకో"

"మీరు అడ్డుపుల్లలు వెయ్యకండి జిడ్డు బడ్డూరావులా! ఆయనేదో వేలకి వేల సంపాదన గురించి చెపుతున్నాడు. వినండి. సంపాయించండి. నాకు రవ్వల నెక్లెసు చేయించరా?" ముద్దుగా అంది.

"ఓ. కె. అలాగే".


తిరిగి వచ్చాడు అవతారం.

"ఏమంటోందండీ చెల్లెమ్మ? డబ్బు సంపాయించమంటోందా?"

"ఆహా!"

"ఇవ్వాళే పరిచయం అయ్యానుగాబట్టి... నా మీద మీకు నమ్మకం ఉండొచ్చు లేకపోవచ్చు. అందుకని– తరచుగా మీ ఇంటికి వస్తుంటాను. వచ్చినప్పుడల్లా మీకు– నాకు తెలిసిన మెలకువలు చెపుతుంటాను. అయితే... ఫైనల్‌గా మిమ్మల్ని మా 'బాస్' దగ్గరికి తీసికెడతాను. ఆయన మాట వింటే చాలు మీరు పూటకి వెయ్యి సంపాయిస్తారు... పూటకి వెయ్యి అంటే?"

"అమ్మ బాబోయ్! పూటకి వెయ్యి రూపాయలా... మీ బాస్ దగ్గర రూపాయల గొయ్యిగాని లేదు కదా?"



"తినబోతూ రుచెందుకు?"

"సరే!"

"అయితే వస్తాను మరి?"

"మీరెక్కడుంటారు?"

"పని అయ్యేంతవరకూ మిమ్మల్ని అంటి పెట్టుకొనే ఉంటాను. కనిపెట్టుకునే ఉంటాను".

"మీ అడ్రసు?"

"చెప్పవలసిందేనా?"

"తప్పకుండా".

"తప్పదా?"

"తప్పదంటే తప్పదు".

"అయితే వినండి- పటమటలో ని కటకటనగర్‌లో... రాయి దెబ్బ, చావు దిబ్బ మీద".

"అదేం నగర్ అండీ? .. ఎప్పుడూ వినలేదే?"

"ఈ మధ్యనే పదవిలోంచి గెంటేయబడ్డ మంత్రి.., తంటా పెంటయ్యగారు ప్రారంభోత్సవం చేశారు".

"హవుస్ నెంబర్".

"కార్పొరేషన్ ఛాంబర్లో ఉంది. ఇంకా బయటికి రాలేదు.

"అంతా గడబిడగా ఉంది'.

"మీరంత శ్రమపడలేరు గానీ .. కావలసినప్పుడల్లా నేనే వస్తుంటాగా?"

"సరే!

"చివరగా ఒక మాట! మా బాస్ అడిగి రమ్మన్నవి మిమ్మల్ని అడుగుతుంటాను. సంకోచించకుండా సందేహించకుండా సమాధానాలు చెప్పండి. మీరు పూటకు వెయ్యి సంపాయించాలి మరి"

"అలాగే'

"నే వస్తాను మరి" అంటూ వెళ్ళిపోయాడా వ్యక్తి.

* * * * *

రోజులు గిర్రున తిరుగుతున్నాయ్. ఒకటి రెండుసార్లు రవికాంత్ ఫోన్ చేశాడు. మృదుల కోసం. ఇప్పుడతను కాలేజీకి మామూలుగానే వెడుతున్నాడు.

"నాకు ఫోన్ చెయ్యటానికి మీరెవరు? బిహేవ్ యువర్ సెల్ఫ్ ప్రాపర్లీ" అంటూ గట్టిగా వార్నింగిచ్చింది- మృదుల.

పక్కనే ఉండి విన్న మధుసూదనంగారు రుక్మిణమ్మ ఎంతగానో సంతోషించారు.

"సో నైస్ ఆఫ్ యూ బేబీ" మెచ్చుకున్నారు మధుసూదనంగారు.

"అది నా కూతురండీ!" కూతురి బుగ్గమీద మృదువుగా ముద్దు పెట్టుకుంది రుక్మిణమ్మ.

మృదుల తన గదిలోకి వెళ్ళిపోయిన తరవాత బాధగా అన్నారు మధుసూదనంగారు.

"ఆ రవికాంత్... బాస్టర్డ్... మనమ్మాయి జీవితం మీద గట్టి దెబ్బ కొట్టాడు రుక్కూ! ఎంత ప్రయత్నించినా... పెళ్ళి సంబంధాలే కుదరటంలేదు. మన ఆస్థి... అంతస్థు, పరపతీ... పలుకుబడీ... అన్నీ గంగలో కలిసిపోయినయ్.... ఆ అపనింద ముందు... చివరికి మన బేబీని... ఏ అనామకుడికో... ఆస్థీ అంతస్థులేని వాడికో కట్టబెట్టాల్సి వస్తుందేమోనని భయంగా ఉంది".

"మొదటగా అంతగా లేదు గానీ... రోజులు గడుస్తున్నకొద్దీ నాకూ దిగులు వేస్తోందండీ" అంటూ తనూ తల పట్టుకుంది- రుక్మిణమ్మ.

* * * * *

నిర్మల యింటి టెర్రేస్‌పై సమావేశమయ్యారు ఆ సాయంత్రం .. సుశీల... కమలలు.

విజ్ఞానం - వినోదం

బాబ్ బ్రౌన్



DIST BY ASIA FEATURES

సమస్య

నీరు మరిగేస్థానం (బాయిలింగ్ పాయింట్) అంటే ఏమిటి?

అవసరం

ఒక ఉష్ణమాపకం (వేడిని కొలిచే సాధనం) చిన్న పాత్ర, ఉష్ణం, నీరు, ఉప్పు

ఇలా చేయండి

పాత్రలో నీరు మరిగించి క్రించ మంటను తొలగించి ఉష్ణమాపకాన్ని నీటిలో పెట్టండి ఉష్ణమాపకంలో కొలతను చూడండి. ఈ నీటిలో కొంత ఉప్పును కలిపి, మళ్ళీ మరిగించి ఉష్ణమాపకం కొలతలలో మార్పు ఏమైనా ఉందేమో చూడండి.

ఏమి జరుగుతుంది?

ఉప్పు. చాలా ఇతర పదార్థాలు నీరు మరిగే స్థానాన్ని పెంచుతాయి స్వచ్ఛమైన నీటికన్నా ఉప్పు కలిపిన నీరు బాయిలింగ్ పాయింట్ దగ్గర ఎక్కువ వేడిగా ఉంటుంది.

సముద్ర మట్టానికన్నా ఎత్తయిన ప్రదేశంలో నీళ్ళు తక్కువ ఉష్ణోగ్రతలో మరుగుతాయి అందుకనే ఎత్తయిన కొండలపై తక్కువ ఉష్ణోగ్రతలో నే నీళ్ళు మరుగుతాయి.

"బ్యాంకుకు ఫోన్ చేశానే... ఈపాటికి హీరోయిన్‌గారు స్కూటర్ మీద ఉరుకులు పరుగులతో వచ్చేస్తుంటుంది". అంది నిర్మల.

వీధి వాకిట్లో హారన్ వినిపించింది.

"అదుగో! మాటల్లోనే వచ్చేసింది... ముత్యాల మూట..." పేరపెట్ వాల్ దగ్గరకెళ్ళి నవ్వుతూ అంది నిర్మల హాస్యంగా "ఒసేయ్! మృదులా మా ఇంటికి లిఫ్ట్ లేదు గానీ . అక్కడి నుంచి హైజంప్ చెయ్యవే... నీకో మంచి గిఫ్ట్ ఇస్తాను.

స్కూటర్ వాకిట్లో పార్క్ చేసి ఆర్క్ ఆకారంలో ఉన్న ఆ స్పైయిర్‌కేస్ మీదుగా చకచకానడిచి పైకి వచ్చింది మృదుల.

"ఏమిటే కొంపలు మునుగుకు పోయేటట్టు ఫోన్ చేశావ్? ఏమిటి విషయం... హాయ్ సుశీ! కంగ్రాట్స్... త్వరలో పెళ్ళికూతురు కాబోతున్నావటగా. హాయ్ కమలా! హౌ డూయు డూ" హుషారుగా అంది- మృదుల. చిరునవ్వుతో బదులిచ్చారు సుశీల- కమలలు.

"ఏమిటే కథానాయికా... ఇంత చలాకీగా ఉన్నావ్? నీ అంతట నువ్వే... పంతంగా... పట్టుదలగా... నీ చెయ్యి పట్టేవాణ్ణి... అంటే మొగుడుగారిని మొగిలి పువ్వు పెట్టుకుని వెతుక్కున్నావా ఏమిటి?"

"ఏయ్ నోర్ముయ్యవే! ఏదో గిఫ్ట్ అన్నావ్ ఏమిటే?" అంది మృదుల క్వశ్చన్ మార్కు ముఖం పెట్టి.

నిర్మల.... సుశీల వేపు... కమల వేపు చూసింది.... ఏవో సైగలు చేస్తూ.

గిఫ్టంటే గిఫ్టు.

ఉండదులే సాష్టు

కాయగాని కాయ మొట్టికాయ
అయినా గట్టిదిలే తలకాయ!

అని కోరస్ ఆలపిస్తూ మృదుల నెత్తి మీద గట్టిగా మొట్టికాయ వేసి.... ఆ తరవాత "అమ్మో!" అంటూ విషాదగీతం ఆలపించారు నిర్మల ... సుశీల .

డాక్టర్ సలహాలు

డా. కె. వెంకటేశ్వరరావు



ఆర్. ఐ. ఆర్. విశాఖపట్నం

నా వయస్సు 18 సంవత్సరములు. నా చంకలో మిరియపు గింజంత కాయ వున్నది. దాని వల్ల నెప్పి ఏమీ లేదు. ఈ కాయ 6 నెలల నుండి వున్నది. దీనివల్ల ముందు ముందు ఏమైనా ప్రమాదము వున్నదా?

ఈ 'కాయ' పెరుగుతున్నదీ లేనిదీ కొన్ని నెలల పాటు గమనించండి. ఏ మార్పూ లేకుండా, నెప్పి వగైరా లేవీ లేనప్పుడు అలా వదలి వేయవచ్చును. మీకు దీనివల్ల చికాకుగా ఉంటే చిన్న శస్త్ర చికిత్స ద్వారా దీనిని సులభంగా తీసి వేయవచ్చును.

పి. ఐ. గుంటూరు

నా వయస్సు 46 సంవత్సరములు. నాకు రెండు సంవత్సరముల నుండి షుగర్ వున్నది. +2 నుండి 4 కి వచ్చింది. అప్పటి నుండి మనిషిని తగ్గిపోవుచున్నాను. దీనికి కారణం ఏమిటి? చికిత్స ఏమిటి?

మీరు రెండు మూడు నెలల కొకసారి రక్తంలోని గ్లూకోజు ప్రమాణం పరీక్ష చేయించుకోవాలి. అలాగే ప్రతిరోజు మీకు మీరే మూత్ర పరీక్ష చేసుకోవటం ఫలితాలను వ్రాసి ఉంచటం మంచిది.

మీ ఊళ్ళో ఉన్న డయాబెటిక్ స్పెషలిస్టులను కలిసి, వారు చెప్పిన పరీక్షలు చేయించుకుని, వారు నిర్ణయించిన మోతాదు ప్రకారం – మాత్రలు – ఇంజక్షన్లు వాడండి. మందుల కన్నా ముఖ్యమైనది నిర్ణయింపబడిన ఆహారాన్ని సక్రమంగా తీసుకోవటం, ఆహారానికి తగినట్లు సూచింపబడిన వ్యాయామం కూడా చెయ్యవలసి ఉంటుంది. రోగం వచ్చిందని మానసిక ఆందోళన ఈ రోజులలో అనవసరం.

టి. జె. ఆర్. విజయవాడ

సిగరెట్ మీద అమృతాంజనం రాచి పీలిస్తే జలుబు తగ్గుతుందని నా స్నేహితుడు చెప్పాడు. అది ఎంతవరకూ నిజం?

ఈ విషయంలో నాకు ఏ అనుభవమూ లేదు. నేరుగానే ముక్కు మీద అమృతాంజనం పూసుకుంటే సరిపోతుందేమో!

ఎస్. ఎస్. ఖర్గపూర్

నా వయస్సు 35 సంవత్సరములు. 5, 6 నెలల నుండి కాళ్ళు నెప్పులుగా వుంటున్నాయి. పని చేసుకుంటుంటే ప్రక్కల నెప్పులు ఎక్కువగా వస్తోంది. ఊపిరి తీయటం కష్టంగా వుంటోంది. ఎన్ని మందులు వాడినా అప్పటికి తగ్గుతోంది.

ఆహారం క్రమబద్ధంగా తీసుకుంటూ తగినంత కష్టపడ్డ తర్వాత విశ్రాంతి కూడా చాలా అవసరం. అన్ని విటమిన్లు గల మాత్రలను వైద్యుల దగ్గర ప్రిస్క్రిప్షను తీసుకొని వాడండి. అలాగే ముఖ్యంగా స్త్రీలు ఇనుపధాతువు గల మాత్రలను వాడటం వల్ల శరీరాన్ని ఆరోగ్యంగాను, అలసట లేకుండాను ఉంచుకునే వీలు ఉంటుంది. □

ఈ తరం యువతి

కమలలు.

"మీ అందరికీ అలా కావలసిందేలే శాస్తి. ఎందుకంటే మీ బుర్రల్లో తెలివి తేటలు జాస్తి. లేకపోతే.... ఏమిటే? అంతరిక్ష యాత్రకు రాలిలా గున్నావు. తియ్యవే హెల్మెట్ అని అమ్లెట్ పెట్టి చెపితే ఎందుకు తియ్యనే... ఇందు వదనలారా?" అంటూ హెల్మెట్ తీసి పక్కన పెట్టి జుట్టు వేళ్ళతో నే మృదువుగా సరి జేసుకుంది.

ఇంతలో నౌకరు కుర్రాడు "చాయ్" కప్పులు తీసుకొచ్చాడు.

తలా ఒకటే తీసుకున్నారు.

"లిప్ దగ్గర కప్ పెట్టుకుని సిప్ చేద్దామే" హుషారుగా అంది నిర్మల.

"ఓ. కే." అన్నారు ముగ్గురూ.

తాగిన తరవాత కప్పులు కింద పెట్టేశారు.

ఈ సమావేశ మెందుకో తెలుసా?" అంది నిర్మల.

తెలియ దన్నట్టుగా చూసింది మృదుల.

"నీ మీద అవిశ్వాస తీర్మానం ప్రకటించ టానికి" కోపంగా అంది సుశీల.

"అవునే నాకూ బాధగానే ఉంది" అంది కమల.

మౌనంగా ఉండి పోయింది మృదుల.

"ఏమిటే బాబూ నా మీద దండెత్తారు ఉన్నట్టుండి? దండెం మీద తుండు వేసి దాని వెనకాల దాక్కోవాలా ఏమిటి?" నవ్వేసింది నిర్మల.

"చాలించు నీ హాస్యం. నిర్మలా ఈ మధ్య కుదిరిన నా పెళ్ళి సంబంధంతో.... ఒక్క మృదులకు తప్ప.... మన ముగ్గురికీ వివాహాలు నిశ్చయ మయినయ్. మరి దీన్నిలా గాలి కొదిలేద్దామనేనా నీ ఉద్దేశం? అన్ని కబుర్లు చెప్పి... ఇప్పటి వరకూ నువ్వు చేసిం దేమిటో చెప్పు? కనీసం.... ఇంత వరకూ మా ఇద్దరి సహాయం కూడా తీసుకో లేదు. అసలు నీకు మృదుల వివాహం మీద సరైన ఇంట్రెస్టు ఉందా లేదా?" దులిపేసింది సుశీల.

"అవునే నిర్మలా! ఇంతవరకూ దాని విషయంలో మన మేం చెయ్య లేదు. ఇక దాని పెళ్ళి ఎలా జరుగుతుందే.... నువ్వే చెప్పు!" బాధగా అంది కమల.

దాంతో "గయ్"మని లేచింది నిర్మల.

"ఏమిటే మీ రనేది? మృదుల మీద నాకు ఇంట్రెస్టు లేదా? దీనికోసున్నా టిస్టుగాని ఉందటే మీ దగ్గర?" తీక్షణంగా అడిగింది... నిర్మల.

ఈ సారి మృదులకి అరికాలి మంట నెత్తికెక్కింది.

"కబుర్లు తప్ప నా కింతవరకూ ఏం చేశావే నువ్వు.... పైగా నేను ప్రేమించిన రవికాంత్ దగ్గరకి తరచుగా వెడుతున్నావట. అతనితో ఒకటే కబుర్లట.... గంటలు గంటలు! ఆ యింటి దగ్గరలో మా దూరపు చుట్టాలమ్మాయి ఒకటుంది. అది మీ ఇద్దరి సంగతి వాచ్ చేస్తూ ఎప్పటి కప్పుడు నాకు చెబుతుంటుంది."

దాంతో బాగా ఇరిటేట్ అయింది నిర్మల. "అవునే! నీ లవర్ని ఎగరేసుకు పోవాలని... నా తంటాలు నేను పడు తున్నాను. అయినా... అతని ముఖం చూడనని ప్రతిజ్ఞ చేసిన దానివి.... అతను నేనూ కబుర్లు చెప్పుకుంటే నీ కేంటట? కౌగిలించుకుంటే నీ కేమిటి?" కటువుగా అంది.


"ఛీ! నీ లాంటి దాన్ని నమ్ముకుని... నీతో గుడ్డిగా స్నేహం చేసి గడ్డి తిన్నంత పని చేశాను. ఇంత ద్రోహం తలపెడతావా స్నేహ ధర్మం విస్మరించి."

"పోపోవే? ఏమిటే ఇందులో ద్రోహం? అతని కేమన్నా నువ్వు తాళి కట్టిన భార్యవా?" హేళనగా అంది నిర్మల.

ఊహించని రీతిగా.... మృదుల... నిర్మల చెంప మీద ఛెళ్ళున కొట్టి భళ్ళున దిగి వెళ్ళి పోయింది.

కొయ్య బొమ్మల్లా బ్రమ్మపడి పోయారు సుశీల.... కమలలు.

(ఇంకా ఉంది)



ఇప్పుడు తక్కువ ప్రీమియంతో లభించే భీమా సందేశ్ పాలసీ మరింత తక్కువ ప్రీమియంతో!

10%-27% తగ్గింపు

తక్కువ, మరింత తక్కువ ప్రీమియం

భీమా సందేశ్ పథకపు ముఖ్య ఆకర్షణ దానికై చెల్లించాల్సిన తక్కువ ప్రీమియం.

ఇప్పుడు ప్రీమియం రేట్లలో వయస్సు మరియు పాలసీ అవధిని బట్టి 10% – 27% తగ్గింపు. ఈ తగ్గింపుతో భీమా సందేశ్ భీమా పాలసీ రక్షణ అందరికీ, ముఖ్యంగా, ఆదాయం తక్కువగా వుండేవారికి, తక్కువ పైకంతో ఎక్కువ భీమా రక్షణ పొందగోరే వారికి అందుబాటులో వుండగలదు.

ప్రస్తుత భీమా సందేశ్ పాలసీదార్లకు కూడా లాభమే

క్రొత్త ప్రీమియం రేట్ల నిష్పత్తిలో ప్రస్తుత పాలసీదార్ల పాలసీ మొత్తం హెచ్చింపబడుతుంది. దీని సంబంధంగా, భీమా సందేశ్ పాలసీదార్లకు ప్రతి ఒక్కరికీ ప్రత్యేకంగా సమాచారం పంపబడుతుంది.

నష్టం లేని పథకం

భీమా సందేశ్ పథకం క్రింద, పాలసీ అవధి ముగిసాక అన్ని ప్రీమియముల పైకం పాలసీదారుడికి చెల్లించబడుతుంది. ఒకవేళ, పాలసీ అవధిలో మృత్యువు సంభవిస్తే, పూర్తి మొత్తం పాలసీదారుడు పేర్కొనిన వ్యక్తికి చెల్లింపబడుతుంది.

నేడే మీకు చేరువలోని ఎల్ఐసి ఆఫీసును లేదా మీ ఎల్ఐసి ఏజెంట్‌ను సంప్రదించండి.

యోగక్షేమం వహామ్యహమ్

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

ఎల్ఐసి—భద్రత నందించే విశ్వసనీయమైన సంస్థ

RADEUS/LIC/5-87

"దేవుడు మీకు మేలు చేయాలి"

కృష్ణ

రెండు సంవత్సరాల తరువాత స్వదేశానికి వచ్చేను. నాతో బాటు మిత్రుడు ఖదీర్‌ఖాన్ గూడా వచ్చేడు. బొంబాయిలో దిగేక నేను రైల్లో వెళ్ళాలన్నాను. అతను నచ్చజెప్పాలని ప్రయత్నించేడు గాని నేను నా నిర్ణయాన్ని మార్చుకోలేకపోయాను. చివరకు 'నా కర్మకు నన్నొదిలి' అతను విమానంలో హైదరాబాదు వెళ్ళిపోయాడు.

ఎంత యాతన– ఎన్ని తిప్పలు బడ్డాడో గాని నేను దిగిన హోటలు గుమాస్తా త్రీటయెర్ టికట్ తెచ్చి పెట్టేడు. ఎగాదిగా నన్ను అదోలా చూస్తూ "ఏసీగాని విమానం టికెట్సుగాని దొరకడం యింతకంటె చాలా సులభంసార్!" అన్నాడు.

చాలాకాలం తరువాత ప్లాట్‌ఫాం మీద– ఆ జన సందోహంలో బుజాలు బుజాలు రాసుకు తిరుగుతుంటే నాకు వింతహాయి అన్పించింది. మనుషులు ఒకళ్ళ నొకళ్ళట్లా రాసుకు తిరుగుతుంటే సోదరభావం– సహజీవన ధోరణీ అలవడతాయేమో!నన్పించింది– అయస్కాంతంపై రాయగా రాయగా ఇనుపముక్కకి గూడా ఆ స్వభావం అబ్బినట్లు.

నేను అమెరికా వెళ్ళి పదిహేనేళ్ళయింది. ఆరెగన్‌లోని ఒక భౌతిక శాస్త్ర పరిశోధనాలయంలో ఉపసంచాలకునిగా పని చేస్తున్నాను. స్వదేశంలో నాకు తెలిసినంతవరకు నా రక్త సంబంధీకు లెవరూ లేరు. పొత్తిళ్ళనాటి నుంచీ అనాధాశ్రమంలోనే వున్నాను. ఆ దగ్గర్లోనే వున్న ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు చదివి ప్రథమశ్రేణిలో పాసైనాను. ఉపకారవేతనం వచ్చింది. పీయూసీలో. క్లాసువచ్చింది. నా కిష్టమైన ఫిజిక్సు సబ్జక్టు కోసం ఇంజనీరింగు వదలుకుని బీయస్సీ, ఎమెస్సీ చదివి ఇరవైమూడో సంవత్సరం నిండేసరికి డాక్టరేట్ పొందేను. ప్రతిభను గుర్తించడమే తప్ప మరో పరిగణన లేని ప్రొఫెసరుగారి ఔదార్య ప్రోద్బలాలతో స్కాలర్‌షిప్ పొంది అమెరికా వెళ్ళి పోస్ట్ డాక్టొరల్ రీసెర్చి చేస్తూ– యిటీవలే పరిశోధనాలయం ఉపసంచాలకుణ్ణైనాను.

నాటి నుంచి నేటివరకు ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా మైత్రీబంధాన్ని కొనసాగిస్తున్న కొందరు స్నేహితులను చూడటానికే నేను హైదరాబాదుకు రావడం. చిన్ననాటి నుంచి ఆర్థిక – సామాజిక సమీకరణ సూత్రాల్ని తిరస్కరించి చెలికాళ్ళుగా కొనసాగుతూ వచ్చి ఆత్మబంధువులుగా స్థిరపడిపోయిన వాళ్ళను చూసుకోడానికీ తమ దృష్టిలో నా సాంఘికస్థాయి ఎదిగిపోవడంతో దారిలోనే జారిపోయిన పందరివంటి చిన్ననాటి మిత్రులను వెదుక్కోటానికీ– ఇందుకే నేను హైదరాబాదు రావడం.

రైల్లో నిద్రపట్టలేదు. పక్కనున్న బెర్తుల వాళ్ళు నిద్రకోసం పిచ్చి ప్రయత్నాలేమీ చెయ్యకుండా పేకాడుతూ కూర్చున్నారు. వాళ్ళ ముఖాల్లోని ఉత్సాహ ఉద్రిక్తతల్ని పరిశీలిస్తూ కూర్చున్నాను.

అప్పుడప్పుడు నా మనస్సులో ఒక ఆలోచన తలెత్తుతూంటుంది.

తలితండ్రులు, రక్త బంధువులు వున్నవ్యక్తి చాలాకాలపు ఎడబాటు తరువాత వాళ్ళని కలుసుకునేటప్పుడు వాళ్ళపట్ల ఎట్లా ప్రతిస్పందిస్తాడు? ఆ స్పందన – లేక – 'ప్రతిస్పందనలతో వాళ్ళ బాడీ కెమిస్ట్రీలో ఎట్లాంటి మార్పులువస్తాయి?

ఆ వెంటనే మరో ఆలోచనా వచ్చేది. తన వాళ్ళంటూ ఎవరూలేని నా వంటి 'పుట్టు అనాధ మనస్సులో రక్త బాంధవ్యానికి ప్రతిస్పందించే భావకేంద్రం అంటూ ఒకటుంటుందా?' అనే ప్రశ్న నా మిత్రుల్లో ఒక రిద్దరి మనస్సుల్లో నైనా తలెత్తివుండదా?


అరున్నరకు నాంపల్లి చేరింది బొంబాయి ఎక్స్‌ప్రెస్.

ప్రయాణికులు దిగటానికి వరుసగట్టేరు. నేనూ వరుసలో నిల్చుని ఉత్సుకతతో ప్లాట్‌ఫారంవైపు చూశాను.

అందుకోసమే ఎదురు చూస్తున్నట్లు నా కన్నులు ఒక వ్యక్తిపై నిలిచిపోయాయి.

ఉరుదూలో "బాబా – దేవుడు మీకు మేలుచేయాలి. ఈ దురదృష్టవంతురాలైన అనాధకు





కాస్త సాయం చేయండిబాబా!" అంటూ దీనంగా యాచిస్తోంది. బురఖా వేసుకునుంది. రూపం కన్పించకపోయినా గొంతు వార్ధక్యాన్ని స్పష్టంగా తెలియబరుస్తోంది.

దిగి సూట్‌కేస్ లాక్కుంటూ నడిచేను. నా చూపుమాత్రం కాసేపు లంగరువేసిన పడవలాగ ఆ వ్యక్తి దగ్గరే తొణకులాడింది.

అదేదో పరిచిత స్వరంలా విన్పిస్తూంది. కంఠస్వరం కంటే ఆ స్వరంతో అనుస్వరంలా విన్పించే దైన్య నాదం 'మునుపెన్నడో విన్నదే యీ గొంతు' అన్పించేలావుంది.

చేతికొచ్చిన నాణేన్ని ఆమె చేతిలోని టిన్నులో వేశాను.

"జీతేరహొ బేటా!" అన్నదామె. మంత్రంలా నన్ను ముగ్ధుణ్ని చేసిందా దీవెన!

హైదరాబాదులో మూడు రోజులు మూడు గంటల్లా గడిచిపోయాయి. ఉదయం ఒక మిత్రునింటా, రాత్రి మరొక మిత్రునింటా భోజనం. వాళ్ళ కుటుంబ సభ్యులూ - పిల్లలమధ్య ఆహ్లాదాన్ని పొందేను.

రాత్రి హొటల్ రూమ్‌కి వచ్చి పడుకోబోయేముందుమాత్రం ఆ వృద్ధ భిక్షుకి గొంతు గుర్తుకు వచ్చేది. 'దేవుడు మీకు మేలు చేయాలి' అని దీవించినంతమాత్రాన అంతా మేలే జరుగుతుందా? 'చిరంజీవ' అన్నంత మాత్రాన వందేళ్ళు జీవిస్తామా? నిజమే ఒప్పుకుంటాను. అయితే ఆ మాటల్ని ఆ వృద్ధురాలు గుండెలోతుల్నుం చెక్కణుంచో తోడి తెచ్చినట్లన్పించి నాకు వొళ్ళు జలదరిస్తుంది.

ఏడింటికల్లా ఖదీర్‌ఖాన్ వచ్చేడు. రాత్రి భోజనానికి తమ యింటికి తీసుకుపోడానికి.

హొటల్‌మెట్లు దిగి కారుదగ్గరకు నడుస్తూ టక్కున ఆగిపోయాము.

అదే కంఠం! "అల్లా మీకు మేలుచేయాలి - ఈ దురదృష్టవంతురాలిపై కనికరం చూపించండి బిడ్డా!"

గోడకి చేరగిలబడివుంది బురఖావేసుకున్న ఆ వృద్ధ భిక్షుకి.

మేము చెరొక రూపాయి వేశాము.

"అల్లా మాకు కాస్తోకూస్తో మేలుచేశాడు - నీకూ కాస్త మేలుచేయాలని మా కోరిక - అల్లా యీ కష్టాల్నుంచి నిన్ను గట్టెక్కించుగాక!" అన్నాడు ఖదీర్ దయనిండిన గొంతుతో.

"నిజం - నిజం - తప్పక భగవంతు డీమెను అనుగ్రహించాలి" అన్నాను నేనూ.

కారులో మేం వెళ్తుంటే ఆమె ఆశీర్వాదం విన్పిస్తూనేవుంది.

ఆ రాత్రి నా బాల్య స్నేహితులందర్నీ గుర్తుచేసుకున్నాను. నాతో బాటు అనాధాశ్రమంలో వుండి చదువు అబ్బక మానేసినవాళ్ళు, పదో తరగతి వరకు చదివి ఎక్కడో చిల్లరపనులకు కుదిరి ఆశ్రమాన్ని వదలినవాళ్ళు - అంతా గుర్తుకువచ్చేరు. అందులో యిప్పుడు ఎవరెవరు ఎక్కడవున్నారో! ముఖ్యంగా మిత్రుడు పండరి - ముషీరాబాదు నుంచి స్కూలుకు వచ్చేవాడు. వాళ్ళ యింటికి తరచూ నన్ను తీసుకెళ్తుండేవాడు. చాలసార్లు వాళ్ళింట్లో అన్నం తిన్నాను గూడా. చదవడానికి శాయశక్తులా ప్రయత్నించి విఫలులైన వాళ్ళలో అతనూ వొకడు. తనకంటే నేను రెండేళ్ళు చిన్న. అయినా మేం కలుసుకున్నప్పుడు అతనిలో కన్పించే వినమ్రధోరణి నన్ను సిగ్గుపడేలా చేసేది. నేనొక్కణ్ణేగాదు. బాగా చదువు అబ్బుతున్న పిల్లలెవర్ని చూసినా అతనిలో అప్రయత్న గౌరవభావం కలిగేది. నేను బి. ఎస్ సి. చివరి సంవత్సరం చదువుతూండగా చివరిసారి చూశాను అతన్ని. మెట్రిక్ పరీక్ష ఆఖరుసారిగా రాస్తూ లెక్కలు చెప్పించుకోడానికి సైకిలేసుకుని హాస్టలుకు వచ్చేడు.

మర్నాడుదయం హొటలుకు వచ్చిన మిత్రుడు విజయబాబుతో అన్నాను- "పండరి గుర్తున్నాడా నీకు? ముషీరాబాదు నుంచి వచ్చేవాడు."

తలూపేడు విజయబాబు- "బాగానే గుర్తు పెట్టుకున్నావే!"

"ఇప్పు డెక్కడున్నాడో యేమైనా తెలుసా?"

విజయబాబు చూపు చిట్లింది- "అతను పోయా

దన్నారు."

"పోయాడా?! గ్నాడ్! ఏమైంది?"

"ఏదో రోగమయ్యుంటుంది నామకః- నిజానికి మన దేశంలో చాలా మంది లాగ దారిద్ర్యం- దౌర్భాగ్యంతోటే చనిపోయుంటాడు. మూడు సంవత్సరాల క్రితం అనుకుంటా- కలిశాడు. ముషీరాబాదు నుంచి కవాటిగూడాకు మారేమని చెప్పాడు. తరువాత వేరే వాళ్ళ ద్వారా విన్నాను. అతని భార్య అతన్ని వొదిలేసి ఎవర్తోనో పోయింది. ఆ షాక్ నుంచి తేరుకోలేక పోయాడను కుంటా-" నిట్టూర్చేడు విజయబాబు.

నివ్వెర పోయాను. కాలగతిన స్నేహపథం నుంచి జారిపోయిన మిత్రుణ్ని వెదుక్కుందా మనుకుంటున్నాను. పోయాడా!!

ఆ వార్త మనసును కలచి వేసింది. చాలా సేపు మౌనంగా వుండి పోయాము.

తరువాత మాట్లాడబోతే నా గొంతు దగ్గుత్తిక బడింది. పండరి పోయాడు. అతని కుటుంబ సభ్యులు-? భార్య సరే- పిల్లలు లేరా?

విజయబాబుకు ఆ వివరాలు తెలీవు. తెలియవని చెబుతూంటే అతని ముఖాన అపరాధ భావం అలుముకుంది.

మర్నాడుదయం విజయబాబూ నేనూ కలసి కవాటీగూడా వెళ్ళేము.

వాళ్ళనూ, వీళ్ళనూ అడిగి తెలుసు కున్నాము. పదకొండింటి కల్లా ఓ కాలవ పక్కనున్న ఆ గుడిసెను కనుక్కున్నాము.

మేం ఆ యింటి ముందు తచ్చాడటం గమనించి పొరుగు గుడిసె కుర్రాడు ఒకడు వచ్చి- మేం వచ్చిన పని ,తెలుసుకుని కాసేపు ఆలోచించి రివ్వున పరుగెత్తాడు.

కాసేపట్లో వచ్చింది పండరి తల్లి- అనుమానంగా, సందేహంగా, భయంగా మా వంక చూస్తూ.

మా దగ్గరికి వచ్చేక మౌనంగా ప్రశ్నార్థకంగా మా యిరువుర్నీ మార్చి మార్చి చూసింది.

ఆమె నన్ను గుర్తు బట్టలేదు. కానీ ఆమెను చూసేక నే నామెను మరచి పోయినట్లే అన్పించ లేదు. కండ్లకి బాగా దిగువ దాకా.విస్తరించిన ఆ నల్లని వలయాలు విజయబాబు చెప్పిన- చెప్పని కథనంతా వివరిస్తున్నాయి.

నేనే చొరవ తీసుకుని అన్నాను- "నేనమ్మా- నువ్వు నన్ను గుర్తు బట్ట లేదు. పండరి చిన్న నాటి స్నేహితుణ్ని- రాధాకుమారని- "రాధ" అని పిలిచే వాడు పండరి."

ఆమె చూస్తోంది గుర్తు చేసుకుంటూ.

"ముషీరాబాదులో మీరున్నప్పుడు పండరితో బాటూ వస్తూండే వాణ్ని- మీ యింట్లో చాలా సార్లు అన్నం గూడా తిన్నాను. మీరు మరీ బలవంతం చేసి తిన్పించేవారు- ఆ రాధని!"

ఆమె అయోమయంగా చూసింది. ఆ కొన్ని క్షణాల్లో ఎన్ని సంవత్సరాల గతం విహ్వాల మనోవేగంతో ఆమె మనస్సులో రివ్వున కదలిందో! ఆ పోయిన తన కుమారుడి జీవిత విశేషాలు ఎన్ని ఆ జ్ఞాపకరంగాన రెప రెప లాడేయో! ఎన్ని ముద్దులు- ఎన్ని నవరసపూరిత అమృత స్మృతులు ఆ గుండెలో గుబగుబ లాడేయో! తెలీదు గాని.

క్రమంగా ఆమె కళ్ళ నుంచి అమృత వృష్టి లాంటి వాత్సల్య దృష్టి ప్రసరిస్తూ నన్ను తడిపి వేయసాగింది. నా శరీరం మళ్ళీ చిగురించ సాగిన మోడులా పులకరించింది.

"ఓ! నాయినా- నువ్వా!?" అన్న దామె. "రాద- రాద- ఔ రాద" అంటూ నెమ్మదిగా గుర్తు చేసుకోసాగింది. "ఎప్పటి దినాలు! ఎప్పటి కాలం! నాయినా! పండర్ని ఆ బగమంతుడు దీసుకు పోయిందు నాయినా! తండ్రీ- దేవుడు నా బిడ్డడ్ని ఎత్తుకపోయిండు నాయినా!"

ఆమె కళ్ళు పొంగేయి. ఆ అశ్రుధార జీవ నదిలా కన్పించింది.

నదీ తీరాన చెలమలాగ నా కళ్ళల్లోనూ బాష్పం ఉబికింది. సంతోషం! నా కంటికీ- హృదయానికీ బంధం యింకా సడల లేదన్న మాట!

చప్పున కన్నీళ్ళు తుడుచు కుందామె. తలుపు తీసింది. కానీ అంతలోనే తటపటాయించింది- "లోని కొస్తావా నాయినా?"

ఆ గుడిసె తలుపు వినమ్రభావం నేర్పింది. వొంగి యిద్దరమూ లోపలికి నడిచేము.

గోడమీద- పండరి! పండరి చిన్నతనం నాటి ఫోటో- మెట్రిక్ పరీక్ష కోసం దిగింది లాగుంది- పెద్దది చేయించారు.

ఆ ఫోటోలో నుంచి ఆ స్నేహపూరిత మైన కండ్లు నన్ను మళ్ళీ తమ యింటికి ఆహ్వానించేయి కొన్ని యేళ్ళ తరువాత.

ఆ కళ్ళలోకే చూస్తూ వుండిపోయాను.

గబగబ మూలనున్న చాపని తీసి పరిచిందామె- "కుసోండి నాయినా- ఎంత దయతో- ఎంత మాలివితో వొచ్చిర్రో కసింత "చా" ఖైన తాగుదురు-" అని తడికచాటుకు పొయ్యి రాజెయ్య డానికి వెళ్ళింది.

"ఉహుఁహుఁ- ఇప్పుడవన్నీ పెట్టుకోకు-" వారించబోయాడు విజయబాబు.

"అన్నీ యేవుంది నాయినా- చాయేగా-" అన్న దామె.


మేం టీ తాగుతూంటే ఆమె వివరంగా చెప్పింది.

పండరి క్షయ రోగంతో పోయాడు- ఇద్దరు మగ పిల్లలు- పిల్లల్ని చదివించాలని- వాళ్ళకి బాగా చదువు రావాలని తాపత్రయ పడేవాడు. పెద్ద పిల్లాడ్ని బళ్ళో వేయకముందే పోయాడు. రోగం పుణ్యమాని కన్న పిల్లల్ని మనసుతీరేలా దగ్గరకు తీసుకోడానికి గూడా సాహసించేవాడు కాదు. ఆ పిల్లల తల్లి- సరే- ఆ మహాతల్లి అసలెక్కడుందో గూడా తెలీదు. జంతువులే నయం పిల్లల్ని కని వొదిలేయవు- సాకుతాయి.

"మరి పిల్లలు- ఏరమ్మా?" అడిగేను.

ఆమె కళ్ళు తృటికాలం మెరిసేయి- "బడికి బోయినారు నాయినా- పండరి ఆకర మాటదే- నా పిల్లల్ని సాళెకు దోలాల- సాళెకు దోలాలని కల్వరిస్తానే కన్ను మూసిందు తండ్రి" పళ్ళు బిగబట్టి కష్టంతో దుఃఖాన్ని పొంగనీయకుండా ఆపింది. -"షరీకు జేసినగా నాయినా- బళ్ళో షరీకు జేసినగా- వాళ్ళ కోసమే యీ కట్టెనింకా సాగదీస్తున్న."

బడికి పంపడమంటే- ఎట్లా? పుస్తకాలు, బట్టలు, ఫీజులు! ఎట్లా? మరి యింట్లో తిండి- తిప్పలు? ఎట్లా? ఎట్లా?- ప్రశ్నలన్నీ నా




అమృతాంజన్‌కే
తెలుసు
ఒంటి నొప్పులు
మరియు
బెణుకుల బాధ
మృదువైన మూలపదార్థము వల్ల
ఉపయోగించుట సులభము
క్రొత్త కార్కు అమరిక వల్ల
మందు శక్తి రక్షణ
AMRUTANJAN
Pain Balm
అమృతాంజన్
ఏ ఇతర బాధలు కల్గించని
శీఘ్ర నివారిణిని నమ్మండి
Amrutanjan Limited
OBM 8777 TG

గొంతులో నే గద్గదకట్టి పోయాయి.

రోడ్డుదాకా మమ్మల్ని సాగనంప డానికి వచ్చిందామె. పిల్లలకు బాగా చదువు అబ్బు తూందనీ, బుద్ధిమంతులనీ చెబుతూంటే ఆమె కళ్లల్లో కొత్త జీవం కన్పించింది.

ఆ ఫోటో లోంచి పండరి అంతా వింటూన్నాడేమో! అందుకనేనా ఆ కళ్ళలో ఆ తృప్తి! అన్పించింది.

నా చేయి జేబులో తటపటా యిస్తోంది. ధైర్యం చేసి వంద రూపాయల నోటు తీసేను. "ఉంచమ్మా- పిల్లల కేమైనా కొని పెట్టు-"

ఆమె భయపడినట్టు చేతులూపుతూ వారించింది- "వొద్దు- వొద్దు నాయినగారూ."

"నాయినగారూ!" తల కొట్టేసినట్టైంది నాకు- "తీసుకోమ్మా- ఫర్వాలేదు- నీ బిడ్డలాంటి వాణ్ణే నేనూ-"

"తప్పు నాయినా- నువు యాదికి బెట్టుకుని వచ్చుకమే జాలు- నీ కెందరు బిడ్డలు సాయినా?"

చెప్పేను ఇంకా పెళ్లి చేసుకోలేదని- మళ్లీ అర్థించేను.

ఆమె చాలా మృదువుగా మాట్లాడింది గాని స్థిరంగా తిరస్కరించింది.

ఏం చెయ్యాలో తెలీలేదు. వ్రేళ్ల మధ్య ఆ వంద రూపాయల నోటు తిరస్కృత సుందరిలా బుసకొడ్తూంది.

హోటలుకు వచ్చేశాము- అపరాధుల్లా- మౌనంగా- తలలు వొంచుకునే.

నా మనస్సులో ఆ వృద్ధభిక్షుకి మెదలింది. కట్టుకున్న వాడు వొదిలేస్తేనో – కన్న బిడ్డలు పట్టించుకోక పోతేనో – ఆత్మాభిమానం చంపుకుని జీవిక కోసం యాచనకు సిద్ధపడ్డ దొక స్త్రీ-

కన్న తండ్రి కన్ను మూసి, కన్నతల్లి గాలికి పిల్లల్ని వొదిలి వొంటి సుఖం చూసుకోగా- వృద్ధాప్యంలో యే అగచాట్లు పడుతూ ఆ పిల్లల్ని పెంచుతూందో గాని, అయిన వారి నుంచి సానుభూతిని మాత్రం స్వీకరించి- ధనాన్ని తిరస్కరించింది మరో స్త్రీ!

ఆ రాత్రి నాకో చిత్రమైన కల వచ్చింది. తొలిసారిగా నా తల్లి కన్పించింది. నాలాగే ఆమె పొడుగరి. కన్నూ ముక్కూ చెవీ- కవళికలు- రంగూ- నాలాగే వుంది. అయితే ఆమె తలపైన జుత్తు బదులు పాపిటికి రెండు వైపులా పెంకులు కప్పి వున్నాయి. ఆమె గుండె మీద సగం విరిగిన తలుపులతో తెరచిన ద్వారం వుంది. చేతులూ- బుజాల మీద- మొండి గోడల మీద మొలచినట్టు పలచగా గడ్డి మొలచి వుంది. అక్కడక్కడ ఎముకలు కొద్దిగా బైటికి వెళ్ళు కొచ్చేయి.

ఆ కలకు అర్థం యేమిటో గాని నా మనసు వికల మైంది.

మిగిలిన వారం రోజుల్లో మరి కొందరు మిత్రుల్ని కలుసుకున్నాను.

ఆదివారం నాడు వెళ్లి పండరి పిల్లల్ని చూసి వచ్చేను. చెరొక రెండు జతల బట్టలు కొని యిచ్చేను. ఈ సారి మాత్రం ఆ అమ్మ కాదనలేక పోయింది.

తిరుగు ప్రయాణానికి ముందు ఎందుకనో అన్పించింది. వెళ్ళే ముందు మరోసారి ఆ వృద్ధ భిక్షుకిని చూడాలన్పించింది. "బిడ్డా!" అన్న మాట ఆ నోటితో మరో మారు అన్పించు కోవాలన్పించింది.

ఆ మాటే ఖదీర్‌తో అన్నాను- "ఒక్కసారి చూడాలన్పిస్తోంది ఖదీర్‌భాయ్"

సానుభూతితో తల పంకిస్తూ అన్నాడు ఖదీర్- "ఎక్కడుందో- ఏ ఫుట్‌పాత్ మీద కన్ను మూసిందో! అనారోగ్యం పాలైందో యేమొ- ఎండకూ వానకూ చలికీ గురయ్యే ఆ శరీరం ఎంత కాలం మనుతుంది!?"

నా కెందుకనో మరో నాలుగు రోజులు వుండి వెళ్లా మన్పించ సాగింది. ఉన్నట్టుండి ఆ ఆలోచన యెందుకు వచ్చిందో! తటపటా యిస్తూనే ఆ మాట ఖదీర్‌తో అన్నాను.

అతను తృళ్లిపడ్డట్టు కన్పించేడు- "నీ కేమైనా కాలేదు గదా!" అన్నట్టు చూశాడు వా వైపు- "నా ప్రోగ్రాం అయితే ఫిక్స్ అయిపోయింది. నీ యిష్టం- నువ్వీ మాట ముందే అని వుంటే నేను ఫ్లైట్ తీసుకునే వాణ్ణి-"

మిత్రు లందరం కలసి భోజనం చేసి నాంపల్లి స్టేషనుకు బయల్దేరాం- రాత్రి తొమ్మిది గంటలకు బొంబాయి ఎక్స్‌ప్రెస్- ఈ సారి ఖదీర్‌భాయ్ కూడా నాతో బాటు రైల్లో ప్రయాణం చేయడాని కంగీకరించేడు.

నాంపల్లి స్టేషను దగ్గర గుండ్రటి ఆ చమన్ దగ్గరకు రాగానే ఆ గొంతు మళ్లీ విన్పించింది. "బాబా- దేవుడు మీకు మేలు చేయాలి- ఈ దీనురాలిపై కనికరం చూపండి బాబా-"

నా కాళ్ళు మంత్రం వేసినట్టు ఆగిపోయాయి. అటు వేపే చూస్తూ నిల్చుండి పోయాను. నా చేయి జేబులో తగిలిన ఒక కరెన్సీ నోటును పట్టుకుని

నాగరికతారణ్యం

ఇది అరణ్యం
మానవతా వసంతం
పోగొట్టుకున్న జనారణ్యం!
నాలుకల మీద ప్రేమ శోధాలు
నిర్మిస్తున్న నటనారణ్యం!
పలకరింపుల మధ్య
కరచాలనాల మధ్య
కరెన్సీ ధ్వనులు వింటున్న
కర్ణ శ్రవణారణ్యం
అన్నా! ఇది సర్వ కల్మషవాహిని!
మూసీ నదితో సమానిని!!

– "కోవెరా"

సిద్ధంగా వుంది.

మా వేపు వస్తుందేమోనని చూస్తున్నాను.

ఆమె చీదరించి కొడ్తూన్న ఒక ప్రయాణీకుడ్ని యాచిస్తూ వెంటబడు తూంది.

రవి నన్ను గమనిస్తున్నట్టున్నాడు- "పద పద- ఆ ఛీట్‌కి దానం చెయ్యకపోతే నీ కొచ్చే పుణ్యమేమీ జారి పోదులే-"

"ఛీట్!" నాకు కష్ట మన్పించింది- "మరీ అంత నిర్దయగా మాట్లాడకు రవీ- ఎవరి భాగ్యం ఎప్పుడెట్లా మారుతుందో ఎవరు చెప్పగలరు."

ఇంతలో రాంరెడ్డి అందుకున్నాడు- "రంజాన్ నెలగదా- బాబా ఫోటో ఒకటి చేతబట్టింది. సెంటిమెంట్‌ని టికిల్ చేసి డబ్బు లాగడానికి-"

క్రిస్టోఫర్ కూడా నవ్వేడు గానీ ఆ నవ్వులో కొద్ది సానుభూతి ధ్వనించింది. "చేదుగా వున్నా నిజమే అది" అన్నట్టుంది ఆ నవ్వు.

ఆ మనిషిని గురించి అటువంటి మాటలు వినడానికి- నమ్మడానికి మనస్సు తిరస్కరిస్తూంది.

'నో నో నో- ఆమె అట్లాంటి మనిషి కాదు. ఆమె పరిస్థితి యేంటో! జీవితంలో ఏ వొడిదుడుకులు- ఏ నిర్దాక్షిణ్యమైన మలుపులు యిట్లా యాచనకు దిగజార్చేయో! ఎవర్నించి. ఎందర్నించి. ఎట్లా దగా పడిపోయిందో!' – నేను. అనాలనుకున్న మాటలన్నీ వాళ్ల చెవిన బడటం తమకిష్టం లేదన్నట్టు గొంతులో నే అణగిపోయాయి.

అప్పుడు నా మనసులో ఒక ఆలోచన తళుక్కుమన్నది. నాకు వచ్చిన కలకు 'నిజమైన' అర్థం స్ఫురించసాగింది.

ఆశ్రమం అరుగులపైన అనాథ శిశువుగా ప్రారంభమైన నా జీవితం సంక్షిప్త సారాంశం మనసులో మెదలింది. ఎందరు దాతల దాన ధర్మాలపై ఆధారపడి మేము అనాథాశ్రమంతో బ్రతికేమో, యాచన నుంచి వచ్చిన ఆ ధనం మా జీవితాలకు మార్గం చూపలేదూ! పెంకులు కప్పిన ఆ అనాథాశ్రమం- నా కన్నతల్లి ఆమేకదూ! అన్నార్తులు- అనాథశిశువులను హృదయానికి హత్తుకొన్న ఆ తల్లి గుండె ద్వారం తెరచివున్న మాతృమందిరం కదూ! కన్నతల్లి మా గురించి పదిమందినీ యాచించలేదూ!?

అప్పుడుగాని గుర్తుకురాలేదు. నన్ను 'కని'- పెంచి పెద్ద జేసిన అనాథాశ్రమాన్ని దర్శించుకో కుండానే వెళ్లిపోతున్నాను నేను!

సిగ్గుతో తలవాలిపోయింది నాకు. బిచ్చాలెత్తి నన్నొక గుర్తింపు పొందిన మనిషిగా పెంచిన ఆ పెంకుటింటి తల్లి ఋణం తీర్చుకున్నానా నేను

"రవీ-" కణతలు నిమురుకున్నాను నేను- "నేనొక ముఖ్యమైన పని మరచే పోయాను- నా ప్రయాణం వాయిదా వేసుకోవాల్సి వస్తోంది."

మిత్రులు ఆతృతతో చూసేరు.

ఆ వృద్ధభిక్షుకి అమూల్యమైన కర్తవ్యాన్ని గుర్తు చేసింది. ఏది? ఏది ఆమె

అటూ ఇటూ చూసేను.

బారలు వేసుకుంటూ వెళ్తూన్న ఓ విదేశీ యాత్రీకుని వెంటపడి యాచిస్తూ– పరుగులాంటి నడక నడుస్తూ వెళ్తోంది రాయల్ హోటల్ దిసెగా.

ఆదుర్దాగా అడుగుతున్నారు మిత్రులు.

ఏం చెప్పను? చెబితే అర్థం చేసుకోగలరా.? నవ్వకుండా– నవ్వుకోకుండా వుండగలరా

వీడ్కోలు చెప్పటానికి వచ్చిన బంధు మిత్రుల సమూహంలోంచి ఖదీర్ నన్ను వెదుక్కుంటూ వచ్చేడు.

చెప్పేను. "చాలా ముఖ్యమైన పని ఖదీర్‌భాయ్– మరచిపోయాను. ఆగిపోతున్నాను– సారీ నా నుంచి నీకు అసౌకర్యం అయింది"

"అరరె!!" విస్తుపోయాడు ఖదీర్– "అదేంటీ?" అన్నాడు సగం ప్రశ్నగా సగం ఆశ్చర్యంగా.

ఇక ఎక్కువ వివరించలేదు నేను. ట్రెయిను కదిలిందాకా. అన్యమనస్కంగానే అతనేకి కంపెనీ యిచ్చేను.

"అయితే ·యింతకీ ఎప్పుడొస్తున్నట్టు?–" ట్రెయిను కదిలేక అడిగేడు ఖదీర్.

"నీకు జాబు రాస్తాను" అన్నాను చేయి వూపుతూ.

మిత్రులతో కలసి తిరుగుముఖం పట్టేను.

రాయల్ హోటల్ మూల నుంచి ఆబిడ్స్‌కు పోయే మలుపు దగ్గర జంక్షన్‌లో ట్రాఫిక్ స్తంభించి పోయివుంది.

జనం గుమిగూడి వున్నారు. మేము వెళ్ళి చూశాము.

"రోడ్డు దాటుతూ డబుల్‌డెకర్ కిందపడి పోయింది–" చెబుతున్నాడో వ్యక్తి.

"మొత్తం శరీరం నజ్జునజ్జైపోయింది– ముఖం గూడా ఆనవాలు తెలీడంలేదు–"

ఆదుర్దాగా నలుగురైదుగుర్ని నెట్టుకుని వెళ్ళి మునుగాళ్ళపైనిల్చుని చూసేను.

షాకే యిస్తూ– నీడలతో నెత్తురుతో కలిసి పోయిన ఆ బురఖా కన్పించింది. వృద్ధ భిక్షుకి– ఐదూ పది పైసలిచ్చిన ప్రతి వ్యక్తికీ 'దేవుడు మీకు మేలు చేయా'లంటూ అమూల్యమైన దీవెనల్నిచ్చిన వృద్ధభిక్షుకి

"ఓ గ్యాడ్! ఓహ్– మైగ్యాడ్!!"

ఆ చేతుల్లోంచి జారిపోయిన డబ్బాలో నుంచి నాణేలు చెల్లా చెదురుగా పడిపోయాయి– 'ఇక వీటి విలువ ఎంతో మీరే చూసుకోండి' అన్నట్టు.

ఆమె నిర్జీవహస్తాలు కాబా ఫొటోను మాత్రం గట్టిగా పట్టుకునే వున్నయ్– యీ స్థూల ప్రపంచాన్ని కతాను నమ్మనంటున్నట్టు.

మిత్రులు గూడా నివ్వెర పోయారు.

అరగంట సేపట్లోనే మా విమర్శలనూ– పరిహాసాన్నీ మా ముఖాలపైకే గిరాటేసి నెత్తురుచుక్క లేకుండా చేసి పోయింది నెత్తుటి ముద్దైన ఆ బురఖా తల్లి!

* * * * * *

ఎవరినీ వెంట తీసుకెళ్ళకుండా నేనొక్కణ్ణే నా పెంపుడు తల్లిని చూడటానికి వెళ్ళేను.

అంత దూరం నుంచి చూడగానే నా కళ్ళు మసక బారేయి.

సగం పగిలి పోయిన పెంకులూ– బెచ్చెలు బెచ్చెలుగా సున్నం గచ్చురాలిపోయిన గోడలూ ఆ స్థితిలో వుంది– వృద్ధాప్యంలో నాలాంటి బిడ్డలు ఆదుకోకుండా వొదిలేసిన ఆ తల్లి:

అనాధలు, అభాగ్యులు, మాతృహీనులు, కన్నతల్లి మోసానికి గురైన చిన్న పిల్లలు– అందరినీ– 'అంతా నా పిల్లలే' అంటూ చేరదీసే అనాధమాత– తాను స్వయంగా అనాధలా దీనంగా– దిగ్విహీనంగా కన్పిస్తోంది.

నేను తిరిగి అమెరికా ఎందుకు వెళ్ళాలో అర్థం కాలేదు. ఎందుకు వెళ్ళకూడదో మాత్రం అర్థమవుతూన్నట్లన్పించింది.

'యాచన చేయడం ఎవరికీ సంతోషదాయకమైన పనికాదు బాబా– బిచ్చగాళ్ళలో నూటికి ఎనభైమందైనా ఆ వృత్తిని చివరి మార్గంగా చూసుకున్న వాళ్ళే– వాళ్ళలో యింకా మనుష్య స్వభావం– ఉహుఁ– మానవత్వం– మిగిలిపోయింది కనుకనే దొంగలు కాకుండా, హంతకులు కాకుండా– యాచకులుగా స్థిరపడిపోయారు. బాబా– ఒకసారి పరీక్షగా వాళ్ళ కళ్ళల్లోకి చూసి చూడు– చనిపోయిన ఆత్మాభిమానపు నిర్జీవకళ ఎట్లా కొట్టొచ్చినట్టు కన్పిస్తుందో! 'మేం నోచుకోని వాటికి మీరైనా నోచుకోండి' అంటూ కారు చౌకగా వాళ్ళు మీకు ప్రసాదించే దీవెనలలో మోసం విన్పిస్తోందా– నిస్సహాయుల ఘోష ధ్వనిస్తోందా?....

ఆకాశంలో ఎక్కణ్నుంచో– అశరీరవాణిలా ఆ తల్లి అంటూన్నట్టు– ఆ మాటలు నా గుండెలో మారు మ్రోగుతూనే వున్నయ్.

శుష్కమైన మనస్సుతో నాలుగు రోజులు ఎటూ కదలలేక పోయాను.

శనివారంనాడు బొంబాయి వెళ్ళాల్సిన వాణ్ని– మరుసటి శనివారంనాడు దేవాలయం నుంచి సరాసరి కవాటీగూడా వెళ్ళేను.

ఈ సారి పండరి పిల్లలు యింటి ముందే కన్పించేరు– స్కూలుకు వెళ్ళకుండా దిగాలుగా పడ్డ మొగాలతో.

వాకబు చేస్తే తెలిసింది– వాళ్ళ నాయనమ్మ– పండరి తల్లి– ఎటు పోయిందో తెలీదు– వారం రోజులైంది జాడ తెలీక! ◘



న్యాయపీఠం



బి.బి.రావు. ఎమ్.ఏ.ఎల్ఎల్.బి.

భార్యకు తాత్కాలిక భరణం ఇవ్వాలి

ఢిల్లీలోని మేజిస్ట్రేట్ కోర్టులో సావిత్రి తన భర్త అయిన గోవిందసింగ్‌పై తన పోషణ కోసం ప్రతి నెలా భరణం చెల్లించాలని దావా వేసింది. అంతే కాకుండా దావా పరిష్కారం కావటానికి కొంతకాలం పడుతుంది కనుక తాత్కాలిక భరణం మంజూరు చెయ్యవలెనని మరో పిటిషన్ పెట్టుకున్నది. కానీ ఈ పిటిషన్‌ను మేజిస్ట్రేట్ తిరస్కరించారు. దానిపై సావిత్రి సుప్రీమ్ కోర్టు వారికి అప్పీలు పెట్టుకున్నది.

క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని 125 సెక్షన్‌లో తాత్కాలిక భరణం మంజూరు చేయాలనీ లేదు. కానీ తాత్కాలిక భరణం మంజూరు చేయకూడదని కూడా లేదు అని సుప్రీమ్ కోర్టువారు అభిప్రాయ పడ్డారు. 125 సెక్షన్ ప్రకారం ఎవరైనా తన భార్యను పోషించడానికి నిరాకరించినా లేదా తన పిల్లలను పోషించడానికి నిరాకరించినా లేదా తన పిల్లలు మెజారిటీ తీరినప్పటికి అంగ వైకల్యం కలిగి ఉన్నచో అట్టి పిల్లలను పోషించడానికి నిరాకరించినా లేదా తండ్రిని గాని, తల్లినిగాని పోషించడానికి నిరాకరించినా అతను నెలకు ఐదు వందల రూపాయల వరకు భరణం చెల్లించాలని మేజిస్ట్రేటు ఆర్డరు జారీ చేయవచ్చును. కానీ 125 సెక్షన్ క్రింద పెట్టుకున్న అప్లికేషన్లు పరిష్కారం జరగటానికి కొన్ని నెలలు పడుతుంది. అంతవరకు తనను తాను పోషించుకోలేని దరఖాస్తుదారు బ్రతికి ఉండాలికదా, అందుచేత తాత్కాలిక భరణం మేజిస్ట్రేటు మంజూరు చేయవచ్చును. తాత్కాలిక భరణం మంజూరు చేయడానికి గల కారణాలు వివరిస్తూ దరఖాస్తుదారునకు ఒక ఎఫిడవిట్ దాఖలు చేసుకోమనవచ్చును. దానిపై మేజిస్ట్రేట్ తాత్కాలిక భరణం మంజూరు చేయవచ్చును. ఎఫిడవిట్‌లోని కారణాలు నిజంకావని మేజిస్ట్రేట్‌కు తోచినపక్షంలో తాత్కాలిక భరణం ఎప్పుడైనా నిలుపు చేయవచ్చును. 125 సెక్షన్ క్రింద మేజిస్ట్రేట్‌కు ఈ అధికారం ఉన్నదని 1986 లో సుప్రీమ్ కోర్టు వారు తీర్పు చెప్పారు. ◘

సీరియల్

ఆడపిల్లలు - అనుభవాలు

హరికిషన్

(గత సంచిక తరువాయి)

ప్రేమకు నీరాజనం:

ఇంటికి వచ్చాక జగదాంబ కొడుకుని కేకలేసింది.

శ్రీవిద్యకు కూడా అన్నగారి పద్ధతి నచ్చలేదు "తెలివితేటలు నీ ఒక్కడి సొంతమే కాదురా. అందరికీ వుంటాయి. డిగ్రీ తెచ్చుకున్న అమ్మాయితో మాట్లాడే విధానం ఆదేనా" అన్నది జగదాంబ.

'అమ్మా' నువ్వు మనస్సులో ఏదో ఊహించుకొని తప్పంతా నాదేనని అనటం నేను సహించలేను. కట్నం పారేసి ఓ మొగుణ్ణి కొనుక్కుందామనే ధీమాతో ఉన్న దామ్మాయి. ఆ అర్భకుడిని నేను దొరికాను ఆ మాటల పొగరు విన్నావుకదా, పెద్ద కట్నం వస్తుందనే ఆశ నీకు వుండొచ్చు, కాని అంతటి గడుగ్గాయిని చేసుకోవలసిన అవసరం నాకులేదు. నాక్కావల్సింది నేను మెచ్చిన, నన్ను మెచ్చిన పిల్ల కాని, కట్నం తెచ్చే కొరకంచు కాదు" అన్నాడు.

మానసిక వ్యధతో గోడకానుకున్నావిడ. శ్రీవిద్య వైపు చూస్తూ కన్నీరు పెట్టుకున్నది

అన్నయ్యా, నా మాట ప్రకారం నడుచుకోవాలని చెప్పటంలేదు. విని ఆలోచించమని కోరుతున్నాను కట్నం లేకపోయినా నువ్వు కోరుకున్నమ్మాయిని నువ్వు పెళ్ళిచేసుకోగలవు. కాని కట్నం తీసుకోకుండా ఏ వరుడూ నన్ను పెళ్ళిచేసుకుంటాడనే నమ్మకం నాకు లేదు. నాకు మాటల్లో, భావాల్లో, మనస్సులో అందం ఉన్నది కాని, చూడముచ్చటవేసే అందం నాకు లేదు. ఖరీదు చేసి భర్తను కొనుక్కోవలసిందే కాని, నన్నెవరూ ప్రేమించి పెళ్ళిచేసుకోరు. అంత డబ్బు మనకు లేదుకనక, నీ భాషప్రకారం నువ్వు ఎవరికన్నా అమ్ముడుపోయి, ఆ డబ్బు తెచ్చుకొంటి, నాకు అన్నగారయిన పాపానికి, ఈ అర్భకురాలయిన చెల్లెలికి ఓ భర్తని కొని, ఈ కన్యచెర వదిలించుకోవచ్చు. అన్నయ్యా' ఆదర్శాలు అచ్చులో బావుంటయ్యిగాని, ఆచరణకు సాధ్యపడేవికావు" అన్నది శ్రీవిద్య.

ఖిన్నుడై చూసేడు జగదీష్ జగదాంబ వెక్కుతూ కూర్చున్నది.

"అమ్మా! ఇప్పుడు ఏమైందని ఈ ఏడుపు. నేను కట్నం లేకుండా ఎవర్నో పెళ్ళిచేసుకుంటానని డిక్లేర్ చెయ్యలేదే ఎందుకీ గోల. ఛీ ఛీ అందరూ నా మనస్సు మీద దాడిచేస్తున్నారు" అన్నాడు జగదీష్.

*   *   *   *   *

రెండు రోజులు గడిచాయి. అమ్మాయి జానకిని చేసుకోనని గట్టిగా చెప్పేశాడు జగదీష్ యూనివర్సిటీలో లాస్ట్ టరమ్ ఫీజు, ఎగ్జామినేషన్ ఫీజు, ఫలాని తేదీలోగా కట్టాలని నోటీసు వేశారు. ఇన్ని రోజుల నుంచీ, యూనివర్సిటీ కాంపస్‌లో, క్లాస్ రూంలో, అక్కడ కూడా అభిలాష్ జగదీష్‌కు ఎదురుపడుతున్నా, అభిలాష్ అటు చూస్తూ పలకరించకుండానే. వెళ్ళిపోతున్నాడు. జగదీష్ పలకరిద్దా మనుకున్నా అతను అవకాశం యిచ్చేవాడుకాదు.

నోటీస్ బోర్డులో ఆ నోటీసు వేసిన మర్నాడు జగదీష్ వస్తుంటే, గేట్లోనే అభిలాష్ ఎదురుపడి, ముఖం పక్కకు తిప్పుకుని "మిస్టర్, యిదిగో టరమ్ ఫీజ్, ఎగ్జామినేషన్ ఫీజ్" అని యివ్వబోయాడు. జగదీష్ తీసుకోలేదు. అభిలాష్ చెయ్యిపుచ్చుకుని......

"బ్రదర్ నాకు కావాల్సింది నీ ఆదరణ, ఆప్యాయతే, అటువంటి సద్భావంతో యిచ్చిన డబ్బే నేను తీసుకొంటాను గాని, విరోధభావంతో యిచ్చే డబ్బు నాకు అక్కర్లేదు. థాంక్స్" అని వెళ్ళిపోయాడు.

అభిలాష్ మాట్లాడలేదు. అట్నుంచే పోస్టాఫీస్‌కు వెళ్ళి ఆ డబ్బు జగదీష్ పేర మనియార్డర్ చేసేడు.

మర్నాడు జగదీష్‌కు ఆ మనియార్డర్ వచ్చింది. పోస్ట్‌మేన్ తెచ్చాడు. జగదీష్ మనియార్డర్ తీసుకోలేదు. రెఫ్యూజ్‌చేశాడు. పోస్ట్‌మేన్ వెళ్ళిపోయాడు. ఆ మర్నాడు ఆ డబ్బు మళ్ళీ అభిలాష్‌కే చేరింది. "పొగరు తలకెక్కింది. ఆల్‌రైట్" అనుకున్నాడు అభిలాష్.

జగదీష్ మథనపడుతున్నాడు. తల్లి అడిగినా ఏమీ చెప్పలేదు. నిరాశగా ఉండేవాడు. కాని పట్టుదలగా ఎక్కడికీ వెళ్ళకుండా ఇంట్లోనే వుండి చదువుకొనేవాడు. మధ్యమధ్య అభిలాష్‌తో అతని స్నేహపు తీపి గుర్తులు నేమరువేసుకునేవాడు. మనస్సులో నవ్వుకునేవాడు. ఓ చిరిచాప, జంపకాణ చుట్ట, దుప్పటి... కాలేజి నుంచి వచ్చాక ఎక్కడికీ వెళ్ళటంలేదు. చదువూ, ఆలోచనా అంతే.

శ్రీవిద్య పరిస్థితిని అర్థంచేసుకున్నది. "అన్నయ్యా, అట్లా వుంటున్నావేం? ఫీజులు కట్టేశావా, నీతో విరోధం పెట్టుకున్న అభిలాష్ యిక డబ్బు యివ్వడుకదా" అన్నది.

పేలవంగా నవ్వేడు.

"చూడూ, నా జీతం విషయం మానేసి, నువ్వు చదువుకో. ముష్టెత్తుకుని ఫీజు కట్టుకుంటాను. మనిషి విరోధాన్ని పెంచుకున్నప్పుడు, ఆ డబ్బు మాత్రం ఎందుకు తీసుకోవాలి? నా పేర మనియార్డర్ చేశాడు, త్రిప్పికొట్టేను. రాస్కెల్ నాతో మాట్లాడడు కాని, డబ్బిస్తాట్ట ఫీజుకట్టటానికి. ఇడియెట్" అన్నాడు కోపంగా.

"పేదవాడి కోపం పెదవికి చేటు అని పెద్దబాలశిక్షలోనే చెప్పేరు. చిన్నప్పట్నుంచీ ఆ విషయం తెల్సుగా" అన్నది.

"చూడూ, నాకివన్నీ చెప్పక్కర్లేదు, నా బాధ నేను పడతాను, పడగలను, నీ సలహా నాకు అనవసరం" లేచి వెళ్ళబోయాడు. అతని చెయ్యిపట్టుకున్నది శ్రీవిద్య.

"డియర్ బ్రదర్! ఆవేశం పనికిరాదు. నవ్వు ఎవరినో ప్రేమించినట్లు నాకు తెలుసు. ఎవరా పాప?"

జగదీష్ కోపం తారాస్థాయికి వెళ్ళింది. చెల్లెలు దవడ వాయించాడు. అయిదువేళ్ళూ తేలాయి ఈ హఠాత్ సంఘటనకు విభ్రాంతురాలయింది. అన్నగారిలో యింతకోపం ఎప్పుడూ చెల్లెలు చూడలేదు. అభిమానం వెల్లువలా పొంగింది. వయసొచ్చిన తను చిన్నపిల్లలా అన్నగారిచేతిలో దెబ్బలు తిన్నది.

జరిగిన కథ– 5: అభిలాష్, జగదీష్‌ల మధ్య మనస్పర్ధ ఏర్పడుతుంది. జగదీష్ సత్యభామ, సావిత్రిల దగ్గరికి రాయబారం వెళతాడు సత్యభామ జగదీష్ పైన ఇష్టం కలిగిందని చెపుతుంది సావిత్రి అభిలాష్‌ను నిరాకరిస్తుంది. మనస్పర్ధ కారణం కనుక్కోవడానికి వచ్చిన శ్రీవిద్యను అభిలాష్ అవమానిస్తాడు. చదువు మానేస్తానంటాడు. జగదాంబ జగదీష్‌కు పెళ్ళి చేయాలని తొందరపడుతుంది పెళ్ళిచూపులకు తీసుకెళుతుంది

అభిజాత్యం, అవమానం వెన్నుచరిచాయి. కళ్ళు చెమ్మగిల్లి ఎర్రబడినయ్యి.

"అన్నయ్యా, చాలు నీ సంస్కారం. ఇంత దిగజారిపోతావని ఊహించలేదు. కాలేజీ ఫీజు, యూనివర్సిటీ పరీక్షల ఫీజు కట్టుకోడం చేతకాదు. ఆర్థికంగా చితికిపోయినా ఆవేశం కోటికి పడగలెత్తింది. కట్నం యిచ్చి పిల్లనిచ్చి పెళ్ళిచేస్తాను బాబూ, అంటే ఆ పిల్లను అడ్డదిడ్డ ప్రశ్నలు వేసి. నీ అహంభావాన్ని నిరూపించుకొన్నావు. అన్నయ్యా వెరీగుడ్, వెరీనైస్. నన్ను దవడలు వాయించేటంత అధికారం నీ కున్నప్పుడు, మంచి సంబంధం చూసి నాకు పెళ్ళిచెయాల్సిన బాధ్యతా నీ కున్నది. ప్లీజ్ అయిదారు నెలల్లో నాకు పెళ్ళిచేసతీరాలి." ఆవేశంగా అన్నది శ్రీవిద్య.

మ్రాన్పడిపోయాడు. గోడవారన కూర్చొని తల్లి చూస్తున్నది. అవమాన భారం ఆవిడను దహించివేసింది.

"జగదీష్! నువ్వు యింత ప్రతాపవంతుడివి అవుతావని నాకు తెలీదురా. భేష్! పద్దెనిమిదేళ్ళ వయసొచ్చిన చెల్లెల్లిమీద చెయ్యిచేసుకున్నావే. చాలా బాగుంది. సరే నీ పెళ్ళి నీ యిష్టం వచ్చినట్లే చేసుకో. దానిపెళ్ళి నా యిష్టం వచ్చినట్టు జరిగితీరాలి" అన్నదావిడ.

బయటకి వెళ్ళిపోయాడు జగదీష్. రోడ్డువెంట నడుస్తున్నాడు. ఏం చెయ్యటానికీ తోచటంలేదు. ఆలోచన ఘనీభవించింది. అభిమానం గడ్డకట్టింది. పరిస్థితులు యింకా యింకా తనని అవమానపరుస్తున్నయ్యి.

అప్రయత్నంగానే అతను సత్యభామ యింటి దగ్గరకు నడిచి వెళ్ళేడు. తల ఎత్తి చూసేడు. వరండాలో సత్యభామ.

"రండి జగదీష్‌గారూ కూర్చోండి! అట్లా ఉన్నారేం? వాటీజ్ దట్ ప్రాబ్లం?" అన్నది. అతను కూర్చున్నాడు. అప్పుడే తండ్రి కూడా కార్లో వచ్చాడు. ఆయనా పలకరించాడు. బాగా చదివి క్లాస్‌లో ఫస్టుగా రావాలన్నాడు. తనతో ఏదన్నా పని ఉంటే చెప్పమన్నాడు. తన ఆఫీస్ రూం లోకి వెళ్ళిపోయాడు. ఇద్దరూ ఏం మాట్లాడాలో తోచక కూర్చున్నారు. ఉన్నట్టుండి అన్నాడు జగదీష్ "ఆడపిల్లకు మెంటల్ మెచూరిటీ ఎప్పుడు వస్తుంది? కొంతమంది ఆడపిల్లలు టీన్ ఏజ్ లో నే ఆరిందాలా మాట్లాడుతారు ఎందుకని?"



నవ్వుతూ కూర్చొంది సత్యభామ.

"ఆడపిల్లకు స్వాభావ సిద్ధమైన ఫిజికల్ మెచ్యూరిటీ వచ్చాక సిగ్గు ఆవేశిస్తుంది. అది కూడా స్వభావ సిద్ధ మైనదే. ఆ సిగ్గు దొంతర్లే సద్భావాలతో మనస్సులో ప్రవేశించి నప్పుడు మానసికంగా స్పందన ఏర్పడి, విచక్షణా భావం చోటు చేసుకొంటుంది. ఆ విచక్షణ కూడా సక్రమ మైనదే అయితే, ఆ భావ తరంగాలు జీవన గమనాన్ని స్పృశించి యుక్తా యుక్త విచక్షణా జ్ఞానాన్ని పెంచుతయ్యి. అప్పుడే వయస్సుకు మించిన తర్క వితర్కాలతో, సద్విమర్శతో ఆ పిల్ల మాట్లాడు తుంది. వీటన్నింటికీ కీలక మైనది అవగాహన, సద్భావం. ఈ అవగాహన, సద్భావం కూడా వయస్సుతో పాటు పెరిగి భేషజం వైపుగా పయనిస్తే ఎగోయిజం ఎక్కువ అవుతుంది. అదే అహంకారం. మరో రకంగా ఈ సద్భావానికి, ఆర్థిక ఇబ్బందులూ ఎదురైతే, ఆ ఆడపిల్లలు పెద్ద ఆరిందాలా కూడా మాట్లాడతారు. ఇంతకీ ఎవరా అమ్మాయి" అన్నది.

"మీరే సత్యభామగారూ!"

చిన్నబుచ్చు కుంటుందేమో అనుకున్నాడు. కాని గలగల నవ్వింది.

"గోదావరిలా నవ్వేస్తున్నారు" అన్నాడు.

"లేదు. కావలం గంభీరంగానే ఉంటాను. నా వయస్సు ఆఖరి టీనేజ్ దాటి ఠండెళ్ళయింది. నాకు అహంభావం, లేదు, నేను ఎవరి మీదా రాయి విసరను. ఎవరయినా నా మీద ఒక్క గడ్డ వేస్తే, నేను పది రాళ్ళు విసుర్తాను. దటీజ్ ది మెంటాలిటీ ఆఫ్ దిస్ సత్యభామ" అన్నది

"అయితే మీ మంచితనాన్ని ఫిక్సెడ్ డిపాజిట్‌లా వాడుకో మంటారా" అన్నాడు.

"ఫిక్సెడ్ డిపాజిట్‌కి పీరియడ్ ఉంటుంది. అక్కర్లేదు. కరెంట్ ఎకౌంట్‌లా వాడుకోండి. కాని ఒక్క షరతు."

"చెప్పండి. ఆచరణ యోగ్యమైతే పాటిస్తాను."

"అభిలాష్‌ని పెళ్ళి చేసుకోమనే ప్రస్తావన ఎన్నడూ తీసుకు రావద్దు" అన్నది.

"దట్సాల్ రైట్, అట్లాగే."

"ఎంత డబ్బు కావాలి? మీరు టరమ్ ఫీజు, ఎగ్జామినేషన్ ఫీజు కట్టలేదని నాకు తెల్సు.

ఆ మాటలో స్వచ్ఛత, ఆప్యాయత, సహాయం చెయ్యాలనే భావం వెల్లడయినయ్యి. అయిదొందలు అడిగాడు. ఇచ్చింది. కృతజ్ఞత చెప్పి, నమస్కరించి వెళ్ళేడు.

అతను వెళ్ళాక తండ్రి అన్నాడు–

"అతనంటే నీకు ఇష్టమేనా, సత్యా.

"సానుభూతి, పావర్టీ ఒక్కోసారి ఆప్యాయతను పెంచుతుంది." అన్నది. ఆయన మరేమీ మాట్లాడ లేదు.

జగదీష్ ఫీజు కట్టేశాడు. రశీదు తెచ్చి శ్రీవిద్యకు చూపించాడు. ఆలోచిస్తూ అన్నగారి వైపు చూసింది.

'డబ్బు ఎక్కడిది."

"రిజర్వు బ్యాంక్ వాళ్ళు అప్పిచ్చారు."

"కాదు. ఎవరినో అడిగి తెచ్చావ్. ఆ వ్యక్తి ఎవరు?"

"నీకు అనవసరం. చెప్పవలసిన బాధ్యత ఉన్నా అవసరం లేదు."

నవ్వింది శ్రీవిద్య.

"అన్నయ్యా! నాకూ కాస్త బుర్ర ఉన్నది. నేను నీ చెల్లెల్ని. బాధ్యత గుర్తు పెట్టుకుంటే చాలు. ఆ భ్యాంకర్ ఎవరో నువ్వు చెప్పక పోయినా, ఓ పెళ్ళి కావలసిన అమ్మాయి అని నాకూ తెల్సు" అని అవతలకు వెళ్ళింది. ఆశ్చర్య పోయాడు జగదీష్.

రోజులు నడుస్తున్నయ్యి ఫైనల్ ఎగ్జామినేషన్స్ అయినయ్యి. ఈ పరీక్షలతో సత్యభామ, సావిత్రి కాలేజీ కోర్స్. చదువు పూర్తి చేసినట్టే. రిజల్ట్సు వచ్చి పాసయితే పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కూడా పూర్తి చెయ్యాలని ఇద్దరి అభిప్రాయం. కాని పెద్ద వాళ్ళకు ఇష్టం లేదు. పెళ్ళి చెయ్యాలనే వాళ్ళ ఉద్దేశ్యం.

అభిలాష్, జగదీష్ పరీక్షలు కాలేదు. ఇద్దరూ బాగా చదువులోనే నిమగ్ను లయినారు. ఒకరు మరొకరితో మాట్లాడు కోవటం లేదు. ఆ ప్రయత్నమూ చెయ్యటం లేదు.


* * * * *

ఒక రోజున సావిత్రి ఆ పాక ఇంట్లో కుర్చీలో కూర్చుని ఏదో ఆలోచిస్తుంది. కళ్ళు చెమర్చి ఆనంద బాష్పాలు వర్షించాయి. ఒక్కసారి తన మనస్సు విదిలించి ఆలోచిస్తూ కూర్చుంటే జీవితం ఏమిటో గా అనిపించింది.

చెల్లెలు ఆసిరమ్మ చూసింది. అక్కయ్య ఏడుస్తున్నదని తల్లితో చెప్పింది. ఆవిడ గుండెలు బాదుకుంటూ, "నా తల్లే, నీకేం కష్టం వొచ్చిందే?" అని ఖంగారు పడుతూ దగ్గరకు వచ్చింది. ఆ వెనకాలే ఆసిరమ్మ. తండ్రి గేదెలకు గడ్డి తీసుకు రావటానికి వెళ్ళేడు.

"ఏడవటం కాదమ్మా. సంతోషం, ఆనందంతో కళ్ళు చెమర్చాయి' అన్నది సావిత్రి.

గడుసులోకం —బాబు






బాలల్లో సాంగత్య ప్రభావం

హాంగ్‌కాంగ్ నాంగ్‌జియోపిన్ అనే ఒక బాలిక చిన్నప్పటి నుంచే ఇరవై నాలుగు ఘంటలసేపూ పందులతోనే కాలక్షేపం చేయడం వలన సాంగత్య ప్రభావం కారణంగా– పందిలానే చప్పుడుచేయడం, చేతులను కూడా కాళ్ళ మాదిరి నేల మీద అన్ని పందిలాగ నడవడం, బురదలో పొర్లడం మొదలుపెట్టిందని ఈ మధ్య పత్రికలో వార్త వెలువడింది.

మరొకరిని అనుకరించే మనస్తత్వం పసిపిల్లలలో ఎక్కువనే సత్యాన్ని గుర్తించే- పిల్లవాడికి కావలసిన ఉపచారాలను చేస్తూ, పిల్లవాని నెత్తుకొని తిరుగువానిని (కుమారధారుడు) ఎన్నుకునే విషయంలో ఆయుర్వేదం చాలా శ్రద్ధ చూపిందంటే అతిశయోక్తి కానేరదు.

పిల్లవాని నెత్తుకొను వ్యక్తికుండవలసిన గుణాలను వాగ్భటాచార్యులు తమ అష్టాంగ సంగ్రహంలో ఇట్లు తెలిపారు.

అభియుక్తస్సదాచారో
నాతిస్థూలో నలోలుపః
కుమారధారః కర్తవ్యః



తత్రాద్యో బాలచిత్తవిత్
అధార్మికం దురాచారః
స్థూలో వికటగామినమ్
కరోతి లోలుపో బాలం
ఘస్మరత్వేన రోగిణమ్

బాలుని సంరక్షించువాడు– బాలునియందు ప్రేమ కలవాడుగా యుండాలి. సత్ప్రవర్తన గలవాడుగా యుండాలి. మిక్కిలి లావైన శరీరం కలవాడుగా యుండరాదు. తిండిపోతుగానూ యుండకూడదు.బాలునియందు ప్రేమగలవాడు బాలుని మనస్తత్వ మెరిగి ప్రవర్తిస్తాడు. దుష్ప్రవర్తన గలవాడు బాలుని చెడ్డ నడవడిక గలవానినిగా చేస్తాడు. లావైన శరీరం గలవాడు తాను వికారంగా నడుచుట చేత బాలుని గూడా వికారంగా నడిచేవానిగా చేస్తాడు. తిండిపోతుగ నుండువాడుబాలుని కూడా తిండిపోతుగా జేసి రోగగ్రస్తునిగా చేస్తాడు.

ఆయుర్వేద శిరోమణి రాజరాజేశ్వరశర్మ

ఆడపిల్లలు – అనుభవాలు

సంతోసంలో కూడా ఎడు పొత్తాదేటి, ఇంత్తరం సెప్పకు మరి ఏట, ఎందు కేడుత్తున్నావ్, ఎవ్వరన్నా కూత గూశారా, సెప్పు. ఆల్ల మక్కెలిరగదంతాను, ఆళ్ళ జిమ్మడ. నా కూతురు సదూకొన్నది, అట్టాంటి యిట్టాంటిది కాదు, ఎవుడాడు సెప్పు. ఆడి రగతం తీసి నా కొప్పుకు రాసుకుంతను. ఆణ్ణి వొగ్గేది నేదు. ఎవుడాడు?" రౌద్రావతారంతో అన్నది తల్లి రవణమ్మ. విసుపోయి కళ్ళు తుడుచుకున్నది సావిత్రి. "అమ్మా! ఎవరూ ఏమీ అనలేదు సత్యభామ దయవల్ల కాలేజీ చదువు పూర్తయింది. ఇక నా భవిష్యత్తు ఏమిటో అని ఊహించు కుంటున్నాను."

కాస్త తగ్గిందావిడ. ఈసారి కూతురు మనస్సు తనకు అర్థమైనందను కున్నది.

"నువ్వాలోచించేది పెల్లి ఇసయం, అదేగా ఈ ఇశాపట్నంలో నీకు తగినోడిని ఎతిక, ఆడి ముక్కుకి తాడేసి, తోలుకొచ్చి నీకు మూడు ముళ్ళూ వెయిత్తను. సూడూ పేమ సాలా సెడ్డది ఆడపిల్లని సిలకలా కొరికేసి ఎల్లిపోతరు దొంగనాయాళ్ళు పేమ, పేమా అని ఎంటబడే ఎవుర్నీ నమ్మకు. గోడకు పిడకను గొట్టినట్టు కొట్టిపోతారు పేమనేది పెల్లి పందిట్లో పుట్టేదిగాని, కాలేజీలో, పార్కుల్లో పుట్టేదికాదు ఇసయం అదీ, ఉద్యోగాలు కూడా మా డేంజరు పాలల్లో నీళ్ళు కలిపినట్టే, నీ కెందుకు నుకూకో నాలుగు రోజులు పాలబోసే వోళ్ళకు సెప్పానంటే, నచరైన పెళ్ళికొడుకు దొరుకుతడు. ఆ అదంతా నా కొగ్గియ్యి" అని గబగబ అనేసి సావిత్రి కణతలకు తన తల ఆనించి సంతోషంతో మెటికలు విర్చింది రవణమ్మ.

తల్లి మాటలకు మనస్సులో బాధపడింది సావిత్రి చెపితే అర్థంచేసుకునే మనస్తత్వం కాదు కాని చెప్పక తప్పదు.

"నేను పెళ్ళిని గురించీ, ప్రేమను గురించీ ఆలోచించడం లేదమ్మా. చూడమ్మా నామిద నీకు నిజంగా అభిమానం వుంటే, నా పెళ్ళి సంబంధం పాలవాళ్ళకూ, పెరుగువాళ్ళకూ చెప్పొద్దు. నేనూ చదువుకున్నదాన్ని నా మనస్సు ఎటువంటిదో నీకూ తెలుసు. దయచేసి నా పెళ్ళి సంబంధం విషయం ఎవ్వరికీ చెప్పొద్దు." అని తల్లిని బ్రతిమాలింది సావిత్రి.

మూతిముడుచుకుని వెళ్ళింది రవణమ్మ. నెత్తిన గడ్డి మోపు పెట్టుకుని వెనకవుండి ఈ చివరి మాటలు విన్నాడు తండ్రి నర్సయ్య.

"ఇదుగో నా కంతా ఆకలింపయింది. తన ఇట్ట పెకారం నీ పెళ్ళి సేత్తాదంట మీ యమ్మ. నేనేం ఎదవనా దానిమాట యినటానికి. దాని తల్లో జేజెమ్మ లాటోడిని తెత్తాను. ఈ ఇశాపట్నంలో రైలోళ్ళున్నారు. కార్లోళ్ళున్నరు, పెద్దపెద్ద ఇళ్ళోల్లున్నరు, తల్లిసిగదరగ, గడ్డిగోసే నరసయ్య కూతురు సాయిత్రంటే సక్కని సుక్క. సదూకున్నది అని అందరికీ ఎరికే. పాలబూతువాడు, నాకు తెలిసినోల్లకు సెప్పానంటే, నాసామిరంగా, తోడు పెరుగులాంటి సంబందం సెప్పరే పూతరేకు లాంటి సమ్మందం, రెల్లిపువ్వులాంటి సమ్మందం, ఆర్చరులో ఉన్నయంట. మొన్న అప్పిగాడు సమ్మందం సెప్పిండు. ఆ పిల్లగోడు నైటు అవుసులో ఉద్యోగంట సూత్తానన్నడు. వొల్లకోయ్ అట్టాంటి యిట్టాంటి సమ్మందాలు సెప్పకని సెప్పినా. కనక మాలచ్చిమి గుడికాడ, అర్చురు కాంటాక్టరు మేనల్లుడట, ఆల్లకి పాలుబోత్తాలే. ఆల్లో సమ్మందం సెప్పిను ఇదుగో సాయిత్తిరీ నా పెల్లి నా యిది ప్రెకారం కానేదు. నీ పెల్లయినా నా యిట్టప్పెకారం సెయ్యనీ మీ యమ్మ సెప్పేయన్నీ దొల్లుపుచ్చుకాయ సమ్మందాలు నేసెప్పేది యినుకో. ఏటమ్మా! ఆ అదే ఎల్లమ్మతోట్లో ఎంకటసామి కొడుకు ఈరిబాబు. ఆడూ కాలేజీ సదూ పూర్తిజేసిండంట కే. జీ. ఎచ్చ కాడ ఆడికో సాపు వుందంట, బేంక్‌లో డబ్బుందంట. ఎప్పుడూ సెక్కులు కోత్తానే వుంటాడంట. ఆడికసెమ్మాచలంలో అనాస తోటలూ వున్నాయ్యంట! సాయిత్తిరీ యిదే ఇసయం. నే సెప్పినట్టు యినుకో' అని తుండుగుడ్డ దులిపి భుజాన వేసుకుని గొడ్లపాకలోకి వెళ్ళేడు నర్సయ్య.

ఏమీతోచక తల పట్టుకుని కూర్చున్నది సావిత్రి. అసిరమ్మ నవ్వుకుంటూ అపతలకు వెళ్ళింది. అదికాస్త అయోమయం– (ఇంకావుంది)



సుమలత సమాధానాలు

ఓ. యాదగిరి, నంద్యాల కోట

ప్ర మనసె మందిరము అయితే, కడుపు ఏమవుతుంది?

జ : ఫలహార మందిరం.

త్రి భువనేశ్వరి, చాగలమర్రి

ప్ర : నేనూ, త్వరలొనె కాబొయె మావారూ ఏ పార్కులోనో ప్రమాదవశాత్తు స్పర్శించగానే మా ఇద్దరి శరీరాలలో ఏదో విధ్యుచ్ఛక్తి ప్రవహించి నట్లుంటుంది ఆ శక్తితో ఏం చేయమంటారు?

జ : త్వరలోనే మీ ఇంట్లో దీపం వెలిగించండి.

వి. ఎల్. రమాకాంత్, నిడదవోలు

ప్ర : మానవుడు జీవితంలో తప్పు తెలుసుకుని బాగుపడదాం –అనే సమయంలోనే అడ్డంకులు వస్తాయి. ఎందుకండీ?

జ : అది మరో పరీక్ష.

ఆర్. వి. రాజు, గద్వాల

ప్ర : సుమగారూ! పేదలను, శ్రీమంతులను సృష్టించినది భగవంతుడే కదా?

జ : కాదు. భగవంతుడు మనిషిని సృష్టించాడు. మనిషి డబ్బును సృష్టించాడు. డబ్బే పేదరికాన్ని, ఐశ్వర్యాన్ని సృష్టించింది.

దాచేపల్లి పార్వతీదేవి, ఉరవకొండ

ప్ర · కష్టాలను భరించలేక జీవితం మీద విరక్తి చెందితే....?

జ : సూర్యుడు అస్తమించాడని కళ్ళు మూసుకుంటే, నక్షత్రాలను చూసే భాగ్యాన్ని కోల్పోతాము.

కె. అరవిందకుమార్, ఖుర్దారోడ్

ప్ర : నాకు అదృష్టం తలుపు ఎప్పుడు తెరుస్తుందంటారు?

జ : ఆ తలుపుకు గొళ్ళెం వేసి ఉండదు. శ్రమించి తోస్తేనే తెరుచుకునే తలుపు అది.

కోలంక ఉమామహేశ్వరరావు, సిద్దిపేట

ప్ర : మిమ్మల్ని ప్రశ్న లడిగే మేం మేధావులమా లేక, మా ప్రశ్నలకు జవాబులిచ్చే మీరు మేధావులా?

జ : మేధావులకు కలగ వలసిన సంశయం కాదిది.

సి. హెచ్. బ్రహ్మాజీ, బళ్ళారి

ప్ర : ఒక చిత్రం వంద రోజులు ఆడితే శతదినోత్సవాలు చేసుకుంటున్నారు. వంద చిత్రాలకు పైగా నటిస్తే . శత చిత్రోత్సవాలు జరుపుకుంటున్నారు. నేను నా జీవితంలో (విడియోలో సహా) ఇంత వరకు రెండు వేలకు పైగా చిత్రాలు చూసి ఉంటాను. మరి, నేను ఎటువంటి బహుమానానికి అర్హుడ్ని?

జ : కళ్ళజోడు.

వి. కిరణ్‌కుమారి, విజయనగరం

ప్ర : యుద్ధాలు ఎందుకు సంభవిస్తాయి, లతగారూ?

జ : అత్యాశ గల ఫిరంగుల వల్ల, సర్వాధికార వాంఛ గల తూటాల వల్ల.

కొప్పాక కుమారస్వామి, ఏలూరు

ప్ర : ఒక రోజు మాత్రం పలకరించి, ఆ తర్వాత మాట్లాడ్డం మానేసిన యువతి గురించి ఏమనుకోవాలి?

జ : ఆమె తన తొందరబాటునో, పొరబాటునో గుర్తించి ఉంటుందని.

వి. హరనాథ్, మిరియాలగూడ

ప్ర మనకు గాలి, నీరు, వెలుతురు ఇచ్చే పరమాత్ముని ఏకవచనంలోను, మన బాగోగులను పట్టించుకోని రాజకీయ వేత్తలను బహువచనం లోను సంబోధిస్తా రెందు చేత, సుమలతగారూ!

జ : భక్తికి ఏకవచనం, భయానికి బహువచనం సహజమే.

గోరంట్ల నీలకంఠం, ఆలంపూర్

ప్ర దేశసేవ వేషాన్ని ధరించి, జనాన్ని మోసం చేసే వ్యక్తిని ఏమనాలి?

జ : మందికి తగ్గ మహనీయుడు.

బి. శివరామిరెడ్డి, గురజాల

ప్ర. మీరు ఎక్కువగా మహిళల ప్రశ్నలకే జవాబులిస్తారని నేను కనిపెట్టేశానండోయ్!

జ: కొంప తీసి మీరు ఎప్పుడైనా ఏ స్త్రీ పేరుతోనైనా ప్రశ్న పంపారేమిటీ?

వై. జాన్సన్, గుంతకల్లు

ప్ర. పగలు రాత్రికి మల్లే సరి సమానంగా కష్ట సుఖాలుంటాయంటారే- మరి నాకు ప్రస్తుతం కష్టాల పాలే ఎక్కువగా ఉంది. దీనికి మీరేమంటారు

జ: శీతాకాలంలో పగలు కన్నా రాత్రే ఎక్కువ.

ఎం. గౌస్ మొహిద్దీన్, టిక్కలి

ప్ర. మాలాంటి పాఠకుల ప్రశ్నలకు చమత్కారంగా జవాబులిస్తున్నారు. మీరు ఏ బియ్యం వాడుతారు?

జ: బ్రిల్... అది బియ్యం కాదు. నా పేనాకు ఆహారం.

డి. సాయినాథ్, గోకరాజుపల్లి

ప్ర· సుమలతగారూ! ప్రశ్నలకు జవాబులివ్వడం మీకు ఎప్పట్నుంచి అలవాటు?

జ: బడిలో చదువు-కుంటున్నప్పట్నుంచి.

కె. సుధాకరరావు, సిర్పూర్ కాగజ్‌నగర్

ప్ర: పళ్ళు పులుపుగా ఉన్నాయో, తీయగా ఉన్నాయో రుచి చూసి శ్రీరామచంద్రుడికి ఇచ్చిందట శబరి. ఈ కాలంలో అలాంటి వారెవరైనా ఉన్నారా?

జ: ఫిలిమ్ సెన్సార్ బోర్డ్ వారు. ☐

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

సుమలత సమాధానాలు


ప్రశ్న..

....

....

పంపినవారి పేరు..

పూర్తి చిరునామా..




సినిమా విశేషాలు

"బందిపోటు"గా సుమన్

"జనవరి 4 నుంచి ఫిబ్రవరి 29 వరకు ఒకే షెడ్యూల్‌లో షూటింగ్ పూర్తవుతుంది" అన్నారు ప్రముఖ పంపిణీదారుడు కాట్రగడ్డ ప్రసాద్. ఈయన సమర్పించే శ్రీ అన్నపూర్ణ సినీ చిత్రవారి "బందిపోటు" చిత్రంలో సుమన్, శివకృష్ణ, రంగనాథ్, నూతన్‌ప్రసాద్, కోట శ్రీనివాసరావు, వీరభద్రరావు, వేలు, వినోద్, చిట్టిబాబు, వెంకటరావు, గౌతమి, కల్పన, పూర్ణిమ, డిస్కో శాంతి, చంద్రిక, సురేఖ వగైరా నటవర్గం. ఓంకార్ కథ, మాటలు రాశారు. వేటూరి గీతాలను రాజ్-కోటి స్వరపరిచారు. మనోహర్ ఛాయ, శివశంకర్ నృత్యాలు, మూగి సుబ్రహ్మణ్యం సహకార దర్శకత్వం, రామచంద్ర సింగ్ శిల్పం, కె. రాఘవ ప్రొడక్షన్‌తో టి. ఆర్. తులసి నిర్మించే ఈ చిత్రానికి బి. ఎల్. వి. ప్రసాద్ డైరెక్టరు. మార్చి నెలాఖరున విడుదల.

"నన్ను సుత్తి అన్నా, కత్తి అన్నా సరే - పెద్దయ్యగారు ఇంకా రాలేదు కాబట్టి, నేను స్వీకరించిందే. స్వచ్ఛంగా వుండలేను. అసలు నాకీ పేరు ఎలా వచ్చిందంటే.... మా చిన్నతనంలో స్కూల్ ఫ్రెండ్స్ అందరం కలిసి పిక్నిక్‌కి వెళ్లామండి. అక్కడ గారెలు వండుకోవాలని అందరం అనుకున్నాం. అయితే - ఎవరెవరు ఏ యే సామాన్లు బ్రింగింగ్ చేయాలి అని థింకింగ్ చేశామండి..... ఒకతేమో మినపప్పు తెస్తానన్నాడు. మరొకడు నూనె తెస్తానన్నాడు. ఇంకొకడు పొయ్యిలోకి కర్రలు తెస్తానన్నాడు. ఎవరికి 'నువ్వేం తెస్తావురా?' అని నన్ను అడిగారండి. గారెలు చేసేటప్పుడు దానికి మధ్యలో కన్నం పెట్టాలి కదా - అందుకే, ఆ కన్నం పెట్టడానికి నేను నా వేలు పెట్టుకొస్తానన్నానండి. అప్పటినుంచి నా పేరు వేలు అని పర్మనెంట్ అయిపోయిందండి" అంటూ వేలు అందర్నీ చూసి "ఎవరూ లాఫింగ్ చెయ్యలేదేమిటి?" అని ముఖం చిన్నబుచ్చుకున్నాడు.



మొన్న ఓ నిర్మాత మీకు హీరో వేషం ఇద్దామని వచ్చారు మీరు వూళ్లో లేరు, ఫిల్మోత్సవకి వెళ్లారని తెల్పి ఆ వేషం మరొకడికి ఇచ్చాడు!

పాటిబండ్ల విజయలక్ష్మి నవలతో యార్లగడ్డ శంభుప్రసాద్ సమర్పించే "ప్రేమకిరీటం" చిత్రానికి జి. రామ్మోహనరావు దర్శకుడు. యార్లగడ్డ ప్రభావతి నిర్మాత.

కృష్ణ, శ్రీదేవితో విజయబాపినీడు దర్శకత్వంలో శ్రీనివాసా ప్రొడక్షన్సు చిత్రం "మహారాజశ్రీ మాయగాడు"


"జనవరి 21 నుంచి 31, ఫిబ్రవరి 21 నుంచి 28, ఆతర్వాత మార్చి, ఏప్రిల్ షెడ్యూల్స్‌లో షూటింగ్ పూర్తవుతుంది," అన్నారు విజయ బాపినీడు. ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో అట్లూరి రాధాకృష్ణమూర్తి, కొమ్మన నారాయణరావు నిర్మించే శ్రీనివాసా ప్రొడక్షన్స్ వారి ఈ చిత్రంలో కృష్ణ, శ్రీదేవి నాయకా నాయికలు. కాశీ విశ్వనాథ్ మాటలు, ఎ. ఎస్. ఆర్. స్వామి ఛాయతో శ్రీనివాసబాబు సమర్పణ.

శోభన్‌బాబు, మురళీమోహనరావులతో రాశీ మూవీ క్రియేషన్స్ చిత్రం

"కుటుంబ బాధ్యతలు స్వీకరించాక ఒక వ్యక్తి శ్రీరాముడిలాగ, శ్రీకృష్ణుడిలాగ ఎలా గుణపగలుగుతాడన్న ప్రాతిపదిక మీద అల్లిన కథ" అన్నారు కె. మురళీమోహనరావు. ఈయన దర్శకత్వం వహించే రాశీ మూవీ క్రియేషన్స్ చిత్రంలో శోభన్‌బాబు, రాధ, సుహాసిని, గౌతమి, సత్యనారాయణ, వేలు, వీరభద్రరావు, మమత పాత్రధారులు. బాలమురగన్ కథకు సత్యానంద్ సంభాషణలకర్త. చక్రవర్తి సంగీతం, డి. డి. ప్రసాద్ ఛాయ, భాస్కరరాజు శిల్పం, తార నృత్యాలు, జ్యోతి – చందన్ సహకార దర్శకత్వం, నాగేశ్వరరావు – రాజు ప్రొడక్షన్, నరసింహారావు కూర్పు నిర్వహిస్తున్నారు. "జనవరి మూడో వారం నుంచి ఏప్రిల్ రెండో వారం వరకు మూడు షెడ్యూల్స్‌లో షూటింగ్ ముగుస్తుంది" అన్నారు నిర్మాత ఎం. నరసింహారావు.

తమ్మారెడ్డి దర్శకత్వంలో "మన్మథ సామ్రాజ్యం"


"మేం కొంతమంది కొత్త ఆర్టిస్టులను పరిచయం చేస్తున్నాం. కాని వాళ్ళు కొత్త వాళ్ళంటే ఎవరూ నమ్మరు. అంత బాగా చేశారు. వాళ్ళతో పని చేస్తుంటే ఎంతో థ్రిల్లింగ్‌గా ఉంది. ఏవిధమైన టెన్షన్ లేకుండా విశాఖపట్నం పరిసరాలలో చకచకా షూటింగ్ ముగించాం. యువతరం ఎదుర్కొనే వైవాహిక సమస్య ప్రధాన ఇతివృత్తం. టీనేజ్ ఎంటర్‌టైన్‌మెంట్‌గా రూపొందించాం" అన్నారు తమ్మారెడ్డి. ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వం నెఱపిన చరిత చిత్ర వారి పై చిత్రంలో రఘు, అభినయ, శ్రీదుర్గ, కిన్నెర, పద్మలత, రాజా, పి. జె. శర్మ, సాయికుమార్, వీరభద్రరావు, రమణమూర్తి, కృష్ణచైతన్య, డబ్బింగ్ జానకి, జి. లలిత, గౌరవ పాత్రలో మురళీ మోహన్ నటించారు. ఎం. రాజా మాటలు, జొన్నవిత్తుల పాటలు, బప్పీలహరి సంగీతం, లోకి ఛాయ, బాలు శిల్పం, సుధాకరరెడ్డి సహకార దర్శకత్వం, పి. ఎ. మోహనరావు నిర్వహణ, అప్పారావు సాహసాలు, సతీష్ ప్రొడక్షన్, మురళీ రామయ్య కూర్పుతో సూరెడ్డి వెంకటేశ్వరరావు నిర్మాత.



"డాక్టరుగారి అబ్బాయి" లో అర్జున్, సీతా

"డాక్టరుగారి అబ్బాయి" త్వరలో

"వైద్యవృత్తిని పవిత్రంగా భావించే డాక్టరు, తను నమ్మిన ఆశయ సాధనకోసం చెడు కనిపిస్తే నిర్మూలించే ఆ డాక్టర్ తనయుడు. నిజాయితీ గల పోలీసు ఉద్యోగి అయిన మరో తనయుడు..... వీరిమధ్య నలిగిపోయే ఇల్లాలు..... ఈ పాత్రల మధ్య సంఘర్షణ ఈ చిత్ర కథాంశం", అన్నారు పి. ఎస్. రామచంద్రరావు. ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో పి. ఎ. రామరాజు నిర్మించిన శ్రీ పద్మజ విజయలక్ష్మి ఫిలిమ్స్ వారి పై చిత్రంలో అర్జున్, శివకృష్ణ, గొల్లపూడి మారుతీరావు, సీతా, అరుణ, కోటశ్రీనివాసరావు, నర్రా, హేమసుందర్, అశోక్‌కుమార్ ప్రభృతులు నటించారు. గిరిజశ్రీ భగవాన్ కథకు సుదర్శన్ బడ్డాచార్య సంభాషణలకర్త. రాజ్–కోటి స్వరకల్పనలో సీతారామశాస్త్రి, జొన్నవిత్తుల గీతాలు రాశారు. ఎస్. ఎస్. రాజు ఛాయ, నాయని మహేశ్వరరావు కూర్పుతో ఆర్. రామకృష్ణంరాజు సమర్పణ.



"ప్రియురాలు" లో మోహన్, రూపిణి



హైదరాబాద్‌లో జరిన 9వ వంశీ బర్కిలీ ఫిలిమ్ అవార్డ్సును ముఖ్య అతిథి శ్రీ రాజేంద్రకుమార్ నుండి అందుకుంటున్న నటి రజని సభాధ్యక్షులు శ్రీ టి. సుబ్బరామిరెడ్డి.

కె. ఎస్. ఆర్. దాస్; అర్జున్‌లతో పరమేశ్వరి ఆర్ట్స్ ప్రొడక్షన్స్

"యాక్షన్‌తో పాటు సెంటిమెంట్ కూడా వుంటుంది. నా శ్రేయోభిలాషి ఎస్. పి. వెంకన్నబాబు సమర్పిస్తారీ చిత్రాన్ని" అన్నారు ఎన్నో సంవత్సరాలుగా ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్‌గా అనుభవం గడించిన కె. ఎల్. ఎన్. శాస్త్రి. ఈయన నిర్మించే పరమేశ్వరి ఆర్ట్స్ ప్రొడక్షన్స్ చిత్రంలో అర్జున్ సరసన రూపిణి నాయిక. సత్యనారాయణ, గొల్లపూడి మారుతీరావు, వేలు, వీరభద్రరావు, రాజ్యలక్ష్మి, వై. విజయ, అన్నపూర్ణ యితర పాత్రధారులు. సత్యానంద్ మాటలు, రాజ్‌కోటి సంగీతం, లక్ష్మణ్ ఛాయ, డి. వెంకటరత్నం కూర్పుతో కె. ఎస్. ఆర్. దాస్ స్క్రీన్‌ప్లే – దర్శకత్వ బాధ్యతలు వహిస్తారు. "ఈ చిత్రం సినిమాస్కోప్‌లో తయారౌతుంది" అన్నారు సమర్పకులు ఎస్. పి. వెంకన్నబాబు.

ఫిబ్రవరి 5న "దొంగరాముడు"

డైరెక్టర్ కె. రాఘవేంద్రరావు చిత్రాలలో పతాక సన్నివేశాలకు మరింత ప్రాముఖ్యత ఉంటుందన్న సంగతి అందరికీ తెలిసిందే. దాదాపు వారం రోజుల పాటు హొగెనికల్ వద్ద ఆయన షూట్ చేసిన క్లయిమాక్స్ ఎంతో రిస్క్ తీసుకుని నటించారు. శిక్షణ ఇవ్వబడిన వది భయంకరమైన జాగిలాలు. పదిహేను మంది ఆరితేరిన ఫైటర్స్ పాల్గొన్నారు," అన్నారు గోపీ మూవీస్ అధినేత చలసానిగోపి. ఈయన నిర్మించిన పై చిత్రంలో బాలకృష్ణ, రాధ, మోహన్‌బాబు, చంద్రమోహన్, శివకృష్ణ, పి. ఎల్. నారాయణ, బాలాజీ, కుయిలీ, శ్రీదుర్గ, చలపతిరావు, వై. విజయ వగైరా నటవర్గం.

సినిమా

పరుచూరి సోదరుల రచన, చక్రవర్తి సంగీతం, కె. ఎస్. ప్రకాష్ ఛాయ, భాస్కరరాజు శిల్పం, సలీం నృత్యాలు, సాహుల్ సాహసాలు, డి. వెంకటరత్నం కూర్పుతో కె. రాఘవేంద్రరావు దర్శకుడు.

కె. వి. నందనరావు దర్శకత్వంలో "భర్త చేసిన పెళ్ళి"

"చాలాకాలం క్రితమే నేను కథ, స్క్రీన్‌ప్లేను సిద్ధం చేసి ఉంచాను. కొత్త నటీనటులను ఎంపిక చేసి, మహాశివరాత్రి నాడు పాటల రికార్డింగ్‌తో ప్రారంభోత్సవం," అన్నారు డాక్టర్ ఎ. యోగేశ్వరరావు. ఈయన నిర్మించే పై చిత్రానికి వేటూరి గీతాలు, కె. వి. మహదేవన్ సంగీతం, కుమార్ ఛాయ, బాలు శిల్పంతో కె. వి. నందనరావు దర్శకుడు.

డి. రామానాయుడు చిత్రాలు

దాసరి నారాయణరావు దర్శకత్వంలో వెంకటేశ్ నటించే "బ్రహ్మపుత్రుడు" షూటింగ్ ఫిబ్రవరి 1 నుంచి పరుచూరి సోదరుల దర్శకత్వంలో "రైతురాజ్యం", కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో, మురళీ మోహనరావు దర్శకత్వంలో చిత్రాలు ప్లాన్‌చేసినట్టు డి. రామానాయుడు తెలిపారు.

శ్రీలలిత కళాంజలి ప్రొడక్షన్స్ "అత్త మెచ్చిన అల్లుడు"

"అత్తగా డాక్టర్ భానుమతీ రామకృష్ణ, నాయికగా జయప్రద నటిస్తున్నారు. జనవరి 11 నుంచి 31, ఫిబ్రవరి 20 నుంచి 29 వరకు షెడ్యూల్స్," అన్నారు కోడి రామకృష్ణ. ఈయన కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహించే శ్రీ లలిత కళాంజలి ప్రొడక్షన్స్ వారి పై చిత్రంలో ఈయనతో పాటు సత్యనారాయణ, వై. విజయ, రాజా కూడా నటిస్తున్నారు. కె. వి. మహదేవన్ స్వరకల్పనలో సి. నారాయణరెడ్డి, మల్లెమాల గీతాలు రాశారు. కె. ఎస్. హరి ఛాయ, శివసుబ్రహ్మణ్యం నృత్యాలు, సాహుల్ సాహసాలు, బి. శ్రీధర్‌రావు – కోడి వెంకటరమణ – శ్రీనివాసరావు ప్రొడక్షన్, బి. హెచ్. సూర్యచంద్రరాజు నిర్వహణ, తాతా సురేష్ కూర్పు, వాకాడ తాతయ్య నిర్మాణ సారధ్యంలో వాకాడ అప్పారావు, దాట్ల రామకృష్ణంరాజు నిర్మాతలు.

జయభేరి ఆర్ట్స్ ప్రొడక్షన్స్ చిత్రంలో బాలకృష్ణ, భానుప్రియ



ఫిబ్రవరిలో "బావా మరుదుల సవాల్"

ఇద్దరు ఆప్త మిత్రులు తలవని తలంపుగా బావా బామ్మరుదులవుతారు. ఒకరు (రాజేంద్రప్రసాద్) చట్టానికి ప్రతినిధి. మరొకరు (రాజశేఖర్) న్యాయానికి ప్రతినిధి. ఓ సంఘటన కారణంగా వీరి మధ్య ఛాలెంజ్ ఏర్పడుతుంది. ఇందులో ఎవరు నెగ్గారన్నది ఉత్కంఠ కల్గిస్తుంది. మంచి మనసుగల సంపన్నుడుగా శరత్‌బాబు ఒక అపూర్వమైన పాత్రను నిర్వహించారు," అన్నారు సి. ఏ. గణేశ్. ఈయన (19)స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో పాలమరశెట్టి అన్నపూర్ణ సమర్పించే క్వాలిటీ పిక్చర్స్ వారి పై చిత్రంలో రమ్యక్రిష్ణ, జీవిత, కల్పన నాయికలు. జె. వి. సోమయాజులు, వంకాయల, లక్ష్మిప్రియ, అనుజ తతిమా తారాగణం. సి. పద్మజానాయుడు కథకు కాశీవిశ్వనాథ్ సంభాషణలకర్త. వేటూరి గీతాలను శివాజీరాజా స్వరపరిచారు. పి. గోపాల్ ఛాయ, కె. పెదరామలింగేశ్వరరావు శిల్పం. హైమమూర్తి ప్రొడక్షన్‌తో పి. అప్పారావు నిర్మాత.

"చక్రపాణి గారి కొడుకు"గా నాగార్జున

"జనవరి 10 నుండి 31 వరకు హైదరాబాద్, న్యూఢిల్లీలలో మొదటి షెడ్యూల్. ఫిబ్రవరి 15 నుంచి 29 వరకు రెండో షెడ్యూల్. మార్చి 15 నుంచి 31 వరకు మూడవ షెడ్యూల్. ఏప్రిల్‌లో పాచ్ వర్క్.

ఇది సురేష్ ప్రొడక్షన్స్ 26వ చిత్రం," అన్నారు. డి. రామానాయుడు. ఈయన నిర్మిస్తున్న పై చిత్రంలో నాగార్జున, మోహన్‌బాబు, మురళీమోహన్, రావుగోపాలరావు, శివకృష్ణ, రాజేష్, వేలు, శుభలేఖ సుధాకర్, నూతన్‌ప్రసాద్, చలపతిరావు, రాళ్ళపల్లి, అమల, రాజ్యలక్ష్మి, అంజలీదేవి, శ్రీలక్ష్మి, కాకినాడ శ్యామల వగైరా తారాసందోహం. పరుచూరి సోదరులు కథ, మాటలు రాశారు. చక్రవర్తి సంగీతం, ఏ. ఎస్. ప్రకాష్ ఛాయ, జి. వి. సుబ్బారావు శిల్పం, రఘు నృత్యాలు, పొన్నుస్వామి ప్రొడక్షన్, షిండే సహకార దర్శకత్వం, మార్తాండ్ కూర్పుతో ఎ. మోహన్‌గాంధి స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహిస్తున్నారు.



"చిలిపి దంపతులు"లో పూర్ణిమ, చంద్రమోహన్, వేలు

కె. విశ్వనాథ్ సృష్టి "స్వర్ణ కమలం"

"కళకు విలువ కట్టలేం. ఏ కళలో నైనా ప్రాధాన్యం చెంది అందులో లీనమైతే, ఆ అనుభూతి కూడా అమూల్యమైనది. ఈ చిత్ర కథానాయకుడు కమర్షియల్ బానర్ చిత్రకారుడు. వెంకటేశ్ పాత్రలో లీనమై నటించాడు. సంప్రదాయ సిద్ధంగా ప్రతిభిన్న ఓ నాట్యాచార్యుడి ద్వితీయ పుత్రిక సుశాస్త్రీయ నాలుగో సెడ్యూల్ భువనేశ్వర్, కోణార్క్, విశాఖపట్నం ప్రాంతాలలో జరగడంతో షూటింగ్ పూర్తి ఫ్రతుంది" అన్నారు కళాతపస్వి కె. విశ్వనాథ్. ఈయన స్క్రీన్ప్లే, దర్శకత్వంలో సి. హెచ్. వి. అప్పారావు నిర్మించిన భాను ఆర్ట్ క్రియేషన్స్ వారి పై సంగీత నృత్య కళాఖండంలో షణ్ముఖ శ్రీనివాస్, సాక్షి రంగారావు, మిశ్రో, సెల్వరాజ్, కనకారావు, దేవిలలిత,

శోభన్, శరత్‌లతో శ్రీ అనఘా చిత్ర

"జనవరి 21 నుంచి షూటింగ్" అన్నారు శరత్. ఈయన దర్శకత్వంలో "కులాల కురుక్షేత్రం" అనంతరం వల్లభనేని లక్ష్మీదాసు నిర్మించే శ్రీ అనఘా చిత్ర వారి చిత్రంలో శోభన్‌బాబు, కల్యాణచక్రవర్తి, మోహన్‌బాబు, ప్రభాకరరెడ్డి, రంగనాథ్, కోట శ్రీనివాసరావు, వేలు, వీరభద్రరావు, రజని, సాగరిక,



'కృష్ణగారి అబ్బాయి' లో

కళలు, జీవితానికి పనికిరావని అభిప్రాయపడ్డా తండ్రి కృష్ణ కోసం నాట్యసాధన చేస్తుంది. ఈ పాత్రలో భానుప్రియ విజృంభించింది. ప్రథమ పుత్రిక తండ్రి దైవంగా భావించే కళల్లో ఒకటైన సంగీతాన్ని సాధన చేస్తుంది. ఈ పాత్రలో పేరున్లోనే అనే అమెరికన్ సర్వశిక్షకురాలు మరపురాని అభినయాన్ని ప్రదర్శించింది. జనవరి 16 నుంచి ఫిబ్రవరి 7 వరకు

సినిమా

శ్రీలక్ష్మి, శైలజ, కొందరు రంగస్థల కళాకారులు పాల్గొన్నారు. సాయినాథ్, సిరివెన్నెల సీతారామశాస్త్రి, ఆత్రేయ, ఐ.సింగ్, నందనార్ విజయ్, ఆయుష్, ఖాన్పూర్ కేసర్, రాజగోపాల్ ప్రఖ్యాత పాండవిక వర్గంలో కె. ఎస్. రామారావు సమర్పణ.

వరలక్ష్మి, జాతివేని రాజేశ్వరి, ఒక విశిష్టమైన పాత్రలో సత్యనారాయణ పాత్రధారులు. ఉంధ్యాల సంభాషణలు, కె. వి. మహాదేవన్ సంగీతం, ఎస్. సుధాకరరెడ్డి ఛాయ, అక్కినేని శ్రీనివాసరావు ప్రొడక్షన్, టి. వెంకటరత్నం కూర్పు నిర్వహిస్తాడు. జనవరి 21-31, ఫిబ్రవరి 21-28, మార్చి 21-31 షెడ్యూల్స్ తో చిత్రీకరణ పూర్తవుతుంది.

జంధ్యాల, జయకృష్ణల "వివాహ భోజనంబు"

"ఆదివిష్ణు నవల 'శవతాండవం' ఆధారం. ప్రేమలో బోల్తాపడ్డ ఓ యువకుడు ఆడ జాతినే అసహ్యించుకుంటాడు. స్త్రీ ద్వేషి సంఘం, భార్యా బాధితుల సంఘం లాంటివి స్థాపిస్తాడు. ఇలా మహిళలపై ధ్వజమెత్తుతాడు. చివరికి సరైన అవగాహన లేకపోవడంవల్లే ఇలాంటివి జరుగుతున్నాయని తన పొరబాటును గుర్తిస్తాడు. ఇలా వినోదంగా సాగే కథ. ఎనిమిది జంటలు నడిపిస్తాయి. అలనాటి సుప్రసిద్ధ ఛాయాగ్రాహకుడు స్వర్గీయ సి. నాగేశ్వరరావు పుత్రుడు, లోకసింగ్ శిష్యుడు అయిన సి. విజయకుమార్ ఈ చిత్రానికి తొలిసారిగా ఛాయాగ్రహణం నిర్వహిస్తున్నారు. సుమారు 150 చిత్రాలలో బాల నటుడైన హరి ఉప కథా నాయకుడుగా నటిస్తున్నాడు. ఇతనికి జోడీగా హరిత అనే నవ నటిని పరిచయం చేస్తున్నాం. మరికొందరు రంగస్థల కళాకారులు కూడా ఉన్నారు" అన్నారు దర్శక రచయిత జంధ్యాల. ఈయనా, జయకృష్ణ కలిసి నిర్మిస్తున్న జె. జె. మూవీస్‌వారి పై చిత్రంలో రాజేంద్రప్రసాద్, అశ్విని, చంద్రమోహన్, రాజ్యలక్ష్మి, హరి-హరిత, శుభలేఖ సుధాకర్- కౌసల్య, వేలు-శ్రీలక్ష్మి, వీరభద్రరావు-రత్నాసాగర్, బ్రహ్మానందం-పావలా శ్యామల పాత్రధారులు. ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం స్వరకల్పనలో వేటూరి గీతాలు రాశారు. సి. విజయకుమార్ ఛాయ, యు. వి. పాణి సంయుక్త దర్శకత్వం, గౌతంరాజు కూర్పు తెర వెనుక హంగులు. "విశాఖపట్నంలో డిసెంబర్ 21 నుంచి జనవరి 10 వరకు మొదటి షెడ్యూల్ జరిగింది. మళ్ళీ జనవరి 26 నుంచి ఫిబ్రవరి 10 వరకు జరిగే షెడ్యూల్‌తో షూటింగ్ పూర్తయిపోతుంది" అన్నారు జయకృష్ణ. సమర్పణ: టి. సుబ్బిరెడ్డి.

డైరెక్టర్ కె. రాఘవేంద్రరావు కొత్త చిత్రాలు

నాగార్జున, విజయశాంతి, జీవిత, మోహన్‌బాబులతో కె. మురారి నిర్మించే యువచిత్ర వారి చిత్రం షూటింగ్ ఫిబ్రవరి 1న మొదలవుతుంది. చిరంజీవి, విజయశాంతి, మోహన్‌బాబు, రావుగోపాలరావులతో స్వంత సంస్థ ఆర్. కె. అసోసియేట్స్ చిత్రానికి ఫిబ్రవరి 19న ప్రారంభోత్సవం. బాలకృష్ణతో సాయికృష్ణా ఫిలిమ్స్ అధినేత (కీ. శే. కోగంటి కేశవరావు పుత్రుడు) నిర్మించే చిత్రం షూటింగ్ జూన్ నుంచి వుంటుంది. నాగార్జునతో ఆర్. కె. అసోసియేట్స్ చిత్రం, కృష్ణంరాజు స్వంతచిత్రం, 1989తో చిరంజీవితో అమరనాథరెడ్డి నిర్మించే చిత్రం ప్రారంభమవుతాయి. ☐

టి. సుబ్బరామిరెడ్డి హిందీ చిత్రం "చాందిని"

గతంలో దిల్‌వాలా, జీవన పోరాటం, త్రిమూర్తులు, తాజాగా విజయ్ వంటి అత్యున్నతమైన భారీ చిత్రాలు నిర్మించి స్టార్ ప్రొడ్యూసర్‌గా రాణిస్తున్న, ప్రముఖ పారిశ్రామికవేత్త, కేంద్ర సెన్సారుబోర్డు సభ్యులు టి. సుబ్బరామిరెడ్డి, హిందీ చలనచిత్ర రంగంలో సుప్రసిద్ధ దర్శక- నిర్మాత యాష్ చోప్రాతో కలసి యాష్‌రాజ్ ఫిలిమ్స్ పతాకాన శ్రీదేవి ప్రధాన పాత్రధారిణిగా, నిర్మిస్తున్న 'చాందిని' హిందీ వర్ణచిత్రం షూటింగ్ డిసెంబర్ 20 రాత్రి 9 గంటలకు, బొంబాయిలోని న్యూసెంటర్ హోటల్‌లో హిందీ చలనచిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖుల సమక్షంలో లాంఛనప్రాయంగా ప్రారంభమైంది.



"చాందిని" హిందీ చిత్రం ముహూర్తం వేళ చిత్ర కథానాయిక శ్రీదేవి. చిత్ర కథానాయకుడు వినోద్‌ఖన్నా, రిషీకపూర్, అనుపమఖేర్, దిలీప్‌కుమార్, చిత్ర నిర్మాత టి. సుబ్బరామిరెడ్డి, దర్శకుడు యాష్‌చోప్రా.

చిత్ర నిర్మాత టి. సుబ్బరామిరెడ్డి క్లాప్ కొట్టగా, హిందీ చలనచిత్ర రంగంలో ప్రముఖ హీరో దిలీప్‌కుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, చిత్ర దర్శకుడు యాష్ చోప్రా వినోద్‌ఖన్నా ఋషికపూర్, శ్రీదేవిలపై మొదటి షాట్ చిత్రీకరించారు.

ఈ ముహూర్తానికి హిందీ చలన చిత్ర రంగంలోని సుప్రసిద్ధులు రాజేష్‌ఖన్నా, అనిల్‌కపూర్, మిథున్‌చక్రవర్తి, ధర్మేంద్ర, హేమమాలిని, మీనాక్షి శేషాద్రి, పూనంధిల్లాన్, సన్నిదయాళ్, బి. ఆర్. చోప్రా, రాజేంద్రకుమార్, సుభాష్‌ఘాయ్, ప్రకాష్ మెహతా, లక్ష్మీకాంత్ ప్యారేలాల్, బప్పీలహరి తదితరులు హాజరై నిర్మాత దర్శకులకు శుభాకాంక్షలు అందజేసారు.

"ఇది ఒక ప్రేమ కావ్యం. ప్రేమ ఎంతటి త్యాగానికైనా వెనుకాడదు. ప్రేమకు అవధులు లేవు. ఎల్లలులేవు" అన్న ఇతివృత్తంతో ఈ చిత్ర కథ నడుస్తుంది. చాందినిగా శ్రీదేవి, ఆమెని ప్రేమించే ప్రేమికులుగా వినోద్‌ఖన్నా, ఋషికపూర్‌లు, విలన్‌గా అనుపమకేర్ నటిస్తున్నారని చిత్రకథ గురించి క్లుప్తంగా నిర్మాత దర్శకుడు యాష్ చోప్రా వివరించారు.

మొదటి షెడ్యూల్ జనవరి 16 నుండి ప్రారంభమవుతుంది. నెలాఖరు వరకు జరుగుతుంది. జూన్‌కల్లా చిత్రం షూటింగ్ పార్టు పూర్తి అవుతుంది. హాలెండ్‌లో, ఢిల్లీలో, ఒక షెడ్యూల్ హైదరాబాద్‌లో జరపటానికి ప్లాన్ వేస్తున్నట్టు చిత్ర నిర్మాత టి. సుబ్బరామిరెడ్డి తెలియ జేసారు.

అత్యంత భారీ ఎత్తున నిర్మాణం కాబోతున్న ఈ చిత్రానికి కథ– కమల్‌చంద్ర, మాటలు– కె. కె. సింగ్, పాటలు– ఆనంద్‌బక్షి, సంగీతం– శివహరి, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ– మన్‌మోహన్‌సింగ్ , ఎడిటింగ్– కేశవనాయుడు, కళ– సుదేందురాయ్, స్క్రీన్‌ప్లే– అరుణ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత– గురుదీప్ సింగ్, అసోసియేట్ ప్రొడ్యూసర్– టి. సుబ్బరామిరెడ్డి, నిర్మాత– దర్శకత్వం– యాష్ చోప్రా.

ప్రతిష్ఠాకరంగా నిర్మాణం అవుతున్న ఈ చిత్రంలో వినోద్‌ఖన్నా, ఋషీకపూర్, శ్రీదేవి, అనుపమ్‌ఖేర్, అనితారాజ్, శక్తికపూర్ తదితరులు ప్రముఖ పాత్రలు పోషిస్తున్నారు. ☐

ఆడపుట్టుక

కొండముది దమయంతీదేవి

"అమ్మాయ్ సరళా! ఇంకా కాలేజీకి టైమ్ కాలా?" దొడ్లో నుంచి అనసూయమ్మ కేకేసింది. బాయిలర్ లోంచి బకెట్‌లోకి నీళ్ళు తోడుస్తూ." పొద్దున్నే సుప్రభాతం నేను పాడాలి, కాఫీ కలిపి మంచం దగ్గరకు తెచ్చి 'తాగు తల్లీ!' అంటూ నోటి కందించాలి, వేణ్ణీళ్ళు పెట్టి నీ స్నానానికి నీళ్ళు నే తోలిపి పెట్టాలి, అనక టేబిలు మీద టిఫిన్ పెట్టి, 'రా తల్లీ! వచ్చి తిని వెళ్ళు!' అంటూ ఆహ్వానం చెయ్యాలి, టిఫిన్ అయిం తర్వాత, డ్రెస్సు.... డ్రెస్సు తర్వాత బస్సు... అబ్బబ్బ! ఒక్క పిల్లవన్న మాటే కానీ చచ్చి పోతున్నానే తల్లీ!" అంటూ తల్లి అంటున్న మాటల్ని సరదాగా వింటూ, వంటింటి గుమ్మం దగ్గరకు వచ్చి నిలబడింది నవ్వు మొహంతో సరళ.

ఆ అమ్మాయి చిదిమి దీపం పెట్టుకునేట్టుగా వుంది. ఆడపిల్లల కాలేజీలో బి. ఏ. ఫైనలియర్ చదువుతోంది, సోషియాలజీ మెయిన్‌గా తీసుకుని. తనను గురించి తల్లి పడే కంగారు చూస్తే ఆ అమ్మాయికి తమాషాగా వుంటుంది. తనేమన్నా పాలు తాగే పసిపిల్లా? 'పసిపిల్ల' అనే ఆవిడ అభిప్రాయం. కాదనీ, తన పనులు తాను. చేసుకుంటాననీ అంటే మళ్ళీ అందుకు వొప్పుకోదు. అసలు అందరు తల్లులూ అంతే నేమో!

సరళ యాదాలాపంగా పక్క యింటికేసి చూసింది. అక్కణ్నుంచి చూస్తే డాక్టర్ తిలక్ గారి ఇల్లు మధ్య గది నుంచి దొడ్లో వరకూ స్పష్టంగా కనిపిస్తుంది. ఇప్పుడా ఇల్లు చూస్తుంటే సరళకు విచారం వేస్తుంటుంది. దిగులుగా, బోసిగా, కళాకాంతులూ పోయి, వంటరితనంతో కుమిలిపోతున్నట్టుగా వుంటున్నదా ఇల్లు. ముందు గదిలో ఉంటారు డాక్టరు తిలక్‌గారు. ఆయన సర్జన్ కాదు. కన్‌సల్టింగ్ ఫిజిషియన్ మాత్రమే. అయితే ఏం, బాపట్ల – చీరాల ప్రాంతంలోనే కాదు, ఇటు నెల్లూరు, అటు ఏలూరు నుంచి కూడా. ఆయన దగ్గరకు పేషెంట్స్ వస్తుంటారు, ముఖ్యంగా గుండె జబ్బుల వాళ్ళు. ఎంత మంది వచ్చినా చడీ చప్పుడూ కాకుండా వస్తారు. రెండో కంటి వాడికి తెలియకుండా వైద్యం చేయించుకుని వెళ్ళిపోతారు. తిలక్ గారి ఇంటి ముందు కార్లు ఎన్ని వచ్చి ఆగినా, ఆ కార్లల్లో నుంచి ఎంత మంది దిగినా, అంతా నిశ్శబ్దంగా జరిగిపోతుంటుంది. ఆయన పిల్లలు మధ్య గదిలో చదువుకుంటుంటారు. ఇంక ఆయన భార్య వంట పుట్టి వగ్గర నిలబడి ఏం వండాలో చెబుతూ, పిల్లలకూ, భర్తకూ ఏ సమయానికి ఏం కావాలో చూసుకుంటూ, ఇల్లు సర్దుకుంటూ, ఎప్పుడూ ఏదో పని చేస్తూ చూడగానే వో ఆదర భావం, గౌరవ భావం కలిగేట్టుగా ప్రవర్తిస్తూ, డాక్టరు గారికి తగినట్టుగా ఉండేది.

సరళకు ఆవిడంటే చనువు, ప్రేమ, ఆత్మీయత. ఆవిడ ఉన్నంత వరకూ రోజూ సగం సమయం ఆ ఇంట్లోనే గడిపేసేది. డాక్టరు గారి పిల్లలు సరళ చుట్టూ చేరి "అక్కా! అక్కా!" అంటూ కబుర్లు చెప్పేవారు. కబుర్లు చెప్పమని వేధించుకు తినేవారు. సరళ డాక్టరు గారి భార్యను 'పిన్నీ!' అని పిలిచేది. నిజానికి ఆవిడకు "పిన్నీ!" అని పిలిపించుకోవాల్సినంతటి వయసు లేకపోయినా అట్లా సరళ పిలిస్తేనే కాని ఊరుకునేది కాదు. మహా అయితే సరళ కన్నా ఓ పదేళ్ళు పెద్ద ఆవిడ! ఒకసారి ఆ విషయమే ప్రస్తావన చేస్తే, "నా పిల్లలు నిన్ను అక్కా అని పిలుస్తుంటే, నీకు నేనేమవుతాను మరీ?" అని నవ్వేసింది.

అదేవిటే అమ్మాయ్, నువ్వు నా కూతురు లాంటి దానివి, నన్ను 'అక్కా!' అని పిలుస్తావేం?" అని అడిగింది సరళ వాళ్ల అమ్మ, ఆవిణ్ణో సారి.

"మీ కంటికి నేను చిన్నపిల్లలా కనిపిస్తుంటే, నా కంటికి సరళ చిన్నపిల్లలా కనిపిస్తుంటుందండీ! అయినా ఇద్దరు పిల్లల తల్లిని! ఇంకా నేను చిన్న దాన్నేవిటీ?" అన్నదావిడ గంభీరంగా.

ఆవిడ పెద్దదిగా కనిపించినా కనిపించకపోయినా, డాక్టర్ తిలక్‌గారు మాత్రం పెద్ద వాడు గానే కన్పిస్తుంటారు. సగం తలంతా బట్ట తల అయిపోయింది. మెదమెదలాడే వొళ్ళు. స్థూల శరీరం. మనిషి అంత పొడుగూ కాదు, పొట్టీ కాదు.

ఓ సాయంకాలం పూట, పూలు కడుతూ, టీ. వీ. చూస్తూ, టీ. వీ. లో ఎడ్వర్‌టయిజ్‌మెంట్స్ వస్తున్నప్పుడు, యాదాలాపంగా అన్నది సరళ, "పిన్నీ! ఆ ప్రకటనలో ఉన్నాయనకు. ఆవిడ రెండో పెళ్ళాంగా లేదూ, నువ్వూ – బాబాయ్ గారూ ఉన్నట్టు?"

"ఈ మాట డాక్టరు గారితో అనేవ్, నీకు ఇహ తలకాయ నొప్పి క్కూడా ఆయన బిళ్ళలివ్వరు, తనో బాలా కుమారుణ్ననుకుంటుంటారాయన!"

"ఆయన బాలా కుమారు డెట్లా అవుతాసూ ఇద్దరు పిల్లల తండ్రి అయింతర్వాత?"

"ఏం పిల్లలు పుడితే ముసలితనం వచ్చేసినట్టేనేవిటే, తమాషాగా మాట్లాడుతావూ?"

"ముసలితనం వచ్చినట్టు కాదు పిన్నీ, యౌవనం వెళ్ళిపోయినట్టు!"

ఆ ఇంటి వేపు చూడగానే సరళకు ఇదంతా జ్ఞాపకం వచ్చింది. కళ్ళల్లో నీటి జీర కదిలింది. యౌవనం వెళ్ళిపోయినా, వెళ్ళిపోకపోయినా, డాక్టరు గారి భార్య మాత్రం ఉన్నట్టుండి ఈ లోకం విడిచి వెళ్ళిపోయింది, ఒక రోగం లేదు, రొష్టు లేదు, సుష్టుగా భోం చేసింది. హాయిగా పిల్లలతో కాసేపు కబుర్లు చెప్పి, మంచం మీద ప్రశాంతంగా నిద్రపోయింది. మర్నాటి ప్రొద్దున్న చూస్తే అదే శాశ్వత నిద్ర అయింది. ఏదో టెక్నికల్ పేరు చెప్పారు డాక్టరు గారు 'ఆవిడ అకస్మాత్తు చావుకు. ఏ పేరైతే ఏం సరళ కొక మంచి స్నేహితురాలు కరువైంది. డాక్టరు గారి కొక ఉత్తమ ఇల్లాలు దూరమైంది సరళ వాళ్ళ అమ్మ కొక చెప్పుకో దగిన ఇరుగూ పొరుగూ లేకుండా పోయింది.

భారమైన హృదయంతో, సరళ, ఆ రోజు ఉదయం తన మామూలు పనులన్నీ కొంచెం మంద కొడిగా చేసింది. తలలో పువ్వులే కాదు, చేతికి కొత్తగా కొన్న గాజులు కూడా ఆమెకు వేసుకోవాలనిపించ లేదు.

పుస్తకాలు తీసుకుని కాలేజీకి బయలుదేరబోయింది.

"అదేమిటే – అన్నం తినకుండా వెళ్తున్నావేం?" అనసూయమ్మ ప్రశ్నార్థకంగా అడిగింది

"ఇప్పుడన్నం ఏవిటే? మధ్యాహ్నం వస్తాగా!" సరళ కంఠంలో చికాకు.

"మధ్యాహ్నం నువ్వు వస్తే నేను ఇంట్లో ఉంటానో, ఉండనో అని, ఇప్పుడే తిని వెళ్తావని వంట చేసేశాను. ఇవ్వాళ్టికి టిఫినేం చెయ్యలేదు

టిఫిను చెయ్య లేదన్న మాట కన్నా, ఇంట్లో ఉంటానో ఉండనో అన్న తల్లి మాటే సరళను ఎక్కువగా ఆకర్షించింది.

"ఎందుకుండవ్? ఎక్కడికి వెళ్తావ్?"

"నేనూ, మీ నాన్నగారూ పెళ్ళిళ్ళ రిజిస్ట్రారాఫీసుకు వెళ్ళాలి!"

ఆ మాట విని నవ్వకుండా ఉండలేక పోయింది కొంటెగా, "నువ్వూ – నాన్న గారూ పెళ్ళిళ్ల రిజిస్ట్రారాఫీసు కెందుకే? అది పెళ్ళిపోయిన వాళ్ల కోసం కాదు!" అని అన్నది.

"చెంపలు వాయిస్తాను, నువ్వూ – నీ చిలిపి మాటలూనూ! నేనూ, మీ నాన్నగారూ వెళ్తున్నది మా కోసం కాదు, డాక్టర్ తిలక్ గారి కోసం!" అన్నది అనసూయమ్మ చిరుకోపం నటిస్తూ

సరళ భ్రుకుటి ముకుళించింది. సీరియస్‌గా అడిగింది. ఆయన కోసం ఎందుకూ?"

"ఎందుకేవిటి? ఆయని మళ్ళీ పెళ్ళి చేసుకుంటున్నాడు. రెండో పెళ్ళికి హంగు - ఆర్భాటం ఎందుకని, రిజిష్టర్ పెళ్ళి చేసుకుంటున్నాడు, మమ్మల్నిద్దర్నీ సాక్షులుగా రమ్మన్నాడు."

సరళ గభాలున అడిగింది, "డాక్టరు గారు రెండో పెళ్ళి చేసుకుంటున్నారా?.. అన్‌బిలీవబుల్" ఇంకా మూణ్ణెళ్ళైనా కాలేదు కదమ్మా మొదటి భార్య పోయి?"

"మూణ్ణెళ్ళో, మూడేళ్ళో, భార్య పోయిం తర్వాత ఆ మగవాడు ఎంత కాలం ఉంటాడేవిటి. ఇంకో పెళ్ళి చేసుకోకుండా?" అనసూయమ్మ విసుగ్గా అన్నది.

"ఆ చేసుకోబోయే అమ్మాయికి ఇది రెండో పెళ్ళా, మొదటి పెళ్ళా?" మామూలుగా అడిగినట్లుగా అడిగింది సరళ.

ఖస్సు మన్నది అనసూయ. "చిన్నంతరం, పెద్దంతరం ఉండాలి ఏ మాట అనడానికైనా? ఏవిటా మాట్లాడడం? మగమహారాజు, ఎన్ని పెళ్ళిళ్ళైనా చేసుకుంటాడు. డాక్టరు గారిది రెండో పెళ్ళి కదా అని, ఆ చేసుకోబోయే అమ్మాయిది కూడా రెండో పెళ్ళా అని అడుగుతావా? బుద్ధుండక్కర్లా?"

సరళ ఆ వాగ్ధాటిని భరించ లేనట్టుగా అన్నది "సరేనమ్మా! నాకు బుద్ధి లేదు. పొరపాటు మాటన్నాను. చెంప లేసుకుంటున్నాను. సరా? ఇహ కోప్పడకు!" అంటూ రెండు చెంపలూ వేసుకుంది.

పొరపాటు అని ఒప్పుకుని, చెంప లేసుకోవడంతో కూతురు మీద బుస్సున పొంగిన కోపం టప్పున తగ్గిపోయింది అనసూయమ్మకు.

"నీ మీద ఎందుకు కోప్పడతానే- పొరపాటుగా మాట్లాడకు అన్నాను కానీ!" అంటూ ఆర్ద్రంగా అని, "ఇప్పుడెట్లాగే? టిఫిన్ చెయ్యలేదు, అన్నం తిని వెళ్ళమంటే కాదంటావ్?" అన్నది సాలోచనగా.

"కాస్త బాక్స్‌లో పెట్టెయ్యి, లంచ్ అవర్‌లో క్యాంటీన్‌లో తినేస్తాను!"

"మరి ఇప్పుడు? వొట్టి కడుపుతో వెళ్తావా?"

"కాఫీ కలిపి ఇయ్యి, చాలు!"

నిజానికి సరళకు ఆకలిగానే వుంది. కానీ డాక్టరు గారు రెండో పెళ్ళి చేసుకోబోతున్నారన్న మాట ఆకలిని వెనక్కు నెట్టి కోపాన్ని ముందుకు తెప్పించింది.

ఏం మగవాళ్ళు వీళ్ళు!! భార్య బాగా ఉన్నంత కాలం ఆ భార్యతో తిరగడం, ఆమె ద్వారా తమ అవసరాలు తీర్చుకోవడం, ఆమె కన్ను మూయగానే



మళ్ళీ తమ కామం కోసం, తమ దాహం కోసం మరో అమ్మాయిని వెతుక్కోవడం, అదే పని భర్త పోయిన ఓ ఆడది చేస్తే, ఈ సంఘం క్షమిస్తుందా? కాకై కూస్తుంది. పెద్ద పులిలా గాండ్రిస్తుంది. దయ్యంలా మీద పడుతుంది.

క్లాసులో కూచున్నా సరళకు ఇవే ఆలోచనలు. ఇంగ్లీషు మేడమ్ పాఠం చాలా బాగా చెపుతుంది అయినా ఇవ్వాళ ఆవిడ పాఠం కూడా వినబుద్ధి పుట్టడం లేదు.

"ఏవిటే అట్లా ఉన్నావ్?" ఓ స్నేహితురాలడిగింది.

సరళ తన మనసులో మాట చెప్పింది.

"పాపం, ఆ పిల్లల కోసం చేసుకుంటున్నాడేమోనే!!" ఆ అమ్మాయి సందేహంగా అన్నది. ఆ అమ్మాయి మీద ఇంతెత్తున లేచింది సరళ "అమ్మమ్మలా మాట్లాడకు! పిల్లల కోసమే అయితే ఓ ఆయాను తెచ్చుకోమను, ఉంచుకోమను! ఓ ఆడపిల్ల గొంతు కోయడం ఎందుకూ?"

"పిల్ల అని తెలిసినట్టు అంటున్నావ్.– ఎంతేవిటి పెళ్ళికూతురి వయసు?" సరళ స్నేహితురాలు కుతూహలంగా అడిగింది.

"నాకు తెలీదు!".

"తెలీని దానికి, ఇంత కంఠశోష ఎందుకే? పెళ్ళికూతుర్ని చూసిరా, ఆ తర్వాత మాట్లాడుకుందాం!"

ఆ సాయంకాలం డాక్టరు గారి రెండో భార్యను చూడగానే సరళకు బాధ, కోపం మరింత ఎక్కువయ్యాయి. "నేననుకున్నదే కరెక్టు! ఈ డాక్టరు గారు కూడా అందరి మగవాళ్ళ లాంటి వాడే! తన అవసరం కోసం ఓ ఆడపిల్ల గొంతు కోశాడు!" అనుకుంది సరళ.

చుట్టుపక్కల ఇళ్ళల్లో ఉన్న ఆడవాళ్ళందరూ డాక్టరు గారి రెండో భార్యను చూడటానికి వచ్చారు. వాళ్ళతో కలసి సరళ కూడా లోపలికి వెళ్ళింది.


"అమ్మాయ్! నీ పేరు?" ఓ పెద్ద ముత్తైదువ అడిగింది.

"శ్యామల!!"

ప్రశ్నలు... ప్రశ్నల మీద ప్రశ్నలు.. ఒక ప్రశ్నకు మరో ప్రశ్న జత.... మొత్తం మీద ఒక అరగంటలో తమకు కావలసిన సమాచారాన్నంతా శ్యామల దగ్గర్నుంచి వాళ్ళు రాబట్టేశారు.

శ్యామల తండ్రి వో ఎలిమెంటరీ స్కూలు టీచరుగా పని చేసి రిటైరై పోయాడు. తల్లి అయిదారు సంవత్సరాల కిందటే పోయింది. ఆస్తిపాస్తులేం ఉన్నట్టు లేదు. ఉన్న ఒక్క అన్న కోమటి కొట్లో గుమాస్తా. చెల్లెలికి ఏదో విధంగా పెళ్ళి అయిందనిపిస్తే చాలన్నదే అతని ధ్యాస, తపన అతనెట్లాగూ కట్నాలు ఇవ్వలేడు. కానుకలు తలకెత్త లేడు. అంచేత మొదటి సంబంధం పెళ్ళి కొడుకులు ఆశ అతను వదిలేసుకున్నాడు. డాక్టరు గారు కబురు పంపితే, అతనికి

ఒంటిరెక్క గాలిమర



గాలిమరల వాడకం మళ్ళీ పెరుగుతున్నది. పాతకాలపు గాలిమరలకు ఆధునిక రూపంగా మోనోప్టెరోస్ 15 అనే ఒంటి రెక్కతో నడిచేటటువంటి కొత్త గాలిమర తయారయింది. గాలిని శక్తిగా మార్చే ఈ సాధనాన్ని ఈ ఫొటోలో చూడవచ్చు. ఇప్పుడు ఎన్నో రకాల గాలిమరలు వాడకంలో ఉన్నాయి. గాలిమరల్ని వాడుతున్న దేశాలలో అరబ్ దేశాలు ముఖ్యమైనవి. ఈజిప్టులోని సముద్ర తీర పట్టణమైన మర్సామత్రోహ్‌కు కావలసిన విద్యుచ్ఛక్తినంతా ఇటువంటి గాలిమర సహాయంతోనే ఉత్పత్తి చేస్తున్నారు. ఈ గాలిని విద్యుత్తుగా మార్చే సాధనాన్ని ష్మిట్– బోల్కో– బ్లామ్ అనే సంస్థ తయారు చేసింది. గాలి విసురు పడిపోయినప్పుడు ఒక సమగ్ర డీసిల్ జెనరేటర్ పని చేస్తూ ఉంటుంది. ఈ మోనోప్టెరోస్ 15ను సంవత్సరాంతంలోగా సముద్ర జలంలో లవణాల్ని తొలగించే యంత్రానికి కలుపుతారని, అది రోజుకు 25 ఘనమీటర్ల మంచినీటిని తయారు చేస్తుందని అంచనా వేస్తున్నారు.

ఆపద్బంధువు

ఏనుగెక్కినట్లయింది. చెల్లెల్నిచ్చి కన్యాదానం జరిపించటానికి అతను సంతోషంగా ముందుకు వచ్చాడు.

"అమ్మా! శ్యామలా! పెళ్ళికొడుకు విషయమై నీ అభిప్రాయం ఏమిటమ్మా?" అని అతను ఒక్క ముక్క తన చెల్లెల్ని అడగలేదు. అడగాలని కూడా అతనికి తోచలేదు. శ్యామల తన అన్న పరిస్థితిని మనస్థితినీ గమనిస్తోనే ఉంది.

"రెండో పెళ్ళి సంబంధం? పైగా ఇద్దరు పిల్లల తండ్రినా?" అని ఒక్క ముక్క అనలేదు. తాంబూలాలు పుచ్చుకుంటే, తనకు కాదన్నట్టు అట్లా చూస్తోనే వుంది. 'రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్ళి!' అంటే తలకాయ వూపింది.

"పెళ్ళయిన తర్వాత నువ్వు అటు నుంచి అటే అత్తారింటికి వెళ్తున్నావ్!" అంటే

"ఆహా(!" అన్నదే కాని" మంచిదే అన్నయ్యా! కానీ మరి నా సారె, చీర సంగతేమిటి?" అని ఎదురు ప్రశ్న వేయలేదు.

శ్యామల మాటలబట్టి ఎంతో తెలుసుకున్న ముత్తయిదువులు, కానీ కట్నం లేకుండా డాక్టరుగారు తన రెండో భార్యను పెళ్ళి చేసుకున్నారన్న సంగతి విని, "నిజంగా ఈ కాలంలో పుట్టవలసిన మనిషి కాదమ్మా మన డాక్టరుగారు!" అని ముక్కు మీద వేలేసుకున్నారు.

ఆ తర్వాత డాక్టరు గారి గుణగణాలు కాసేపు పొగిడి, శ్యామలచేత బొట్టు పెట్టించుకుని వెళ్ళిపోయారు.

వాళ్ళు మాట్లాడుతున్నంత సేపూ సరళ, శ్యామలను చూస్తూ మౌనంగా ఓ ప్రక్కన కూచున్నది. వాళ్ళు వెళ్ళిపోగానే డాక్టరుగారి పిల్లలిద్దర్నీ కేకేసి, "రండర్రా! మనింటికి వెళ్దాం!" అన్నది తనూ లేస్తూ

వాళ్ళు ఇక్కడే ఉంటారులెండి!" శ్యామల సన్నగా అన్నది. ఆమె గొంతులో తెలియని ఏదో వేదన ధ్వనించింది.

అప్పుడే దొడ్లో పూసిన కనకాంబరాల్ని వో సజ్జలో పెట్టుకుని శ్యామల తల్లో తురమడం కోసం అక్కడకు వచ్చిన అనసూయమ్మ ఆ మాట విని, "ఇవ్వాళా, రేపూ, ఎల్లుండీ ఆ పిల్లలు మా ఇంట్లోనే ఉంటారులేమ్మా! కొత్తేముందీ?" అన్నది ఆప్యాయంగా, శోభనం రాత్రుల్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ-

శ్యామల మొహం ఎర్రబడింది ఇంకేం మాట్లాడలేదు.

డాక్టరుగారి ఇద్దరు పిల్లల్నీ ఇంటికి తీసుకు వచ్చి, అన్నం పెట్టి, కథలు చెప్పి, నిద్ర పుచ్చిం తర్వాత, ఇంకా తిలక్‌గారి బెడ్‌రూంలో లైట్లు వెలుగుతుండడం చూసి, హాల్లో వున్న తల్లి దగ్గరకు వచ్చి, "అమ్మా!అటు చూడు!" అంటూ లైటు వెలుగుతున్న ఆ గదిని చూపించింది.

అనసూయమ్మ అటు వేపుగా చూసి అర్థవంతంగా తలపంకించింది.

"డాక్టరుగారు ఇంకా ఇంటికి రాలేదేమో!" అన్నది కొంచెం సేపుండి.

"ఎప్పుడో వచ్చారు!" నిష్ఠూరంగా అన్నది సరళ.

పెళ్ళికాని కూతురితో నవ్‌షట్స్ విషయం

మాట్లాడడానికి మొహమాట పడి ఆ విషయాన్ని అంతటితో తుంచేసింది అనసూయమ్మ. సరళ కూడా మరేం అనలేదు.

మర్నాటి ఉదయం పిల్లలిద్దర్నీ తన రిక్షాలోనే ఎక్కించుకుని కాన్వెంట్‌కు తీసుకు వెళ్తూ, వరండాలో నిలబడి వున్న శ్యామలని చూసి, పిల్లలతో, "అదిగోనర్రా మీ పిన్ని గుడ్‌మానింగ్ చెప్పండి!" అన్నది సరళ.

"గుడ్‌మాణింగ్ పిన్నీ!" అన్నారు పిల్లలిద్దరూ.

శ్యామల ఉలిక్కిపడింది. పిల్లల్నీ, సరళనూ చూసింది పేలవంగా నవ్వింది. వరండా మెట్లు దిగి వీధి గేటు దాకా వచ్చి, సరళతో, "సాయంకాలం వీళ్లను ఇక్కడికే తీసుకు వచ్చేయండి!" అన్నది. ఆ గొంతులో ఇదమిద్ధమని చెప్పడానికి వీల్లేని ఏదో వెలితి అనిపించింది సరళకు.

ఎందుకూ అని అడగటానికి అప్పుడు టైం లేదు. తల వూపి రిక్షాను ముందుకు పొమ్మంది. సాయంకాలం ఇద్దరు పిల్లలూ రిక్షా దిగుతూ "అక్కా, టా, టా!" అంటున్నారు. ముద్దుగా. తోపలకు పరుగెత్తారు.

'టా' 'టా'ల సంబరంలో వాళ్లు రిక్షాలోనే పుస్తకాలు మర్చిపోయారు. అవి తీసుకుని సరళ డాక్టరుగారి ఇంట్లోకి వెళ్ళింది.

శ్యామల వాళ్ళకు డ్రెస్‌ఛేంజ్ చేస్తోంది. సరళను చూడగానే పలకరింపుగా నవ్వి, "రండి!" అన్నది.

"పిల్లలు పుస్తకాలు మర్చిపోయారు!" అన్నది సరళ.

ఇద్దరు పిల్లల్లో పెద్దది అన్నది, "నువ్వు తెస్తావని నాకు తెలుసులే అక్కా!"

"యూ నాటీ!" అంటూ ఆ పిల్ల చెంప మీద సుతారాంగా ఒక్కటి వేసి, "వస్తా!" అంటూ శ్యామల వైపు చూస్తూ ఆగింది, "ఏమని సంబోధించాలా?" అనుకుంటూ.

"పిన్నీ!" అని సంబోధించవచ్చు కదా?" అన్నది శ్యామల, ఆ అమ్మాయి మనసులో వున్న సందేహాన్ని పసిగట్టినట్టుగా.

"పిన్నీ అనా?"

"నా పిల్లలకు నువ్వు అక్కవైతే నీకు నేను పిన్నినే కదా?" శ్యామల చొరవకు, తెలివితేటలకు సరళ ఆశ్చర్యపోయింది.

"నీ పిల్లలా?" అన్నది.

"అవును! కనకుండానే తల్లినయ్యాను కదా?... అందులోను- ఇద్దరు పిల్లలకు!! నిండా ఇరవయ్యేళ్ళున్నా లేని శ్యామల అట్లా మాట్లాడుతుంటే అది వ్యంగ్యమో, ఆమె బ్రతుకు భారమో, తన దురదృష్టాన్ని ఆమె ఆ విధంగా ప్రకటించుకోవడమో, సరళకు తెలీలేదు.

ఆ ఇద్దరిదీ దాదాపు ఒకే వయస్సే అయినా, మాట్లాడుకోడానికి వొకే విషయం వాళ్ళకేమి కనబడలేదు.

ఉన్నట్టుండి సరళ అన్నది. "రాత్రి నీ గదిలో లైట్లు చాలాసేపు వెలుగుతున్నాయే?" క్షణం సేపు శ్యామల మొహం మీద వో నీలి నీడ. ఏదో చెబుదామని పెదవులు కదల్చింది. మళ్ళీ మనసు మార్చుకుని జవాబు చెప్పకుండా వూరికే వుండిపోయింది. సరళ బయల్దేరబోయింది. అది చూసి శ్యామల అన్నది, "ఉండు, కాఫీ తీసుకు వస్తాను!"

వద్దన్నది సరళ "ప్రక్క ప్రక్క ఇళ్ళ వాళ్ళం, మన మధ్య ఫార్మాలిటీస్ వద్దు" "ప్రక్క ఇళ్ళ వాళ్ళమే కాదు, డాక్టరుగారికి మీ అమ్మగారంటే ఎంతో గౌరవమని కూడా తెలసింది. బహుశః ఆయన్ని రెండో పెళ్ళికి మీ అమ్మగారే ప్రోత్సహించి ఉంటారు!"

కొరడా పెట్టి కొట్టినట్టు ఛెళ్ళున తగిలిందా మాట సరళకు. అబ్బే! లేదు. లేదు. అట్లా మా అమ్మ చెప్పదు!" అన్నది కంగారుగా.

"ఏం అట్లా చెబితే మాత్రం తప్పేముందీ? ఒక ఆడకూతురుకు కన్నె చెర విడిపించిన పుణ్యం వస్తుంది కదా? మన దేశంలో ఒక ఆడ పుట్టువు పెళ్ళి కాకుండా ఇంట్లో పడి వుంటే అదెంత బరువు ఆ కన్నవాళ్ళకు? డాక్టరుగారిలాంటి వాళ్ళు ముందుకు రాకపోతే నాబోటి వాళ్ళు ఏమైపోవాలి?

శ్యామల అంటున్న మాటలు సరళ గుండెల మీద సూటిగా వచ్చి తగులుతున్నయ్! చివరగా శ్యామల వో మాట అన్నది, "దాదాపు నువ్వూ, నేనూ ఒక వయసు వాళ్లం. అవునా? ఇంటి ప్రక్క ఇంత మంచి సంబంధం పెట్టుకుని, మీ అమ్మగారు నిన్ను డాక్టరుగారికి ఎందుకివ్వాననలేదో?

సరళ తల వొంచుకుని గుమ్మం దాటుతోంది, వెనగ్గా వచ్చింది మళ్ళీ శ్యామల కంఠం. "బహుశః డాక్టరుగారికీ నీకూ మధ్య వున్న వయసు తేడా ఆవిణ్ని భయపెట్టి వుంటుంది; ఎంత చెడ్డా నేను మరో అమ్మ కన్న బిడ్డను కదా?" తన తల్లి మీద ఆ కొత్త కోడలు వేసిన అభాండం, తనతో అన్యాపదేశంగా వెళ్ళబోసుకున్న వ్యధ, సరళ ఉన్నది వున్నట్టు అనసూయమ్మతో చెప్పింది.

"ఆ అమ్మాయి చేసిన ఆరోపణ నిజమేనా?" అన్నది సీరియస్‌గా.

"ఏవిటే ఆ ఆరోపణ? ఆ పిల్ల అనడమూ, నువ్వు నన్ను అడగడమూనూ! ఒకవేళ డాక్టరుగారితో అట్లా అన్నానే అనుకో, అది వప్పా? కూచుని తినలేక అనే మాటలు తప్ప!! మగవాడికి వయస్సేమిటి, మనస్సు ముఖ్యం కాని!! డెబ్బయి ఏళ్ల వయసులో మీ ముత్తాతయ్య మీనాన్నను కన్నాట్ట! తెలుసా" అన్నది అనసూయమ్మ మొహాన్ని గంటు పెట్టుకుని. సరళ ఇహ తల్లి దగ్గర నుంచో లేదు. నిట్టూరుస్తూ తన గదిలోకి వెళ్ళిపోయింది. శ్యామల అట్లా అన్న తర్వాత, ఆ అమ్మాయి దగ్గరకు మళ్ళీ వెళ్ళలేదు సరళ. గిల్టీగా ఫీలు కాసాగింది. మనసు గట్టి చేసుకుని ఒకసారి వెళ్ళి వద్దామన్నా, శ్యామల ఎప్పుడూ ఏదో పని చేస్తూ కనబడసాగింది.

ఒక్క క్షణం తీరిగ్గా రెండు కాళ్ళూ ఒక్క చోట ముడుచుకుని కనబడలేదు. "ఇది విన్నావుటే? ఇంట్లో పని మనిషిని మానిపించేసి ఇంటి పనంతా శ్యామలే చేస్తోందట!! డాక్టరుగారు సంపాయిస్తున్నది చాలక. పైసా పైసా తను కూడా

రాజాలక్ష్మీ అవార్డు వ్యవస్థాపకుడు శ్రీ రమణయ్య రాజా షష్టిపూర్తి ఉత్సవం ఇటీవల మదరాసులో వైభవోపేతంగా జరిగిన సందర్భంగా తీసిన ఛాయా చిత్రం.



కూడబెడదామని కాబోలు! డబ్బే! డబ్బు!! లేని కొంపలో నుంచి వచ్చేసరికి, డబ్బు మీద యావ ఎక్కువైపోయి వుంటుంది!" అన్నది అనసూయమ్మ అన్నాల దగ్గర సరళతో వో రాత్రి.

"ఆ అమ్మాయి అట్లా కనబడలేదే నాకు!" సరళ మెల్లగా అన్నది.

"నీకేం తెలుసే? పెళ్ళి కాని పిల్లవు?... పెళ్ళయిన ఆడవాళ్ళు ఎట్లా ప్రవర్తిస్తారో?" ఇంకో నెల పోయిం తర్వాత, మధ్యాహ్నం పూట సరళ కాలేజీ నుంచి వచ్చిం తర్వాత, ఆ అమ్మాయికి అన్నం పెడుతూ అనసూయమ్మ అన్నది. "సరూ, ఈ సంగతి తెలిసిందా నీకూ?"

"ఏ సంగతి?" సరళ కుతూహలంగా అడిగింది.

"డాక్టరుగారింట్లో తోట మనిషినీ, వంట మనిషినీ కూడా మానిపించేసిందట ఆ కోడలు పిల్ల!" వంటా-పెంటా అంతా తనొక్కతే స్వయంగా చూసుకుంటోందట!! పిల్లల్ని అటూ యిటూ కదలనివ్వటం లేదట! వాళ్ళకు పాఠాలూ అవీ తనే చెప్తోందట!! ఇప్పుడేమంటావ్? ఇదంతా ఆదా కోసం, అవునా కాదా? కాలు మీద కాలు వేసుకుని మహారాణీలా అన్ని భోగాలూ అనుభవించక ఈ కాయకష్టం ఏవిటట ఆ అమ్మాయికి?" అనసూయమ్మ నిష్ఠూరంగా అడిగింది.

తపస్సు

ఫలితం మాటలా వున్నా
జ్వలించే ఈ తపన
లయించే క్షణాలని
లక్షల అక్షరాల్లో
నిక్షిప్తం చెయ్యాలని
ప్రాణ శక్తితో మెరిసే జీవితాలనించీ
జ్ఞాన దీప్తి గ్రహించాలని,
కవ్వించే కళను
కౌగిలించాలని

—సౌభాగ్య

ఆడపుట్టుక

"ఒకసారి నువ్వే స్వయంగా వెళ్ళి చెప్పి రాకపోయినావా?" సరళ సౌమ్యంగా అన్నది.

"అదే అనుకుంటున్నాన్లే!"

అనుకుంటున్నట్టుగానే, రాత్రి తొమ్మిది గంటలవేళ డాక్టరు గారి దొడ్లో నూతి చప్టా దగ్గర శ్యామల చన్నీళ్ళు స్నానం చెయ్యడం చూసి, ఉండబట్టలేక అనసూయమ్మ అక్కడికి వెళ్ళి అడిగింది. "రాత్రిపూట ఈ చన్నీళ్ళ స్నానాలేమిటమ్మాయ్?"

"రండి, రండి అక్కయ్యగారూ!" అంటూ ఇరవైయ్యేళ్ళ శ్యామల యాభయ్ ఏళ్ళ అనసూయమ్మను తీసుకుని, వరండా మీద ఉన్న మడి బట్టను వంట జుట్టుకుని దేవుడి గదిలోకి దారి తీసింది. దేముడి గదిలో జాజ్వల్యమానంగా దీపాలు వెలుగుతున్నయ్. అగరబత్తీల పరిమళం గది అంతటా వ్యాపించి ఉంది. దేముడి ముందు మోకరించి శ్యామల అన్నది. "భగవంతుడా! నాకు ఏ వరం ఇచ్చినా ఇవ్వకపోయినా... డాక్టరుగారినీ, పిల్లల్నీ చల్లగా కాపాడు!" పిల్లల కోసమే నిన్ను పెళ్ళి చేసుకుంటున్నాను సుమా!" అన్నారు నా పతి దేవులు" కన్నె పిల్లలందరూ కలలు కనే మొదటి రాత్రి 'క్షమించు శ్యామలా! నేను పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్నాను!" అన్నారు నా భర్త. నాకెట్లాగూ తల్లినయ్యే యోగం లేదు. కనీసం ఈ ఇంటి దాసిగానైనా నా ఆడ పుట్టుకను సార్థకం చెయ్!" అంటూ శ్యామల వెనక్కు తిరిగి చూసింది. అనసూయమ్మ అక్కడ కనబడలేదు.



ఈకాలం పిల్లలు....

కె. నాగేశ్వరి

ఆడపిల్లలు మగపిల్లలు కలిసి చదువుతున్నారు. ఇళ్ళలో వాటాలుగా వుంటే వారితో వీరు, వీరితో వారు మాట్లాడుకుంటారు. అలాగే కొంటితనం ఓపాలు ఎక్కువున్నవారు ఏడిపిస్తారు. కొన్ని సంవత్సరాల క్రితం ఈ ఏడిపించటం ఆడపిల్లల బుగ్గలు ఎర్రబడడం వరకూ, కళ్ళలో కోపం దోబూచులాడటానికే పరిమితమై వుండేది. నిజానికి ఆడవారికి తమ అందం ఏదో విధంగా ఎదుటివారు గుర్తించాలన్న ఆరాటం ఉంటుంది. అది ఒకవిధంగా బలహీనత! ఆ బలహీనత వెర్రితలలు వేస్తే బాగుండదు. ఎన్నో అనర్థాలకు దారితీస్తుంది.

కొందరికి చిరునవ్వు, సహృదయత పెట్టకుండానే అమరే ఆభరణాలు. వారు అందరినీ ఆకర్షిస్తారనడానికి సందేహంలేదు. అలా ఎక్కువ మందిని ఆకర్షించేవారికి సమస్యుండదు. వారికి అభిమానులే ఎక్కువుంటారు. వారి సహృదయతే మంచి స్నేహితులను, సన్నిహితులను ప్రోగు చేసుకునేట్లుంటుంది. ఇవన్నీ కూడా టీనేజ్‌లోనే ఉధృతంగా వుంటాయి.


ప్రస్తుతం సమాజంలో ఆడదాన్ని నవ్వించేవారే అరుదు. పసిపిల్లల్ని సహితం మానభంగం చేయడం, నూతన వధువులను కాల్చడం ఎక్కువయింది. అంతెందుకు పసితనం వీడి యౌవ్వనంలో అడుగు పెట్టిన యువతికి "సతి" త్వర అయేట్టు చేసే దురాచారం యింకా సమసిపోలేదు. ప్రతీ నోటా ఈ "సతి" గురించే గుప్పుమంటోంది.

నిజంగానే యిలా స్త్రీని పలురకాల హింస ఎన్నాళ్ళు కొనసాగుతుందో చెప్పలేం యౌవ్వనం రాగానే రంగురంగుల సీతాకోక చిలుకలా అలంకరించుకోవాలని ఆడపిల్లకుంటుంది. అబ్బాయిలు కొంటిచూపులతో తమకి ఝాడీగార్డులుగా తిరగాలని కొందరికి వుంటుంది.

ఇది బాహాటంగా ఒప్పుకోకపోయినా నిజం.

ప్రేమ విఫలమైన భగ్నప్రేమికులీ కులాంతర, మతాంతర ప్రణయాలు జరిపి వివాహం దగ్గర ఎన్నో సమస్యలని ఈనాడు చాలామందిలో చూస్తున్నాం. అనుభవజ్ఞులు వీరినో దృష్టితో చూస్తారు. తమ అనుభవాల దృష్ట్యా వారి సమస్యను పరిశీలిస్తారు. దానిని విశ్లేషించి ఓ మార్గం, మంచి మార్గాన్ని చూపిస్తారు.

అదే టీనేజ్‌వారైతే వారి ఆలోచనలపరిధిలోనే చూస్తారు. వారికీ ప్రణయం జరపాలనుంటుంది. లేదా సరదాకి ఏ చదువుగురించో, సినిమాల గురించో, సాహిత్యం గురించో చర్చించాలనుంటుంది. బైటికిమాత్రం బెట్టుసరిగా రిజర్వుడుగా వుంటారు. వీరు వయసుకంటే కొంచెం




ముదిమిగా అన్నింట్లోనూ వుంటారు. వీరి నడవడి మాట, ముఖ భంగిమ నిరంతరం ఏదో అతీతమైనవారిగా వుండాలనే భావాన్ని వ్యక్తం చేస్తుంటారు. అలాంటప్పుడు సాటి ఆడవారు తల్లి, సోదరి, వదిన మొదలైనవారు వీరికి మంచి సన్నిహితులుగా వుండాలి.

స్త్రీ, పురుషుల కలయికే సృష్టికి మూలమనీ, అందులో తప్పులేదనీ తేల్చాలి. వీరు బైటిక ప్రేమికులు. సోషల్‌గా వుండేవారిని తీవ్రంగా తెచ్చుంటారు. అది భ్రమనే వీరికి విప్పిచెప్పాలి. ముందు వీరూ దానికే ' నెగిటివ్‌గా అప్రోచ్‌అవుతున్నారని గ్రహిస్తే మరీమంచిది.

సాధారణంగా వీరు ఓ గిరిగీసుకుని వుంటారు. గనుక వీరి మనసులోని కోరిక తెలుసుకునే సాహసులు దొరకరు. దొరికితే వీరు ఎప్పటికైనా మంచి మార్గాన పడతారు. లేదా అలా ఒకవిధమైన స్థబ్దుగా బైటికుంటారు. లోపలమాత్రం తమకు కావల్సింది పొందలేదనే వేదన ఎక్కువగాపడతారు. అతి అమాయకమైన వీరి నైజం బైటవారికి రిజర్వుడునెస్‌గా లేదా అతి బుద్ధిమంతతనంగా కనుపించవచ్చు. వీరి సన్నిహితులెవరికైనా వీరేది కావాలనుకుంటున్నారో అది లభిస్తే వీరు ఓర్వలేరు. వారిని కసితో ఏదో అంటూంటారు. అది చాలు వీరి తత్వాన్ని పట్టియివ్వడానికి.

ఇలాంటివారిని వెలివేసినట్లు దూరంగా నెట్టేయకూడదు. ఆడా మగా కూడా స్వచ్ఛంగా తప్పులేకుండా స్నేహంగా ఉండగలరని చెప్పాలి. రానురాను తమచుట్టూ ఎవరూ తిరగలేదనే దురభిప్రాయాన్ని పోగొట్టుకొనేట్లు చేయాలి.

ఒకరిచుట్టూ ఇంకొకరు బొంగరంలా తిరగటమే జీవితానికి లక్ష్యం కాదన్న సంగతి వీరికి బాగా తెలియాలి. నిజాయితీని మించినదేదీ మనిషి మనుగడకు తోడ్పడదనే నిజం వీరికి యిరవైరెండేళ్ళలోపునే తెలియాలి. వీరు మంచి నిజాయితీపరులుగా స్థిరపడతారు. ఎవరితో కలవలేక, కలవాలన్న కోరికను జయించలేక మధనపడే వీరు పేచీకోరులుగా కనిపించినా, పైకొచ్చే లక్షణాలుకలిగివుంటారు. □



సీరియల్

డి.ఎస్.పి.విజయ్

ఆదూరి సావిత్రి



(గత సంచిక తరువాయి)

గురప్ప కళ్ళలో నీళ్ళు నిర్ఘాంత పోయినట్లు ఆగి పోయాయి. పై గుడ్డతో కళ్ళు తుడుచుకుని, "దొరా! నేనొకటి అడగనా?" అన్నాడు గురప్ప నెమ్మదిగా

'అడుగు " అన్నాడు విజయ్

అతని కంఠంలో తీవ్రత ఇంకా తగ్గలేదు.

"కోపం చేసుకోరుగా?" సందేహంగా అన్నాడు గురప్ప.

"నాకేం కోపం లేదులే! అడుగు." అన్నాడు విజయ్.

"నువ్వంటే నువ్వని ఎదిరిస్తున్నాననుకోకండి దొరా!"

"లేదులే! చెప్పు."

"మీ నాగరికుల్లో మాత్రం మగాళ్ళకి తమ బిడ్డలంటే ప్రేమ పొర్లి పోతోందా?

మా కన్నా మీరు ఎక్కువ నిగ్రహం కలవారా?

తన పెళ్ళాన్ని పరాయి మగాడితో చూసినప్పుడు మీ మగవాళ్ళకి మాత్రం ఆవేశం రాదా?

భార్యని, దొరికితే ఆమె ప్రియుడినీ చంపెయ్యాలనిపించదా?

బిడ్డల్ని తల్లికివ్వకుండా ఊడ లాక్కుని, ఆమెను బైటికి గెంటేసి... ఆ బిడ్డ కోసం ఆమె అలమటిస్తూ పిచ్చి దానిలా రోడ్డున పడితే పైశాచికంగా నవ్వుకునే మగవాళ్ళు మీలో లేరా?

మీ మగజాతి మా మగజాతి కన్నా గొప్పదా?

ఎందులో ?

ఏ మగాడు తన భార్య పరాయి మగాడితో కులకటాన్ని సహిస్తాడు?

మీలో మాత్రం పిల్లల కోసం ఎందరు తల్లులు ఆత్మహత్యలు చేసుకోటం లేదు?

అలా చేసుకోకుండా ఏ మగాడు ఆప గలుగుతున్నాడు?

నాగరికపు ముసుగు కప్పుకుని మీరు దారుణాలు చేస్తుంటే.... ఆడదాన్ని మీరు మానసికంగా హింసించి క్షణం క్షణం చచ్చేలా చేస్తుంటే.... మేమూ ముసుగును తీసేసి అక్కడికక్కడే.... సాగదియ్యకుండా ఆ కథలకు ముగింపు పలికేస్తున్నాం

మీకూ మాకూ ఏ విధమైన తేడా లేనప్పుడు.... మీరు మా కన్నా ఎందులోనూ ఉన్నతంగా లేనప్పుడు ఎందుకు దొరా మమ్మల్నీ మా కులపు కట్టుబాట్లనీ ఇన్ని తిట్లు తిడతారు?" అన్నాడు గురప్ప.

నాగరిక ప్రపంచాన్ని సవాలు చేస్తూ గురప్ప అడుగుతున్న ప్రశ్నలకు... ఆ ముసుగు కప్పుకుని ఈ చెంచులకన్నా హీనమైన, నీచమైన పనులు చేస్తున్న ఏ పెద్ద మనిషి సమాధానం చెపుతాడు?

వాళ్ళందరి ప్రతినిధిగా తను మాత్రం ఏమని జవాబివ్వ గలడు?

కొద్ది సేపు ఏం మాట్లాడలేక పోయాడు విజయ్. ఆ తరవాత కాస్త తేరుకున్నాడు.

"నువ్వన్నది నిజమే గురప్పా మాలో మీ కన్నా క్రూరంగా ప్రవర్తించే మూర్ఖు లున్నారు

కానీ.... మాలో కొందరు సంస్కార వంతులు కూడా ఉన్నారు. వాళ్ళు ఆడదాన్ని, ఆమె అభిప్రాయాలనీ.. సెంటిమెంట్లనీ మనస్ఫూర్తిగా మన్నించ గల సహృదయులు.

ఎప్పటికైనా ఆ మంచితనం .. మిగిలిన వాళ్ళకు కొంతయినా వ్యాపించ గలదనే ఆశ... నమ్మకం మాకున్నాయి. స్త్రీలలో నిరాశావాదాన్ని పారద్రోల గల అవకాశం మాకుంది. మీలో అది లేదు.

మీలో ఎవరైనా సంస్కారవంతు లున్నా. మీ సాంప్రదాయం అతని మంచితనాన్ని బలవంతంగా చంపేస్తోంది.

సాంప్రదాయాల పేరిట ఆడవాళ్ళనీ, పసి బిడ్డల్నీ నిర్దాక్షిణ్యంగా చంపి పారెయ్యటమే మీకు తెలిసిన న్యాయం.

ఈ బలవంతపు న్యాయానికి మీలో వున్న మంచి వాళ్ళూ చెడ్డ వాళ్ళూ కూడా కట్టుబడి ఉండాలి

ఇహ మీలో మార్పేం వస్తుంది?

అలా వెళ్ళి పోయిన ఆడపిల్లల్ని తిరిగి మీ గూడెంలో అడుగు పెట్ట నివ్వకండి. తలిదండ్రులతో సంబంధాలు పెట్టుకో నివ్వకండి. మీ నుంచి ఏ సపోర్టు ఆమె కందనివ్వకండి

ఆమెను ఎత్తుకెళ్ళిన వాళ్ళు మీ హద్దుల్లో అడుగు పెడితే శిక్షించండి.

ఇష్టమయి వెళ్ళింది గనక అక్కడ ఆమెకు ఎదురయ్యే బాధలు, సమస్యలు ఆమెనే ఒంటరిగా ఎదుర్కో మనండి. మంచయినా, చెడయినా ఆమె నొక్కదాన్నే భరించ మనండి. ఆమెకి శిక్ష చాలు.

కానీ.... ఆమెతో పాటు ఆమె బిడ్డల్ని కూడా పంపెయ్యండి. తల్లీ బిడ్డల్ని బలవంతంగా విడదీసి ఇలాంటి దారుణాలకు పాల్పడకండి.

ఆలోచించు గురప్పా!

నువ్వు కుల పెద్దవి.

వంశపారం పర్యంగా వస్తున్న అధికారం నీది.

నిన్నెవరూ ఎదిరించరు.

ప్రయత్నిస్తే.... నువ్వే నెమ్మది నెమ్మదిగా మీవాళ్ళలో మార్పు తేగలవు.

ప్రయత్నించటంలో తప్పు లేదు గదా!

నువ్విప్పట్నుంచి ప్రారంభిస్తే... నీ తదనంతరం ఇంకోరు.... ఇలా ఇంకో తరానికయినా మార్పు వస్తుంది.

వాతావరణ మంతా నీకు వ్యతిరేకంగా మారొచ్చు. అయినా ప్రయత్నించు. ఆ మూర్ఖత్వాన్ని పోగొట్టటం వాళ్ళలో ఒకడివయిన నీ ద్వారా మాత్రమే సాధ్య

జరిగిన కథ– 26: గోదావరి వరదల్లో మాధవరావు కుటుంబం కొట్టుకు పోతుంది. వైజయంతి ఏమయిందో తెలియదు. విజయ్ చెంచులతో వాళ్ళ గూడానికి వెళ్ళి రంగారావు గురించి పరిశోధన ప్రారంభిస్తాడు. చెంచీతకు మరో గూడెం యువకుడు పోతరాజుతో మనసు కలుస్తుంది. సింగారి దుర్మరణం చూసిన చెంచీత ఉరిపోసుకుని చనిపోతుంది. వాళ్ళ ఆచారాల పట్ల విజయ్‌కు కోపం కలుగుతుంది

మవుతుంది" నచ్చ చెపుతున్నట్లుగా అన్నాడు విజయ్.

విజయ్ మీద గురప్పకు అపారమైన గౌరవాభిమానా లున్నాయి అందుకే ఎదిరించ కుండా అతను చెప్పేది మౌనంగా సాలోచనగా వింటున్నాడు.

"చాలు! అతనిలో కనీసం ఈ మాత్రపు ఆలోచనను రేకెత్తించ గలిగితే మార్పు అదే వస్తుంది' అనుకున్నాడు విజయ్..

బిడ్డల కోసం మరణించిన సింగారి, చెంచీతలను చూస్తుంటే అతనికి వైజయంతి పదే పదే గుర్తొస్తోంది నానీ కోసం ఆమె ఎంత హింస ననుభవిస్తోందో!

గురప్ప సహాయంతో అడివిలో చాలా ప్రాంతాలు వెతికాడు. అయినా రంగారావు ఉనికిని కనుక్కోలేక పోయాడు ..

రంగారావు కార్య కలాపాలన్నీ ఈ అడవిలోనే జరుగు తున్నాయనేది నిర్వివాదాంశం

"ఎన్నాళ్ళయినా సరే ఉండి.. పట్టుదలగా ప్రయత్నించి వాడి అంతు చూడాలి.' అనుకుంటున్నాడు విజయ్

* * * * * *

పెద్దవాళ్ళు ఆహారం కోసం ఆడివిలో కెళ్ళారు పిల్లలంతా గుడిశల బయట కొచ్చారు ఆటల కోసం



నాకు నచ్చిన సన్నివేశం

టాపిక్ రంగారావు మీదికి తిరిగింది.

"రంగారావు, ధర్మారావు తోడు దొంగలు" అన్నాడు చంద్రావు. "ఆ సంగతి మీతో పాటు ఇక్కడ ప్రజలందరికీ తెలుసు. అయినా వాళ్ళు ప్రతిసారీ ధర్మారావునే గెలిపిస్తారు. ఆఖరుకు ముఖ్యమంత్రి లాంటి కీలకమైన స్థానాన్ని అధిరోహించిన వ్యక్తులపట్ల కూడా 'క్రేజ్' ఒక్కటే ప్రధాన పాత్ర వహించే స్థాయిలో ఉన్నాయి మన ప్రజల ఆలోచనలు. పరిపాలనా దక్షత లేకపోయినా, సంవత్సరాల తరబడి కన్నెత్తి ప్రజలవేపు, పాలనా



యంత్రాంగం వైపు చూడలేని కోమాలాంటి స్థితిలో పడున్నా, రేపో మాపో ఎగిరిపోయేంత జరాభారంతో కృంగిపోతున్నా, పట్టించుకోకుండా "ఆయన మా ముఖ్యమంత్రి" అని చంకలు గుద్దుకునే పిచ్చితనం నుంచి బయటపడి ప్రజలు చైతన్యవంతులై తిరగబడ్డనాడు రంగారావులు, ధర్మారావులు నామరూపాల్లేకుండా పోతారు అంటాడు విజయ్.

"కాని ఇంకొక పందేళ్ళ తరువాతైనా మనం ఇలాంటి మార్పును చూడగలమా?" అన్నాడు మురళి.

"చూడలేం. ఎందుకంటే ఇంకో పందేళ్ళ తరువాత మనం ఉండంగా" అన్నాడు విజయ్.

పై సన్నివేశంలో ఓటర్ల బలహీనత, తొందరపాటు గురించి మనసుకు హత్తుకొనేలా వర్ణించబడింది. రచయిత్రికి అభినందనలు.

-కె. ఉమాదేవి, మార్కాపురం




సౌందర్య దారుణంగా శ్రీధర్‌చే మోసగించబడుతుంది. ఆమె డి. ఎస్. పి. విజయ్‌ని ఆశ్రయిస్తుంది. అతను ఆమెను సహృదయముతో చేరదీసి, జగదీష్ అనే స్నేహితుని దగ్గఱకు పంపుతాడు. ఈ విషయాన్ని మురళి మాటల సందర్భంలో తెలుసుకుంటాడు. ఆమెకు తెలియకుండా, ఆమెపై ఒక అభిప్రాయానికి వస్తాడు. ఆమెకు కొత్త జీవితం ప్రసాదించే వారెవరైనా ముందుకు వస్తారా? అనే సమయంలో మురళిలాంటి వ్యక్తి ముందుకు రావడం, మరియు నానీ, విజయ్‌ల ఆప్యాయతాను రాగాల సన్నివేశాలు నా కెంతో నచ్చాయి.

-కె. బి. వి. జి. క్రిష్ణారావు.
విశాఖపట్టణము

* * *

"చెడిపోయిన తనను పెళ్ళి చేసుకోటానికి ఎవరు ముందుకొస్తారు? పవిత్రత అనేదానిని కేవలం మనసుకే ఆపాదించి బలవంతాన చెరచబడ్డ ఆడదాన్ని స్వీకరించగల పయార్థ వ్యక్తాపులు మగాళ్ళలో



డి. ఎస్. పి. విజయ్

వాళ్ళ దగ్గర బాణాలు గురి తప్పకుండా విసరటం నేర్చుకుంటున్నాడు నానీ. వాడికీ ఆట చాలా ఉత్సాహంగా ఉంది....

ఎదురుగా ఉన్న చెట్టు మీద సున్నాలు పెట్టుకుని, ఆ సున్నాల మధ్య నున్న చుక్కకు తగిలేలా బాణం విసరటం ప్రాక్టీస్ చేస్తున్నాడు నానీ.

చెంచుల పిల్లలు కూడా కొంద రతని దగ్గర నిలబడి చూస్తూ మధ్య మధ్య తాము కూడా బాణాలు విసురు తున్నారు.

ఇంతలో ఓ తెల్లని కుందేలుపిల్ల పొదలో నుంచి బయట కొచ్చి పరుగు తీసంది....

పిల్లలంతా దాని వెంట పడ్డారు....

కుందేలు మెరుపు వేగంతో బాణం గురిని తప్పించుకుని పరుగెత్తింది. పిల్లలు పట్టుదలగా దాని వెంట పడ్డారు. చివరి కది వీళ్ళకి దొరక్కుండా మరో పొదలో దూరి తప్పించు కుంది....

పొదలు కదుపుతూ వాళ్ళు వెతుకుతూనే ఉన్నారు....

చెట్టు మీద కిలకిల లాడుతున్న పక్షుల్ని చూసి, అటు పరుగెత్తి సరదాగా ఓ బాణం వేశాడు నానీ.

వెంట్రుక వాసిలో గురి తప్పింది. మిగతావన్నీ రెక్కలు టపటప లాడించుకుంటూ పారి పోయాయి.

మిగిలిన పిల్లలు కుందేలు గొడవలో పడితే.... నానీ పక్షుల్ని వెతుకుతూ ఉత్సాహంతో కూడిన ఉద్వేగంతో వాళ్ళ నుంచి విడి పోయాడు.

కొంచం దూరం వెళ్ళాక ఓ నెమలి కనిపించింది. "హాయ్! పికాక్!" అంటూ అటు పరుగెత్తాడు...

అడివంతా అత్యద్భుతంగా కనపడు తోంది నానీకి....

భయాన్ని మర్చి పోయి కుతూహలంగా నడుచుకుంటూ వెడు తున్నాడు....

ఉడతల వెనక పరుగు తీస్తూ కేరింతలు కొడు తున్నాడు....

అతని మొహంలో పొంగులు వారుతున్న ఉత్సాహాన్ని అడవి తల్లి ముచ్చటగా చూస్తూ తల ఊపుతోంది....

అలసటగా అనిపించి ఒక చోట కూలబడ్డ నానీ కడుపులో పిల్లిలా ప్రవేశించింది ఆకలి....

ఉన్నారా?" అని ప్రశ్నిస్తూ... "పోనీ... మీరు చేసుకోగలరా నన్ను?" అని విజయ్‌ని సవాలు చేస్తుంది సౌందర్య. అప్పుడు విజయ్ చెప్పిన సమాధానం... ఆ సమాధానానికి చలించిపోయిన సౌందర్య మానసిక స్థితి గురించి, ఈ సీరియల్‌లో అద్భుతంగా వర్ణించారు సావిత్రిగారు.

హృదయాన్ని కదిలించి, మనసును ఆర్ద్రతతో నింపివేసే ఈ సన్నివేశం నాకు బాగా నచ్చింది.

-ఎం. వి. రామారావు,
చిక్‌మంగుళూర్ (కర్ణాటక)

★ ★ ★

రాజకీయంగా స్టూడెంట్స్‌ని ఏవిధంగా వాడుకుంటారో సావిత్రి గారు బాగా వ్రాసారు. కొందరు విద్యార్థులు చాలా మూర్ఖంగా ప్రవర్తిస్తారనటానికి ఈ సంఘటన చాలు. విజయ్‌మీద కోపంతో ధర్మారావు విద్యార్థులను ఉసికొల్పటం వారు ముందు వెనక ఆలోచన లేకుండా దౌర్జన్యానికి దిగటం, రాళ్ళు విసరటం వంటివి



చదువుతుంటే హృదయం స్పందించింది.

కానిస్టేబుల్‌కి, విద్యార్థికి మధ్య ఘర్షణలో "ప్రభుత్వమే స్వయంగా సారాయి దుకాణాలు నడి రోడ్డుమీద తెరచి తాగండి కొడకల్లారా అంటుంటే పట్టికెళ్ళి తోసెయ్యటానికి మధ్యలో వెడెవడు?" అని విద్యార్థి అంటాడు. ఇది అక్షరాల నిజం. అందుకే నాకు ఈ సన్నివేశం నచ్చింది.

-కె. యన్. పద్మావతి,
నూజివీడు

★ ★ ★

"మా మమ్మీ నన్ను ఐ. ఏ. యస్. చదివిస్తాను అనుకొనేది. అంకుల్.... మా మమ్మీని రంగారావే ఎక్కడో దాచి ఉంటాడు. మమ్మీని కూడా మీ రెళ్ళి విడిపించరూ."

తల్లి మాట తలుచుకోగానే నానీ గొంతులో అప్పటి వరకు వున్న కుతూహలం పోయి దీనత్వం చోటు చేసుకుంది.

"తప్పకుండా మీ మమ్మీని విడిపిస్తాను. ప్రామిస్" ఆర్ద్రంగా అన్నాడు విజయ్.

ఈ సన్నివేశంలో రచయిత్రి సావిత్రి



గారు నానీ, విజయ్‌లతో అనిపించిన మాటలు నాకు బాగా నచ్చాయి.

– యమ్. బాలత్రిపురేశ్వరి,
పరింపూడి (ప. గో)



పంజరం లాంటి లతా నాట్యశాల నుండి ఓ అమ్మాయి ఎంతో ధైర్యంగా రెయిడ్ చేయమని మెసేజ్ పంపిస్తుంది. ఆ మెసేజ్ ప్రకారం డి. ఎస్. పి. విజయ్ వెంటనే మారు వేషంలో వెళ్ళి నాట్యశాల ప్రిన్సిపాల్ అయిన హేమలతతో ఏ విధంగా మాట్లాడితే తన దారికి వస్తుందో గ్రహించి ఆ విధంగా మాట్లాడి తనకు కావలసిన అమ్మాయిని ఎన్నుకుని ఆ అమ్మాయి ద్వారా వివరాలు సేకరించి కాపలా ఉంచిన పోలీసులకు సిగ్నల్ ఇచ్చి వారు పారి పోవుటకు వీలు లేకుండా అందరూ కలసి అరెస్టు చేయుట. ఈ సన్నివేశం నాకు చాలా బాగా నచ్చినది.

జి. రత్నమంజరి, రాజమండ్రి □

చుట్టూ చూస్తూ లేచి నిలబడి కొంచం దూరం నడిచాడు.... తను వచ్చిన దారి కనపడ లేదు....

ఏ పక్కకు వెళ్ళినా ఈ దారి కాదనే అనిపిస్తోంది....

హఠాత్తుగా నానీలో ఉత్సాహం మాయమయి భయం పాము పిల్లలా ప్రవేశించింది....

బిక్క మొహం వేసుకుని దిగులుగా చుట్టూ చూస్తున్నాడు... భయం.... ఆకలి వాడిని చుట్టుముట్టి ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి....

అప్పటిదాకా ఆహ్లాదంగా అనిపించిన పక్షుల కిలకిలలూ... ఉడతల పరుగులూ... చల్లని నీడనిస్తున్న పచ్చని చెట్లు వాడికిప్పుడు భయంకరంగా అనిపిస్తున్నాయి . ఆ చప్పుడు వింటూ ఉలికులికి పడుతున్నాడు... భయంతో ఒణికిపోతూ "అంకుల్... అంకుల్" అని పెద్దగా పిలుస్తూ ఏడుస్తున్నాడు...

చొక్కా అంచుతో కళ్ళు తుడుచుకుంటూ "అం... కుల్" అని వెక్కిళ్ళు పెడుతూ పిచ్చివాడిలా అక్కడక్కడే కలియ తిరుగుతున్నాడు.

ఏ క్షణాన్నయినా స్పృహతప్పి పడిపోయేలా ఉన్నాడు... అతని ఏడుపులు, కేకలు విని అటుగా వెడుతున్న కొందరు వ్యక్తులు ఆగిపోయారు...

"అంకుల్... అంకుల్". రోదనతో కూడిన స్వరం మళ్ళీ ఆ నిశ్శబ్దంలో ప్రతిధ్వనించింది.

వాళ్ళు ఆ కేకనీ, రోదననీ, ఆధారంగా చేసుకుంటూ వచ్చి నానీని కలుసుకున్నారు.


నాగరికంగా ఉన్న మనుషుల్ని చూడగానె నానీలో భయం, ఏడుపూ కొంత తగ్గాయి.

"ఎవరు నువ్వు? ఈ అడివిలో కెందుకొచ్చావ్?" అన్నారు వాళ్ళు మొరటుగా. వాళ్ళ మాటల్లో ఏదో అపస్వరం.

"దారితప్పాను." అన్నాడు నానీ. అతనిలో భయం మళ్ళీ ప్రవేశిస్తోంది...

"అది తెలుస్తూనే ఉంది. ఎవరొచ్చారు నీతో? ఏమయ్యారు వాళ్ళు?" అనుమానంగా అడిగారు ఆ మనుషులు.

"మేం ఎక్స్‌కర్షన్‌కొచ్చాం. నేను అడవి చూస్తూ వచ్చి దారితప్పి ఇక్కడ పడి పోయాను. మా మేడంలు, మిగిలిన పిల్లలు నాకోసం వెతికి, తిరిగి



వెళ్ళిపోయుంటారు మాది బోనాలపల్లి" అన్నాడు నానీ భయంగా

తనూ, విజయ్ కలిసి వచ్చినట్లు... చెంచుగూడెంలో ఉన్నట్లు వాళ్ళకి చెప్పటం మంచిది కాదనిపించింది నానీకి

"అడివిలో ఎక్స్‌కర్షనేమిటిమీ బొంద! ఏం చూసి ఛస్తారిక్కడ?

సరే మాతోరా నిన్ను మీవాళ్ళ కప్పగిస్తాం "తెల్లగా పెద్ద పెద్ద కళ్ళతో చురుగ్గాఅందంగాఉన్న నానీని చూస్తూ అన్నారు వాళ్ళు.

'నేను రాను అప్రయత్నంగా అన్నాడు నానీ

'ఇక్కడుంటే పులుల వాతబడి చస్తావ్'

"అయినాసరే నేను రాను "

నాలుగు పెరికి, లాక్కొచ్చి జీప్‌లో పారెయ్యక ఏందెహె వాడితో గోల?' అన్నాడొకడు విసుగ్గా

సంధించి విడిచిన బాణంలా పరుగందుకున్నాడు నానీ..

నిశ్చేష్టులై నిలబడ్డారు వాళ్ళు దీన్ని వాళ్ళు ఊహించలేదు రన్నింగ్ రేస్‌లో నానీ ఎప్పుడూ ప్రథముడుగా వచ్చేవాడు వాళ్ళు తేరుకునివెంటపడేసరికే చాలా దూరం పరుగెత్తిన నానీ దట్టంగాపెరిగిన చెట్లలోకి కనుమరుగయాడు

ఆ చెట్లలోకి జీప్ వెళ్ళదు ఇద్దరు దిగి అటు పరుగెత్తారు

'కుర్రనా కొడుకు వేలెడు లేదు కంట్లో కారం కొట్టి లగెత్తాడు నాయాలగాడు దొరకాల అది పని సఫా చేసి పారెయ్యాల' అంటూ ఆగిపోయారువాళ్ళు

అక్కడ మూడు దార్లున్నాయి

వాడెటు వెళ్ళుంటాడు?


ఇద్దరూ చెరో దారి వెళ్ళారు .

అదృష్టవశాత్తు నానీ మూడో దారిలో ఉన్నాడు కొంత దూరం వెళ్ళాక ఇహ పరుగాపి దట్టంగా ఉన్న చెట్టు కొమ్మల మీదుగాపైకెళ్ళి, వాటి గుబురులో ఊపిరి బిగబట్టి కూర్చున్నాడు

వాడి గుండెల చప్పుడు వాడికే భయంకరంగా వినిపిస్తోంది

ఆ మనుషులు కొంత దూరం వెతికి విసుగెత్తి వెనక్కి వచ్చారు విశాలంగా విస్తరించిన ఆ అడివిలో ఎటుబడితే అటే దారులున్నాయి. పారిపోయిన మనిషి అంత తేలికగా పట్టుబడడు

'పోనీండెహె ఎవడో కుర్ర వెధవ దారి తపి ఇటు కొట్టుకొచ్చాడు వాడి కోసం మనమెందుకింత కష్టపడటం? ఆ కుర్రాడెట్లాగా చస్తాడు ఏ క్రూర మృగంపాలిటో పడి ఇహ మనకెందుకీ తిప్పలు కామ్‌గా ఊరుకుంటే సరి." అనుకుంటూ



వాళ్ళు వెళ్ళిపోయి జీప్ ఎక్కారు... అడివంతా చీకట్లు కమ్ముకుంటున్నాయి..

రకరకాల మృగాలు నిర్భయంగా బయటకొస్తున్నాయి .. జంతువుల గర్జనలు. . వాటి కాహుతయిన ప్రాణుల ఆర్తనాదాలు అక్కడ భయంకరంగా ప్రతిధ్వనిస్తున్నాయి .

నానీ గుండెలు అవిసిపోతున్నాయి.. .

ఎక్కడి నుంచో పాముల బుస బుసలు వినిపిస్తున్నాయి

ఈ చెట్టు మీదే కావచ్చు

కదలకుండా... శవాకారంలా చెట్టుకు కరుచుకుని ఉన్నాడు నానీ

భయంతో వాడి ప్రాణాలు కడంటిపోతున్నాయి

కళ్ళలో నుంచి నీళ్ళు ధారాపాతంగా కారుతున్నాయి.

"అంకుల్.. అంకుల్ ." అంటూ ఆక్రోసిస్తోందతని మనసు నిశ్శబ్దంగా ఏడుస్తున్నాడు నానీ.

* * * * * *

నానీ తప్పిపోయాడనే వార్త విని తల్లడిల్లిపోయాడు విజయ్ ...

అన్నం కూడా తినకుండా అప్పటికప్పుడు బయల్దేరాడు వెతకటానికి గురప్ప, ఇంకొద్దరు చెంచులు అతని వెంట వున్నారు..

చీకటిపడే వరకు అలా వెతుకుతూనే ఉన్నారు

నానీ జాడ లేదు ..

ఏమయ్యాడు?

క్రూరమృగాల కాహుతయ్యాడా?

రంగారావు మనుషుల చేతికి చిక్కాడా?

రేపు.. జయంతికి మొహమెలా చూపించాలి?

"రాత్రిపూట లాభంలేదు దొరా. తెల్లారాక మళ్ళీ వచ్చి వెతుకుదాం అన్నాడు గురప్ప

"నో!

మీరెళ్ళండి

వాడు ఏ ఆపదలో ఉన్నాడో తెల్లవార్లూ వాడినా స్థితిలో వదిలి... తెల్లవారటం కోసం తీరికగా ఎదురు చూడ్డం నా వల్లకాదు"

అతని కంఠంలో దుఃఖపు జీరలకు కదిలిపోయిన గురప్ప ఇహ మాట్లాడలేదు

బాణాలు కాగడాలు తీసుకుని అడివిలో మళ్ళీ అన్వేషణ ప్రారంభించారు .

"నానీ. నానీ. ." అనే విజయ్ పిలుపు ఉండుండి అడివిలో ప్రతిధ్వనిస్తోంది

ఎక్కడ నుంచయినా పులి ఛార్జి చేయవచ్చు. ఎలుగుబంట్లు, శివంగులు మిదికి దూకొచ్చు.. విషసర్పాలు ఎదురవొచ్చు...

విజయ్ వీటివల్ల తనకొచ్చే ఆపద గురించి ఆలోచించటంలేదు.

ఇంత చీకట్లో . ఈ అడివిలో నానీ ఇంకా బ్రతికే ఉన్నాడా అనే బాధ, సందేహం అతన్ని తొలిచేస్తున్నాయి....

అంత పెద్ద పోలీసాఫీసరూ విపరీతంగా చలించి పోతున్నాడు...

అతి మామూలు మనిషిలా అలమటిస్తున్నాడు. .

"నానీ.. నానీ .." అని ఆక్రోసిస్తున్నాడు...

వేగుచుక్క పొడిచింది. . వేకువ తెరతీసింది...

తూర్పు తెల్లబడింది...

నానీ బ్రతుకున్నాడనే ఆశ పూర్తిగా నశించిపోయింది విజయ్‌లో.

డస్సిపోయినట్లు ఒక బండరాతి మీద కూర్చుని మోకాళ్ళలోకి తల ఒంచుకున్నాడు....


(ఇంకా ఉంది)

చిన్నారి బాలల దీనగాథలు

ఈనాడు చిన్న పిల్లల ఆరోగ్య మనేది మన దేశంలో ఒక సమస్యగా మారింది. పౌష్టికాహార లోపం. తగిన సంఖ్యలో తల్లీ బిడ్డల సంక్షేమ కేంద్రాలు, ఆరోగ్య విభాగాలు లేకపోవటమే వీటికి కారణాలు. పౌష్టికాహారం లోపం వల్ల ఎంతో మంది పిల్లలు మెడికల్ అబ్‌నార్మలిటిస్‌కు గురవు తున్నారు. దీని కోసం జిల్లాల వారిగా పౌష్టికాహార పరిశోధనలు జరిపించి పిల్లల్లో పౌష్టిక శక్తిని అంచనా కట్టించాలి. ఆ విధంగా పరిశీలించిన తర్వాత ఆయా ప్రాంతాల

బాలల సంక్షేమమే భారత సంక్షేమం

అలవాట్లకు, ఆచారాలకు అనుగుణంగా అందుబాటులో వుండే ఆహార పదార్థాలను చౌకగా వుత్పత్తి చేయించాలి. బహుళార్థ కాహారం, బాలాహారం మొదలైన పిల్లలకు పనికి వచ్చే ఆహార పదార్థాలను ప్రోత్సహించి ప్రచారం చేయించాలి. వికలాంగులైన పిల్లల విషయంలో కూడా అంతగా అభివృద్ధి సాధించ లేదనే చెప్పాలి ఈ



సంస్థల్లో తర్ఫీదు పొందిన సిబ్బంది లేకపోవడం కాని, చాలినంతగా చికిత్స చేయలేక పోవడం గాని జరుగుతుంది వికలాంగుల కవసరమయ్యే సామాగ్రి తగినంతగా లభ్యం కావటం లేదు. ముఖ్యంగా గ్రామీణులు పిల్లల శారీరక ఆరోగ్యం, బిడ్డల పెంపకం విషయంలో వెనుకబడి వుంటున్నారు. ప్రాథమిక సూత్రాలు కూడా వాళ్ళకు తెలియడం లేదు. కనుక తల్లి దండ్రులకు ఆరోగ్యం, పౌష్టికాహారం గురించిన విజ్ఞానం తెలిసి వుండడం ఎంతో అవసరం. బిడ్డల ఆరోగ్యం మీద దెబ్బ తీసే మూఢ నమ్మకాలను పూర్తిగా నిర్మూలించాలి.



ఆరోగ్య కేంద్రాలు, ప్రసూతి కేంద్రాలు అందించే సమాచారాన్ని వారు ఉపయోగించేటట్లు చూడాలి. వెనుకబడిన ప్రాంతాల్లో, మురికి వాడల్లో శిశు సంక్షేమ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి బలహీన వర్గాలకు చెందిన పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా వైద్యం, పోషకాహారాన్ని సప్లై చెయాలి సరియైన విద్యా సదుపాయాలు బడుగు వర్గాలకు అందుబాటులో లేకపోవటం వల్ల బాలలు కార్మికులుగా మారుతున్నారు. రాత్రింబవళ్ళు చెమటోడ్చినా న్యాయమైన వేతనం లభించక పోవటం వల్ల ఆకలి మంటను అదుపులో పెట్టుకోలేక దొంగతనానిక పాల్పడు తున్నారు బాల కార్మికులకు వసతి గృహాలు ఏర్పాటు చేసి. మానసిక, సాంస్కృతిక వికాసానికై రిక్రియేషన్ సౌకర్యాల్ని కలిగించాలి. బాల లందరికీ నిర్బంధోచిత ప్రాథమిక విద్యను అందించ టానికి నూతన విద్యా విధానాన్ని సంస్కరించాలి. "బాలల సంక్షేమమే భారత సంక్షేమం"గా గుర్తించివారి పురోభివృద్ధికై ప్రభుత్వం ఉద్యమించాలి.

– డి. శ్రీనివాస్, తెనాలి

* * *



లోపల గదిలో పని చేస్తున్న నాకు అక్కా! అన్న పిలుపు విన్పించి చేస్తున్న పని ఆపి బైటకు వచ్చాను ఎదురుగా పదమూడు సంవత్సరాలు వుంటా యేమో ఒకపాప, ఆ పాప ప్రక్కనే ఐదు సం. నిండీ నిండని మరో చిన్నపాప. ఆ ఇద్దర్నీ నేను చూసిన గుర్తు లేదు వారి కలుపుగోలు తనానికి నాకు ముచ్చట వేసింది.

'అందుకే ఎవరు పాపా మీరు? ఏం పని మీద వచ్చారు?" అన్నాను. అందుకు ఆ పాప బిక్క మొహం వేసి 'అక్కా! మరే.. మరి....." అంటూ అడగడానికి భయపడుతున్నట్టుగా అన్నది. ఆ ఇద్దర్నీ చూస్తుంటే జాలివేసింది ఆ ఇద్దర్నీ దగ్గరకు తీసుకొని నిదానంగా అడిగాను అలా ఆప్యాయంగా అడగడంతో ఆ పాపకి కొంతంత ధైర్యం వచ్చినట్లయింది.


'అక్కా' మరే మా అక్క మిమ్మల్ని అడిగి ఏమైనా పాత బట్టలుంటే తీసుకురమ్మంది' అన్నది. అంతలో మా పిన్ని లోపల్నుండి వస్తూ 'ఎవరూ' వచ్చింది?' అని ఆ ఇద్దర్నీ చూసి 'ఏవిటీ వచ్చారూ?" అన్నది. వాళ్ళ రాకకు కారణం నేను చెప్పి 'ఎవరు పిన్నీ వీళ్ళూ?' అన్నాను. 'వీళ్ళు మొత్తం ఐదుగురు ఆడపిల్లలు. వీళ్ళ నాన్న ఒట్టి తాగుబోతు వీళ్ళ అమ్మని చాలా కష్టాలు పెట్టేవాడు. ఇంట్లో విలువైన వస్తువు లన్నింటినీ అమ్ముకుంటే అదేమని భార్య అడగబోతే గొడ్డును బాదినట్టు బాదేవాడు. వీళ్ళ అమ్మ ఈసారయినా మగపిల్లాడు పుట్టక పోతాడా అంటూనే నాల్గు కాన్పులూ ఎదురు చూసిన ఆమెకి నలుగురూ ఆడపిల్లలే పుట్టారుట. ఐదో కాన్పు వచ్చేటప్పటికి శారీరకంగా, మానసికంగా కూడ నలిగిపోయింది. ఆమె చివరి క్షణంలో కూడ ఆడపిల్లనే కని శాశ్వతంగా ఈ లోకాన్ని విడిచింది.

అప్పటి నుండి ఈ పిల్లలకి కుటుంబ భారం నెత్తిన పడింది. వీళ్ళకి యింట్లో గడవడమే కష్ట మవుతోంది" అని చెప్పి పిన్ని బాధపడింది.

చదువు సంధ్యలను అలవరచుకొని

సరైన ఆలోచన అవసరం

రేపటి పౌరులుగా ఎదగవలసిన ఆ చిన్నారులు, తల్లి దగ్గర గారాలు పోతూ కొసరి-కొసరి-గోరుముద్దలు తినవలసిన ఆ చిన్నారులు సుఖ, సంతోషాలకు, ఆప్యాయత నిండిన పిలుపుకు దూరమయి ఎర్రని ఎండలో, ఎండనక, వాననక చెమటోడ్చి కూలి పని చేసి వచ్చిన కొద్దిపాటి సొమ్ముతో రోజులను భారంగా వెళ్ళదీస్తున్నారు



ఆ చిన్నారుల దీనస్థితిని చూసి మనసు బాధగా అన్పించింది

కొందరి తల్లిదండ్రుల మూర్ఖత్వానికి మంచి పౌరులుగా కీర్తి పొందాల్సిన ఇలాంటి చిన్నారుల భవిష్యత్తు చీకటిలో కొట్టు మిట్టాడుతోంది. అందుకే ఇలాంటి చిన్నారుల కోసమయినా ప్రతి తల్లీ, తండ్రీ సరయిన మార్గంలో ఆలోచించాలి. ఆ నాడే ఈ బాలల దీనగాథలకు తెర పడుతుంది.

మంచి రోహిణీకుమారి,
విజయవాడ □

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

చిన్నారి బాలల దీన గాథలు

రచన పంపిన వారి పేరు :. ....

పూర్తి చిరునామా :........................

....

....

పిన్ కోడ్

నాగరికమ్మైన పోకడలు ఇంకా సోకని ఆ అమాయకమ్మైన పల్లెటూళ్ళో సీతారామయ్యగారి ఇంటి ముందు ఆయన ఒక్కగా నొక్క కూతురు తల్లిలేని పిల్ల పసిడి బొమ్మ శారదమ్మ పెళ్ళి

జరగబోతున్నా శుభసందర్భంగా అక్కడ నాలుగువైపులా గుంజలుపాతి పెద్ద పందిరైతే వేశారు ఎక్కడా పెళ్ళికళ రాదో అన్న భయంతో కొబ్బోలు మామిడి తోరణాలు ప్రతిగుంజకీ కట్టిపడేశారు. పాతకాలంనాటి ఆ పెంకుటింటి వసారాలో గోడకి చేర్లబడి కూర్చున్న సన్నాయిమేళం మంగళస్వరాలను మోగించాలనే శతవిధాల ప్రయత్నిస్తున్నారు అవి కాస్తా విషాదాన్ని వెదజల్లి ఊరుకుంటున్నాయి

ఇదివిని నలుగురైదుగురు పెళ్ళిపెద్దలు ముందు ఉలిక్కిపడి తర్వాత గాభరాపడ్డారు.

"ఓయ్ – కాస్త ఆపండి ఇవాళ ఏం రోగమొచ్చింది మీకు బొత్తిగా శృతితప్పి వాయిస్తున్నారు ఏరా పరమయ్యా పుట్టి నప్పట్నుంచీ వాయిస్తున్నావుకదా, ఇప్పటిక నలభయ్యోపడిలో పడ్డావు. పెళ్ళింటిలో పడిన కాఫీ ఫలహారాలు సరిపోలేదా లేక ఇంట్లో పెళ్ళాం చీవాట్లుపెట్టిందా? ఇక్కడ పెళ్ళి జరగబోతోంది. కానీ మరేమి కాదు. కాస్త వినసొంపుగా అఘోరించండి "

ఒకాయన తీవ్రంగా మందలించడంతో సన్నాయివాళ్ళు కొంచెం స్పృహలోకి వచ్చి అపస్వరాలు పలకకుండా ఊదేందుకు విఫలయత్నం చేస్తున్నారు.

వీధివసారాలో ఓ మూలగా పడక కుర్చీలో కూర్చున్నారు సీతారామయ్యగారు. వయసుకి మించిన వృద్ధాప్యం, నీరసం ఆవహించి ఆయన మౌనంగా వుండిపోతున్నారు మాటిమాటికీ జవాబు తెలియని ప్రశ్నేదో ఆయన గుండెల్ని తొలిచివేస్తోంది. ఎక్కడో పొరపాటు చేస్తున్నానేమో నన్న అనుమానం ఆయనను ప్రశాంతంగా వుండనివ్వడంలేదు. శారద తల్లే కనుక బ్రతికివుంటే యిలా జరిగేదా అన్న ఆలోచన పదేపదే రాసాగింది. జరుగుతున్న తంతును నిశ్శబ్దంగా ప్రేక్షకుని గా చూడటం తప్ప, తాను చేయగలిగిందేమీ లేదని ఆయనకు తెలుసు.

బతకలేక బడి పంతులన్న సామెత ఊరకే రాలేదు ఆ పల్లెటూళ్ళో ఆయన చేసిన ఉద్యోగం పొట్టకూటికే సరిపోయింది. ఇక పెద్దలిచ్చిన ఆస్తి తమ్ముడు భాస్కరం చదువుకు హారతికర్పూరం అయిపోయింది. ఆస్తిలో తనకు సగం వాటా వుంటుందనీ ఒకవేళ ఉద్యోగంలో తా నేమీ కూడబెట్టకపోయినా, పిల్ల పెళ్ళికి పనికొస్తుందన్న ఊహ కూడా సీతారామయ్యగారికి ఏనాడూ రాలేదు. భాస్కరాన్ని ఆయన స్వంత కొడుకుకన్నా మిన్నగా పెంచిపెద్దచేశారు. తల్లీతండ్రీ చిన్ననాడే గతించడంతో భాస్కరం ఆలనాపాలనా ఆయనే చూశారు. భార్య లక్ష్మీకాంతమ్మగారు కూడా ఎప్పుడూ ఆయన మాట జవదాటలేదు. ఉన్న అయిదు ఎకరాల పొలం భాస్కరం చదువుకి ఖర్చు పెడుతుంటే......

"ఏమండీ. రేపు మన పిల్ల గతేమిటి? దాన్ని అత్తవారింటికి పంపేమార్గం ఆలోచించారా? అని ఎప్పుడూ ప్రశ్నించలేదు.

ఒకవేళ ఆవిడ అడిగితే సీతారామయ్యగారు ఈవిధంగా సమాధానం చెప్పివుండేవారేమో.

"అదేమిటే పిచ్చిదానా! మనల్ని కన్న బిడ్డకన్నా ఎక్కువగా ప్రేమించే భాస్కరం వున్నాడని మరిచిపోతున్నావా?"

అప్పటికి భాస్కరం యూనివర్శిటీ చదువు పూర్తిచేసి మంచి జీతం వున్న ఉద్యోగంలో స్థిరపడ్డాడు పెళ్ళిచేసుకున్నాడు ఇద్దరు పిల్లలు

కర్త-కర్మ



కూడా.

పెరట్లో చిన్న మొక్కని నాటి, ఫంవత్సరాల తరబడి దానిని అతి జాగ్రత్తగా పెంచి పెద్దచేసిన రైతు అది కాయా పిందె వేయకపోవడంతో కృంగిపోయినట్టుగా సీతారామయ్యగారు తమ్ముడి మీద చిన్ననాటినుండి పెట్టుకున్న ఆశలు అడియాసలు కావడానికి ఎంతో కాలం పట్టలేదు.

పిల్ల పెళ్ళి కళ్ళ చూడలేదన్న బెంగతోనే లక్ష్మీకాంతమ్మగారు కన్నుమూసింది. నిజానికి భాస్కరం తన కేదో ఒరగబెట్టాలన్న దురాశ సీతారామయ్యగారి కేనాడూ లేదు. అమాత్రం పిల్ల బాధ్యత తను తీసుకోకపోతాడా అని ఊరుకున్నారంతే. భార్య చనిపోవడంతో అయన మానసికంగా చాలా డీలాపడిపోయారు. రిటైరయ్యాక కొంతమంది పిల్లలకి ప్రైవేట్లు చెబుతూ వాళ్ళ పెద్దలు కృతజ్ఞతో యింటి అవసరాలు గడిచిపోయేటట్టు సాయం చేస్తుంటే జీవనం వెళ్ళదీస్తున్నారు.

ఓ రోజు పైపంచ చేతపట్టుకుని హడావిడిగా వచ్చాడు కరణం రామయ్య.

"అయ్యా పంతులుగారూ. మన శారదమ్మ అందచందాలకి గుణగణాలకి సరిపోయే సంబంధం ఒకటి వచ్చింది. అబ్బాయి రైల్వేలో ఇంజనీరు. రూపంలో మన పిల్ల కేమీ తీసిపోడు. నేను స్వయంగా అతగాడిని చూసివచ్చి మీ కీ వివరాలన్నీ చెబుతున్నా - కట్నం విషయంలో కూడా వాళ్ళకి పెద్ద ఆశల్లేవు. అమ్మాయి బాగుంటే చాలంటున్నారు. మనమ్మాయి వారికి ఎలాగూ నచ్చి తీరుతుంది. ఓ అయిదారు వేలు యిస్తే సంబంధం తప్పక కుదురుతుంది. మీరు సరేనంటే పెళ్ళిచూపులు ఏర్పాటుచేస్తాను" అన్నారు.

అదృష్టం అవిధంగా వెతుక్కుంటూ కాళ్ళదగ్గరకి రావడంతో సీతారామయ్యగారు ఆనందంతో ఉక్కిరిబిక్కిరైపోయారు.

ఆయన కరణంగారి రెండుచేతులు గట్టిగా పట్టుకుని "రామయ్యగారూ! శారద మీ పిల్లే అనుకుని ఈ బాధ్యత మీ మీద వేసుకోక తప్పదు. నేను నాలుగక్షింతలు (తప్ప) వెయడం తప్ప యింకేమీ చేయగలిగే స్థితిలో లేను" అన్నారు చెమర్చిన కళ్ళు తుడుచుకుంటూ.

"ఆమాట మీరు వేరే చెప్పాలా శారద ఒకటీ నా పిల్ల ఒకటీనా" అని వెళ్ళారు కరణంగారు.

ఆయనే మధ్యవర్తిగా వ్యవహరించి సంబంధం స్థిరపర్చారు. ఇక కట్న కానుకలు మాట్లాడుకోవలసి వుంది.

మగపెళ్ళివారింటికి వెళ్ళివచ్చి కట్నం. పెళ్ళి ఖర్చులు మొత్తం ఏడెనిమిదివేలు అవుతుందని లెఖ్కలు వేశారు కరణంగారు.


నిజం చెప్పాలంటే యిది ఏమంత పెద్ద మొత్తం కాదు సీతారామయ్యగారూ వారైనా పేరుకు కట్నం తీసుకుంటున్నారంతే. ఆ అయిదు వేలు నగ రూపేణా మన అమ్మాయికి పెట్టకమానరు. పెళ్ళి ఖర్చంటారా ఎంత తక్కువలో చేసినా రెండు మూడువేలు ఎలాగూ తప్పదు" అన్నారు కరణంగారు.

సీతారామయ్యగారు ఏమీ మాట్లాడకపోవడంతో కాసేపు ఆగి ఇలా అమ్మాయి పెళ్ళి కుదిరింది. నీవు కొంత డబ్బు సాయం చేయాలంటే మీ భాస్కరం ముందుకు వస్తాదనుకుంటాను అన్నారు నెమ్మదిగా.

సీతారామయ్యగారి ఆలోచన అంతవరకు వెళ్ళలేదు. ఈ వున్న ఇల్లు అమ్మితే ఎంత మొత్తం వస్తుందొ లెక్కలు వేసుకుంటున్నారు.

కరణంగారి మాటలకి ఆయన మెల్లిగా తలెత్తారు.

ఉన్న వూరిని చూసేందుకు · అన్నగారి



యోగక్షేమాలు విచారించేందుకు భాస్కరం ఏ రెండుమూడేళ్ళకో ఒకసారి వచ్చి వెడుతున్న మాట నిజమే ఒదినగారు కాలధర్మంచేసినప్పుడు రావడమే ఆఖరిసారి.

అప్పటికి శారద ఓణీలు వేస్తోంది.

"అన్నయ్యా – శారదకి ఏదైనా మంచి సంబంధం కుదిరితే నాకు వ్రాయి. డబ్బు సాయానికి నేను వున్నానని మరిచిపోకు" అని హెచ్చరించి అతడు వెళ్ళడం ఆయనకు జ్ఞాపకం వచ్చింది.

నిజమే. భాస్కరానికి వ్రాస్తే పంపుతాడు కానీ.....

ఒకరికి యివ్వడమే తప్ప ఎవరినీ అర్థించిన చెయ్యికాదు సీతారామయ్యగారిది. అంతవరకు. ఆయనకు రోజులు అలాగే గడిచాయి. అందుకని వ్రాయడానికి ఎంతగానో సంకోచించారు. తన చేతులతో పెంచి, పెద్దచేసిన తమ్ముడికి అలాంటి ఉత్తరం వ్రాయవలసివచ్చినందుకు మధన పడ్డారు. అది చదివి తమ్ముడు ఏమనుకుంటాడో చిన్ననాటి నుండి పెంచి పెద్ద చేసినందుకు ప్రతిఫలం అడుగుతున్నాననుకుంటాడేమోనని విచారపడ్డారు.

రోజులు, వారాలు గడిచాయి. భాస్కరం జాబుకోసం ఎదురు చూస్తూనే వున్నారు కాలం గడిచిపోతోంది కానీ భాస్కరం నుంచి జాబు రాలేదు.

జరిగిన సంగతిది.

నిజానికి భాస్కరం అన్నగారి ఉత్తరం చూసి ఎంతో సంతోషించాడు ఆయన ఋణం తీర్చుకునే అవకాశం యిప్పటికైనా వచ్చినందుకు పొంగిపోయాడు. వెంటనే బ్యాంకుకు చెక్కు రాసి పదివేలు తెప్పించి యింటికొచ్చాడు.

"మన శారదకి పెళ్ళి కుదిరిందోయ్! అన్నయ్య 8 వేలు చాలని వ్రాశాడు. కానీ ఎందుకైనా మంచిదని పదివే లు తెచ్చాను. నాకు ఆఫీసు పనితో తీరుబడి లేకుండావుంది. పైగా రేపు కాంప్‌కి వెళ్ళాలి కూడా. అన్నయ్యకి డ్రాఫ్టు పంపించు" అని భార్య అలివేలుకు అప్పగించి, కొత్తగా కడుతున్న ఇంటి పర్యవేక్షణకు హడావిడిగా భోజనంచేసి వెళ్ళిపోయాడు భాస్కరం ఆ తర్వాత నిశ్చింతగా క్యాంప్‌కు కూడా బయలుదేరాడుకూడా. అయితే అలివేలు అతను అనుకున్నట్టు డబ్బు పంపలేదు. మౌనంగా ఊరుకుంది. ఆమె మనసులో అంతకుముందు ఎటువంటి దురుద్దేశం లేదు. కానీ డబ్బు అనేది చేతిలో వుంటే ఎంతటివారిలోనైనా మార్పు కలిగితీరుతుంది. ఇక బలహీనమైన మనసువున్న అలివేలు లాంటి వాళ్ళ సంగతి చెప్పేదేముంది? ఆ పదివేలు బ్యాంకులో అలాగే వుంటే తమ కూతురు మంజు పెద్దయ్యేనాటికి ఉపయోగపడవా. ఈయన సంపాదించింది కాస్త ఇల్లు కట్టుకోడానికి సరిపోయె. రేపు పిల్ల పెళ్ళి ఏవిధంగా చేస్తారు. ఆడపిల్ల తల్లి కనుక తనకావిధంగా ముందుచూపు వుండటంలో తప్పులేదని సమర్థించుకుంది. కాంప్ నుంచి వచ్చాక భాస్కరం వేసిన సవాలక్ష ప్రశ్నలకి మొదట ఓపికగానూ శాంతంగాను తర్వాత కోపంగాను బదులిచ్చింది.

"రేపు మీ పిల్ల పెళ్ళి కుదిరితే ఎవరిదగ్గరికి దేహి అని వెడతారు? ఈ రోజు దానధర్మాలు చేయగానే సరికాదు. ముందు సంగతి కూడా ఆలోచించండి. మరో పదేళ్ళకి మనం పిల్ల పెళ్ళి చేయక తప్పదు. మంచి స్టేటస్ వున్న అబ్బాయిని చూడొద్దా? ఓ లక్షయినా అందుకు వెనకేయకపోతే ఎలా?

"అదికాదు అలివేలు. సొమ్ము యివ్వకపోతే అన్నయ్య ముందు ఎంత చిన్నతనంగా వుంటుంది?"

భాస్కరం వెలిబుచ్చిన అనుమానాలన్నీ సింగినాదం అని కొట్టిపారేసింది.

మొదట్నుంచీ అతడు భార్యా విధేయుడే. ఆవిడకి ఎదురు చెప్పి, ఆ ఇంట్లో కప్పు కాఫీ కూడా అతడు ధైర్యంగా తాగలేదు.

పర్యవసానం శారద పెళ్ళి ముందు అనుకున్నట్టుగా రైల్వే యింజనీరుతో కాక పక్కవూళ్ళో పదెకరాల మాగాణి వున్న ఏభై ఏళ్ళ వరునితో నిశ్చయమైంది. అతని మొదటి భార్య సంతానానికి కూడా వివాహాలైపోయాయి. పదిమంది మనవలతో అతడు భార్య పోగానే మళ్ళీ పెళ్ళికి సిద్ధమవుతున్నాడు.

పెళ్ళి ఖర్చులు తామే భరిస్తామని మగ పెళ్ళివారన్నా సీతారామయ్యగారు అందుకు ఒప్పుకోలేదు. పదిహేను వందలకు ఇల్లు తాకట్టుపెట్టి, పెళ్ళి పనులు మొదలెట్టారు.

ముహూర్తానికి ముందురోజు భాస్కరం, అలివేలు పిల్లలు వచ్చారు. అన్నగారిని అతగాడు తప్పించుకుని తిరిగాడు. అలివేలు పెళ్ళిపనుల వంకతో అసలు వీధివైపే రాలేదు.

శారదకి తల్లి తరఫు దగ్గర బంధువులు ఎవరూ లేరనే చెప్పాలి. వసరకి మేనత్త అయిన ఓ ముత్తయిదువ శారదని పెళ్ళికూతురుగా అలంకరిస్తూ నిట్టూర్చింది.

పిల్ల బంగారం. ఇలాంటి సంబంధం చేయడానికి ఆ తండ్రి కెలా మనసు ఒప్పిందో. ఆమాత్రం సొమ్ము సంపాదించే పరపతి లేకపోయిందా. అన్న భావాలు ఆ నిట్టూర్పులో ప్రకటితమయ్యాయి.

"ఏమమ్మా పాలు విరిగిపోయాయి. మగపెళ్ళివారికి కాఫీలు పాలపిండితో కలిపేసి ఈపూటకి సర్దెయ్యమంటారా?" వంటాయన హడావిడిగా వచ్చి అడుగుతున్నాడు.

ఏదో ఒకటి చేసెయ్యవయ్యా. ఇలాంటివి వంద పెళ్ళిళ్ళు జరిపించివుంటావు. నీకు ఒకళ్ళు చెప్పేదేముంటుంది. అయినా మనం నిక్షేపంలా గంగాళంలో పాలు తెచ్చిపెట్టాం అవి విరిగిపోతాయని కలగన్నామా. దేనికది సరిపెట్టుకోవలసిందే. మన శారదమ్మ పెళ్ళి మాత్రం యింత హఠాత్తుగా కుదిరిపోతుందని అనుకున్నామా ఏమిటి" అందావిడ పెదాలమీదికి బలవంతాన నవ్వు తెచ్చుకుంటూ.

"అంటే మానవ ప్రయత్నానికి మించిన శక్తేదో మనల్ని నడిపిస్తూ వుంటుందన్నమాట" వంటాయన గడపలో నిలబడి ఆవిడ వివరణకోసం ఆగాడు.

"అంతేమరి. అన్నివిధాలా కుదిరిన సంబంధం తప్పిపోవడం, చివరికి ఈవిధంగా రెండో పెళ్ళి సంబంధం జరగడం యివన్నీ చూస్తుంటే కర్మ సిద్ధాంతం నిజమేననిపిస్తుంది."

పెళ్ళికూతురుకన్నా ఘనంగా కనపడాలనే తాపత్రయంతో నల్లని తన స్థూలకాయానికి ఖరీదైన

కంచిపెట్టుచీర కట్టుబెట్టి చీరకుచ్చిళ్ళు సరిగా వచ్చాయోలేదో కాసులపేరు రవ్వలదుద్దులు, వడ్డాణం, ముత్యాల గాజులు అందరికీ కనిపిస్తున్నాయో లేదో నని పదేపదే సర్దుకుంటూ అద్దంలో చూసుకుని మురుస్తున్న అలివేలు అవునవును మనం ఎంత ప్రయత్నించినా ఎవరికెవర్ని ముడిపెట్టాలో భగవంతుడు ముందే నిర్ణయించి వుంచుతాడొదినా. దానిని తప్పించడం, కాదనడం ఎవరితరం? అంది తనమీద జవాబుదారీ సమస్య ఏదో తొలగిపోయినట్టుగా తేలికపడిన హృదయంతో.

ఒక్కసారి ఆవిడ చీరకట్టు నగలవైపు పరిశీలనగా చూసి ముభావంగా వూరుకొంది శారద మేనత్త.

ఆవిడ చూపులో భావాలకి అలిమేలు కొంచెం భయపడి ఏదో అర్జంటుపని వున్నట్టుగా అక్కడినుంచి తప్పుకొంది.

"ముహూర్తానికి టైం అవుతొంది అన్నయ్యా" అన్న భాస్కరం పిలుపుతో లేచి పందిట్లోకి వెళ్ళారు సీతారామయ్యగారు.

పెళ్ళితంతంతా జరుగుతోంది. అక్కడ వున్నవారందరి గుండెల్లో చెప్పరాని బరువు పేరుకుంది. ఇలా జరగవలసింది కాదు అని వూళ్ళోవాళ్ళంతా ఎవరికివారు పదేపదే అనుకుంటున్నారు. ఎంతగా కర్మ సిద్ధాంతాన్ని అన్వయించుకోవాలన్నా వారికి చేతకావడంలేదు.

మనిషి తోటివారికి వుపయోగపడుతూ బ్రతకాలన్న బుద్ధికలిగి లేనప్పుడు మనలో మనకే సహకారం లోపించి ఒక మంచిపని చేయడానికి ముందుకువచ్చే ధైర్యంలేక కనిపించని దేవుడిని బాధ్యుడినిచేయడమెందుకు. మనకు చేతకాని పనులకు కర్మ సిద్ధాంతం అడ్డుపెట్టుకోవడ మెందుకు. మానవ సహజమైన ప్రేమాభిమానాలు మృగ్యమై అందుకు తార్కాణంగా యిలాంటి విషాద సంఘటన జరిగిపోతుంటే మనలోని లోపాలను కప్పిపుచ్చుకోడానికి ప్రయత్నించడం మూర్ఖత్వం కాదు అజ్ఞానం అంతకన్నా కాదు. మనలో పెరిగిపోతున్న స్వార్థపరత్వానికి నిదర్శనం ఇంతకంటే ఏం కావాలి?

ఆ పెళ్ళి చూసిన సీతారామయ్యగారు కన్న తండ్రి కనుక నాలుగయిదు రోజులకన్నా ఎక్కువ బ్రతకలేదు.

పంతులుగారు అదృష్టవంతులు కూతురి పెళ్ళిచూసి మరీ వెళ్ళిపోయారు. అని చెప్పుకున్నారు ఊళ్ళోజనం అంతరంగాల్లోని అట్టడుగు నిజాలను తొక్కిపట్టి.

* * * *

కాలచక్రం పన్నెండుసార్లు తిరిగింది. భాస్కరం కూతురు మంజులత ఇప్పుడు డిగ్రీ చదువుతోంది. కొడుకు ఇంటరు రెండుసార్లు తప్పాడు. మంజులత పేరుకు తగినంత అందంగా లేకపోయినా అనాకారి కాదనే చెప్పాలి.

ఈమధ్య కూతురి ప్రవర్తన తల్లిలో అనేక అనుమానాలు రేకెత్తించుతోంది. వేళపట్టున ఇంటికి రాకపోవడం, ఫస్ట్‌షో విడిచిపెట్టే సమయానికి తిరిగివచ్చి ఎవరో ఫ్రెండింటికి వెళ్ళానని చెప్పడం.

ఎందుకో అలివేలుకు నమ్మాలనిపించలేదు.

కూతురు గాడి తప్పిందన్న అనుమానం కొన్నాళ్ళకి రుజువై అలివేలును నిలువునా కుంగదీసింది

మహిళామండలి మెంబర్స్‌తో కలిసి ఆవిడ సినిమాకి వెళ్ళినప్పుడు మంజులత మరో యువకుడితో కబుర్లు చెబుతూ ముందువరసలో కనపడింది.

"మీ అమ్మాయే కదూ – మరీ సోషల్‌గా పెంచుతున్నట్టున్నారే!" తోటివారి హేళనకు అలివేలు తలెత్తుకోలేకపోయింది. ఇంటికి వచ్చాక కూతుర్ని గట్టిగా నిలదీసింది.

"ఎవడే వాడు – చదువు పేరుతో నువ్వు వెలగబెడుతున్న రాచకార్యాలు ఇవా? ఆడపిల్లకి కొద్దో గొప్పో చదువు అవసరమని బయటికి పంపిస్తే ఇలాంటి పరువుతక్కువ పనులు చేస్తూ నీ ఇష్టం వచ్చినట్టు తిరుగుతావా?" అని కేకలేసింది.

మంజులత ఏమాత్రం తొణకలేదు. భయపడలేదు.

"మేమిద్దరం ప్రేమించుకున్నాం. మన కులమే. త్వరలో పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం. పిచ్చిమమ్మీ. ఈరోజుల్లో ఇలాంటివన్నీ అతి కామన్. కాస్త ధైర్యసాహసాలు వున్న ఆడపిల్లలు తమ భర్తలను వెతికే శ్రమ తల్లి దండ్రులకివ్వడంలేదు. రోజులు మారలేదా!"

అలివేలు కూతురి మాటలకి విస్తుపోయింది. కొంతసేపటికి సర్దుకుని "సరే · నువ్వన్నట్టే ఒప్పుకుంటాను. ఆ అబ్బాయిది మన కులమే నంటున్నావు. మీ ప్రేమ ఎంతగొప్పదైనా పెళ్ళి పెద్దవారి సంప్రతింపులద్వారా జరిగితేనే బాగుంటుంది కానీ మీ రిద్దరూ ఇలా బరితెగించి తిరుగుతుంటే నలుగురూ ఏమనుకుంటారు? ఇంకా ఆ అబ్బాయితో తిరగకు. మీ నాన్నగారితో మాట్లాడి నేను ఒప్పిస్తాను" అంది.

మంజులత అలాగే అని తల్లికి మాటిచ్చిందేకాని ఆ అబ్బాయితో తిరగడం మానలేదు. భార్య చెప్పిన ప్రకారం ఆ అబ్బాయి ఇంటికి వెళ్ళివచ్చాడు భాస్కరం. అతని ముఖం ప్రసన్నంగాలేదు.

అతనితో ఎక్కువ పరిచయం వద్దని అమ్మాయితో చెప్పు. ఆ అబ్బాయికి చాలామందితో యిలాంటి స్నేహాలు వున్నాయిట. వాళ్ళ అబ్బాయికి మంచి అలవాట్లులేవని తల్లీ దండ్రీ స్వయంగా చెప్పారు.

ఇదంతా మంజుతో చెప్పి గట్టిగా హెచ్చరించింది అలివేలు. అయినా మంజులత నిర్లక్ష్యంగా వూర్కొంది.


"అతను అలాంటివాడు కాదమ్మా. నాన్నగారితో వాళ్ళు నిజం చెప్పలేదు. ఎక్కడ పెళ్ళిచేయాలో అని వారి భయం. కొన్నాళ్ళుగడిచాక వారే దారికి వస్తారు" అని నవ్వింది.

ఆమె ధైర్యం చూసి. తను భయపడనవసరంలేదని నిశ్చింతగానే రోజులు దొర్లిస్తోంది అలివేలు.

ఆమెను అలా ప్రశాంతగానే వుండనిచ్చి ఓ రోజు నిద్రమాత్రలు మింగి ఈలోకం విడిచిపోయింది మంజు.

కన్న కూతురు యింట్లో తమతో నవ్వుతూ తుళ్ళుతూ తిరుగుతూనే జీవితంపై అంత కఠినంగా

ఈ 'వేమన' పద్యాలు



దోపుడిచ్చువాడు తోడనే నెఱదాత
దోచుకున్నవాడు ద్రోహి యగును
ప్రాపు జూపువాడు పరగ పుణ్యుండయ్యె
ప్రాపు జెఱచువాడు పశువువేమ

నిర్ణయం తీసుకుని ఆత్మహత్య చేసుకోవడం అలివేలుకి మానసికంగా తిరిగి కోలుకోలేని పెద్ద షాక్ అయింది.

మంజు చనిపోతూ వ్రాసిపెట్టిన లేఖలో ....

"అమ్మా! అతను మంచివాడని నమ్మి మోసపోయాను. అతను అన్న ఒక్కమాట నా ఆత్మాభిమానాన్ని దెబ్బతీసింది. పెళ్ళిపేరెత్తేసరికి నీలాంటివాళ్ళతో నాకు పెళ్ళేమిటి? నువ్వు నా ఒక్కడితోనే తిరిగావని రుజువేమిటి? అన్నాడు – అతనులేకుండా బ్రతకలేను. అతడు నన్ను పెళ్ళి చేసుకునే అవకాశంలేదు. అందుకని జీవితం చాలిస్తున్నాను" అని వుంది.

కూతురు మరణించాక అలివేలు మంచం దిగడంలేదు. డాక్టర్లు ఎన్ని మందులిచ్చినా అమె

కర్త - కర్మ

మనోవ్యధ నయం కావడంలేదు. పిచ్చిమంజ నాతో ఒక్కమాట చెప్పకుండా ఎంతపనిచేశావు? ఇనాళ్ళు నిన్ను అపురూపంగా పెంచిన కన్నవారికంటె నిన్నగాక మొన్న పరిచయమైన వ్యక్తి ఎక్కువయాడా? అతనికోసం నిండుప్రాణం తీసుకున్నావా? నీ మీద పంచప్రాణాలు పెట్టుకున్న నీ తల్లి ఎలా బ్రతుకుతుందని ఒక్కక్షణం ఆలోచించావా?"

మంచానపడి దుఃఖిస్తూనేవుంది అలివేలు. ఆమె ఇక రోజుల్లోనే వుందని డాక్టర్లు తేల్చేశారు. భాస్కరం అతని కొడుకు గుండె రాయి చేసుకున్నారు.

"మంజూ నన్ను వదిలి దూరంగా ఎలా వెళ్ళగలిగావు? ఒక్క క్షణమైనా నిన్ను చూడకుండా వుండగలనా? అందుకే నువ్వెక్కడున్నా వచ్చేస్తున్నానమ్మా నాకు దూరంగా వుండవుకదూ?"

అలివేలు మగతగా కలవరిస్తోంది. ఆమెపక్కన కూర్చున్న శారద విసనకర్రతో విసురుతూ కాళ్ళు ఒత్తుతోంది. అలివేలు నోరు తడుపుకున్నప్పుడల్లా ఆమె గొంతులో మంచినీరు పోస్తోంది.

కొంతసేపటికి అలివేలు కళ్ళుతెరిచి తనకు శుశ్రూషచేస్తున్న వ్యక్తిని గుర్తించడానికి ప్రయత్నంచేసింది. మసకబారుతున్న కళ్ళకి అస్పష్టంగా కనిపించిన ఆ రూపు......

"ఎవరు శారదకదూ?"

అలివేలు స్మారకం కోల్పోబోయి ఎలాగో నిలదొక్కుకుంది. అలాంటి స్థితిలో కూడా ఆమెను పచ్చినిజాలు వెంటాడి వేధించి మనసుని చిత్రవధ చేయసాగాయి.

"ఇదివరకు నీ పెళ్ళికొచ్చినప్పుడు ఏదేదో వాగాను. చూశావా శారదా. అంతకు అంతా అనుభవిస్తున్నాను. చేసుకున్న ప్రారబ్ధం నన్ను కడుపుశోకంలో ముంచిందా? కాదు. గారాబంగా విచ్చలవిడిగా పిల్లను పెంచి ఆ ఫలితం వికృతంగా మారి దాని ప్రాణాలు తీసుకుంటే కుమిలిపోతున్నాను. చిన్నదానివైనా నీ చేతులుపట్టుకుని ప్రాధేయపడుతున్నాను – నన్ను మన్నించమ్మా."

శారద ముఖాన బొట్టు లేకపోవడం గమనించి ఆవిడ ఒక్కసారి తృళ్ళిపడింది.

"అయితే శారదా... ."

"వారు పోయారు పిన్నీ" ఆమె తలదించుకునే వుంది.

"ఈ పాపమంతా మూటగట్టుకుని పోతున్నాను. ఇందుకు బాధ్యురాలని నేనే. ఆ రోజు డబ్బు పంపమని మీ బాబాయి చేతిలో పెట్టినా, నేనే మంజు భవిష్యత్తు ఏం చేస్తారని ఆయనతో దెబ్బలాడాను. అసలు మంజు అన్న పిల్లే యిప్పుడు లేదు. ఆనాడు కళ్ళు మూసుకుపోయి నీ భవిష్యత్తుతో చెలగాటమాడాను. ఈరోజు నవ్వలా వైవిధ్యం అనుభవించడానికి కారణం నేనే......" ఇంకా ఏదో అనబోతున్న అలివేలు నోటిని మెల్లిగా చేతితో మూసింది శారద.

"లేదు పిన్నీ. నా రాతకి నువ్వెలా కారణమవుతావు? ఆనాడు నువ్వు చెప్పినట్టు ఎవరి కర్మకి ఎవరూ కర్తలు కాదు. మనమంతా జగన్నాటకంలో పాత్రధారులం" అంది నిశ్చలమైన కంఠంతో.

అప్పుడే గదిలోకి అడుగుపెట్టిన భాస్కరం అది విని తలవాల్చుకున్నాడు.

అలివేలు మాటల కందని ఆర్ద్రభావంతో శారదచేతిని అందుకుని కళ్ళకు అద్దుకుంది. □

1987లో శిశు మరణాలు!

విజ్ఞానశాస్త్రమూ, విజ్ఞాన జ్ఞానమూ ఎంత అభివృద్ధి చెందినా ప్రపంచంలో అనారోగ్య కారణంగా చిన్న పిల్లలు లెక్కలకు మించి చనిపోతున్నారట. ఒక్క 1987వ సంవత్సరంలో టిటనస్, మలేరియావంటి రోగాలవల్ల సుమారు ఒకటిన్నర కోటి పిల్లలు ప్రపంచం మొత్తంమీద చనిపోయారట.

భార్యను చంపిన భర్త!

ఫ్లారిడాకు చెందిన డేర్‌ఫీల్డ్ బీచ్ అనే పట్టణంలో ఫిలిఫ్ ట్రిగర్ అనే వో 77 ఏళ్ళ వృద్ధుడు జీవితంమీద విరక్తి చెంది తన భార్యను చంపి, తానూ అదే పిస్టలుతో పేల్చుకున్నాడట కానీ, ఆయన మాత్రం చావును తప్పించుకున్నా, శిక్షను తప్పించుకోలేకపోయాడట. ఆయన వయస్సును చూసి జాలిపడిన జడ్జిగారు వో నెల్లాళ్ళు శిక్ష విధించి, జీవితమంటే ఏమిటో వో పది నిముషాలు బోధించి 'ఇటీజ్ ఎ వండ్రఫుల్ లైఫ్' (జీవితం అతి అద్భుతమైనది) అనే సినిమాను కూడా చూడమని శిక్షలో వొ బాగంగా చెప్పారట - గుడ్'

భర్తపై ప్రేమతో భార్య ఆత్మాహుతి!


రాజస్థాన్‌కు చెందిన అర్జన్‌పురా అనే వో గ్రామంలో సుజన్‌సింగ్ అనే ఆయన పిత్రార్జితం పంచుకునే సందర్భంలో తన సోదరులతో ఘర్షణ పడ్డాడట ఆ ఘర్షణ కొట్లాటగా మారి, ఆ కొట్లాటలో ఆయన స్పృహ కోల్పోయాడట. అది చూసి ఆయన సతీమణి వోటికన్వారి తన భర్త చనిపోయాడని భావించి నూతిలో దూకి ఆత్మహత్య చేసుకున్నదట ఇంతకూ ఆ భర్తగారు మాత్రం చావలేదట

కుక్కకు పంది పిల్లలు జననం!

ఖాజీపేటకు చెందిన అన్నలూరులో ఒక కుక్కకు మూడు పందిపిల్లలు, రెండు కుక్క పిల్లలూ పుట్టాయట. ఆ పంది పిల్లల కాళ్ళు కుక్క కాళ్ళవలె వున్నాయట. శరీరం మాత్రం పంది శరీరాన్ని పోలి వున్నదట.

తికమకపెడుతున్న హెల్మెట్లు!

రెండు చక్రాల మోటరు వాహనాలను నడిపే వారు తలకు హెల్మెట్ విధిగా ధరించ వలెను. లేనిచో శిక్షార్హులగుదురు అని వున్న ప్రభుత్వ ఆజ్ఞను అదే ప్రభుత్వం వున్నట్టుండి హెల్మెట్‌లు పెట్టుకో రాదు హెల్మెట్‌గానీ, అటువంటివి గానీ పెట్టుకున్నచో



శిక్షార్హులు అని కొత్త శాసనం చేసిందట. ఇది చేసినది శ్రీలంక ప్రభుత్వం. కారణమేమయ్యుంటుందంటే యిటీవల తీవ్రవాదులు హెల్మెట్‌లను ధరించి ప్రభుత్వ అధికారులను, మంత్రి పుంగవులను కాల్చి చంపి, పోయారట. వీరి ఆనమాలు దొరక లేదట కనుకనే యీ మారు చట్టమట'

విదేశాలలో వింత ఫోనులు!

అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా మొదలైన దేశాలలో మనసు వికారంతో సతమతమవుతూన్న ప్రజలకు మానసోల్లాసం కలిగించేందుకుగానూ టెలిఫోనువారు కొన్ని సౌకర్యాలు కలిగించారట. వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నంబర్లకు ఫోను చేస్తే ఆ ఫోనులోంచి చక్కని చిన్న చిన్న కథలూ, జోకులూ వినిపిస్తాయట. తమ కష్టాలను కొన్ని నంబర్లకు చెప్పుకుంటే ఆ నంబరు నుంచి వోదార్పు, సానుభూతీ కూడా వస్తాయట - వాటీజిండియా డూయింగ్!

ఆలయ ప్రాంతంలో శవం హంతకుల అరెస్ట్!

కోయిలకుంట్లకు చెందిన మహమ్మద్ హుస్సేన్ అనే ఆయన్ని కొంతమంది మారణాయుధాలతో కొట్టి మల్లికార్జునస్వామి దేవాలయం ప్రాంతంలో శవాన్ని పారేసి, చక్కాపోయారట. ఈ సందర్భంగా పోలీసు విచారణలో చాకలి పున్నయ్య, చాకలి వెంకటేశ్వర్లు ననెడ పుల్లయ్య దొరికారట. వారిని అరెస్టు చేశారట వారు నేరం అంగీకరించారట

ప్రభుత్వ సంస్థలో వింత రూలు!

ఒరిస్సాలో ఇపట్రాన్ అనే వో ప్రభుత్వ సంస్థలో వింత రూలు ఒకటి వున్నదట. ఆ ఆఫీసులో పనిచేసే స్త్రీలు మరుగుదొడ్డికి వెళ్ళి మూడు నిముషాలలో తిరిగి రావాలని, అలా వారు రోజుకు రెండుసార్లకన్నా ఎక్కువ వెళ్ళరాదనీ అట ఆ రూలు ఈ రెండు సార్లకన్నా ఎక్కువసార్లు వెళ్ళకుండా వుండడానికి ఆ శాఖలో స్త్రీలకు టోకెన్ పద్ధతి కూడా వున్నదట - మరి మగాళ్ళకో!!

భార్య అదృశ్యం - భర్త ఆవేదన!

నామక్కల్‌కు చెందిన తిల్లయ్యపురంలో 32 ఏళ్ళ అప్పు గవుండర్ అనే ఆయన భార్య డిశంబరు 24వ తేదీ 14న్నర కాసుల బంగారు నగలతోనూ, 1500 రూపాయలతోనూ మాయమై పోయిందట' ఆమెనెవరైనా ఎత్తుకుపోయారేమోనని ఆమె భర్త పోలీసుతో ఫిర్యాదు చేశారట □



ఆశాజ్యోతి

శ్రీమతి స్వాతి శ్యాంర మల్లేష్

తెల్లవారుఝాము ఐదు గంటలు కావస్తోంది.

"పిన్నీ! లే. లే. అమ్మమ్మ తొందరగా లేవమంటోంది. మేమంతా ఎప్పుడో లేచిపోయాంగా. నువ్వేలేట్‌కేట్."

బద్ధకంగా ఉందని అటు, ఇటు తిరిగి పడుకుంటున్నా, కుదిపి కుదిపి లేపేస్తున్నారు అక్కయ్య పిల్లలు చిట్టి, చిన్నీను. బాబిగాడైతే నా కాళ్ళమీద ఎక్కికూచొని, చేతులు రెండూ పట్టుకొని తన వైపుకు లాగేస్తున్నాడు.

నాదస్వరం కేసెట్ ఆన్ చేసి, టేప్‌రికార్డర్ వాల్యూమ్ హెచ్చించి మంచం ప్రక్కనే ఉన్న టేబిలు మీద పెట్టింది చెల్లాయి. వీళ్ళంతా ఇంత హంగామా చేస్తుంటే ఇక లేవక తప్పదురా భగవంతుడా అనుకుంటూ బద్ధకంగా లేచాను.

కళ్ళు విప్పానో లేదో ఒక్క ఉరుకున దగ్గరగా వచ్చి – బావగార్ని అల్లరి పెట్టి నిద్రలేపే కార్యక్రమాన్ని నా చెవిలో చెప్పసాగింది చెల్లాయి.

అంతలో "మరల్లారా"! అంటూ మా బావే వచ్చేశారు. (మా ఇద్దర్నీ కలిపి "మరదళ్ళల్లారా" అనటానికి బదులు మమ్మల్ని మా బావ పిలిచే జంటపేరు అది.) మీ తంత్రాంగానికి ముందే నేను లేచి వచ్చాను. మీ అక్క పిలుస్తోంది. తొందరగా పదండి" అంటూ మా బావే టపాకాయలా పేలాడు.

రాత్రి పడుకోబోయే ముందు ఎంతో వేగంగా లేవాలని, లేస్తూనే బావను ఆట పట్టిస్తూ నిద్రలేపాలని ఎన్నో పథకాలు వేసుకొని పడుకున్నాం మేమిద్దరం కాని, మా ప్లాన్ అంతా తలక్రిందులయింది నా మొద్దు నిద్రను, బద్ధకాన్ని తిట్టుకున్నాను మనసులోనే.

"చిన్నక్క లేవటం ఆలస్యం చేసింది గానీ– అంతలో ఏమయిందిలే బావా! ఇంకా ఇవాళ నరక చతుర్దశే కదా!" సీమటపాకాయలా పేలింది చెల్లాయి.

అందరం కలసి పూజ గదిలోకి చేరేసరికి అమ్మ అందరికీ పీటలు వేసి హారతి ఇవ్వటానికి అన్నీ సిద్ధం చేసింది. ఇంకా ఇలాంటి సరదాలు, సంబరాలు ఎందరి ఇళ్ళల్లో మిగిలి ఉన్నాయోగాని, నవ్వుల జల్లులతో మనసులు పులకింత లేస్తుంటే, పిల్లలు మనుమలు, మనుమరాళ్ళతో పాటు భర్తని కూడా కూచోబెట్టి అందరి తలలపై నూనె పెట్టి, కుంకుమ బొట్లు, నలుగు పిండి నుదుట పెట్టి మా అందరికీ హారతి ఇచ్చింది అమ్మ.

నోట్లో పటికబెల్లం ముక్కలు పెట్టగానే, నాన్న ఓ ఇత్తడి పళ్ళెన్ని అప్పడాల కఱ్ఱతో బాదుతూ, జేగంటలా వాయించాడు. "నరకాసురుడు చచ్చాడొహో" అని ఓ సారి పెద్దగా అరిచారు నాన్న జేగంటతో సహా పిల్లలంతా ఉత్సాహంతో అదేమాట తిరిగి అనగానే – నవ్వుల జేగంటలు మార్మోగాయి.

"ఇక ఒకొక్కళ్ళూ స్నానాలకు కదలండి" అంది అమ్మ. ఒక్కొక్కరు తలంటు కొంటూంటే "తలకో టపాకాయ" కాల్చమని చెప్పారు నాన్న.

పది గంటలు అయ్యేసరికి అందరి తలంటూ్లు ఫలహార కార్యక్రమాలూ పూర్తి అయ్యాయి.

అమ్మ, వదినె, అక్కయ్య కలసి వంట – పిండి వంటల పని ప్రారంభించారు. భావ, అన్నయ్య, తమ్ముడు చెల్లాయి కలసి మార్నింగ్ షో సినిమా ప్రోగ్రాం వేసుకున్నారు. పిల్లలందరితో కలసి బజారు ప్రోగ్రాం నాది!

సాయంత్రం వేళ బజార్లో అడుగు పెట్టటానికే వీలు లేనంత కోలాహలంగా ఉంటుందని ఉదయాన్నే అక్కయ్య పిల్లలు, అన్నయ్య పిల్లలు అందర్నీ తీసుకొని మందుగుండు సామాన్లు కొనటానికి బయల్దేరాను. కాని, అందరూ నాలాగే అనుకున్నారో ఏమో! వంద పెళ్ళిళ్ళు ఒకే పందిట్లో జరుగుతున్నంత సందడిగా ఉంది బజారు. దుకాణాలన్నీ రక రకాలుగా అలంకరించి ఉన్నాయి. ఎన్నో రకాల బాణ సంచారాలు చక్కని వరుసల్లో దొంతర్లుగా పేర్చి, కనువిందుగా అమర్చారు. బారులు బారులుగా ఉన్న దుకాణాలు వచ్చే పోయే వారికి స్వాగతాలు పలుకుతున్నాయి. బొమ్మల కొలువులు పెట్టినట్టుగా మట్టి బొమ్మల దుకాణాలు బజారుకే ప్రత్యేక ఆకర్షణ కలిగిస్తున్నాయి.

చిట్టి, చిన్న బొమ్మల దుకాణాల వైపు పరుగు లెత్తారు. మున్ని, బాబిగాడు మిఠాయి దుకాణం వైపు వెళ్ళారు. పంచదారతో చేసిన చార్‌మినార్, కుతుబ్ మీనార్ గొల్లభామల బొమ్మలు చూపిస్తూ –" అత్తా! కొనుక్కుందామా" అంటోంది అన్న కూతురు జయ.

"నాకు మాత్రం పెద్దగన్ కొనాలి. రీలు కేపులు బోల్డు కావాలి" మరోసారి డిమాండ్ చేశాడు అన్నయ్య చిన్న కొడుకు వినయ్. అందర్నీ ఒప్పించి మళ్ళీ దగ్గరకు చేర్చుకున్నాను.

"అమ్మా! నా దగ్గర సామాన్లు కొనండి. ఈ సిసింద్రీలతో తారాజువ్వలు కూడా పోటీ పడలేవు. నా దగ్గరున్న చుచ్చుబుడ్లు కంపెనీ మెరుగు బుడ్లు లాంటివి కావు. మువ్వన్నెలు చిందించే చుచ్చుబుడ్లు ఉన్నాయి. మందార పూవుల్లా విచ్చుకొని పై పైకి వెలుగులు జిమ్మేవీ ఉన్నాయి. వెన్నెల వెల్లువుల్లా వెలుగులు వెదజల్లే మతాబులు ఉన్నాయి. కొనండమ్మ కొనండి".

రెండు భుజాలకు బరువైన నిండు సంచులు వ్రేలాడేసుకొని, ఒక పట్టెడకు చెక్కకట్టి దాన్ని మెడలో వ్రేలాడేసుకొని, అందులో కొన్ని మతాబులు, చుచ్చుబుడ్లు, చిచింద్రీలు పెట్టుకున్న నిండా పదేళ్ళు ఉండని ఆపసివాణ్ని చూస్తుండి పోయాన్నేను.

వాణ్ని చూస్తుంటే జాలేసింది. చినుగుల బనీను, అతుకుల పొట్టిలాగు వేసుకున్నా వాని మొఖంలో అదో రకమైన వెలుగు నిండి ఉంది. ఆశగా నా సమాధానం కోసం ఎదురు చూస్తున్నాడు. "ఏంటమ్మా అలా చూస్తారు? ఈ పిల్లాడేంటి? అమ్మడం ఏమిటి? అనా? పెద్ద పెద్ద షాపుల్లోనే మీలాంటి పెద్ద వాళ్ళంతా కొనేస్తే, నాలాంటి చిన్న వాళ్ళు చేసిన ఈ బాణసంచారా వెలుగులు ఎవరికి తెలుస్తాయి? ఎలా పైకి వస్తాయి. ఏడాదికి ఒక్క అమావాస్యకే మన దేశంలో వెలుగులు విరుస్తాయి. ఆ వెలుగుల్లో నా చేతి వంతు ఎంతైనదీ మీలాంటి వాళ్ళే నిర్ణయించాలి. కొని తీసుకు వెళ్ళండి. ఈ రోజు రెండు కాల్చి చూడండి – నచ్చకపోతే నేనిక్కడే ఈ బజార్లోనే తిరుగుతూంటాను. తిరిగి ఇచ్చేయండి". ఆఖరిమాట అంటూన్నప్పుడు వాడి గొంతు తడబడింది. వాడి కనుకొలుకుల్లో నిలిచిన నీటిపొర స్పష్టంగా కనిపించింది.

వాడి దగ్గరున్న రకాలన్నిటినీ కొన్ని కొన్ని చొప్పున కొనేశాను. దగ్గర దగ్గర అరవై రూపాయలు అయింది. వందనోటు చూపించి చిల్లర అడిగాను. లేదన్నాడు. చిల్లర కోసం మిఠాయి దుకాణం వైపు నడిచాను. నా వెనకే వచ్చాడు వాడు కూడా.

పిల్లలందరితో పాటు వాడికీ ఒక లడ్డు, జహంగీరు ఇప్పించాను. ఎంతో చెప్పిన మీదట తీసుకున్నాడు. క్రింద పడిఉన్న చిన్న కాగితాన్ని తీసి తొడుక్కున్న బనీనుతో తుడిచి లడ్డు అందులో చుట్టి సంచిలో వేసుకున్నాడు. జహంగీరు మాత్రం తిన్నాడు.

ఎటో చూస్తున్నట్టు నటిస్తున్నా నేను మాత్రం వాడినే గమనిస్తున్నాను. ఒక్కసారి మా ఇద్దరి చూపులూ కలిశాయి.

"మా చెల్లికండీ! ఇంతే ఉంటుంది అది" అంటూ ఏదో తప్పు పని చేసిన వాడిలాగ అన్నాడు మా జయను చూపిస్తూ.

"మీదే బోణీ! ఇక ఇవికూడా చెల్లి పోతే రేపు సాయంత్రం మార్వాడీ పేటలో లక్ష్మీ గణేష్ పూజలు జరిగే దగ్గర అమ్మకానికి బుంగలు, బూరాలు కొనుక్కొని వెళిపోతాను" అన్నాడు.

"అన్నీ అమ్మేస్తే మరినువ్వు కాల్చుకోవా?" అమాయకంగా అడిగాడు మా బాబిగాడు.

"రోజూ కడుపులు మాడ్చుకొని బ్రతికే మాకు మతాబులు కాల్చుకొనే రోజులు ఎప్పుడు వస్తాయో"! అన్నాడు ముందు నుంచి గమనిస్తున్నాను వాడి మాటల్లోని తీరు తెన్నుల్ని. ఇంత చిన్న వయస్సులో ఇన్నిన్ని మాటలు ఎలా చెప్పకలుగుతున్నాడు? ఆశ్చర్య పోయాన్నేను.

నా మనసులోని భావం ఎలా కనిపెట్టాడో గాని– "అవుసరం అన్నీ నేర్పిస్తుంది. దాన్నే గురువుగా భావిస్తే మంచి దారి చూపిస్తుంది ఇవన్నీ నేనే తయారు చేశాను. మా అమ్మ పని చేస్తున్న ఇంటివారి అబ్బాయిలు ఇద్దర్నీ బ్రతిమాలుకొని నేర్చుకున్నాను. నాలాగ మా చెల్లి కష్టబడకూడదు అది పెద్దయ్యేలోగా నేను ఎక్కడయినా పనిలో కుదురు కుంటాను. ఏమంటారు?" నన్నే ఎదురు ప్రశ్న వేశాడు.

"రేపు గాలి బుడగలు, బూరాలు అమ్మితే నీకెంత లాభం వస్తుంది?" అని అడిగాను.

"కొన్నవన్నీ అమ్ముడయితే, పది రూపాయల దాకా లాభం రావచ్చు. కాని ముందు ఇవి చెల్లాలిగా". వాడి గొంతులో నిరాశతో కూడిన దీనత్వం తొణికిస లాడింది. ఆశ– నిరాశల మధ్య వాని కనురెప్పలు కదలాడుతున్నాయి.

"రేపు సాయంత్రం నువ్వు ఇక్కడే ఉండు – నేను వచ్చేదాకా" అన్నాను.

నామాట అర్థం కాక అదోలా చూశాడు. చివరకు ఏమనుకున్నాడో ఏమో అలాగే అన్నట్టుగ్గా తల ఊపాడు.

ఒకేదగ్గర ఇంతసేపు ఉండటం నచ్చలేదేమో – మున్న, బాబి, చిట్టి అటు వెళ్దాం పదమని మారాం చేశారు.

బజారు గేటు ప్రక్కన నలుగురు పిల్లల్తో ఆగిన స్కూటరును చూచి అటు కదిలాడువాడు. పిల్లలు దిగగానే స్కూటరు స్టాండు వేస్తున్న అతని దగ్గర చేరాడు క్షణంలో.

దీపావళి రోజు. సంధ్యవేళ దాటి పోయింది. వీధుల్లో అన్ని ఇళ్ళూ దీపాల వరుసల్తో కళకళ లాడుతున్నాయి. ఎలక్ట్రికల్ బల్బుల తోరణాలు దారంతా ఎదురవుతున్నాయి. పైకెగసిన బాణసంచారా విశాల ఆకాశంలో రంగుల రంగవల్లులు దిద్దుతున్నై.

ఇంత ఆలస్యం అయినందుకు ఇంట్లో అంతా ఎంతో కంగారు పడ్తూంటారని అనుకొంటూనే ఇల్లు చేరాను. క్రొత్త నిక్కరు, చొక్కా తొడుక్కొని నాతో కలసి వచ్చిన అబ్బాయిని చూసి అందరూ ఆశ్చర్యపోయారు. వాడి గురించి నేను తెలుసుకున్న విషయాలు చెప్తూంటే ఒక్కొక్కరూ నా చుట్టూ చేరారు.

"వీడిపేరు రాజు గౌరవ మర్యాదలు గల ఓ మంచి కుటుంబంలో ఇద్దరు అక్కయ్యలకు, ఒక అన్నకు ముద్దుల తమ్మునిగా, అమ్మా నాన్నలకు బుజ్జిబాబుగా ఐదేళ్ల వరకు పెరిగాడు. రాజమండ్రి దగ్గర ఓ పల్లెలో ఉండేవారు. అక్కడి బడిలో జాయిన్ అయ్యాడు. ఆ సంవత్సరమే గోదావరీ వరదల్లో వీళ్ళ కుటుంబమంతా నాశనమైపోయింది. తల్లి కొడుకు మాత్రం మిగిలారు.

ఆ పరిస్థితుల్లో తమలాగే కుటుంబమంతా నాశనమై అనాథగా మిగిలిన ఓ చూలింత– వీళ్ళమ్మ ఆదరణలో ప్రాణం నిలుపుకొని ఓ పాపను ప్రసవించింది. ఆ తర్వాత రెండు నెలలకే ఆమె అనారోగ్యంతో కన్ను మూసింది.

ఇప్పుడు ఆ పాపే తన చెల్లిగా, అమ్మే దైవంగా భావిస్తూ, వాళ్ళిద్దరి సుఖం కోసం ఈ చిన్న వయసులోనే కష్టపడ్తున్నాడు రాజు.

మీరందరూ ఇష్టపడితే ఇవాల్టినుంచి మనతోనే ఉంటూ, మన ఇంట్లో అవుసరమైన చిన్న చిన్న పనులను చేస్తూ, మీతోపాటు ఆడుకొంటూ ఉంటాడు. అలా కాకపోతే ఇవాళ మనతో సరదాగా గడిపి రేపు తెల్లవారి వాళ్లింటికి వెళ్లిపోతాడు ''

ఎవరికీ చెప్పకుండాసాయంత్రం నేను ఎక్కడికి వెళ్లానో తెలియక, తిరిగి రావటానికి చేసిన ఆలస్యంవల్ల ఇంత వరకు దీపాలు పెట్టకుండా, దుబ్బు కొట్టకుండా ఎదురు చూస్తున్న ఇంట్లోని వారంతా ఒక్కసారి నెవ్వెర పోయారు.

"అమ్మా! ఈ అబ్బాయి స్వంతంగా చేసిన మతాబులు, చుచ్చుబుడ్లు... అవే నిన్న సాయంత్రం మేం కొనుకొచ్చాం'' అన్నాడు మున్నా.


దీపావళికి చీర కొనుక్కోకుండా కూతురు చేసిన పని ఏమిటో అర్థం అయింది అమ్మకు

"ఇంటి ముంగిట ముచ్చటగా దీపాలు వెలిగించు కొని

పటాసులు ప్రేల్చటమేకాదు– దీపావళి
నిరాశా, వేదనల గూళ్ళలో బతుకుతూన్న
నికృష్ట జీవనాలలో
ఆశాజ్యోతులు వెలిగిస్తే
అదే అసలైన దీపావళి!"

అన్నారు నాన్న కవితా రీతిలో. అమ్మా నాన్నల ఆమోదం నాకెంతో ఆనందాన్ని కలిగించింది. ఆ క్షణం రాజు కళ్లల్లో వెలిగిన సంతోషదీపాల కాంతి రేఖలు చూచిమరపురాని దీపావళి ఇదేనని తృప్తిగా గాలి పీల్చేను. □





(గత సంచిక తరువాయి)

మరునాడు కిరీటి ప్రయాణమయ్యెను. శశిరేఖ "గిరికను చూచికాని రా"ననెను. కిరీటియు, ధర్మారావును, శశిరేఖయు గిరిక యింటికి పోయిరి. శశిరేఖ ఒక్కతెయు లోనికి పోయెను. మిత్రులిర్వురును బయట నిలుచుండిరి. శశిరేఖను రత్నగిరి చూచి కూతురున్న చోటికి తీసికొనిపోయెను. గిరిక ప్రొద్దుననే లేచి స్నానము చేసి, మడి కట్టుకొని తన గదిలో కూర్చుండి, కనులు మూసికొని, ధ్యానించుచుండెను. ఎట్టయెదుట గజమెత్తున వేణుగోపాల స్వామి విగ్రహము కంచుతో చేసినది – ఉన్నది. గిరిక బద్ధపద్మాసనస్థయై ప్రాణాయామము పట్టి దృష్టి భ్రూమధ్యమున బిగించియుండెను. శశిరేఖ నివ్వెరపోయెను. ఆమె రత్నగిరితో అన్నది. ఆమెను నేనిప్పుడేమని పల్కరింతును? నేను చెప్పి పోవుటకు వచ్చితినని చెప్పుము. మేమింక ఈ గ్రామమునకు వచ్చుచు పోవుచునే ఉందుము ఈ స్వామికిని మాకును త్రెంచరాని బంధ మేర్పడినది. అని గిరిక ఉన్న దిక్కున కొక నమస్కారము చేసి, ఆమె తాను వెలికి వచ్చెను. ముప్పురు రైలునకు పోయిరి. శశిరేఖా కిరీటులు రైలులో కూర్చుండిరి. శశిరేఖ తన ఒడలు తా నెరుగదు కిరీటి మనస్సులో రెండు శిరస్సుల నాగు మెదలుచుండెను. శశిరేఖ మనస్సులో గిరిక మెదలుచుండెను. రైలు కదలిపోయెను. అన్న దమ్ములొకరి నొకరు వాంఛాగాఢమైన కనులతో చూచుకొనిరి. రైలు నెమ్మదిగా నడచినను, కొంత సేపటికి వారొక రొకరికి కన్పించలేదు. రైలు పోయినంత మేర ధూమమును పైకి చిమ్ముచునే ఉండెను. ధర్మారావు తిరిగి యింటికి వచ్చెను. అరుంధతికి మరల నొప్పులు వచ్చెను. గుంటూరులో ఉన్న కుగ్నరు దొరసాని ఆసుపత్రికి తీసికొని పోదునని ధర్మారా వెన్నిసార్లో చెప్పెను. ఆమె అన్నిసార్లు అంగీకరించలేదు "అక్కడ ప్రసవ సమయమున నిరాభరణలనుగా నిర్వసనలనుగా ఉంచెదరట. తిలకములు లేని మొగాలతో, ఆభరణములు లేని ఒడళ్ళతో తెల్లని వస్త్రములతో అమంగళాకృతి దాల్చుటనాకేమి కర్మము? నేను పో" నన్నదామె. మరునాడు ప్రొద్దున ఇంటి వద్దనే ప్రసవించినది. మగశిశువు కలిగెను. ప్రసవసమయమున చాల బాధ పడినది. మంగ మెలకువలు తెలసిన ప్రసవ వైద్యురాలు. పూర్వము గ్రామములో ఒక చాకలి మంత్రసాని ఉండెడిది. ఆమె యీ విద్యలో ఆరితేరినది. ఆమె చాల అనుభవశాలిని. ఎంత గడ్డయన ప్రసవమైనను చేతి మెలకువతో ఆమె సాధించెడిది. "ఫోర్సెప్సు" మొదలైన సాధనముల అవసరము లేకుండ ఆమె ఉపాయము వలననే గర్భకోశము యొక్క సర్వంకషమయిన జ్ఞానము, తదనుకూల హస్తప్రయోగవై శారద్యము – వీనితో ఆమె లోకమునకు బహూపకారిణిగా ఉండెను. అది ఒక విద్య. ఆ విద్య చదువుకొనునది కాదు. సంప్రదాయము చేత వచ్చునది. సంప్రదాయమునకును చదుకొనుటకును దేశములో మహాయుద్ధము ప్రబలి, ధనదేవత అధికార దేవతలు చదువుకొనుట యొక్క పక్షమున చేరి సంప్రదాయము నోడించెను. సంప్రదాయము పొందిన యోటమి మఱల దానిని తలఎత్తనీయలేదు. ఈ సంప్రదాయమున కెన్నెన్ని చోటులనైనను పరాభవమే వాటిల్లెను. చాకలిది నాలుగైదు ప్రసవములు సంబాళించుచుండగా మంగ చూచి కొంత గ్రహించెను. అప్పటి నుండి అస్పృశ్యులకు పోనివారు సుబ్బన్నపేటలో మంగ సాయ మపేక్షింతురు. ఆమె వచ్చి కోడలికి సహాయపడెను. అరుంధతి బాధ పడుచున్నవేళ మంగ ఉన్నది. "నాయనా! పిల్ల యింత బాధపడుచున్నది. గురులింగశాస్త్రిగారు లేకపోయెను. ఆయన మంత్రించి పంచపాత్రెడు జలమిచ్చినచో వీసమెత్తు బాధ లేకుండ ప్రసవించి ఉండును. ఆయన చనిపోయిన తరువాత గ్రామములో దిక్కు పోయినది. కొంచెము విభూతి మంత్రించి యిచ్చువాడు లేడు. గాలిక ధూలికి గాపైనవాడు లేడు. ప్రతివారికి ఇంగ్లీషే వేదమైనది. అరుంధతికి పుట్టిన కొడుకు వ్రేలెడంత పొడుగు, వానికన్న ఎలుకపిల్ల నయము- ఇవి మంగ మాటలు.

చుంచు కూసినట్లు కూసిన వాని యేడుపు వాకిట కూర్చున్న ధర్మారావు హృదయనాళములలో ఆకాశమునందు శబ్దించినది. సర్వము సుఖావసానమని తెలిసిన తరువాత ధర్మారావు తోచీ తోచనివాడు పనియు పాటలేక ఊరి వెంట నడచుచుండెను. కొంత సేపటి కతడు తాను కోటగుమ్మము దాటి లోనికి పోవుచుంటి నని తెలిసికొనెను. ఇచ్చటికి వచ్చితి నేమని వెనుదిరుగబోయి హరప్పనాయని చూచిపోద మనుకొని, మఱల వెనుదిరిగి పోయెను. హరప్పనాయ దేదో చదువుచుండెను. అతడు ధర్మారావును చూచి "ఇది జార్జి ఇలియట్ వ్రాసిన సైలాస్ మార్నరు" అనెను. ధర్మారావు వెనుదిరిగి పోయెను. హరప్ప మఱల చదువు చుండెను. ధర్మారావు దేవాలయము ముందునకు నడచెను. అప్పటికి జాము ప్రొద్దెక్కినది. దేవదాసి ఆలయము ముఖమంటపమునందున్నది. తాను పురిటివాడు. ధర్మారావు లోనికి పోవుటకు వీలులేదు. ద్వారబంధమునందు కూర్చుండెను. దేవదాసి అతని వంక" చూచుచుండెను. ఇంతలో ధర్మారా వెందుకు వచ్చినట్లో, ఎందుకు పోయినట్లో తెలియక హరప్ప పుస్తకము మూసి అతని ననుసరించెను. అతడు వచ్చి ఆలయమున కెదురుగా వీథిలో నిలుచుండెను. తలుపులు తీసి ఉన్నవి. ధ్వజస్తంభము ప్రక్క నుండి దేవదాసి

జరిగిన కథ: 41 రంగారావు గారు దొరసానిని వివాహం చేసుకుంటాడు. గవర్నరు గారు సుబ్బన్నపేటలో పురపాలక సంఘ భవనాన్ని ప్రారంభిస్తాడు. దేవదాసి గిరిక ప్రతి రోజూ ఆలయానికి పోయి స్వామిని సేవిస్తూ ఉంటుంది. హరప్పనాయడు తాను చేయవలసిన పనులను గూర్చి ఆలోచిస్తూ ఉంటాడు జోస్యులను ఎవరో కొట్టి చంపుతారు. కిరీటికి శశిరేఖకు వివాహం జరుగుతుంది. దొంగనోట్ల కేసులో సినిమా రౌడీ చలపతిని, రామేశ్వరమును పోలీసులు నిర్బంధిస్తారు రామేశ్వరము తనకున్న ఆస్తి నంతటిని మంగమ్మ పేర పెడతాడు. మంగమ్మ ఒకనాడు డబ్బంతా తీసుకుని బెజవాడ వెళ్ళి పోతుంది. రామేశ్వరమునకు 7 ఏళ్ళు, చలపతికి 8 ఏళ్ళు శిక్ష పడుతుంది. అరుంధతి, శశిరేఖ, రథంతరి గిరికలు ఆలయానిక వెడతారు శశిరేఖ గిరికను చూచి ఆశ్చర్య పోతుంది.

శిరము మీదుగా హరప్ప దృష్టి స్వామి మీద పడెను. హరప్ప కంటికి మొదట ఏదో మెఱసినట్లు తోచి నిదానించి చూచిన తరువాత స్వామి మొగమున నున్న తిలకముగా స్ఫురించెను. హరప్ప ఎన్నడును మొగమున తిలకము ధరింపడు. కొందరు "తండ్రి మతమే కొడుకునకు. కేశవస్వామి మతాను యాయి" అనుకొందురు. వారందరును తిలకమును ధరించరు. చైతన్యుడు తిలకమును ధరించెను.



తదవతారమైన కేశవస్వామి యేల ధరించలేదో? హరప్ప స్వామి మొగమున నున్న వెండి ఊర్ధ్వపుండ్రములు చూచినంతనే భక్తినిమీలితాక్షుడై యిట్లు ధ్యానించెను. "ప్రభూ! నీ ఆలయములోనికి వత్తునని బుద్ధి పుట్టి యేడేండ్లయినది. నన్ను నీవు లోనికి రానిచ్చుట లేదు. నా మొగమున కూడ తిలక మెప్పుడు పెట్టింతువు? ఎప్పుడు నీ ఆలయము లోనికి రప్పించుకొందువు? నాకు నీ సన్నిధిసేవ

ఎప్పుడు? . పంచమునివలె వీథిలో నుండియే చూచుచుంటినిగాని సన్నిహితుడనగు స్థితి నాకు లేకపోయెను. "దేవదాసి హరప్పను చూచెను. ఆమె అతని వంకనే చూచుచుండెను. కూర్చున్న చోటు నుండి లేవలేదు. ధర్మారావటు దేవదాసిని చూచును. ఇటు హరప్పను చూచును. తానును తన కూర్చున్న చోటి నుండి లేవలేదు. హరప్ప అట్లె నిలుచుండెను. కదలలేదు. ప్రొద్దు బాగుగ ఎక్కినది. అర్చకుడు

స్వామికి నైవేద్యము పెట్టి తెర అడ్డము వేసి యిచ్చిన నీరాజనము బయటకు తెచ్చి దేవదాసికి చూపించెను. ఆమె సాష్టాంగపడి నమస్కరించెను. ధర్మారావు మోకరించి నమస్కరించెను. వీథిలో హరప్ప నిలుచుండి చేతులు పైకెత్తి నమస్కరించెను. ఎవరి దారిన వారు పోయిరి.

ధర్మారావు మఱల గ్రామము వెంట తిరుగుచుండెను. అతని కింటి వద్దకు పోయినచో తిండి ఎవరు పెట్టెదరు? సావిత్రమ్మగారు శిశువునకు నీరు పోసి, బాలెంతరాలికి నీరు పోసి అప్పుడు మడికట్టుకోవలయును. రథంతరియు, మంగయు

సాయమున్నారు గాని, పని తెలదు. ఆ నాడు కూడు రెండు జాములు దాటియే. ఈ కారణము ధర్మారావు విచారించుకొనలేదు. విచారించుకొనకుండగనే అతని హృదయమునకు తెలియును. అతడు మరల

గ్రామము వెంట తిరుగజొచ్చెను. పసిరిక కనబడెను. అతనికి ధర్మారావు చాల యేండ్లుగా ఒంటరిగా కనిపించలేదు. నేడిట్లు కనిపించినంతనే పసిరిక వచ్చి అతని మీద వ్రాలెను. పసిరిక అతని చేయి పుచ్చుకొని లాగికొని పోదొడగెను. ధర్మారావు మాఱు పలుకకుండ అతని ననుసరించుచుండెను. అంతవఱకు ఎండలు కాచి ఆ పగలు మేఘములు క్రమ్మి అప్పుడు చినుక సాగెను. ధర్మారావు తలయెత్తి నాలుగు దిక్కులును చూచెను. మేఘములు సాంద్రముగా పట్టినవి. గాలిలేదు. మేఘములు తప్పక కురియును. పసిరిక తలయెత్తడు. నడచు చుండెను. ఇఱువురును ప్రాగ్దిశ నున్న మెట్ట చేలకు పోయిరి. జొన్న చేలు గజమెత్తున పెరిగి ఉండెను. దున్నిన చాళ్ళలో చిన్నచిన్న గుంటలున్న చోట వాన నీరు నిలిచి ఉండెను. అది రాత్రి పడిన వాన. చిలుకలు, పాలము పిచ్చుకలు, గోరువంకలు చేల మీద అందందు కనబడజొచ్చెను. ఒకటి రెండు కొంగలు దూరాన పల్లపు చేలపై ఎగురుచుండెను. పికిలిపిట్ట ఒకటి సన్నని యీల కొట్టుచు, ఱెక్కలు – స్నానము చేసిన బ్రాహ్మణుడు విడిచిన తన ఉత్తరీయము చేతులపై వేసికొని ఎండబెట్టుటకు కదిలించునట్లు కదలించుచు, ఆకాశమున రివ్వున పరుగెత్తెను. పసిరిక పిట్టలకై పరువెత్తి వానిని పట్టుకొనెను. కొన్ని

ఎగిరిపోయినను కొన్ని అతని చేతికి చిక్కును చిక్కిన పిట్ట కీచుమనును, పసిరిక కిలకిలారుమని నవ్వి దానిని వదలి పెట్టును. ఒక పొలము పిచ్చుక పసిరిక భుజముపై వ్రాలి ధర్మారావును చూచి "నీ వున్నావా" అన్నట్లర్థముగా ఎగిరిపోయెను. రెక్కలు కదలించి, ఆ వేగముతో కొంత దూరము పోయి, మరల కదలించి, ఆ వేగముతో మఱికొంత దూరము పోయి, యిట్లు పోవుచుండెను. మొదటిసారి కదలించిన వేగము మందగించు వరకు పిచ్చుక వేగము మందగించుటయే గాక ఎగిరిన ఎత్తు కూడ తగ్గి భూమికి దగ్గరగా వచ్చును. మరల రెక్క కదల్చునప్పుడు వేగమును వచ్చును. ఎత్తునకు పోవును.

పసిరిక ధర్మారావును చేలచుట్టు త్రిప్పెను. ఆతిథ్య మొసగుటకు ఉచబియ్యము లేవు. మొక్క జొన్న కండెలు లేవు. అన్నియు చిన్ని మొక్కలే. జొన్నచేలలో వేసిన పెసరకాడ తీగలైన సాగలేదు. లేత జొన్నాకుల మీద వానచినుకులు నిలిచెను. గట్ల వెంట ఉన్న పచ్చిక అంతయు తడిగా నుండెను. చినుకుచున్న వాన కొంచెము పెద్దదాయెను దూరమున ఏదో పరుగెత్తుచున్నట్లుండెను. పసిరిక చిత్రముగా తల త్రిప్పి ఆ పరుగెత్తుచున్న దాని వంక చూచెను మఱల ధర్మారావు వంక చూచెను. నాగస్వరము పాడుచుండగా ఆడుచున్న పాము తల చప్పున ప్రక్కకు త్రిప్పినట్లు పసిరిక తల త్రిప్పెను. అతడొక్క పరువున పోయి ఆ పరుగెత్తుచున్న దానిని పట్టుకొనెను. అది ఒక సర్పము. పసిరిక చేయబోవుచున్న గడుసుదనము దానికి తెలిసినది. అతడు తన్ను ధర్మారావు వద్దకు తీసికొని పోవుచుండెను. అది పసిరికను వ్రేలి మీద కఱచినది. పసిరికకు వ్రేలు నొప్పి పెట్టి దానిని క్రింద వదలి, పోవుచున్న దాని తోకపై కోపముతో త్రొక్కెను. అది అతనిని చూచి నవ్వినట్లు పడగ విప్పి, నేల మీద వదలిన గాలి పడగవలె అటునిటు కదులుచు పోయెను. పసిరిక కిలారుమని నవ్వెను. అతడు మఱల ధర్మారావు వద్దకు వచ్చెను. ధర్మారావు ముక్కుమీద వ్రేలుంచెను. పసిరిక మఱల నవ్వెను. వర్షము పెద్దది కాజొచ్చెను. ఆ వానకు వడగండ్లు పడెను. పసిరిక వడగండ్లేరి తాను కొన్ని తిని, ధర్మారావునకు కొన్ని యిచ్చెను. ధర్మారావు తానింకను స్నానమేచేయలేదు. వానిని తినలేదు. ఒక పాము వానలో పరువెత్తుచుండెను. వడగండ్లు దాని శిరస్సున తాడించుచుండెను. అది పడగ విప్పి బుస్సుమని లేచి ప్రక్కవాటుగా బొంయిమని వీచుచున్న గాలిని గసిగాట్లు కొఱకి కష్టము మీద పోవుచుండెను. పసిరిక పరువెత్తి తన చేతులు దాని పడగమీద నుంచి యది పోయినంతమేర వడగండ్లు దాని పడగమీద తగులకుండ చేసెను. అట్లు దాని పోయినంత మేర అతడును పోయెను. ఆ పామెంత తొందరగా పరువెత్తునో అతడు అంత తొందరగా పరువెత్తెను.

ధర్మారావనుకొనెను. : "ఇచ్చటికి లక్షసార్లు మేమొంటరిగా వచ్చెదము. మాకొక్క పామయినను కనబడదు. ఒక పిట్టయైనను కనబడదు. ఇతనితో వచ్చినప్పుడన్నియు పాములే! అన్నియు పిట్టలే.'


వర్షము విజృంభించి కురియసాగెను. ధర్మారావు వానలో తడిసి ముద్ద అయ్యెను. పసిరిక గోచి మాత్రము పెట్టును. అతని మీద వాన కురిసినట్లే లేదు.

పదునేడవ అధ్యాయము

సుబ్బన్నపేట తూర్పు దిక్కంతయు గుండేటికి దక్షిణమున అంతయు తాటి తోపులు. పూర్వము చుట్టు పట్ల అంతయు మాగాని కానప్పుడు గ్రామము నాల్గు వైపుల తాటివనములే శోభ తెచ్చినవి. ఆ ఊరిలో కలాలీ లెక్కువ మంది. వారందఱు త్రాళ్ళు గీసికొనియే జీవింతురు. గ్రామము పట్టణమైన తరువాత, మెట్టలు మాగానులైన తరువాత, వారి జీవనాధారము కొంత వెనుక పడినది. గ్రామము పట్టణమైన తరువాత వారి యిండ్లకు చుట్టు పట్లనున్న నెరాబా స్థలములన్నియు నివేశ స్థలములై వారలు తమకున్న కొంచెము నేలయు అమ్ముకొని పోయిననే మేలని తోచి అట్లు చేసిరి. పోయిన కొలది యిండ్లు గుండేటిలో కట్టుకొనవలసి వచ్చినది. పల్లెటూరిగ ఉన్నప్పుడు తాళ్ళు ప్రతివారును గీసెడివారు. అందఱకు తలా ఒక కొంచెము గిట్టెడిది. ఇప్పుడా గ్రామము ముప్పది వేల కిజారా పాడుదురు. ఇజరాదారు ముప్పది వేలు చెల్లించి తనకు మఱి అంత లాభము చూచుకొని తాళ్ళు గీయు వారికేమి ఒసంగగలడు? వారికి గిట్టుబడి తక్కువయై పోయెను. జమీందారీ తాళ్ళు మాగాని చేసిన క్రొత్తలో పొలము కలవారు తాడి బొత్తలు మొదలైనవి నరికివేసిరి. అప్పటికి తాళ్ళను గురించి యింత పట్టింపు లేదు. ఇప్పుడు తాడి ముట్టుకొన రాదు. పొలముగల కాపు "నా చేనిలోనున్న తాడి నేను గీయనీయ"ననరాదు. తాడి మాగాణి మధ్య ఉండును. గీయుటకు పైరులో నుండి గౌండ్ల వాడు పోయినచో దారి యేర్పడి పైరు నష్టమగును. అప్పటికిని కాపు అటకాయించలేడు.

ఉన్న తోపులన్నియు గుండేటికి దక్షిణమున కనుక గలాలీల యిండ్లన్నియు ఆ వైపుననే ఉన్నవి. వారిలో చాల మంది గ్రామము వదలి లేచిపోయిరి. మఱి కొందఱి పిల్లలు సెకండు ఫారము థర్డు ఫారము వఱకు చదివి, కొందఱు ట్రయినింగై బోర్డు స్కూలు మాష్టరులుగను, కొందరు గ్రామములో వెలిసిన కచేరీలలో కళాశాలలలో కో ఆపరేటివు బ్యాంకులలో పలు చోట్ల బంట్రోతులుగా చేరిరి.

ఇంతలో సహాయ నిరాకరణోద్యమము తన దృష్టి మద్యపాన నిషేధము వంకకు మఱలించినది. గ్రామములోని కొందఱు యువకులు దొంగతనముగా కల్లు వచ్చు తాటి మెవ్వలన్నియు కోసివేసిరి. వారందఱును చెఱసాలలకు పోయిరి. ఇజారా పాడరాదని నిర్బంధించిరి. ఒకటి రెండు సంవత్సరములు కల్లుమీద వచ్చు రాబడి రాచఱికము వారికి చెడిపోయెను. దేశమున సత్యాగ్రహులు విచ్చల విడిగా నిషేధ ప్రచారములు కావించుచుండిరి. ఇజారాపాకల వద్దకు పోవుటయు, అచ్చట మద్యపాయులతో వాదోపవాదములు, బతిమాలుటలు, గడ్డములు, పాదములు పుచ్చుకొనుటలు, వారిచేత వెచ్చ వెచ్చని సారాయి పుక్కిలించి యుమియించుకొనుటలు, కొన్ని సమయములందు శిరస్సులపై మద్య ఘటములు పగిలించుకొనుటలు



- వీనితో వారు ధర్మవీరులైరి. రాఘవరావు చెఱసాల నుండి విడువబడి మద్యపాన నిషేధోద్యమములో తిరుగుచుండెను. అతనికి సుబ్బన్నపేట గొప్ప చెల్లుబడి గ్రామమని తెలియును. నరసరావుపేటలో అతనికి తానుండుటకు వీలులేకపోయెను. భార్య పుట్టినింట ఉన్నది. అత్తమామల కళ్లనికన్న దౌర్భాగ్యుడు లేడని ఊహ. అతని అన్నగారు తమకున్న నాలు గెకరముల పొలము పంటయు చెఱలో ఉన్న తమ్మునకు దమ్మిడి అందకుండ అనుభవించుచు చెఱ వదలి రాఘవరావింటికి రాగానే, మగడు పెండ్లము లిద్దఱును కలిసి పది రోజులలో రాఘవరావు నింటినుండి సూటిపోటి మాటలతో తఱిమిరి. రాఘవరా వత్తవారి యింటికి పోయి వారము దినములుండెను. చెడి అత్తింటికి పోరాదన్నట్లు రాఘవరావున కచటి ఉనికియు ఏవగింపు కలిగించెను. భార్యా సంయోగ మొక్కటియే అతని కచట కలిగిన మనశ్శాంతి. పోయి బెజవాడలో సూర్యపతి యింటివద్ద ఉండవచ్చును. రాఘవరావు కొంత దేశోద్ధారకమైన కార్యము కూడ చేయవలయునని - సుబ్బన్నపేటలో ధర్మారావున్నాడు. అది మద్యపానము విరివిగా జరుగుచోటు, అచ్చటి కేగినచో ప్రచారము చేయవచ్చును. మిత్రుని యింట ఉండవచ్చును.

రాఘవరావు ధర్మారావు ఇంట ఉండుటచేత పోలీసువా రతనిని గూఢచార దృష్టిలో చూచు చుండిరి. ధర్మారావునకు, ఉద్యమమునకు బంధుత్వము ఖద్దరు వఱకే. ఊరిలోని యినస్పెక్టర్లు, మ్యాజిస్ట్రేటు, తహసీల్దారు ధర్మారావు నెఱుగుదురు. అతడు కవి అనియు, గ్రామములోని పలుకుబడి అతనికొక విచిత్రమయినది కలదనియు వారికి తెలియును. చంద్రారెడ్డి అతనికి స్నేహితుడు. అతడుద్యమములో ఎక్కువ జోక్యమునకు పోడు. ఎవరో మిత్రుడు వచ్చి అతడు వాని యింట నుండుట- యీ హేతువులచే ధర్మారావు నందు దోషముగా పరిగణింపబడలేదు. రాఘవరావు మిత్రుని యింట భోజనము మాత్రము చేయును రాత్రులందెప్పుడో వచ్చి అరుగుమీద తనకై యేర్పడిన మంచముమీద పరుండును. తక్కిన యపుడెల్ల గ్రామముమీదనే తిరుగుచుండును. పేట పట్టణమైనంతనే చాకలు లందఱు ప్రతి దినము గుడ్డలుతుకుట మానివేసిరి. ప్రతి దిన ముతికిన బట్టలు కట్టుకొనుట కన్న జనులకు ఇస్త్రీ చేసిన మడతలు కట్టుకొనుట అలవాటైనది. పూర్వ దినము ధరించిన వస్త్రములే మఱుదినము ధరింతురు. ఇవియే మాసిపోవువఱకు కట్టుకొందురు. విడచిన గుడ్డ మఱల కట్టుకొనుట పూర్వపు రోజులలో అసహ్యముగా ఉండెడిది. ఈ రోజులలో ఇస్త్రీ చేయని బట్ట కట్టుకొనుట అసహ్యము. ధర్మారావు గృహములో మాత్రము పూర్వాచారమే ఉన్నది. ఇచ్చటికి వచ్చిన తరువాత రాఘవరావునకు ప్రాణము సుఖమనిపించెను. నరసరావుపేటనుండి తాడిలోతు బావులవద్ద నుండి సుబ్బన్నపేటకు బార లోతు బావుల వద్దకు వచ్చెను. తెల్లవారకముందే సుఖముగా స్నానము చేయును. చాకలి ఉతికి తెచ్చిన మడతలను కట్టుకొనును. పది గంటలకు చక్కగా భోజనము చేయును. ఒక కూర, గేదె పెరుగు ప్రతి దినము తప్పక ఉండును. రాత్రిరికి సుఖముగా నిద్రించును. రెండేండ్లతడు చెరసాలలో పడిన కష్టమంతయు సుబ్బన్నపేటలో రెండు నెలలలో తీరెను. రాఘవరావు గ్రామము వెంట పోవును. ప్రతి యింటికి పోవును. ఆ యింటిలోని సంగతులు కనుగొని మద్యపాయు లెవరైన ఉన్నచో, వారికి బోధించును. వీథులలో పెద్ద పెద్ద సమావేశములు చేసి పోలీసు వారి ప్రాణమునకు తన ప్రాణమునకు అలజడి తెచ్చుకొనడు. అడప దడప ధర్మారావు కూడ అతనివెంట పోవును. ధర్మారావు, ద్రష్ట మాత్రమే. వాగ్మి రాఘవరావు.

కోట ముందు నుండి రోడ్డు దక్షిణముగా బెజవాడకు పోవును. ఆ రోడ్డునకు రెండు వైపులను గ్రామమున్నది. పేద కొంపలన్నియు రెండు పేటలుగ విభజింపబడెను. రోడ్డునకు తూర్పుననున్న భాగమొకటి, పడమటనున్న భాగమొకటి తూర్పుననున్న భాగమంతయు గూడెమును, మిషనరీపేట, కలాతీల యిండ్లు; పడమరనున్న భాగమునందు సినిమా హాలు. దాని వెనుకన పట్టణము సర్దు, పేద వారల కొంపలు. రాఘవరావు తన పని చేయునది అచట. ధర్మారావును, రాఘవరావును కలిసి ఒకనాటి సాయంకాలము అచ్చటికి పోయిరి అందొక పూరిపాక ఉన్నది లోపల హార్మనీ వాయించు చుండిరి. ఆ యిల్లు చూచి - రాఘవరావు 'ఇది యొక చిత్రమైన సంసార"మనెను. ఇద్దఱును లోనికి పోయిరి. లోన ఒక ముసలిది ఉన్నది. దాని కేబది ఏండ్లుండును ఎన్నడును నూనె రాయని తల, మాసిన చీర విధవరాలు. చేతికి గాజులు కూడ లేవు. చూచుటకు దయ్యమువలె ఉన్నది నలువది యేండ్ల స్త్రీ మరిఒకతె. ఆమె చేతికి బిళ్ళేరు గాజులు. వారమున కొకసారి సంస్కరింపబడుచున్న తల, మాసిన చీరయు, అవికయు ఆమె మఱొకచోట కూర్చున్నది. పదమూడేండ్లది మఱొకపిల్ల. ఆమెకు యౌవనోదయమైనది. తెల్లని చీర, నల్లని అవిక, ప్రక్కపాపట, సొగసునకై కత్తిరించిన ముంగురులు. కాలికి పట్టా గొలుసులు.

బొమ్మసెక్స్ తెచ్చిన యుద్ధం



మధ్య యుగాలలో శౌర్యం ఆఢ్య లక్షణంగా ఉండేది. యుద్ధాలు చేయడం రాజులకు హాబీగా ఉండేది. అందుకే అతి చిన్న కారణాలకు కూడా కలహించుకుంటూండేవారు.

పదహారవ శతాబ్దంలో స్విట్జర్లాండ్ చిన్న చిన్న రాజ్యాలుగా ఉండేది. అక్కడ అపెంజల్, సెంట్‌గాల్ అనేవి ఇరుగు పొరుగ రాజ్యాలు. 1579వ సంవత్సరంలో సెంట్‌గాల్ దేశం ఒక ఆల్మనాక్‌ను ప్రచురించింది. అందులో తమ దేశపు పతాక చిహ్నం మగ ఎలుగుబంటి అని పేర్కొంది. అక్కడితో ఊరుకోక తమ పొరుగు రాజ్యమైన అపెంజల్ పతాకం మీద ఉండేది ఆడ ఎలుగుబంటి అని ఓ విసురు విసిరింది. నిజానికి రెండు దేశాల పతాకాల మీద ఉండేదీ ఒకేరకం ఎలుగు చిహ్నమే. దానిసెక్స్ గుర్తు ఎక్కడా కనిపించదు. కాని ఆల్మనాక్‌లో ఈ విధంగా ప్రచురించడంతో తగాదా వచ్చి పడింది.

సెంట్‌గాల్ తమ చిహ్నం గురించి ఈ విధంగా పేర్కొనడం అవమానకరంగా భావించింది అపెంజెల్. వెంటనే తప్పును దిద్దుకోవలసిందిగా సెంట్‌గాల్‌కి సందేశం పంపింది. సెంట్‌గాల్ ఇందుకు తిరస్కరించడంతో రెండు దేశాల మధ్యా భీకర యుద్ధం మొదలైంది. రెండు సంవత్సరాలపాటు సాగిన ఈ యుద్ధంలో ఎన్నో వేలమంది మరణించారు. చివరకి సెంట్‌గాల్ చావు తప్పి కన్నులొట్టపోయిన స్థితిలో అపెంజెల్ పతాక చిహ్నం మగ ఎలుగేనని, ఒప్పుకుంది. అంతటితో యుద్ధం ముగిసింది.

– కె. ఆర్. కె. మోహన్

చేతులకొక బంగారపు గాజుల జత. మఱి మూడు జతల జరీ గాజులు. మొగము చూచినంతనే నవ నాగరికత అంతయు ఉట్టిపడుచున్నది. ఆమె హార్మనీ వాయించుచున్నది- "పోయెనయ్యో ఆ పాలతీ ననుబాసి, పోవునపుడు ఆ పాలతీ వాల్గనుల చూపులు, చూపులు కావవి. మారునీతూపులు- పోయె. పోవునపుడు ఆ పాలతి పడు సంతాపము. సంతాపము కాదది నా పాపము పోయె" ఈ పాట వాయించుచున్నది. ఇరువురును లోనికి పోయి నంతనే ఆమె పాట మాని ఒక వికృతలజ్జ ప్రకటించెను. ముసలిది "అయ్యగారూ, రం"డని రాఘవరావును మరియాద చేసెను. ఇద్దఱును కూర్చుండిరి.

రాఘవ: రంగయ్య ఎట్లుండెను!

ముసలిది : రాతిరి మఱల త్రాగినాడు బాబూ! త్రాగివచ్చినపుడు వాని వ్యవహారమంతయు మీకు తెలియునుగదా! దుర్గమ్మను రాతిరి మఱల చావ మోదినాడు. మొన్ననే నేను ప్లీడరుగారి యింటిలో పని చేయగా వచ్చిన జీతము రూపాయన్నఱలో పావలా బెట్టి క్రొత్త గాజులు వేయించితిని. ఆ గాజులు బ్రద్దలైపోయినవి. పైగా దాని చేతికి గాజులు గ్రుచ్చుకొని గాయమైనది. చూడుము. అని దుర్గ చేయి చూపించెను. ఆ నలుబది యేండ్ల స్త్రీ పేరు దుర్గ. ముసలిదానిపేరు మహాలక్ష్మి. దుర్గ మహాలక్ష్మి కూతురు. రంగయ్య భార్య. మహాలక్ష్మియు, దుర్గయు ఊరిలో ధనవంతులు యిండ్లలో పనులు చేయుదురు. ప్రొద్దున్న సాయంకాలమున పనులు చేసి, మధ్యాహ్నము పది గంటల నుండి రెండు గంటల వఱకు పొగాకు ఫ్యాక్టరీలో పూట కూలి చేయుదురు. సుబ్బన్నపేటకు పది మైళ్ళు దాటి ఉత్తరమునను, పశ్చిమమునను, మెట్ట గ్రామము లున్నవి. అచ్చట పొగాకంతయు సుబ్బన్నపేట కెగుమతి అగును. నాగన్నసెట్టి కొడుకు వేంకట రత్నము పొగాకు ఫ్యాక్టరీ పెట్టెను. నాగన్నసెట్టి చనిపోయి పదేండ్లయ్యెను. రోజునకు వందమంది కూలివాండ్రు ఫ్యాక్టరీలో పని చేయుదురు. వచ్చిన పొగాకు పెండెలన్నియు స్త్రీ లందఱు నాల్గు వరుసలుగా కూర్చుండి పెద్దాకుకు పెద్దాకు, చిన్నాకుకు చిన్నాకుగా చేయుదురు. ఇటులైదాఱు రకములు తీసి, వేని కవి పెద్ద పెద్ద బేళ్ళుగా యంత్రములో అదిమెదరు. అది పై కెగుమతి. వేంకటరత్న మీ వర్తకములో లక్షాధికారి అయ్యెను. మునుపటి పచారికొట్టు, బట్టల కొట్టు తీసివేసెను. ఇందులో చాల లాభము. పల్లెటూరినుండి వచ్చిన పొగాకును చాల తక్కువ ధరకు కొనును. పల్లెటూరివారును దిక్కులేక ఈ ధరకే వానికిచ్చి పోదురు. కూలి దినమునకు స్త్రీకి మూడణాలు; పురుషునకు పావులా. పూట కూలి అణాముక్కాని. పొగాకు బర్మాకు, సిమ్లాకు, ఉత్తర హిందూ స్థానమునకు ఎగుమతి అగుచుండెను. పై కెగుమతి చేయు ధరలు కొన్న ధరకన్న నాలుగైదు రెట్లెక్కువ. పండించిన కాపునకు ధర తక్కువ. ఇట్లుండగా ధర్మఖాతా ఖర్చుల క్రింద కొట్టద్దె క్రింద, కోమటి కాయికష్టముక్రింద బోలెడంత విఱుగ కోత. దేశములో నార, పొగాకు, తేయాకు మొదలైన వర్తకపు పంటలు బలిసి వానికే యిచ్చట వర్తక బాహుళ్యము జరుగుచుండెను. గోధుమలు, జొన్నలు, తదితర ధాన్యములు పర దేశములనుండి యిచటికి దిగుమతి అగుచుండెను. ఇచ్చట పండిన పంట అంతయు తిండికి కాక పేదవారు వర్తకపు పంటలమీద కూలితో బ్రతుకవలసి వచ్చుచుండెను. వర్తకపు పంటలు పండించి, కాపు తక్కువ వెల కమ్ముకుని ఆహార పదార్థములను ప్రియముగా వెలకు తీసికొనవలసినవాడగుచుండెను. ఇందుచే దేశము బీద దయ్యెను.

మహాలక్ష్మియు, దుర్గయు కలిసి నెలకు సుమారు పదమూడు పదునాల్గు రూకలు సంపాదింతురు. అందులో చేజిక్కినప్పుడు కొంత, బతిమాలి కొంత, బెదిరించి కొంత, కొట్టి మఱికొంత, ఎప్పు డెట్లు వీలైన అప్పుడట్లు రంగయ్య పీడించుకొని తీసికొనిపోయి త్రాగును. రంగయ్య కొక కుమారుడు- పదునాలేండ్లవాడు. అతడు సినిమా హాలు చుట్టూ తిరుగుచుండును. సినిమాలో గొన్నాళ్ళు కతనికి నెలకు నాలుగు రూక లిచ్చిరి. సినిమా పండుకొన్నది. ఆ రాబడి తగ్గినది. అతని పేరు కోటీశ్వరరావు. అతడు బీడీలకు నెలకు రెండు రూపాయిలు ఖర్చు పెట్టును. అది ఆడువాండ్ర సంపాదనలో నుండియే యీయవలెను. కూతురు నరసమ్మకు తలనూనెలు, పిన్నులు, ఊలు, సబ్బు బిళ్ళలు మొదలైనవి కావలయును. తిండికి బజారు నుండి నూకలు తెచ్చుకొందురు. ఏ రోజున కారోజు వ్యంజనములకు అంగలార్తురు. అహంకారములు పట్టరానంత. ఇతరులతో కొంచెము పోట్లాట వచ్చెనా, తండ్రి కొడుకులు కఱ్ఱలు పుచ్చుకొని బయలు దేఱుదురు. మహాలక్ష్మి రాఘవరావుతో అన్నది. "బాబయ్యా! వాని త్రాగుడును, వీని బీడీలు లేకున్నచో సంసారము సుఖముగా జరుగును. మా నరసమ్మ ఉన్నది. దాని నెవరికైనను గొప్పవారి కీయవలయునని ఉన్నది. పిల్లకు హార్మనీ చెప్పించినాము. నాల్గవ క్లాసు వఱకు చదివినది. నీవు వచ్చిన తరువాత నయము. కొంచెమన్నము తినుచున్నాము. రంగయ్య పది రోజులక్రింద ఒకసారి త్రాగినాడు. మఱల రాత్రి త్రాగినాడు. నీ వన్నచో అతడు వెఱచుచుండును. నీవు మఱల కనబడి, ఒకసారి చివాట్లు పెట్టి పొమ్ము." రాఘవరావును, ధర్మారావును బయటకు వచ్చిరి. లోపలనుండి మఱల హార్మనీ మ్రోత వినవచ్చెను.

ధర్మా : రాఘవా! ఆ కీర్తన వింటివా?

రా : విన్నాను. ఈ పనికిమాలిన నాటక సమాజములవారు దేశమంతయు ఇట్టి దౌర్భాగ్యపు కీర్తనలతో నింపివేసిరి. అందులో ఒక నీతి లేదు. సంగీతము లేదు; రసజ్ఞత లేదు. బొంబాయి పోయి పారసీ మెట్లు నేర్చుకొని వత్తురు. వాని ననుసరించి యెవనిచేతనో తెలుగు పాటలు వ్రాయింతురు. హార్మనీ మ్రోతయు, తబలా మ్రోతయు ఈ కీర్తనలకు వన్నెలు తెచ్చును. ఆ కీర్తనలు దేశముమీద వ్యాపించును. దేశములో తిండిలేకపోయినను చక్కని రసజ్ఞత యైనను కలిగి జనులు బాగుపడెదరేమో అనగా మన ప్రాణములకీ నాటక సమాజములు వెలసినవి. రంగముమీద ఎంత అపభ్రంశముగా ప్రవర్తించిన అంత జనాకర్షణ జరుగుచున్నది. జనాకర్షణకు రంగముమీద అసభ్య వేషములు హేతువు; దాని కిది హేతువు. ఈ రీతిగా నాటక సమాజములవారు దోచుకొనుచుండిరి. దేశములో దమ్మిడి లేదు. ప్రతి నాటకమునకు వేయి రూపాయిలు చెల్లుబడి. అపూర్వ నట సమ్మేళన మైనచో రెండు వేలు. సంపాదించిన నటకులేమైన బాగుపడుచుందురా అనిన, వారి సంపాదన అంతయు దుర్వ్యయము క్రింద సరిపోవుచున్నది. ఈ రీతిగ దేశము విద్యచేతను, ధనము చేతను దరిద్రమగుచున్నది. సినిమాలకు గాని, నాటకములకుగాని చక్కని శాసనములు లేవు. ఫిలిములకు "సెన్సారుషిప్పు"న్న దనగా అది దేశమునందు రాజద్రోహమనబడు దానిని లేకుండ చేయుటకే చేయబడుచున్నది గాని దేశీయులకు రసజ్ఞత్వము, కథా చమత్కారము, ఔచిత్యము మొదలైన విషయములను బోధించుటకు సానుకూలపడుట లేదు. దుర్మార్గులైన కవులు నాటకములు వ్రాయుదురు. పాటలు వ్రాయుదురు. వారికి రెండు శబ్దములు సరిగా అతుకుట చేతగాదు. వారా నోరు మూసికొని ఊరకుండరు. మనమా, శాస్త్రులము కాము. ఈ వఱద మూలముగా ఆంధ్ర మహా కవుల కవిత్వములన్నియు మూలబడినవి. ఏ విధముగా చూచినను దేశ మెంత దుఃస్థితిలో ఉన్నది!

(ఇంకా ఉంది)

ప్రగతి పథంలో ......

అడుక్కునేవాడి చేతిలో
అదృష్ట రేఖకై చూస్తూ
ఎదురు దెబ్బ తగిలితే
నుదుటి రేఖ తడుముకుంటూ
ఇంటిపేరు సాకుతో
కులంలోతు కనుక్కుంటూ
నాజాతి ముందుకు పోతున్నది-
హరోం హరహర హరహర అంటూ
గాను గెద్దులా!

—కస్తల వేంకట విజయబాబు

'ఫేమిలీ ఈజ్ ది క్రేడిల్ ఆఫ్ సొసైటీ". కుటుంబం సమాజానికి ఊయల వంటిది. అత్యంత ప్రాధాన్యతగల, అతి ప్రాచీనమైన ఈ కుటుంబ వ్యవస్థకు మూలం వివాహం. ప్రపంచంలో ఈ వివాహాల స్త్రీ, పురుష సంబంధాల పరిణామ గతిని పరిశీలిస్తే యిది అనేక మార్పులు చెందుతూ వస్తున్నట్లుగా తెలుస్తోంది. కాలానికి కాలానికి, మతానికి మతానికీ, ప్రాంతానికి ప్రాంతానికీ ఈ వ్యవస్థలో అనేక మార్పులు గోచరిస్తున్నాయి. ఒక కాలంలో బహు భార్యాత్వం, బహు భర్తృత్వం అంగీకరించబడితే మరో కాలంలో అవి నిషిద్ధం. ఇప్పటికీ ముస్లింలలో బహు భార్యాత్వం చట్ట సమ్మతమయితే, హిందూ సమాజంలో అది నిషేధించబడింది. ఈ వైవిధ్యాలను ఓ పక్కకిపెట్టి జనరల్‌గా 'స్త్రీ పరిస్థితిని సమీక్షిస్తే...


గర్భస్థంగా ఉండగానే స్త్రీకి కష్టాలు ప్రారంభం. గర్భస్థశిశు నిర్ధారణ పరీక్షలు వెలుగులోకి వచ్చాక స్త్రీ గర్భస్థ శిశువుగా ఉండగానే అతి దారుణంగా చిదిమివేయబడుతోంది. పుట్టాక తల్లిదండ్రుల పెంపకంలో కూడా పురుషుని కంటె చిన్నచూపే చూడబడుతోంది. స్త్రీని చదివించే విషయానికి వస్తే "ఆడపిల్లకి అంత క్కంటె ఎక్కువ చదువెందుకు? ఉద్యోగాలు చేయాలా? ఊళ్ళేలాలా? ఎంత చదివినా వంట గదికే కదా?" అనే తల్లిదండ్రులు నూటికి ఎనభైశాతం ఉంటారు.

ఇక పెళ్ళివిషయానికి వస్తే – వరకట్న సమస్య! బాగా డబ్బున్నవారు ఏదో విధంగా కూతురు పెళ్ళి చేయగలుతున్నారు. సామాన్యుడు కూడా 'గంతకు తగ్గ బొంత'ను చూడగలుగుతున్నాడు. కాని మధ్యతరగతి మానవుడు మాత్రం ఈ వరుల వేలం పాటలో వరుల్ని కొనుక్కోలేక కష్టాల ఊబిలో కూరుకుపోతున్నాడు.

వివాహానంతరం భార్యా భర్తలు 'పడుగు పేకల్లా' కలిసిపోయి కష్టసుఖాల్లో సమంగా భాగం పంచుకుంటూ, ఒకరిపట్ల ఒకరు సదవగాహనతో సంసారం సాగిస్తే 'గృహమె స్వర్గసీమ' అవుతుంది. కాని చాలా సంసారాలు అలా వుండటంలేదు. దీనికి కారణం – పురుషుడెప్పుడూ స్త్రీపై ఆధిక్యత కోరుతుండడం. భార్యా భర్తలిద్దరూ ఉద్యోగస్తులైనా భార్య సంపాదనమీద భర్త పెత్తనం కొనసాగుతోంది.

వరకట్న హత్యలు, సతీ సహగమనాలు, వైధవ్యాన్ని ఆచరింపచేయడం – యిలా స్త్రీని హింసించే దురాచారాలు ఎన్నో యింకా కొనసాగుతున్నాయి. ఎన్నో దురాచారాలు స్త్రీని చిత్రవధ చేస్తున్నాయి. ఈ స్త్రీ సమస్యలకు కారణాలు రెండు. ఒకటి పురుషాధిక్య సమాజం. రెండు స్త్రీ బలహీనత. కట్నం తేలేదని భర్త తనను మెడబట్టి బయటకు గెంటినా, శాడిస్టులా సిగరెట్టుతో వాతలు పెట్టినా, బెల్టుతో గొడ్డును బాదినట్లు బాదినా, కిరసనాయిలు పోసి తగలబెట్టినా కిమ్మనకుండా స్త్రీ సహిస్తోంది. స్త్రీలోని ఆ బలహీనతే పురుషుల్ని ఉన్నతునిగా నిలబెడుతోంది. దీనికి పరిష్కారం – పురుషుల దృక్పథాల్లో మార్పు రావాలి. భార్యను బానిసగా చూసే మనస్తత్వం నుంచి, తనతో సమానంగా, సహధర్మచారిణిలా పరిగణించే మనస్తత్వానికి పురుషుడు ఎదగాలి. అలాగే స్త్రీ కూడా అన్యాయాన్ని ఎదిరించే ధైర్యం, గుండె నిబ్బరం అలవరచుకోవాలి.

అంతరంగాల్లో మార్పు రావాలి!



గుబ్బల ఝాన్సీలక్ష్మి.
పెదపాడు (ప. గో.)

కూపన్
ఆంధ్ర సచిత్ర వారపత్రిక
ఈ కాలం పెళ్ళిళ్ళు
పంపిన వారి పేరు ....
పూర్తి చిరునామా ....
....
....
పిన్ కోడ్: ....

షేర్ మార్కెట్‌లలో పెట్టుబడులు



–యన్ రామ్‌జీ, న్యూఢిల్లీ

నేను క్రిస్మస్ శెలవలు మీద విజయవాడ రావటం జరిగింది. ఇక్కడ సూపర్ బజార్ ప్రక్కన మా ఫ్రెండ్ భాస్కర్ ఆఫీస్‌లో కూర్చోవటం నాకు ఒక అలవాటు. ఇంతలో కొంతమంది ఇన్వెస్టర్‌లు నా రాక గూర్చి తెలిసి రావటం జరిగింది. వారంధరూ ఇప్పుడు నా వ్యాసాల గురించి చర్చించటంతో బాటు ఆంధ్ర



హెచ్. పి. నందా

సచిత్రవార పత్రిక వారు ఇన్‌వెస్టర్‌లకి చేస్తున్న మేలు గూర్చి హర్షించటం, అంతేగాక దిన పత్రికలో కూడా షేర్ ప్రైస్ మూమెంట్స్ ఇస్తే బాగుంటుంది. దానితో పాటు మీరు డైలీ మార్కెట్ మూడ్స్‌ను గూర్చి వ్రాస్తే బాగుంటుంది అని సూచిస్తూ ప్రపంచ స్టాక్ మార్కెట్స్ పతనం గూర్చి మీ అభిప్రాయం ఏమిటి? అని ఎంతో ఆందోళనగా ప్రశ్నించారు.

నేను జవాబు చెప్పేలోగా మా భాస్కర్ అందుకొన్నాడు.

ఏముంది గురూగారు బహుశా మన కృష్ణా జిల్లా వారు ఆ మార్కెట్‌లలోకి కూడా ప్రవేశించి వుంటారు అందుకనే పడిపోయింది! చూడండి మన వాళ్ళు లారీ ఫీల్డులో ఉధృతంగా ప్రవేశించే సరికి కిరాయిలు పడిపోయాయి. అలాగే వీడియో ఫిల్మ్స్, విడియో గేమ్స్ అంటూ చెప్పుకుంటూ పోతున్నాడు.

ఇంతలో మా రెడ్డిగారు చెప్పినవే కాక బహుశా మన మహేష్‌రాజు, సుందర శర్మలు ఈ మార్కెట్‌లో ప్రవేశించి వుంటారు. ఎందుకంటే శర్మ బొంబాయ్ బ్రోకర్ దివాళా తీశాడు అని రూమర్స్ స్ప్రెడ్ చేయటంలో ఘనుడు అయితే రాజు గారు చాలా లెక్కలు వేసి ప్రతి షేర్ బాగా పెరిగాక అప్పుడు తను కొనటమే కాకుండా అందర్నీ కొనమని హింసించేసి కొనిపిస్తాడు. (ఈయన అదృష్టం ఏమోగాని ఇతను ఏ షేర్ కొన్నా గూడా 'ధాం' అని పడిపోతుంది.) అలాగే విదేశాలలో ఉన్న భారతీయుల చేత కొనిపించి వుంటాడు అన్నాడు.

వాళ్ళ కామెంట్స్‌కి నవ్వుకొని అసలు టాపిక్ లోకి నా సహజ ధోరణిలోకి వచ్చి వివరించటం మొదలు పెట్టాను.

అక్టోబర్ 19న వాల్ స్ట్రీట్ (ఇది న్యూయార్క్ స్టాక్ ఎక్స్‌ఛేంజికి మరో పేరు) యొక్క డౌ జోన్స్ (ఇది మనం కొలబద్దగా తీసుకొనే ఇ. టి. ఇండెక్స్ లాటి ధరల సూచిక) 2246.74 నుంచి 1738.42 కి ఒక్క సారిగా 405.73 పాయింట్స్ పడి పోయి ప్రపంచంలో వున్న ఇన్వెస్టర్‌లు అందరికీ వెన్ను లోంచి ఒణుకు



ఎన్. ఎం. దేశాయి


పుట్టించిన సంఘటనే కాక ఈ రోజుని బ్లాక్ మండేగా బాధగా పిలవ బడుతున్న దుర్దినం.

ఈ పతనం ఎంత తీవ్రంగా వుందో తెలుసుకోవాలంటే కొందరు ప్రముఖుల అభిప్రాయాలతో పాటు కొందరు ఇన్వెస్టర్ల అభిప్రాయాలు గూడా మీకు తెలియ పరచవలసిన అవసరం వున్నది.

ప్రపంచం మొత్తం మీద బహుళ ప్రజాదరణ కల 'టైమ్స్' పత్రిక ఎడిటర్ ఎకనామిక్స్ అండ్ బిజినెస్ సెక్షన్‌లో ఇలా వర్ణించాడు.

ఇప్పుడు మార్కెట్‌కి ఏమవుతుందన్నది ముఖ్యం కాదు, ఈ పతనానికి దారి తీసిన ఆర్థిక సమస్యలు మనని అంటి పెట్టుకునే ఉటాయి. ప్రతి ఒక్కరూ ఈ సంఘటన వలన నష్టపోతారు. చివరికి నా పిల్లలు, వారి పిల్లలతో సహా" అని వర్ణించాడు.

అమెరికా లాటి పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలలో ప్రజలు తమ సేవింగ్స్‌ని తప్పని సరిగా కొంత మేరకు స్టాక్ మార్కెట్లలో పెట్టటం నిత్యకృత్యం అటువంటి ప్రజలలో, ఒక రిటైర్ అవ్వబోతున్న ఒక సాధార్ణ ఇన్వెస్టర్ ఈ పతనం చూసి ఏమి చెప్పాలో అర్థంగాక అన్న మాటలివి "ఇది నన్ను చచ్చేంత భయపెడుతూంది. ఎందుకంటే ఈ



మార్కెట్ ప్రభావం అన్నిటి మీదా ఉంటుంది" అన్నారు.

ఈ విధంగానే బెర్నికా, ఎలియాస్ దంపతులు 300,000 డాలర్ల పోర్ట్ ఫోలియో స్టాక్ లలో పెట్టిన పెట్టుబడి 20x కొద్ది రోజులలో కూలిపోవటం చూసి ఇలా అన్నారు. "మేము గత 22 ఏళ్ళుగా ఈ మార్కెట్‌లో పెట్టుబడి పెడుతున్నాము. ఇప్పుడు ఇది జరిగింది. ఒక జీవితకాలం కృషి నలతటినీ ఇది వ్యర్థం చేసింది" అన్నారు.

ఇలా నష్టపోయిన వాళ్ళే కాదండోయ్ 4 సం. లగా అంటే 1982 నుంచి విపరీతంగా పెరుగుతున్న ఈ స్టాక్ మార్కెట్ లలో పెరిగిన ప్రతి షేరు పడాలి అనే నియమం ప్రకారం అంటే మన సముద్రంలో వచ్చే అల కూడా ఒక ఉప్పెన కావాలి అనేటట్లుగా వుంటుంది అని వూహించి విపరీత మైన డబ్బు సంపాదించిన వారు కూడా వున్నారు. అలాటి వారిలో డోనాల్డ్ ట్రిమ్స్ అనే జర్నలిస్ట్ కిమ్ పోర్టుఫోలియో మేనేజర్ డౌ జోన్స్ 2722 చేరిన వెంటనే తన కంపెనీలో వున్న 500 మిలియన్ డాలర్ల షేర్లు అమ్మేయటం మూలంగా 200 మిలియన్ డాలర్స్ నికరలాభం సంపాదించుకున్నారు.

అంతేగాక పడిపోతున్న స్టాక్ మార్కెట్లలో కూడా డబ్బు సంపాదించవచ్చు అని నిరూపించటానికి అన్నట్లు కొందరు 508 పాయింట్స్ పడిపోయిన రోజున కాని ఆ మర్నాడు డౌ సిద్ధాంతం ప్రకారం పడిపోయిన దానిలో 1/3 వ వంతు తప్పక పెరుగు



తలక్రిందైన అంచనాలు!

తుంది. అన్న నిర్ధారణగా అన్నట్లు ఆ మర్నాటి పెరుగుదలలో అమ్మేసి వేలు లక్షలు సంపాదించిన వారు కూడా వున్నారు.

పాఠకుల మెదడుకు ఒక మేత కల్పిస్తున్నాను. ఇలాటి వారి గూర్చి మనం ఇంతకి ముందు తెలుసుకున్నాం వీరికి ఒక ప్రత్యేకమైన పేరు వుంది. ఆ పేరు ఏమిటో కరెక్ట్‌గా వూహించి ఆంధ్ర సచిత్ర వార పత్రికకి పంపిన వారికి ఒకవారం పత్రిక ఉచితంగా బహుమతిగా లభిస్తుంది. ఈ బహుమతి మీదే ఎందుకు కాకూడదూ? ప్రయత్నించండి!.

వచ్చే వారం ఈ మార్కెట్స్ పడిపోవటానికి గల కారణాలు. ఈ పతనాన్ని ఊహించిన భారతీయుని పేరు. దీని ప్రభావం ఇతర దేశాలలో వున్న స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో ఎంత వరకు వుంది? మొదలయినవి తెలుసుకొందాము. □

రు. 116/– బహుమతి!

బడ్జెట్ తరువాత మార్కెట్ ఎలా వుంటుంది?

మనం కొంత వరకు ఈ మార్కెట్ గూర్చి తెలుసుకుంటున్నప్పుడు రకరకాలుగా వూహాగానాలు సాగుతున్న బడ్జెట్ గూర్చి దాని ప్రభావం స్టాక్ మార్కెట్‌ల మీద ఎలా వుంటుంది అని కరెక్ట్‌గా వూహించి దానికి సరైన 3 కారణాలు క్లుప్తంగా వివరించిన వారికి సదరన్ కన్సెల్టెన్సీ సర్వీసస్ శీతమ్మధార బ్రాంచ్ విశాఖపట్నం వారు 116 రూపాయిలు బహుమానంగా ప్రకటిస్తున్నారు. మీ అభిప్రాయాలు ఫిబ్రవరి 27 లోగా వ్రాసి ఆ బహుమతి మీరే ఎందుకు పొందకూడదూ? –రామ్‌జీ

మన క్రీడాంగణాల దుస్థితి!

క్రీడాంగణాలు పవిత్ర ఆలయాలు. మన వర్ధమాన క్రీడాకారులని రూపొందించే శిక్షణ కేంద్రాలు. ఔత్సాహిక క్రీడాకారులను తీర్చి దిద్దే స్థావరాలు. జాతీయ, అంతర్జాతీయ, తదితర స్థాయి పోటీలు, నిర్వహించబడే ఆట స్థలాలు.క్రీడాంగణములు ఆధునిక పరిస్థితులలో కావలసిన సదుపాయములు యువతకు అందించి. భవిష్యత్తులో మనకీర్తి, ప్రతిభలను చాటే క్రీడాకారులను తయారు చేయ వలసిన శిక్షణ కేంద్రాలే గాక రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీలు నిర్వహించుటకు అనువైన ప్రదేశాలు. వీటిని యితర దేశాలలో ప్రజారోగ్య కేంద్రాలుగా భావిస్తుంటారు. కానీ మన దురదృష్టం ఏమిటంటే ప్రజారోగ్య కేంద్రాలు (పబ్లిక్ హెల్త్ సెంటర్స్) అంటే రోగులు వైద్య సదుపాయము కొరకు వచ్చే ప్రభుత్వ ఆసుపత్రులు. మనకు ప్రజారోగ్యము అంటే రోగుల స్థావరము అని అర్థము. ఆరోగ్యమే మహాభాగ్యము అనే సూక్తి నేడు కరువైనది. క్రీడాకారులంటే ఆదరణ లేదు. ఏ కొద్దిగానో క్రీడలంటే అభిమానించేవారు తమ కుమారుడు గవాస్కర్, కపిల్‌దేవ్‌లా శ్రమ, కృషి, దీక్ష లేకుండా కావాలనుకుంటారు. క్రీడాంగణములు, ఆటస్థలములు అవశ్యకతని మన సమాజం గుర్తించలేదు. ఆటలు ఆడుకొనుటకు స్థలము లేక రోడ్డు ప్రక్కన దుమ్ములో అనారోగ్య పరిస్థితులలో, ఒక ప్రక్క వాహనముల రాకపోకలు, కలుషిత వాతావరణంలో చిన్నారి బాలలు ఆడుకొంటూ యుంటే, సమాజము గురించి, మంచి చెడు చెప్పే పెద్దలు సహితం పట్టించుకోరు.



ఆడుకోడానికి అనువుగా క్రీడా స్థలాలని తీర్చిదిద్దాలి.


పెద్ద పట్టణములలో, కొందరు క్రీడాసక్తి కలిగిన వారి కృషి ఫలితంగా బహిరంగ ఆటస్థలములు, క్రీడాంగణములు ఏర్పడ్డాయి. బహిరంగ ఆటస్థలములంటే అందరూ పెత్తుందారుతే.

ఇక ఉన్న కొన్ని క్రీడాంగణాలని నిర్మాతలు నిర్వహించ లేని స్థితిలో యున్నారు. క్రీడాభిమానులైన దాతల సహకారముతో అనేక క్రీడాంగణములు మన దేశంలో, రాష్ట్రములో నిర్మించబడ్డాయి. ప్రభుత్వ, క్రీడామండలిల ఆర్థిక సహాయం అతికొద్ది. కాని వాటి నిర్వహణ కష్టమయినది. క్రీడాంగణములు ఎప్పటికప్పుడు ఆటలకు అనువుగా తీర్చి దిద్దుటతో బాటు, క్రీడా పరికరాలు సమకూర్చుకోవాలి. క్రీడాంగణ సిబ్బంది ఖర్చు భరించవలసి యున్నది. ఉదాహరణకు మన రాష్ట్రంలో గల అనేక క్రీడాంగణములు యిదే స్థితిలో యున్నవి. రాష్ట్ర క్రీడామండలి (ఇప్పుడు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) నుండి క్రీడాంగణములు నిర్వాహణకు ఎట్టి ఆర్థిక సహాయము అందటంలేదు. నేడు మన రాష్ట్రములో శ్రీకాకుళం . కాకినాడ, ఏలూరు, విజయవాడ, గుంటూరు, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు, అదిలాబాద్ మొదలగు చోట్ల క్రీడాంగణములు కలవు. ఇవన్నీ ప్రజల సహకారముతో నిర్మించబడినవి. విజయవాడ స్టేడియం మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహించటం వల్ల అంత కష్టము అనిపించటంలేదు. విశాఖపట్నం కార్పొరేషన్ స్టేడియం 135 లక్షల వ్యయముతో నిర్మించబడి డిసెంబర్ 12న ప్రారంభించబడినది. ఈ క్రీడాంగణముల నిర్వహణ జిల్లా క్రీడామండలిలకు కష్టసాధ్యముగా యున్నది. హైదరాబాద్ లాల్‌బహదూర్ స్టేడియం కాంప్లెక్స్, జింఖానా గ్రౌండ్స్ మాత్రం రాష్ట్ర క్రీడామండలి స్వయంగా నిర్వహిస్తున్నది. గుడివాడలో ఎన్. టి. ఆర్. స్టేడియం నిర్మాణములో ఉంది.

క్రీడాంగణములోని వివిధ ఆటస్థలములు ఆ క్రీడలకు అనువుగా తీర్చి దిద్దవలసిన అవసరం ఉన్నది. ఆటస్థలం ఉపరిభాగము చదునుగా

(78 వ పేజీ చూడండి)

రాజకీయ సమావేశం కారణంగా ఒక క్రీడాంగణానికి పట్టిన దుస్థితి.



హైదరాబాద్ నోట్‌బుక్

నిజాం కాలేజి శతవార్షికోత్సవం:–

నిజాం కాలేజి 1887 లో స్థాపితమైంది. 1987 కు వంద ఏళ్ళు పూర్తి చేసుకొంది. ఈ సంవత్సరమంతా శతవార్షికోత్సవ వత్సరం-కనుక సభలు సమావేశాలు జరుగుతూనే వుంటాయి. నిజాం కాలేజీ భవనాలు చాల్ల పాతవైపోయాయి గనుక, వర్తమాన అవశ్యకతలకు అనుగుణంగా కొత్త భవనాలు నిర్మించాలని, విద్యార్థుల, సిబ్బంది అవసరాలు, మొదలయిన వాటిని బట్టి పెక్కు అంతస్థుల భవనాలు నిర్మించాలని ఆడిటోరియం కూడా నిర్మించాలని శతవార్షికోత్సవ సంఘం పథకాలు సిద్ధపరచింది. ఈ కాలేజీ సేకరించే నిధులకు అనురూపమయిన అనుదానం (గ్రాంటు) ఇవ్వడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం వాగ్దానం చేసింది. ఈ పథకాలకు ఒక కోటి రూపాయలు ఖర్చు కావచ్చునని అంచనా. దీనిలో సగం– 50 లక్షల మొత్తాన్ని కాలేజీ సేకరించాలి. ఈ శతవార్షికోత్సవానికి ఇచ్చే విరాళాలకు రాబడి పన్ను మినహాయించడానికి రాబడి పన్ను శాఖ సెక్షన్ 80 (జి) కింద అంగీకరించింది. నిజాం కాలేజీ పూర్వం ధనవంతుల కాలేజి. దీనిలో చదివిన రాజులు, మహారాజులు, నవాబులు, బహదేదార్లు, ఉన్నతాధికారులూ ఉన్నారు. వారు శతవార్షికోత్సవ వార్త వినగానే, కాలేజీకి వచ్చి, "నేనిక్కడ కూర్చుని చదువుకున్నాను. ఏ[illegible]టి మన కళాశాల ఇలా మారిపోయింది! అప్పటి గాంభీర్యం కనిపించదే? అప్పటి తోట లేవీ? లానులు (పచ్చిక బయళ్ళు) లేవే? బండలు, మెట్లు ఎంత అరిగి పోయాయి!" అంటూ తమ మధుర స్మృతులు వెళ్ళబోసుకుంటున్నారు. వారంతా దాదాపు 75 నుంచి 90 ఏళ్ళ వాళ్ళు. ఉత్సవాలను అత్యంత జయప్రదంగా చేయాలని నిర్ణయించుకున్నారు.

భాగ్యనగరంలో హుయాంగ్‌హో!

తెలుగుదేశం ప్రభుత్వం ఐదు సంవత్సరాల విజయోత్సవం సందర్భంగా జనవరి 9 వ తేదీన జరిగిన జనశక్తి చైతన్య యాత్రను చూచిన వారు చైనాలోని పసుపు నది హుయాంగ్‌హో పొంగి పార్టీ సరిహద్దులు దాటి భాగ్యనగర వీధులను ముంచెత్తిందా? అని భ్రాంతి పడ్డారు. వేల మంది తెలుగుదేశం కార్యకర్తలు పసుపు గుడ్డలతో, పసుపు జండాలను, బ్యానర్లను ఊపుతూ కల్లోలితమైన హరిత నదినే తలపించారు. నిజాం కళాశాల ఘోషా మహల్ స్టేడియం, బుద్ధ పూర్ణిమ గ్రౌండ్‌ల నుంచి సికింద్రాబాద్‌లోని గ్యారిసన్ పెరేడ్ గ్రౌండ్‌కు చేరుకున్న ఈ జనశక్తి చైతన్య యాత్రలో పార్టీ అభిమానులు నృత్యం చేస్తూ, బాజాలు వాయిస్తూ, గంతులు వేస్తూ వెళ్ళారు. ఉదయం 11–00 గంటలకు ఆరంభమైన ఈ మహాయాత్ర సాయంకాలం 5–00 గంటలకు సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్ చేరింది. వాస్తవానికి యాత్ర నిజాం కళాశాల నుంచే ప్రధానంగా బయలుదేరినా, లాంఛనంగా ఘోషామహల్ స్టేడియం నుంచి ప్రారంభమైంది. ఈ ఘోషా మహల్ పోలీస్ గ్రౌండ్ నుంచే తెలుగుదేశం పార్టీ బోఫోర్స్ ఫెయిర్‌ఫాక్స్ ప్రతికూల ప్రదర్శనలు ప్రారంభించారు. అందువల్లనే ఈ యాత్ర కూడ అక్కడ నుంచే లాంఛనంగా ప్రారంభమయిందని అంటున్నారు. చైతన్య యాత్ర ఆరంభం కావడానికి ముందు ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు శ్రీ ఎన్. టి. రామారావు పసుపు రంగుతో మెరిసిపోతున్న కారులో వచ్చి దిగారు. అతనిని చూడడానికి జనం తండోప తండాలుగా మూగి వున్నారు. అతనికి స్వాగతమివ్వడానికి మంత్రులు. రామారావు కటౌట్‌లూ వున్న వ్యాను నడిచింది. మరచాను ఏనుగుకు ముందు నగరంలోని సుప్రసిద్ధ బ్యాండు బృందంలో ఒకటయిన పెంటయ్య బృందం తెలుగుదేశం గీతాలు వాయిస్తూ నడిచింది. పార్టీ వ్యాను వెనుక శ్రీకాకుళం జిల్లా నుంచి వరుసగా జిల్లాల వారీ జనవాహిని కదలింది. ఈ మహాయాత్ర గమ్యం చేరడానికి ఆరు గంటలు పట్టింది. దాదాపు ఈ పన్నెండు కిలో మీటర్ల యాత్ర పొడవునా కార్యకర్తల ఉత్సాహం ఏంత మాత్రమూ తగ్గలేదు. వారు పాడుకుంటూ, ఆడుకుంటూ, గంతులు వేసుకుంటూ, ఎన్. టి. ఆర్ అనుకూల నినాదాలు కేంద్ర, కాంగ్రెస్ ఐ ప్రతికూల నినాదాలు చేసుకుంటూ తరలి వెళ్ళారు. స్త్రీలు, బాలబాలికలు కూడ ఉత్సాహంలో ఏమాత్రం తీసిపోలేదు. యాత్ర అంతటా బాణ సంచా



ఊరేగింపు దృశ్యం

శాసనసభ్యులు వేచి వున్నారు. ముఖ్యమంత్రి, ప్రముఖులతో కరచాలనం చేసిన తర్వాత, తన కటౌట్, పార్టీ చిహ్నం వున్న వ్యాను ఎదుట ఐదు కొబ్బరికాయలు కొట్టి యాత్ర ప్రారంభం కావచ్చునని చేతితో సైగ చేసి, తాను వచ్చిన కారులో యాత్రలో పాల్గొన్నారు. వెంటనే బాణసంచా కాల్పులు, నినాదాలు, బ్యాండు వాద్య ఘోషలతో యాత్ర ప్రారంభమైంది. యాత్రకు అగ్రగామిగా హరిద్రాకౌశేయాలంకృతమైన ఏనుగు నడిచింది. దానిపై హైదరాబాద్ నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు శ్రీ కృష్ణారెడ్డి పెద్దపార్టీ పతాకను పట్టుకొని కూర్చున్నారు. గజరాజు వెంబడి ఐదు ఒంటెలు, తొమ్మిది గుర్రాలు నడిచాయి. వాటిని అధిరోహించిన వారూ పసుపు దుస్తులు ధరించారు. వాటి తర్వాత పార్టీ చిహ్నమూ, శ్రీ

కాల్పులు వినబడుతూనే వున్నాయి. వాటి ధ్వనిక ఆకాశం ప్రతిధ్వనించింది. ఈ బాణసంచా తయారు చేసిన వారు తూర్పు గోదావరి జిల్లాలోని ద్రాక్షారామవాసులట. వీరు పెరేడ్ గ్రౌండ్‌లో ఆ రాత్రివి తమ బాణసంచాతో పట్టపగలుగా, ఉదయాస్తమయ సంధ్యలుగా, క్షీరసాగరంగా, ఎర్ర సముద్రంగా మార్చారు. ఊరేగింపులో ఉత్సాహోతి రేకాన్ని వర్ణించడం సాధ్యం కాదు. పులి వేషాల వారు, ఆటవిక వేషాల వారు నాట్యం చేయడం కనిపించింది. వాటిని చూస్తూ ఊరేగింపు లోని వారికి అలసట తగ్గింది. ఒక మహోత్సాహి తన నడుం బెల్టు చుట్టూ ఐదు తెలుగుదేశం పార్టీ పతాకలు చెక్కుకున్నాడు. రెండుచేతులతో రెండు పతాకలు పట్టుకున్నాడు. కేకలు వేస్తున్నాడు. స్త్రీల నినాదాలతో "అన్న

హైదరాబాద్ నోట్‌బుక్

జిందాబాద్, అన్న వర్ధిల్లాలి" అనే కేకలు విశేషంగా వినిపించాయి. తిరుపతి నుంచి వచ్చిన ఒక యువకుడు అచ్చం శ్రీ రామారావు లానే ఆహార్యం ధరించి ఆశ్చర్యపరచాడు. అతడు నవ్వినా ఎన్. టి. ఆర్ లాగే నవ్వాడు. ఆ చూపులు, చేతి సన్నలూ అవే. మాజీమంత్రి శ్రీ ఎనమల రామకృష్ణుడు నాయకత్వం వహించిన తూర్పు గోదావరిజిల్లా బృందంలో ఒక వ్యక్తి విచ్చుకత్తితో కదంతొక్కుతూ పదం పాడుతూ నడిచాడు. ఈ మహాయాత్రలో పాల్గొన్నవారు కొందరు మొదటిసారి నగరానికి వచ్చారు కాబోలు! ట్యాంక్‌బండ్‌పై ఉన్న విగ్రహాలను విస్తుపోయి చూస్తూ వెళ్ళారు వయోవృద్ధులు.. స్త్రీలు ఆ విగ్రహాల పంచన, అక్కడక్కడ విశ్రాంతి తీసుకున్నారు జిల్లాల నుండి బస్సులతో, లారీలతో లక్షల ప్రజలు వచ్చారు ఈ వాహనాలు దాదాపు రెండు వేల పైచిలుకని అంచనా ఏమైనా భాగ్యనగరం కనివిని ఎరుగని జనశక్తి చైతన్య యాత్ర ఇది

జనం! జనం! జనం! జనం!

జనం మనం మనం జనం, జనం లేంది మనంలేదు – అన్నాడు కీర్తిశేషుడు దాశరధి కవి. జనవరి 9వ తేదీన తెలుగుదేశం పార్టీ జనం జనం అంతా జనం – అన్నది. నేను మద్రాసుకు కృశ్చేవ్ వచ్చినప్పుడు చూచాను. మద్రాసులోని ఐలెండ్‌గ్రౌండ్ 10 లక్షల జనంతో కిటకిటలాడింది. అంతకుముందు 1939లో నేతాజీ సుభాష్‌చంద్రబసు మద్రాసుకు వచ్చినప్పుడు చూచాను. మద్రాసు నగరమే బీచిలో విరుచుకుపడింది. శ్రీ అణ్ణాదురై విజయోత్సవం చూచాను మౌంట్‌రోడ్డు రోడ్డే జనంతో పొంగిపోయింది అంతజనం తెలుగుదేశంపార్టీ విజయోత్సవంలో జనవరి 9న చూచాను. ఏమిజనం! ఏమిజనం! అంతా జనమే. ప్రత్యర్థి రాజకీయ పక్షాలు విమర్శించినట్టు కొంతమందిని బలవంతగా తేగలంగాని, ఇన్ని లక్షల మందిని తేలేముగదా! కనుక వివిధ భావాలతో వచ్చినవారు వున్నా, అత్యధికసంఖ్యాకులు అభిమానించే జనులు అనకతప్పదు. ఈ విజయోత్సవంలో హర్యానా ముఖ్యమంత్రి శ్రీ దేవీలాల్, కర్నాటక ముఖ్యమంత్రి శ్రీ రామకృష్ణ హెగ్డే, అస్సాం ముఖ్యమంత్రి ప్రఫుల్ల కుమార్ మహంతా, బెంగాల్ ముఖ్యమంత్రి ప్రతినిధి, బి. జె పి. నాయకురాలు శ్రీమతి విజయరాజే సింధియా, పంజాబ్ మాజీముఖ్యమంత్రి శ్రీ బర్నాలా, లోక్‌దళ్ (బి) నాయకుడు శ్రీ బహుగుణ, జనమోర్చా నాయకులు శ్రీ వి. సి. శుక్లా, కాంగ్రెస్ ఎస్ నాయకుడు శ్రీ ఎస్. కె గవాయి, శ్రీ మధుదండావతే, జెఠ్‌మలానీ మున్నగువారు పాల్గొన్నారు వీరందరూ తమతమ ప్రసంగాలతో నాన్‌కాంగ్రెస్ ఐ ప్రభుత్వాలను, ముఖ్యంగా ఎన్. టి ఆర్. ప్రభుత్వాన్ని ఏదో సాకుతో కూలద్రోయడానికి ప్రయత్నించవద్దని, అలా ప్రయత్నిస్తే దేశంలో అల్లకల్లోలం జరుగుతుందని కేంద్రప్రభుత్వాన్ని హెచ్చరించారు. ముఖ్యమంత్రి శ్రీ ఎన్. టి రామారావు ఈ బ్రహ్మాండమైన సభలో ప్రసంగిస్తూ, నాన్ కాంగ్రెస్ ఐ జాతీయ రాజకీయపక్షాలు కేంద్రంలోని కాంగ్రెస్ ఐ ప్రభుత్వానికి ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని నెలకొల్పితే దేశ సమస్యలు పరిష్కారమౌతాయని, కనుక కాంగ్రెస్ ఐ యేతర రాజకీయ పక్షాలు ఏకమై కాంగ్రెస్‌ను కేంద్రం నుంచి తొలగించాలని అన్నారు. ఒక ఉమ్మడి కార్యక్రమంపై అన్ని ప్రతిపక్షాలు ఏకం కావాలన్నారు. నాయకుల ప్రసంగాలతో రాత్రి చాల ప్రొద్దుపోయినప్పటికీ, లక్షల జనం అట్లేవుండి గిరిజన నృత్యాది సాంస్కృతిక కార్యక్రలాపాలను తిలకించింది.

ఉపశ్రుతి:

తెలుగుదేశం విజయోత్సవానికి వచ్చిన జనాన్ని చూచారా? అనడిగాను ఒక కాంగ్రెస్ ఐ నాయకుణ్ణి ఆ(' జనానికేమిలెండి'- అని చప్పరించాడు అయన. అయ్యా, ప్రతి వ్యక్తికీ తన యిష్టం వచ్చినట్లు అభిప్రాయపడే హక్కువుంది కాని, వాస్తవాలను తప్పుగా చెప్పే హక్కు లేదని బెర్నార్డ్ బరుష్ అనే మహనీయుడు అన్నాడండీ – అని మా మాటలు వింటున్న ఒకపెద్దమనిషి అన్నాడు.

– తిరుమల రామచంద్ర

ఉండేందుకు ఎప్పటికప్పుడు జాగ్రత్త తీసుకోవాలి లేకపోతే ఆడటం కష్టమే కాక, గాయములు తగిలి క్రీడాకారుని భవిష్యత్తుకు దెబ్బ తగులుతుంది.

ఎంతో శ్రద్ధ, కృషి ఫలితంగా ఆటలకు అనువుగా ఏర్పడిన క్రీడాస్థలములలో కొన్ని రాజకీయ సమావేశాలు, వినోద కార్యక్రమాలు విందులు ఏర్పాటు చేయటం వల్ల నష్టం జరుగుతున్నది అటువంటి సయములలో నిర్మించు తాత్కాలిక వేదికలు, యితర కట్టడములు వలన ఆటస్థలములకు ఎంతో నష్టము జరుగుతున్నది. దానిని గురించి ఆలోచించేవారు లేరు. తిరిగి ఆటస్థలములు తీర్చిదిద్దుకొనుట దుస్సాధ్యము.

క్రీడాంగణములంటే కొందరి అభిప్రాయము ఎప్పుడు క్రీడా పోటీలు నిర్వహించాలి, వినోద కార్యక్రమాలు జరగాలని. ఈ అపోహ సామాన్యునికే గాక విద్యావంతులకు కూడా ఉంది. ఇది సరికాదు. ఎల్లప్పుడు క్రీడా పోటీలు జరపాలి, అంటే జరగని పని. వ్యయముతో కూడినట్టిది. అన్ని సమయాలలో

మన క్రీడాంగణాల దుస్థితి

(76 వ పేజీ తరువాయి)

అందరికీ అవకాశము లభించదు. ఆ శక్తి ఉన్నా అవకాశం లభించని, వ్యయము భరించలేని పరిస్థితులలో పోటీలు జరుపుట కుదరదు కొన్ని కోట్ల వ్యయముతో ఢిల్లీలో నెహ్రూ స్టేడియం, కలకత్తా, బొంబాయి, మద్రాసు, బెంగుళూరు మొదలైన చోట్ల క్రీడాంగణములు నిర్మించబడ్డాయి. వాటిలో ఎల్లప్పుడు పోటీలు జరగవు. క్రీడాంగణం క్రీడాకారుల శిక్షణ స్థలము అన్నది మరువరాదు

మనం పతకాలు సాధించలేదని చేతగాని విమర్శలు చేస్తే, మేధావులు మనం క్రీడారంగానికి ఏం చేసాము! మన కుటుంబంలో ఎంతమంది క్రీడాకారులు ఉన్నారు? అని ఆలోచించాలి. కనీసము తమ పట్టణములో పిల్లల కోసం ఆటస్థలముమైనా సమకూర్చకూర్చకలిగామా అని ఆత్మ పరిశీలన చేసుకోవాలి.

ఆధునిక క్రీడాంగణములు నిర్మించుట ఎంత కష్టమో దాని నిర్వాహణ కూడా అంత కష్టం. క్రీడాంగణము ఆరోగ్యకేంద్రముగా, పవిత్ర ఆలయములాగ భావించినప్పుడే మనం ఆరోగ్యవంతమైన జాతిని రూపొందించగలము. జాతీయ, అంతర్జాతీయ క్రీడారంగంలో పతకములు సాధించగల ప్రతిభావంతులను తీర్చిదిద్దగలము. సమాజ దృక్పథం మారాలి. క్రీడాంగణములలో యితర కార్యక్రమాలు నిర్వహించటం పట్ల మేధావులు ఆసక్తి చూపరాదు. అప్పుడే మనం క్రీడారంగములో ఏదైన సాధింగలము. నిరాహణలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు భాగం పంచుకోవాలి మున్సిపాలిటీలు, కార్పొరేషనులు, పంచాయితీరాజ్ సంస్థలు క్రీడాంగణముల నిర్మాణానికి ముందుకు రావాలి ప్రజాహిత కార్యక్రమాలలో ఆటస్థలములు సమకూర్చుట కూడా ముఖ్యమని ప్రజాసంస్థలు మరువరాదు

- ముకరమ్

Printed and Published for Nageswara Rao Estates Private Ltd., by S. Nageswara Rao, at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada - 520 003. Acting Editor : M. Madhava Rao, Chief Editor : S. Radhakrishna.
Phones : Business : 61247, 61248, 75569 Editorial : 75667


గోపి ఆర్ట్ పిక్చర్స్
దొంగరాముడు
కె.రాఘవేంద్రరావు బి.ఎ.
పరుచూరి బ్రదర్స్ · చక్రవర్తి ·
చలసాని గోపి
డి.వెంకటరత్నం ·


నందిగం దేవీప్రసాద్
రాంప్రసాద్ ఆర్ట్ మూవీస్
చుట్టాలబ్బాయి
HIMALAYA PUBS
Bhaskar
ఎమ్.రామలింగేశ్వరరావు * కోడి రామకృష్ణ
బి.బుల్లిసుబ్బారావు శ్రీనివాస చక్రవర్తి
సత్యానంద్ · వేటూరి · చక్రవర్తి · లక్ష్మణ్ గౌడ్

వారఫలం

19-2-1988 శుక్రవారం నుండి 25-2-1988 గురువారం వరకు

★ **మేషం :** ఒకటి రెండు ముఖ్యగ్రహాల అనుకూలతయున్నది. ప్రసిద్ధిగల వారి సహాయ మున్నది. కృషియందు రాణింపు ఉన్నది. వస్తు విక్రయమందు అనుకూలతయున్నది. స్త్రీలకు · సభాగౌరవం, ధనలబ్ధి, వృత్తి యందు వికాసం గల వారం.

★ **వృషభం :** అన్ని రంగాలలో అనుకూల మున్నది. మీ యింట ఏదో శుభం జరిగే మార్గమున్నది. ప్రసిద్ధులయిన వారి స్నేహం లభ్యమవుతుంది. కళారంగ ఖ్యాతి అధికమవుతుంది. ధన లాభమున్నది. స్త్రీలకు : ఆదాయం గల వారం. ఉద్యోగం చేసేలాగైతే 'ప్రమోషన్' ఆశింపవచ్చు.

★ **మిధునం :** రాజకీయాలందు మీకు అనుకూలతయున్నది. రాజకీయవాదులకు మేలైన వారం గృహానందమున్నది. సభా గౌరవమున్నది. చిత్ర రంగానుకూలతయున్నది. ఇరుగు పొరుగు సహాయమున్నది. స్త్రీలకు : ధనవంతుల లేక ఉత్తముల స్నేహం లభ్యమవుతుంది.

★ **కర్కాటకం :** అనుకోకుండా కొందరు ప్రయాణించగలరు లాభదాయకమే ఉద్యోగ రీత్యా మీరు చేసే యత్నాలు సాగి వస్తాయి ఉత్తముల స్నేహం లభిస్తుంది. కొందరకు పత్రికా గౌరవం ఏర్పడుతుంది. స్త్రీలకు : వాదోపవాదాలతో కాల క్షేపం. అనవసర గొడవలు.

★ **సింహం :** దూర ప్రాంతాలకు వెళ్ళవలెననే మీ ప్రయత్నాలు సానుకూలమవుతాయి. ఇరుగు పొరుగు గొడవలు రావచ్చు. వృత్తియందు అనుకూల మార్పులుంటాయి సభా గౌరవమున్నది పత్రికా ప్రశంసలకు ఆస్కారం. స్త్రీలకు · ధనలబ్ధి, ఆరోగ్యమందు వృద్ధి, నూతన కార్యోత్సాహం.

★ **కన్య :** ఆదాయం గల వారం. శుభ కార్యాచరణమున్నది. మీ యింట్లో మేలు జరుగనున్నది. బంధువుల మూలంగా కాకపోవచ్చు. రాజకీయాలందు మేలుగాని సమయం. స్త్రీలకు : **తమ కొరకు** గాని, బంధువులతోగాని చేసే **శుభకార్య వ్యవ** హారాలు అనుకూలదాయకాలు.

★ **తుల :** అనేక రీతుల లాభదాయకం. ఆదాయమున్నది, అనుకూల వార్తాశ్రవణం. ఆదరించే వారుంటారు అనుకోకుండా మిత్రులు యింటికి రాగలరు. స్త్రీలకు : ధనలబ్ధి, ఉద్యోగానుకూలం, ప్రజారంగాన ప్రసిద్ధిగల వారం.

★ **వృశ్చికం :** శుభ కార్యాచరణమునకు యత్నిస్తారు. అనుకూలమే. ఇంట అధితి, అభ్యాగతుల ఆదరించవలసిన ప్రసక్తి ఏర్పడుతుంది. ప్రయాణాలు పెద్దగా అనుకూలించవు. స్త్రీలకు : మూఢ విశ్వాసాలతో కొందరు కొన్ని పనులు చెడగొట్టుకొంటారు, గ్రహించి మెలగండి.


★ **ధనుస్సు :** రాజకీయంగా ఏ మాత్రం మేలు గాదు. ఎంత కృషి చేసినా ఎలాంటి లాభం లేదని గ్రహిస్తారు. వృత్తి అనుకూలం గాదు. శని బాధ ఉన్నట్లనిపిస్తుంది. స్వల్పాదాయం లేకపోలేదు. స్త్రీలకు : ఒక్క ఉద్యోగ రీత్యా తప్ప తక్కిన వ్యవహారాలందు క్షేమం లేదు. గ్రహించాలి.

★ **మకరం :** సర్వానుకూల సమయం ప్రజా రంగాన వృద్ధి యున్నది. వృత్తి యందు ప్రసిద్ధియున్నది. రాజకీయ రంగాన అనుకూల మున్నది. మీ యింట శుభం జరిగే అవకాశమున్నది. ఉత్తరాల మూలంగా పలు విషయాలు గ్రహిస్తారు. స్త్రీలకు · ఉద్యోగమందు సదవకాశాలు

★ **కుంభం :** గ్రహించండి, వారమంతా లాభదాయకం. అనుకూలదాయకం. ధనదాయకం, వ్యాపారానుకూలదాయకం, వృత్తియందు వికాసమున్నది. నలుగురిలో మీ పలుకుబడి హెచ్చుతుంది స్త్రీలకు : చలనచిత్ర రంగావకాశాలుంటాయి. ప్రయత్నించి వాస్తవమని గ్రహించండి.

★ **మీనం :** అనుకూల శత్రువులున్నారు. ఏ వ్యవహారంలో నయినా జాగ్రత్తగా మెలగుట ఈ వారం మేలు. ప్రయాణాలు వాయిదా పడుట అంతకన్నా మేలు. వీలైనంతలో కళా రంగాన యత్నించుట మేలు. స్త్రీలకు : వృద్ధికరమైనవి మొదటి మూడు దినాలు. వృత్తియందు అనుకూలతగల వారం గ్రహించండి.

-విద్వాన్ కోట సత్యరంగయ్యశాస్త్రి



దూరదర్శనం

లత

సుప్రభాతం

నాటిక – కథ – హెచ్. వి.సుబ్బారావు,

జన్మతః నియోగి బ్రాహ్మణుడైన అన్నమయ్య వెంకటేశ్వర భక్తుడైనందున – పంగనామాలు వ్యక్తిత్వం జనానికి పెట్టాలని దర్శకుడి అభిప్రాయం కాబోలు. – నారాయణతే నమో నమో: పాట అన్నమయ్యదేనా? నాకు గుర్తు లేదు. ఈ నాటిక పూర్తిగా చూసింది ఈ రోజే. రావికొండలరావు రాధాకుమారి గార్లని ఉపయోగించుకోటం చేత కాలేదు దర్శకుడికి – మురళీమోహన్ నటన ప్రౌఢంగా ఉంది. మిగతా వాళ్ళు ఫరవాలేదు. త్యాగయ్యకి అయిదు జన్మలున్నాయని విన్నాను. అన్నమయ్య తన వంశంలో తను జన్మించి ఉండవచ్చును. తిరపతి దిగని అన్నమయ్య కాలం మారి అమెరికావెళ్ళాడు. బాగుంది.

ఈ దేశంలో ఒకరోజు

ఈ రోజుతో అయిపోతుందిట హమ్మయ్య హాయిగా ఉంది ఈ చివరి గండం ఎలాగో దాటేద్దాం

నిరుద్యోగులు – స్మగ్లర్ల చేతిలో పడి పోలీసులకి చిక్కుతారు కాని పోలీసులు వాళ్ళ మంచితనాన్ని గుర్తించి నిరుద్యోగ భృతి ఇప్పిస్తారు వాళ్ళు ప్రైస్ ...టుకొని ఎద్దితో కొచ్చారు శుభం ఎన్ని అవకతవకలున్నా అయిపోయింది పరవాలేదు

శక్తి

జయకాంతన్ కథా నాటికాగుచ్ఛంలో యుగసంధి – కథ ననుసరించిన నాటిక వృద్ధ వితంతువు ఒకావిడ – బాలవితంతువు అయిన మనుమరాలు మళ్ళ పెళ్ళి చెసుకుందని కొడుకూ కోడలూ ఎద్దు – చచ్చిందనుకుంటాం అంటే సమాధానం చెప్పింది

నాకు వితంతు వేషం వేసి జుట్టు కూడా తీశారు కాని ఇప్పుడు నీ కూతురు చదువుకుంది ఉద్యోగం చేస్తున్నది. ఆమె వివాహం చేసుకోటంలో తప్పు కనపడటం లేదు. కాలం మారింది, ఆచారాలు వాటితో పాటు మారాలి. నేను నా మనుమరాలి దగ్గరకు పోతాను. అని వెళ్ళిపోతుంది. కథ నడపటం బాగుంది కాని వితంతు వివాహాలు నేడు సమస్య కాదు ఇది జయకాంతన్ 30 ఏళ్ళ నాడు వ్రాసింది అయి ఉంటుంది



బంగారు చిలక

కథ యస్– యస్ శ్యామసుందర్ దర్శకత్వం – పణిసుందర్

ఒక బంగారు చిలక లాంటి అమ్మాయినీ ఆస్తినీ కబళించాలని చూస్తూ ప్రయత్నిస్తున్న కథలు లక్షల కొలదీ సినిమాలుగా చెత్తాకారి నవలలుగా వచ్చాయి– ఇందులో హీరో బాగా లేడు హీరోయిన్ ఫరవాలేదు ఏదో ఉంది

రామాయణ్

సీతని రావణుడు ఏదో అనటం – ధాన్యమాలిని వారించటం– త్రిజట స్వప్నం – సీతః వినపడేట్లు హనుమ చెట్టు మీద కూర్చుని పాడటం – ముద్రిక చెట్టు మీద నుంచి పడవేశాడు హనుమ. అంత నిర్లక్ష్యంగా పడవేయటం వాల్మీకంలో లేదు.

రావణుడిని నీచుడిగా చిత్రించటం అనేది ప్రజా సామాన్యానికి నచ్చుతుంది. సీత హనుమని కూడా అనుమానిస్తుంది. హనుమ ఆమె అనుమానాలు తీరుస్తాడు. ఇది మందరం లాగా మక్కికి మక్కి కాదు. స్వర్ణ సీత లాగా పరిశోధనానంతరం తయారయిందీ కాదు. కాని తీయటం బాగుంది – బాపి కాబోలు మీరు అన్ని రామాయణాలు చదివారా అని అడిగాడు చదివాను నూటికి డెబ్బయి రామాయణాల్లో సీత పౌలస్త్య కుమారి

మనసు గుర్రం – లేదు కళ్ళెం

నాటిక భార్య చావు బ్రతుకుల్లో ఉన్నా డైరెక్టరు తన సినిమా ఆఖరి సీన్లు తీస్తాడు అదృష్టవశాన ఆమె బ్రతికేఉంది

నర్తించకే అలివేణీ – అనే పాట ఎవరు పాడారో గాని వేగం లేదు వానవచ్చే వేగంలేదు రాగం కూడా మేఘమల్హార్ గాని హిందోళగాని కాదు కాని సినిమా వాన కురిసింది మనోరంజన్‌లో లాగా హీరో డామినేషను ఉందా? దేవదాసు కనకాల నటన బాగుంది– డైరెక్షన్‌లో పెద్ద వేగం లేదు ఒక మాదిరిగా ఇదివరకు వచ్చిన ప్రస్తుతం వస్తున్న నాటకాల్లో ఇది పరవాలేదు బాగుంది ☐

అపాయాలను ఎదుర్కోవడమే అతని జీవిత లక్ష్యం



[illegible]

ఫ్యాషన్ ప్రపంచంలో సాటిలేని చీరలు, కరిష్మా శారీస్.



ప్రముఖ క్లాత్ షాపులలో లభించును.

SHANKAR ADS/K.S/87

ఆంధ్రసచిత్రవారపత్రిక– రవికళాశాల



స్వాగతోపన్యాసం చేస్తున్న రవి కళాశాల డైరెక్టర్ శ్రీ సి. వి. ఎన్. ధన్, వేదికపై ఉన్న వారు శ్రీ ఎం. మాధవరావు, ప్రొ. టి. వేణుగోపాల రావు, ప్రొ. ఎ. శేషగిరిరావు, గుంటూరు జిల్లా కలెక్టర్ శ్రీ జన్నత్ హుస్సేన్

విజేతలకు బహుమతి

ఆంధ్ర సచిత్ర వారపత్రిక– రవికళాశాల సంయుక్తంగా నిర్వహించిన 'సరికొత్త సైన్స్ క్విజ్' విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభ ఫిబ్రవరి 6వ తేదీ సాయంత్రం గుంటూరులోని రవికళాశాల అసెంబ్లీ హాలులో అత్యంత వైభవంగా జరిగింది.

ఈ సభకి అధ్యక్షులుగా నాగార్జున విశ్వవిద్యాలయం కళాశాలల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ. శేషగిరిరావు, ముఖ్య అతిథిగా కోనేరు లక్ష్మయ్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి. వేణుగోపాలరావు, బహుమతి ప్రదాతగా గుంటూరు జిల్లా కలెక్టర్ శ్రీ జన్నత్ హుస్సేన్ గార్లు విచ్చేసారు.

ప్రారంభంలో రవికళాశాల డైరెక్టర్ శ్రీ సి. వి. ఎన్. ధన్ స్వాగతం చెప్తూ అధ్యక్షులు, ముఖ్యఅతిథి, బహుమతి ప్రదాతలని వేదికపైకి ఆహ్వానించి పుష్పమాలాలంకృతులని చేసారు. శ్రీ ధన్ తమ స్వాగతోపన్యాసంలో సైన్స్‌క్విజ్ ఉద్దేశాన్ని వివరించి విద్యార్థులు సైన్స్‌పై శ్రద్ధ చూపాలని, దేశం గర్వించదగిన శాస్త్రవేత్తలుగా తయారు కావటానికి చక్కని కృషి చేయాలని అన్నారు.

ప్రొ. ఎ. శేషగిరిరావు తమ అధ్యక్షోపన్యాసంలో విద్యార్థినులు కూడా ఎక్కువ సంఖ్యలో ఈ సైన్స్ క్విజ్‌లో పాల్గొని బహుమతులు గెలుచుకోవటం సంతోషకరమైన విషయమనీ, 21వ శతాబ్దం వారిదేనని, విద్యార్థులు వారితో పోటీ పడటానికి మరింతగా కృషి చేయాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు.

ముఖ్య అతిథి ప్రొ. టి. వేణుగోపాలరావు మాట్లాడుతూ నేటి సమాజానికి శాస్త్రీయ దృక్పథం కావాలని, పురాతన భావాలని, ఛాందసాలని విడిచిపెట్టాలని, శాస్త్రీయ దృక్పథం ఉన్నవారు తమకి తెలిసినది చెప్పి, తెలియని విషయాల కోసం నిరంతర అన్వేషణ చేస్తూ ఉంటారని, పాతసిద్ధాంతాలని నమ్మితే పురోగతి ఉండదని, టి.వి.లో కూడా మూఢ నమ్మకాలని పెంచే సన్నివేశాలనేకం చూపిస్తున్నారని అన్నారు.

బహుమతి ప్రదానం చేసిన గుంటూరు జిల్లా కలెక్టర్ శ్రీ జన్నత్ హుస్సేన్ ప్రసంగిస్తూ శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు విద్యార్థులు ఛాలెంజ్‌గా తీసుకుని కృషి చేయాలని అన్నారు. విద్యార్థులలో సైన్స్‌పై అభిరుచిని పెంచేందుకు క్విజ్ నిర్వహించటానికి ఆంధ్ర సచిత్ర వారపత్రిక ముందుకు వచ్చినందుకు ఆయన తమ హర్షాన్ని ప్రకటించారు.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక యాక్టింగ్ ఎడిటర్ ఎం. మాధవరావు వందన సమర్పణ చేసారు.

సైన్స్ క్విజ్‌లో 25కి 23 మార్కులు తెచ్చుకుని రు. 750/=లు మొదటి బహుమతిగా అందుకున్న కుమారి ఎస్. శశిరేఖ విజయవాడ గాంధీనగరంలోని ఎస్. బి. ఎస్. ఆర్. కె. ఆర్. గరల్స్ హైస్కూలులో 10వ తరగతి చదివింది. సైన్స్‌పై తనకి అభిరుచి కలగటానికి కారణం తమ సైన్స్ టీచర్ శ్రీమతి